శ్రీరస్తు

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.



శ్రీమదాంధ్ర


వచనరామాయణము

కిష్కింధాకాండము

సంస్కృతరామాయణమునకు సరియైన తెనుగు

శ్రీసరస్వతుల సుబ్బరామశాస్త్రిగారిచే

రచితము.



294.5922
SUB

చిన్నపురి:

స్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచే ప్రకటితము

All Rights Reserved.]

[*Rs.* 2—8—0

C.I

294.5922
SUB

Dr. B.R. AMBEDKAR
OPEN UNIVERSITY

CALL NO:

ACC. NO: 1126

AUTHOR: సుబ్బిరామిరెడ్డి, ఎం.వి.


TITLE: రాజకీయ రామాయణము

Date Due	Borrower's Name

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

శ్రీ ర స్తు

శ్రీరామచంద్రపర బ్రహ్మణే నమః



శ్రీమదాంధ్ర

వచనరామాయణము

కిష్కింధాకాండము

సంస్కృతరామాయణమునకు సరియైన తెనుఁగు

శ్రీసరస్వతుల సుబ్బరామశాస్త్రిగారిచే

విరచితము

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11261

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
1126

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచే ప్రకటితము

1959

All Rights Reserved.]

[*Rs. 2—8—0*

I

294.5922
SUB

PRINTED AT
THE 'CHANDRIKA' PRESS
Madras—1959.

II

విషయసూచిక

సర్గము.		పుట.
1.	శ్రీరాముఁడు పంపాసరోవరవైభవముఁజూచి విరహవేదనపడుట	1
2.	సుగ్రీవుఁడు హనుమంతుని రామలక్ష్మణుల విచారించుటకై పంపుట	12
3.	హనుమంతుఁడు రామలక్ష్మణులసంగతిని వివరించుట ...	14
4.	లక్ష్మణుఁడు హనుమంతునకుఁ దమవృత్తాంతముఁ దెలుపుట ...	17
5.	సుగ్రీవుఁడు రామునితోఁ జెలిమి యొనర్చుట ...	20
6.	సుగ్రీవుఁడు రామునికి సీతభూషణములఁ జూపుట ...	23
7.	సుగ్రీవుఁడు రాముని, రాముఁడు సుగ్రీవుని నోదార్చుట ...	25
8.	రాముఁడు సుగ్రీవుని వాలితోడివైరమునకుఁ గారణంబు నడుగుట	27
9.	సుగ్రీవుఁడు తనకును వాలికినగల వైరమునకుఁ గారణము దెల్పుట	30
10.	సుగ్రీవుఁడు తనప్రవాసనమునకుఁగారణము దెల్పుట ...	32
11.	సుగ్రీవుఁడు వాలిప్రభావ మెఱిఁగించుట ...	35
12.	సుగ్రీవుఁడు వాలిని యుద్ధమునకుఁ బిలుచుట ...	43
13.	సుగ్రీవుఁడు రెండవతూరి వాలిమీఁదికి యుద్ధమునకుఁ బోవుట...	46
14.	సుగ్రీవుఁడు సింహనాదము సేయుట ...	48
15.	తార వాలిని యుద్ధప్రయత్నమునుండి నివారించుట ...	50
16.	రాముఁడు వాలిని బడవేయుట ...	53
17.	వాలి రాముని దూరుట ...	56
18.	రాముడు వాలివాక్యములకు బదులు చెప్పుట ...	61
19.	తార వాలిమరణము విని వాలికడ కేలెంచుట ...	67
20.	తార వాలింజూచి విలపించుట ...	70
21.	తార ప్రాయోపవేశమునకుఁ బూనుట ...	72
22.	వాలి సుగ్రీవుని కంగదు నప్పగించుట ...	74
23.	తార వాలింగూర్చి విలపించుట ...	76
24.	సుగ్రీవుఁడు వాలివధమునకై యనుతాపము నొందుట ...	79
25.	వాలిని దహనమొనర్చుట ...	84
26.	సుగ్రీవుని పట్టాభిషేకము ...	88
27.	రాముఁడు ప్రస్రవణపర్వతము చేరుట ...	91
28.	వర్షాకాల వర్ణనము ...	95
29.	హనుమంతుఁడు సుగ్రీవుని రామునికార్యమునకై హెచ్చరించుట	102
30.	శరత్కాలవర్ణనము ...	105
31.	లక్ష్మణుఁడు సుగ్రీవునికడ కేగుట ...	113
32.	సుగ్రీవుఁడు హనుమంతునితో నాలోచించుట ...	117
33.	లక్ష్మణుఁడు సుగ్రీవుని నంతఃపురమునఁ జూచుట ...	119

సర్గము.		పుట.
34. లక్ష్మణుఁడు సుగ్రీవుని దూఱుట	...	125
35. తార లక్ష్మణునికోపంబు శాంతపఱచుట	...	127
36. లక్ష్మణసుగ్రీవు లొండొరుల నోదార్చుకొనుట	...	129
37. సుగ్రీవుడు వానరుల నందఱిని బిలిపించుట	...	130
38. సుగ్రీవుఁడు రాముని జూడవచ్చుట	...	133
39. నలుదెసలనుండి వానరసేన లేతెంచుట	...	135
40. సుగ్రీవుఁడు వానరవీరులను తూర్పునకు పంపుట	...	138
41. సుగ్రీవుఁడు హనుమదాదులను దక్షిణదిశకుఁ బంపుట	...	144
42. సుగ్రీవుఁడు సుషేణాదులను బడమటిదిక్కునకుఁ బంపుట	...	148
43. సుగ్రీవుఁడు శతబలిని నుత్తరదిశకుఁ బంపుట	...	152
44. రాముఁడు హనుమంతునిచేతికి నుంగరమిచ్చుట	...	158
45. వానరవీరులు సీతను వెదకవెడలుట	...	159
46. సుగ్రీవుఁడు తనభూలోకపరిజ్ఞానమునకుఁ గారణముఁ దెల్పుట	...	160
47. తూర్పు, పడమర, ఉత్తరదిశలకుఁ బోయిన వానరవీరులు మఱలుట		162
48. హనుమంతుఁడు సీతను వెదకఁ బోవుట	...	163
49. అంగదుఁడు వానరులను ప్రేరణసేయుట	...	165
50. హనుమదాదులు సీతాదేవిని వెదకుట	...	166
51. హనుమంతుఁ డొకతాపసితో మాటలాడుట	...	169
52. హనుంతుఁడు స్వయంప్రభకుఁ బ్రత్యుత్తర మొసఁగుట	...	171
53. హనుమదాదులు గడువుమించినందుకై చింతించుట	...	172
54. హనుమంతుఁ డంగదునకు హితము సెప్పుట	...	176
55. వానరులు ప్రాయోపవేశమునకుఁ బూనుట	...	178
56. సంపాతి వానరులకడకు వచ్చుట	...	180
57. అంగదుఁడు సంపాతికి జటాయువధ వృత్తాంతము నెఱిఁగించుట		182
58. సంపాతి వానరులకు సీతసంగతి నెఱిఁగించుట	...	183
59. సంపాతి వానరులకు సీతావృత్తాంతము నెఱిఁగించుట	...	186
60. సంపాతి వానరులకు గురుతుసెప్పుట	...	189
61. సంపాతి నిశాకరునితో సంభాషించిన సంగతి చెప్పుట	...	190
62. సంపాతి వాక్యము	...	192
63. సంపాతి వాక్యము	...	193
64. వానరులు దక్షిణసముద్రము సేరుట	...	194
65. వానరవీరులు తమతమశక్తులం దెలుపుట	...	196
66. జాంబవంతుఁడు హనుమంతునిఁ బురికొల్పుట	...	199
67. హనుమంతుఁడు లంకకుఁ బయనమగుట	...	202

శ్రీరస్తు

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః

శ్రీమదాంధ్ర వచనరామాయణము

కిష్కింధాకాండము

1-వ సర్గము

శ్రీరాముఁడు పంపాసరోవరవైభవముఁజూచి విరహవేదనపడుట

ఆరణ్యకాండమున రాముని దీనరక్షణ తత్పరత్వము వర్ణింపఁ బడినది. కిష్కింధాకాండమున మిత్ర రక్షణ పరత్వము వర్ణింపఁబడు చున్నది.

రాముఁడు లక్ష్మణసమేతుఁడై తామరలతోను, కలువలతోను గూడి చేఁపలచే నిండినదయియుండు నా పంపాసరస్సు సొంపును జూచి మొదట సంతసమునంది, సీతను దలఁచి నింద్రియవైకల్యము నొంది, మరునిబారిం దవిలి లక్ష్మణునితో నిట్లనియె:

సౌమిత్రీ, ఈ పంపాసరస్సు వైడూర్యములమాడ్కి నిర్మలమైన యుదకము గలదియు, వికసించిన కమలములచే నొప్పారునదియు, పెక్కు వృక్షములచే శోభిల్లునదియునై చెలువారుచున్నది. సౌమిత్రీ, పంపాసర స్తీరమునఁ జూడ్కి కింపొదవించుచుండు నరణ్యమును జూడుము. దీనియందలి పర్వతములంబోలు చెక్కిల్లగు శిఖరములతోఁ గూడినయట్లు ప్రకాశించుచున్నవి. ఈ పంపాసరస్సు చిత్రములయిన యరణ్యములుగలదియు, పెక్కు తెఱఁగులయిన పుష్పములతోఁ గూడి నదియు, చల్లని నీరు గలదియు, పాములు, ఏనుఁగులు, పులులు, పక్షులును మున్నగుమృగములును మెండుగఁగలదియు, పద్మములచేఁ

వ్యాప్తమయినదియు, మిక్కిలి యింపయినదియునై యున్నందున భరతునియెడబాటుచేతను, సీతాపహరణముచేతను గలిగినశోకముచేఁ బీడితుఁడనై యున్న నాకును సంతసం బొదవుచు నొప్పుచున్నది. నలుపు ఆకుపచ్చనిరంగులు గలిసిన యీ పచ్చికనేల చెట్లనుండిరాలిన బహువిధములయిన పువ్వులతో నిండినదై, రత్నకంబళ్లు పఱచినట్లు మిక్కిలి ప్రకాశించుచున్నది. పుష్పరాసులతో నిండిన వృక్షశిఖరములు కొనలందుఁ బూఁచిన పూవులతోఁ గూడిన తీఁగెలచేఁ జుట్టఁబడి యెంతయుఁ బ్రకాశించుచున్నవి. లక్ష్మణా! యింపయిన గాలి గలదియు, పుష్పఫలభరితములైన వృక్షములుగలదియు, నెత్తావిగలదియు నైనందున నెక్కువ కామవికారము హెచ్చించెడు వసంతర్తువు సమీపించియున్నది. జలధరములగు మేఘము లుదకమును వర్షించునట్లు, పుష్పమయములగు వృక్షములు పుష్పములను గురిపించుచున్నవి. వీనిరూపు చూడుము. కానలందలి చెట్టు లెల్ల గాలిచే మిక్కిలి కదలుచు రమ్యములైన కొమ్మలమీఁద బువ్వులు చల్లుచున్నవి. లక్ష్మణా! చూడుము. క్రిందఁబడినవియు, పడుచున్నవియు చెట్లయండే యున్న వియునగు పూవులతో వాయువు పూవుబంతులాట యాడుచున్నట్టులున్నది. పుష్ప భరితములైన చెట్లకొమ్మలు గాలి వీచుటచేఁ గదలఁగా నా పూవుల నడుమనుండిన తుమ్మెదలు వెలుపలికి వచ్చి రేఁగి యా వాయువును గూర్చి గానములు చేయుచున్నట్లు మ్రోగుచున్నవి.

లక్ష్మణా! నట్టువగాండ్రచే నాట్యమాడించుచుఁ బాటకుఁడు వెనుకనుండి పాటపాడునట్లు, వాయువు వృక్షములను గదలించుచు మదించిన కోయిలకూఁతలచే గానముచేయించుచుఁ బర్వత గుహలనుండి వెలుపలికి వచ్చుచున్నవాఁడు. అంతటఁ గడు వేగంబున వీచుచుండఁగాలిచే నీ చెట్లొక్కదానితో నొకటి చేరినకొనలుగలవై, సరములుగాఁ గ్రుచ్చఁబడియుండునట్లు గనఁబడుచున్నవి. ఈ రమ్యమగు గంధముగల గాలి చందనముపగిదిఁ జల్లనై, బడలిక దీర్చుచు మెల్లఁగా వీచుచు సుఖముగా సోఁకుచున్నది. మధ్యగంధముగల వనములందలి యీ వృక్షములు గాలికిఁ గదలినవై, తేనెటీఁగలధ్వనులచే గానముచేయునట్లు కనఁబడుచున్నవి. పర్వతములు రమ్యములైన కొండనెత్తములందు చక్కని పుష్పములుగల మనోహరములగు వృక్షములు గలిగి

యుండుటంజేసి యొండొంటితోఁ గలసిన శిఖరములుగలవానియట్లు ప్రకాశించుచున్నవి. ఈ వృక్షములు పుష్పములచేఁ గప్పఁబడిన కొనలు గలవై, గాలి వీచుటచేఁ గదలుచు, నింపుగా గానముచేయుచుండు తుమ్మెదలు కొనలయందుఁ గలిగియుండుటవలన, నల్లని కురులు గలిగి, పుష్పములు జుట్టున కలంకరించికొని, తలయూచుచుఁ బాడెడు గొప్ప పాటకులమాడ్కిఁ గనఁబడుచున్నవి. లక్ష్మణా! చక్కఁగాఁ బూచిన యీ కొండగోఁగుచెట్లను జూడుము. ఇవి బంగారుభూషణముల నలంకరించి కొని, పచ్చనిపట్టువలువలు గట్టిన మానుసులవలెఁ గన్పట్టుచున్నవి. లక్ష్మణా! ఈ వసంతర్తువు యింపుగులుకు పెక్కుపక్షుల నాదములతోఁ గూడినదయి సీతను బాసియున్న నాకు సంతాపమును హెచ్చించుచు నున్నది. శోకాక్రాంతుఁడనై యున్ననన్ను మన్మథుఁ డింకను సంతాప పెట్టుచున్నాఁడు గదా! ఈ కోయిల నేను లొంగినందుకు సంతసముచేఁ జక్కఁగా నుబ్బినదై, నన్ను హేళనమునకుఁ బిలుచుచున్నది. సుమిత్రానందనా! యీ చక్కనైన సెలయేటియందలి నీరుకోడి మన్మథపీడితుఁడ నగుఁ ననుఁ జూచి, సంతసముతో మఱింత కూయుచు నా మనసునకుఁ గడు వెతను గలిగించుచున్నది. తొల్లి నాప్రియకాంత యాశ్రమంబులం దున్నయప్పుడు, నీరుకోళ్ళకూఁతలను విని నన్నీ కూఁత వినరమ్మని పిలిచి, కడు నుప్పొంగుచుండెను.

లక్ష్మణా! యట్లు వింతగొల్పు పక్షులన్నియుఁ బెక్కు తెఱఁగులైన ధ్వనులను జేయుచు, నచ్చటచ్చటనుండి చెట్లకును, పొదలకును, తీఁగెల జొంపములకును వచ్చి చేరుచున్నవి చూడుము. లక్ష్మణా! ఆఁడుపక్షు లెల్ల మగపక్షులతోఁ జేరి, తమగుంపులు గొనియాడుచుండఁ దేఁటుల నాదముల విని యానందించుచుఁ జెవులకింపుగాఁ గూయుచున్నవి. నీరుకోళ్లును, గండుంగోయిలలును గూయుచుండుటచేత నీ వృక్షము నాకు మదనవేదన నెచ్చించుచున్నవి. అశోకపుష్పముల గుత్తులనెడు నింగలములు గలదియు, తుమ్మెదలళుంకారము లనెడు ధ్వనులుగల దియు, చివుళ్ళనెడి యెఱ్ఱని మంటలుగలదియునైన యీ వసంతర్తు వనెడి యగ్ని నన్ను దహింపఁగోరుచున్నది. తిన్నని పలుకులు గలదియు, సన్నని కంటితెప్పలు గలదియు, మెత్తని వెండ్రుకలతోఁ గూడినదియు

నయిన యా ప్రియం గానక నేను బ్రాణములతో నుండి యేమి యుప యోగము?

ఓ దోషరహితుఁడా! చెలువు మీఱిన కానలతో నొప్పారు చున్నదియు, నెల్ల దెసలను గోయిలలతోఁగూడినదియునైన యీవసంత కాలము నా ప్రియయగు సీతకుఁ బ్రియమైనది. మన్మథునిసంతాపముచేఁ బుట్టిన దుఃఖ మను నగ్నిహోత్రుఁడు వసంతకాలంపుసొంపుచేఁ బెంపొంది నన్ను వేగిరముగా దహింపఁగలఁడు. ప్రియం గానక చెన్నుమీఱిన వృక్షములం జూచుటచే నా మదనసంతాపము మీఁదు మిక్కిలి హెచ్చుచున్నది. సీత గంటికిఁ గానరాకయు, సురతకాలంపుఁజెమ్మట నార్చి, యలఁత దీర్చునట్టి వసంతుఁడు కంటికిఁ గనఁబడుచును నా శోకంబు పెంపొనరించుచున్నారు. సౌమిత్రీ! లేడికూనకంటిం గానక వెతలకును వగపులకుం బాలయియుండు నన్నిపు డీ కనికరములేని వసంతమారుతము వెచ్చగ మాడ్చుచున్నది.

ఈ నెమళు లచ్చటచ్చట స్ఫటికంపుఁ గిటికీలంబోలు తమ తొక్కల విచ్చుకొని నర్తనముచేయుచున్నవి. ఈ నెమళు లాడునెమళ్ళతోఁ గూడి మిక్కిలి మదించి, మరునివశమునఁ జిక్కియున్న నా కెక్కువ మదన వికారము గలిగించుచున్నవి. లక్ష్మణా! చూచితివా యీ యాఁడునెమ్మి మరునిబారిం జిక్కి, కొండచరులందు నటించుచున్న తన ప్రియుఁడగు నెమ్మికడ నృత్యము సల్పుచున్నది. మగనెమలియు, తన తొక్కలను విచ్చుకొని, కూఁతలచే నన్ను హేళనము చేయునట్లు నటించుచు మదన వికారమునుజెంది యాఁడునెమ్మిని వెంబడించుచున్నది. నెమ్మియొక్క ప్రియకాంత నే రాక్షసుఁడును దొంగిలింపలేదుకదా! కాఁబట్టియే యీ నెమ్మి తన కాంతతోఁగూడ నింపుగులుకువనములందు విహరించుచున్నది.

ఈ వసంతర్తువున వనవాసము నాకుఁ గడు నోర్వరానిదై యున్నది. లక్ష్మణా, తిర్యగ్జంతువులందుఁ గూడ వలపన నెట్టిదో! చూడుము! ఎంతవలపు లేనిది యీ యాఁడునెమలి, మోహము నాఁపఁజాలక తానే యిట్లు మగనికడఁ దిరుగుచుండునే! విఱివికన్నులు గలదగు నాప్రియకాంతయు రాక్షసునిచే నపహరింపఁబడకుండెనేని, మదనవికారము గలదై యెక్కువ మక్కువతోఁ గూడి నాకడకు వచ్చి యుండునుగదా! ఈ వృక్షములందలి పుష్పము లెక్కువ కాంతిగలిగి

మనోహరములుగా నున్నను, తుమ్మెదలతోఁగూడ వ్యర్థముగా నేలరాలి పోవుచున్నవి. పక్షులెల్ల నొండొరులం బిలుచుకొనుచున్నవో యన్నట్లు శ్రోత్రానందముగాఁ గూయుచు, నా కెక్కువ మదనవికారముం గలిగించు చున్నవి.

నా ప్రియకాంత యెచ్చట నున్నదో యచ్చటఁగూడ నిపుడు వసంతర్తువు వచ్చియుండునేని, నా ప్రియురాలగు సీతయు వలపులం జిక్కి నావలెనే దుఃఖించుచుండును. ఆ సీత యుండుచోట నిప్పుడు వసంతర్తువు రాకయుండును. వచ్చియున్నఁ గలువకంటియగు సీత నన్నుఁ బాసి యెట్లు జీవించియుండఁగలదు? లేక నా ప్రియకాంత యుండు చోట వసంతర్తువు వచ్చియున్నదేమో! చక్కని పిఱుఁదులుగల నాసీత శత్రువుల బెదరింపుల కోర్చి యేమిచేయుచున్నదో? నడివయసుదియు, తామరకేకులంబోలు కన్నులుగలదియు, తిన్నగా మాటాడునదియు నైన నా ప్రియకాంత యుండు ప్రదేశమున వసంతకాలము వచ్చి యుండునేని, నా ప్రాణప్రియ నా విడూగము సైపఁజాలక తప్పక ప్రాణముల విడువఁగలదు. పతివ్రతయగు నా సీత నన్నుఁ బాసి ప్రాణ ములతో నుండఁజాలదని యిప్పుడు నాకు దృఢముగాఁ దోఁచుచున్నది.

సీత తప్పక తన తలంపెల్ల నాయం దుంచియుండునది. నేనును ఆ సీతయం దన్ని తెఱఁగుల నెక్కువ యనురాగ ముంచియున్నాను. ప్రియ కాంతనే తలంచుచుండుటచేత నా కీ పువ్వుల నెత్తావిని జూఱగొనుచు వచ్చెడి తిన్నని చల్లని గాలి యగ్నిహోత్రసదృశమై యున్నది. సీతతోడ నున్నప్పు డేమలయమారుతము నాకు విమవక సుఖకరముగా నుండెనో, ఆ గాలి యిప్పుడు నాకెల్లప్పుడు విచారమును గల్గించుచునే యున్నది. మునుపు, సీత నాతో నుండునప్పుడు, ఏకాకి యాకాశంబుఁజేరి కూయు చుండెనో, ఆకాకి యిప్పుడు సీత దగ్గఱ లేనప్పుడు చెట్టునఁ గూర్చుండి మిక్కిలి సంతోషముతోఁ బాడుచున్నది. ఈ వాయసమే యప్పుడు పంచవటియందు సీతావిరహామును గలిగించినది. ఈ పక్షియే యిప్పుడు నన్ను సీతకడకుఁ గొనిపోవఁ గలదు.

లక్ష్మణా, పక్షులెల్ల విరియఁబూచిన కొమ్మలుగల చెట్లియందుఁ గూర్చుండి, మన్మథోద్రేకము గలిగించునట్టి కూఁతలఁ గూయుచున్నవి చూడుము. లక్ష్మణా, ఒకతేఁటి గాలి కెగిరిన యొక బొట్టుగుచెట్టు

యొక్క పూవులగుత్తిని జూచి, మద్యపానమువలనిమత్తుచే గదలుచున్న ప్రియురాలికడకుం బోలెఁ గడువేగిరముగా వచ్చుచున్నది. విరహులకు స్వాభావికముగా దుఃఖమును బెంచునట్టి యీ యశోకవృక్షము గాలి కెగురుచున్న యీ పూవుగుత్తులచే నన్ను బెదరించుచున్నది. లక్ష్మణా, పూఁతతో వెలయు మావిడిచెట్లు మైపూఁత పూసికొని, మనసున రతిసుఖము గోరుచున్న కాముకులమాడ్కిఁ గనఁబడుచున్నవి. నరశ్రేష్ఠుండవగు సౌమిత్రి, కిన్నరులీవింతలైన వనసమూహాములం దచ్చటచ్చటఁ దిరుగుచున్నారు చూడుము.

ఈ నెత్తావిగల తామరపువ్వులెల్ల బాలసూర్యునివలె నీటియందంతట వెలుఁగుచున్నవి చూడుము. ఈ పంపాసరోవరము తేటనీరు గలిగి, రాయంచలతోను, గన్నెలేళ్ళతోను గూడి, పలువన్నెలుగల తామరపువ్వులును, నల్ల కలువలును సౌగంధికములునుగలదై యొప్పుమీఱియున్నది. మఱియు నీ పంపాసరోవరము బాలసూర్యునిం బోలినవియు తుమ్మెదలు తిరుగుటచే నడఁగియున్న కేసరములుగలవియునగు పంకజములతోఁ గూడి యొప్పుచున్నది. చక్రవాకపక్షులును, గట్టులందు చిత్రములైన యనేకవనములును గలిగి, నీరు త్రాగవచ్చెడి యేనుఁగుల యొక్కయు మృగములయొక్కయు సమూహాములతోను ఎంతయు వన్నెమీఱియున్నది. లక్ష్మణా, నిర్మలమయిన యీపంపాసరోవరోదకము నందలి పంకజములు గాలిచేఁ గొట్టువడినయలలవేగముచేఁ గొట్టుమిట్టాడుచు మిక్కిలి ప్రకాశించుచున్నవి.

తామరపూవులరేకులంబోలు కన్నులుగలదియు, నెల్లప్పుడు తామరపువ్వులం దెక్కువ ప్రేమగలదియునైన వైదేహినిం గానక జీవించియుండుట నాకు మనము లేదు. అక్కటా! యేమి మనుని కటికిదనము. చక్కని రూపముగలదియు, ముద్దుగులుకుమాటలు పలుకునదియునైన సీత గనఁబడక, దొరకనిస్థితియం దుండగా, ఆ సీత నీ మరుఁడు మాటిమాటికి జ్ఞప్తికివచ్చునట్లు చేయుచున్నాఁడు. వీఁడు క్రూరుఁడుగాఁడేని, యిట్లు నొచ్చియున్న నన్నింకను బీడించునా? ఈ వసంతము చక్కఁగఁ బూచిన వృక్షములతోఁ గూడి నన్నింకను బాధింపదేని, నే నిప్పటికిఁ గలిగియుండు మన్మథునిబాధ నోర్చుకొనియుండఁ గలుగు

దును. లక్ష్మణా, నే నా సీతతోఁగూడి యున్నప్పు డే యేవస్తువులు నా మనసున కింపొందవుచుండినవో, అవియెల్ల నిప్పుడు ప్రియురాలిం బాసి యుండుటచే నా మనసుకు వగపు పుట్టించుచున్నవి. లక్ష్మణా, నే నిప్పుడు తామరపువ్వుల రేకులను జూచిన, నవి సీతయొక్క కన్నులతో సమా నము లని తలఁచుచున్నాను.

చెట్లు నడుమఁ బుట్టి, పద్మకింజల్కములమీఁదినుండి వీతెంచు నీ గాలి సీత నిట్టూర్పువలె మనోహరముగ నున్నది. లక్ష్మణా, పంపాసర స్సుయొక్క దక్షిణమునఁగన్న కొండచరియఁ జూడుము. అచ్చటఁ బూవులు పూచినదగు మనోహరమయిన కొండగోఁగు చెట్లొక్కటి యున్నది. ఈ ఋశ్యమూక మను పర్వతోత్తమము పలురంగుల కావి తాలతోఁగూడి, వాయువేగముచేఁ బలురంగులుగల దుమ్మును లేపు చున్నది. లక్ష్మణా, యీ పర్వతమునందలి చరియలంతటఁ జక్కఁగాఁ బుష్పించినవియు, నాకులు లేనివియునై రమ్యములై యుండు మోదుగు చెట్లు లుండుటచే నా పర్వతసానువులు మంటలుగలవిమాడ్కి వెలుఁగు చున్నవి. పంపాసర స్తీరరుహాములగు నీ జాజి, మల్లెతీఁగెలు, గన్నేరు చెట్లులును జక్కఁగా వికసించినవై, యొక్కటితో నొకటి గలిసికొని, నెత్తావి గలిగియున్నవి. చక్కఁగా విరిసిన మొగలిపొదలును, వావింటి చెట్లులును, అడవిమొల్లలును, మొల్లపొదలును వాసనం గుబాలించుచు నెంతయు విరాజిల్లుచున్నవి. కదంబవృక్షములు, ఉలిమిరిచెట్లు ఖర్జూ రపుఁజెట్లు, నల్ల యశోకవృక్షములు, పద్మకములును విరులుగలవై, నలుదెసలఁ బరిమళము నెఱపుచున్నవి. కొండల పైభాగములందు సింగపుఁగేసరములమాడ్కి వెలుఁగుచున్న లొద్దుగుచెట్లు, ఁడుగుచెట్లు, గోరింటచెట్లు, పూర్ణకవృక్షములు, వేఁపచెట్లు, మామిడిచెట్లు, కలిగొట్టు చెట్లు, కాంచనపుఁజెట్లు పుష్పభరితములయి యెంతయు శోభిల్లుచున్నవి.

నారింజచెట్లు, ఏఱుమద్దిచెట్లు, గేదంగిచెట్లు, విరిగిచెట్లు, దిరిసెన చెట్లు, శింశుపావృక్షములు, చంద్రచెట్లు, బూరుగు, మోదుగు, ఎఱ్ఱి గోరింట, నెమ్మి, కానుఁగుచెట్లు, శ్రీగంధపుఁజెట్లు, స్యందనవృక్షములును వెలయుచున్నవి. సౌమిత్రీ చూడుము. ఈ పంపాసర స్తీరరుహము లగు వేలకొలఁది వృక్షములు చక్కఁగాఁ బుష్పించి, పుష్పించినకొన లతోఁ గూడిన తీఁగెలచేఁ జుట్టుకొనఁబడినవై వెలయుచున్నవి. లక్ష్మణా,

యావనముచే మదించిన జవ్వనులు తమ ప్రియులనే వెంబడించి యుండునట్లు, ఈ చెట్లు గాలికిఁ గదలుచున్నను, తీఁగె లా చెట్లకొమ్మల నెడఁబాయక యవిపోయినట్లుల్ల వానిని గలిసికొనియె పోవుచున్నవి. గాలి చెట్టునుండి చెట్టునకును, బర్వతమునుండి పర్వతమునకును, వనము నుండి మఱొక్క వనమునకును బోవుచుఁ బెక్కువృక్షముల పూఁదేని యల రుచిచూచుటచే మిక్కిలి తనివినొందినదానివలె తిన్నగ వీచు చున్నది. కొన్ని వృక్షములు పుష్పములచే నిండినవై, తేనియవాసన గలిగియున్నవి. మఱికొన్ని వృక్షములు మొగ్గలతోఁ గూడి, నల్లని చాయగలవానిమాడ్కిఁ గానంబడుచున్నవి. తుమ్మెదలును "ఈ పుష్పమునందుఁ దేనియ నిండియున్నది. ఈ పుష్పనందుఁ దేనె తియ్యనై యున్నది. ఈ కుసుమము చక్కగా విరిసియున్నది." అని యాశతోఁ బువ్వపువ్వులోపలను దూఱుచున్నది. ఈ తేఁటి యొక పువ్వున వాలి, మఱల లేచి, వేగిరముగా మఱొక పువ్వునకుఁ బోవు చున్నది. ఈ తిరున నిది తేనె గ్రోలవలయు ననెడి యాసతోఁ బంపా సరస్సుగట్టున నున్న చెట్టు లన్నిటియందును దిరుగుచున్నది. ఈ నేల యందు విస్తారముగాఁ జెట్లనుండి పువ్వులు దమంతట రాలుటచే, నిది పువ్వులు పఱచిన పాన్పువలె సొబగుమీఱి, సౌఖ్యకరముగాఁ గన బడుచున్నది. ఈ కొండ నెత్తములం దొక్కొక్కచోట నొక్కొక్క తీరుగల పువ్వులు రాలుటవలనఁ బసుపు నలుపు మొదలగు పలురంగులు గల నెజ్జ లేర్పఱుపఁబడినవో యనునట్లు కానఁబడుచున్నవి.

లక్ష్మణా, వసంతకాలమున నీ చెట్లయందలి పువ్వుల కలిమిని జూచితివా! ఇయ్యవి యొక్కదానిమీఁద నొకటి పోటి గలిగియున్నవో యన్నట్లుగా నొక్క చెట్టునకంటె మఱొక్కచెట్టు సిరివిగాఁ బూచియున్నది. ఈ వనపాదపములు చక్కగాఁ బూఁచిన కొమ్మలతోఁగూడి, తుమ్మెదల ఝుంకారములతో నిండి యొండొరులం బిలుచుచున్నవో యన్నట్లులు వెలయుచు నెంతయుఁ జెలువుమీఱు చున్నవి. లక్ష్మణా, ఈ నీరుకోడి తేటనీటిని జొచ్చి తన ప్రియతోఁ గూడి రమించుచున్నది. ఇయ్యది చూడ నా మనసున కెంతయు మదనవేదన హెచ్చుచున్నది. గంగానది కింతటి చక్కని రూపుగల దేని, యప్పుడు గంగానది మనోహరములగు గుణములు గలదియని

లోకములందు మిక్కిలి ప్రసిద్ధి గాంచియుండును. ఇప్పు డా పతివ్రత యగు సీత దొరకునేని, నే నిచ్చటనే యా సీతతోఁ గూడియుందునేని, నా కింద్రలోకము నక్కఱలేదు; అయోధ్యయు నక్కఱలేదు. ఇట్లు మనోహరములగు పచ్చికబయళ్ళయం దా సీతతోఁగూడి విహరించు చుందునేని నా కే చింతయులేదు; ఇతరవస్తువులమీఁద నాశయులేదు. ఈ మహీరుహములు చక్కని యాకులు కలిగి, పలుతెగలయిన పుష్ప ములతో నిండినవై యుండుటంజేసి, కాంతావియోగముచే సొక్కి యుండు నాకు మనోవికారమును బెంచుచున్నవి. సౌమిత్రీ చల్లనినీరు గలయీపంప పద్మములచే శోభిల్లుచు, హంస, కారండవ, చక్రవాక, ప్లవ, క్రౌంచాదులగు జలపక్షులతో నొప్పి, నీరు ద్రావ వచ్చిన వరా హములు మొదలగు మృగములతోఁ గూడి యింపుగాఁ గూయు చున్న పక్షులతో నెంతయు శోభిల్లుచున్నవి. తమప్రియులంగూడి మోద మొందుచున్న వివిధములగు పక్షులు చంద్రముఖియు, జవ్వనియు, తమ్మికంటియునై న ప్రియకాంతను గానక దానినే తలఁచి వగచుచుండు నాకు విరహవేదనను మఱింత హెచ్చించుచున్నవి.

లక్ష్మణా, వింతలైన యీ చరులందుఁ దమ ప్రియలతోఁ గూడి రమించుచున్న జింకలఁ జూడుము; మృగాక్షియగు సీతం గోలుపోయి విరహవేదనచేఁ గుందుచున్న నన్నును జూడుము. ఈ మనోహర మగు చరియయందుఁ దిరుగు పెక్కు మృగములును పక్షులును తమ ప్రియ కాంతలతోఁ గూడి యిచ్చటి కచ్చటికిఁ దిరుగుచుండుటఁ జూడ నాకు మదనవేదన మఱింత హెచ్చుచున్నది. ఆ నా కాంతను జూచిననే కాని నా మనంబునకు నెమ్మది గలుగదు. లక్ష్మణా, సన్ననినడుముగల యాసీత నాత్రోఁగూడి నీ చక్కని పంపాసర స్తీరమున వీచు గాలిని సేవించుచు నుందునేని, నేను బ్రాణములతో నుందును. లక్ష్మణా, అదృష్టశాలు రగు మానవులు పద్మముల కమ్మని తావిని గొని, తిన్నగా వీచుచు శోకమును బోఁగొట్టెడి యీ పంపాసర స్తీరపు దోఁటలలోనిగాలిని సేవింతురు. నడివయసుదియు, పద్మపత్రములంబోలు కన్నులుగలదియు నైన నా ప్రియయగు జానకి నన్ను విడనాడినదయి స్వాధీనముఁదప్పి తనప్రాణముల నెట్లు దాల్చియుండఁగలదు? నేను వనవాసము ముగించి మఱలఁ బట్టణమునకుఁ బోయినప్పుడు ధర్మముల నెఱిఁగినవాఁడు,

సత్యము పలుకువాఁడు నగు జనకనృపాలుఁడు తన కూఁతునేమము నడిగిన నేనేమి బదులు చెప్పుదును? తండ్రి నన్నడవికిఁ బొమ్మనఁగా నే నడవికి వచ్చునప్పుడు, నిర్భాగ్యుఁడనైన నన్నెడఁబాసి యుండఁ జాలక నీతికి లోఁబడి కూడవచ్చిన ప్రియురాలగు సీత యిపు డెచ్చట నున్నదో! లక్ష్మణా, రాజ్యముఁ గోల్పోయి, విచారగ్రస్తుఁడనై యున్న నన్నే సీత వెంబడించి వచ్చినదో, యట్టి సీతను బాసి, సంతసము దప్పి యెట్లు నేను ప్రాణములతో నుండఁగలను? చక్కని కనుతెప్పలు గలదియు, నెత్తావిగలదియు, ఒచ్చెములు లేనిదియునై సొబగుమీఱు చుండు సీతమోమును జూడక నా మనము మిక్కిలి గుందుచున్నది. లక్ష్మణా, సీత చిఱునవ్వుమోముతో నడుమనడుమఁ బరిహాసపూర్వకము లయినవియు, తియ్యనివియు, రసవంతములయినవియు, మే లొనఁగూర్చునవియునైన పలుకులు పలుకు నెప్పుడు వినఁగలను? నడివయసున నున్నదియు, బతివ్రతయునైన సీత వనమున వనటనొందియు మదన బాధఁజేఁ గృశించియున్న నన్నుఁగూర్చి, దుఃఖము లేనిదివోలెను, సంతోషచిత్తురాలికై వడియు బాగుగా మాటాడుచు, నన్ను సంతోష పెట్టెను. లక్ష్మణా, నేను మఱల నయోధ్యకుఁ బోయినపుడు, నాతల్లి, "కోడ లెక్కడ" అని మక్కువతో నడుగఁగా, నే నామె కేమని బదులు చెప్పుదును? లక్ష్మణా, నీవు పోయి, తోఁబుట్టువులం దెక్కువ ప్రేమముగల భరతునిం గూడి సౌఖ్యముతో నుండుము. నేను జానకిని విడనాడి యొకనిమిషమైనను మనఁజాలను." అని లక్ష్మణునితోఁ జెప్పి రాముఁడు విరహావేదన నోర్వఁజాలక, దిక్కులేనివానికై వడి విలపించుచుండును.

అట్లు ధీరుఁడయినను సీతావియోగవేదనచే వగచుచుండు రామునిఁ జూచి, లక్ష్మణుఁడు సమయోచితముగను, బదులులేకుండ నట్లు నిట్లనియెఁ: "పురుషోత్తముఁడా, రామా, దుఃఖము నణఁపుము. నీకు మేలయ్యెడుఁగాక. కలుషాత్ములుగాని సీబోటిధీరు లెంత యాపద లందును వ్యసనము నొందరుగదా. ప్రియజనమునం దెక్కువ స్నేహ ముంచినయెడ, వారిం బాసినప్పు డెక్కువ వ్యసనము గలుగును గావున, ప్రియజనమునం దెక్కువ ప్రేమ యుంపరాదు. దీపపువత్తి తడిసి యున్నను, ఎక్కువ స్నేహముండునేని కాలిపోవును. రాఘవా!

నీ ప్రియురాలి నపహరించిన రావణుఁడు పాతాళమునకుఁగాని, లేక యంతకుఁ గ్రిందికిఁగాని, బోయినను, ఆతఁ డెవ్విధమునను ప్రాణము లతో నుండఁజాలఁడు. ఆపాపాత్ముఁ డగు రావణునిసంగతి మొదటఁ దెలిసికొందము. పిమ్మట వాఁడు సీతను దెచ్చియిచ్చిన సరే లేనిచో వానిని వధింతము. ఆ రావణుఁడు సీతను వెంటఁ దీసికొని యదితి గర్భము చొచ్చినను, వానిని వధించెదను. ఓ పూజ్యుఁడా! మే లొసఁగునట్టిది నెమ్మది. అట్టి నెమ్మది నొందక కార్యము సిద్ధింపదు గావున నీవు దీనబుద్ధి వదలి, శాంతి నొందుము. కార్యము చెడిపోయిన వారె ప్రయత్నపడక యా కార్యమును నెఱవేర్చుకొనఁజాలరు. ఆర్యా! ఉత్సాహమే బలిమిగలది. ఉత్సాహమునకంటె మించిన బలము లేదు. ఉత్సాహవంతుని కీలోకము దుర్లభమైనది యొక్కటియు లేదు. ఉత్సాహవంతు లెప్పుడును నాశ మొందరు. కావున మన ముత్సాహముపూని సీతం బడయుదము. మహాత్మా! నీవు శోకమును వెనుకకుఁ ద్రోసి, మోహమును వీడి, కార్యమును సాధింపుము. నీవు ధైర్యవంతుఁడవుగను, శక్తిగలవాఁడవుగ నున్నను, నీ ప్రభావము నేల యెఱుఁగకున్నావు?" అనియిట్లు లక్ష్మణుఁడు శాంతపఱుఁచఁగా, రాముఁడు దుఃఖాక్రాంతచేతస్కుఁడయినను, వగపును మోహమును బాసి, మిక్కిలి ధైర్యము నొందెను.

ఎన్నఁ రాని పరాక్రమంబు గల యా రాముఁడు చింత నాపుకొని కడురమ్యములైన చెట్లతోఁ గూడి, మనోహరమైయున్న పంపా సరస్సును దాఁటిపోయెను. మహాత్ముఁడగు రాముఁడు వనమునంతయు, నెలయేళ్లను, పర్వతగుహాలను జూచుచు, లక్ష్మణసమేతుఁడయి సీతను గానక, మనమున వగచుచుఁ బయనమైపోయెను. రాముఁడు ముందు నడచుచుండఁగా, లక్ష్మణుఁడు మరపు లేనుఁగునకై వడి నడచుచు ధీర హృదయుఁడయి, మెలఁకువతోఁ గూడి యా రామునికి రాజధర్మములు చెప్పియు, మృగాదులవలన నపాయము గలుగనీకయుఁ గాపాడు చుండెను.

అట్లు రామలక్ష్మణులు వచ్చుచుండఁగా, వానరాధిపుఁడును, బల వంతుఁడునైన సుగ్రీవుఁడు ఋశ్యమూకపర్వతశిఖరమునసుండి, ఆశ్చర్య

మును గలిగించురూపముగలవారగు నా రాజపుత్రులం జూచి మిక్కిలి యులికిపడి, కొంచెమైనను గదలక మెదలక యుండెను. ధైర్యశాలి యగు నా సుగ్రీవుఁడు గజముమాడ్కిఁ దిన్నగాఁ బోవుచు నప్పర్వత సమీపంబునఁ బెద్దయుఁ బ్రొద్దు సంచరించుచుండు నారాజపుత్రులం జూచి, దిగులొంది, వాలి పంపిన మాఱువేసములు దాల్చిన బంటులో యని తలఁచి భయ మను సముద్రమున మునింగినవాఁడై యెక్కువ వెతనొందెను. ఆ సుగ్రీవుని మంత్రు లగు వానరులును పరాక్రమ శాలు లగు రామలక్ష్మణులం గాంచి, "వీరు వాలిబంటు" లని వెఱచిన వారలై, పావనంబును, సుఖప్రదమును, శరణుచొచ్చినవారిం గాపాడు నదియు, సంతతము వానరుల కునికిపట్టయినదియునై న మతంగాశ్రమంబు నకుఁ బోయి చేరిరి.

2-వ సర్గము

సుగ్రీవుఁడు హనుమంతుని రామలక్ష్మణుల విచారించుటకై పంపుట

మహోత్సులును, మేటి యాయుధములు దాల్చిన వాఁడిమగలునైన యన్నదమ్ములగు రామలక్ష్మణులఁ జూచి, వానరశ్రేష్ఠుఁడగు సుగ్రీవుఁడు వాలి యంపిన భటులేమో యని సంశయపడినవాఁడై, మనసున దిగులొంది, దెసలెల్ల విలోకించుచు నారాటమొంది యొకచోట నిలువక, తా నున్నచోటనె యుండుటకు నిచ్చగింపనివాఁడయ్యె. కడు భీతుఁడయిన యా కపీంద్రుని మనస్సు వ్యసనాక్రాంత మయ్యెను. ధర్మాత్ముఁడగు సుగ్రీవుఁడు మిక్కిలి భీతినొంది, కొంతతడవు తనమంత్రులం గూడి మేలుకీళ్ళ నరసి వారితో నిట్లనియె. "వీరు వాలియొక్క వేగులు. వీరు మనసంగతి తెలిసికొనుటకై మోసముతో నారబట్టలను గట్టుకొని చోరరాని యీ వనమునకు వచ్చియున్నారు" అని సుగ్రీవుఁడు చెప్పఁగా, సుగ్రీవునిమంత్రులందఱు గొప్పవిలుకాండ్రగు రామలక్ష్మణులను జూచి, యాచరియ విడిచి మఱియొక్క శిఖరమునకుఁ బోయి చేరిరి. అట్లొక్కొక్క గుంపునకు నాయకులయిన వానరులు యూథపుల కధిపతియు, వానరోత్తముఁడు నయిన యా సుగ్రీవునిచుట్టును అతని కేయపాయము రాకుండునట్లు కనుపెట్టికొని కాచుకొనియుండిరి. ఇట్లు వానర లొక్క

చోటినుండి మఱియొక్క చోటికిని, ఒకపర్వతముమీఁదినుండి మఱి యొక్కపర్వతముమీఁదికిని బోవుచుఁ దమ వేగముయొక్క బలమిచేఁ బర్వతశిఖరములనుసై తముఁ గదలించుచు, నా దుర్గముననున్న పుష్పిం చిన చెట్ల నన్నింటిని విఱిచిరి. వానరము లిట్టు డాటిపోవుచు నా పర్వతమునన్న జింకలను, పిల్లులను, పులులను వెఱపించుచుఁ దిరుగుచుఁ బోయి, మఱొక్క పర్వతశిఖరముఁ జేరి తమ యధిపుఁడగు సుగ్రీవునిసన్నిధానమునఁ జేతులు గట్టికొని నిలఁబడియుండిరి.

ఇట్లు వాలి పంపిన మోసగాండ్రో యని సంశయించి, భీతిచేఁ గడగడ వణఁకుచున్న సుగ్రీవుం జూచి, మాటలందు నేర్పరియగు హనుమంతుఁడు, "మీ రందఱు వాలినిమిత్తమయిన యీ తత్తరపాటు వదలుఁడు. ఇది పావన మగు మలయపర్వతము. ఈ పర్వతమున వాలి వలనిభయము లేదు. హరిశ్రేష్ఠా, నీ వేవాలికి వెఱచి యిట్లు పరుగెత్తి తివో, యట్టి క్రూరస్వరూపుఁడును, క్రూరుఁడును నగు వాలి యిచ్చట గానరాఁడు. పాపాత్ముఁడగు నే నీయన్న వలన నీవు భయపడుచున్నావో, యాదుష్టాత్ముఁడగు వాలి యిక్కడ కానరాఁడు. నీ కిచ్చట భయ కారణం బేమియు నాకుఁ గానరాదు. ఓవానరోత్తమా! నీ కోఁతితనము తెలిసినదియెకదా. నీవు చపలబుద్ధికలవాఁడవు గనుక, మనోస్థైర్యము లేక యున్నావు. వానరోత్తమా! తెలివియు యోచనయుంగలవాఁడవై, భావములంగ్రహించి యన్నిపనులు చేయుము. ఏల యన, బుద్ధిహీనుఁడగు రాజు సర్వభూతములఁ బాలింపఁజాలఁడు" అని చెప్పెను.

సుగ్రీవుఁడును హనుమంతుఁడు చెప్పిన మంచి పలుకులు విని, యా హనుమంతునితోఁ గడు మేలయిన పలుకులం జెప్పెను. "ఓ హనుమంతుఁడా! నిడుద చేతులును, విఱివికన్నులును గలవాఁడై, ధను ర్బాణగదలం దాల్చిన దేవకుమారులం బోలిన వీరిం జూచిన నేరికి వెఱపు పుట్టదు? ఈ పురుషోత్తములు వాలి పంపిన వేగులని తలంచెదను. రాజులకు వెక్కుండ్రు మిత్రు లుందురు. ఒక్కొక్క రొక యాలోచన చెప్పుదురు. కాఁబట్టి రాజులయెడ నమ్మక ముంచుట తగినపని కాదు. రాజు గూఢచారులగు శత్రువులను దెలిసికొనవలయును. అట్లు తెలి యక నమ్మియుండు రాజును, శత్రువులు తాము నమ్మనివారయి సందు

గనిపెట్టి యాతనికి నాపదలం గలిగింతురు. వాలియో కాచకార్యముల పట్లఁ గడు నేర్పరి. రాజులు పెక్కుపాయములఁదెలిసినవారు. కావున నట్టి మోసగాండ్రగు శత్రువుల మాఱువేసముదాల్చినయట్టి మోస గాండ్రమూలములనే యెఱుంగవలయును. హనుమంతుఁడా! నీవు మాఱువేసము దాల్చి, వారిచేష్టల యభిప్రాయములను, రూపమును, మాటలను గనిపెట్టి, వారు మంచిమనసు గలవారని తెలియుదువేని, పొగడ్తలచేతను, స్వాభిప్రాయములఁ దెల్పుటచేతను వారిని నమ్మించి, వారియభిప్రాయముఁ దెలిసికొనుము. ఓహరిపుంగవా! వారు విండ్లను దాల్చి యేల యీవనమున కేతెంచిరో యడిగి తెలిసికొనుము. నా కనుకూల మగునట్లు వారితో మాట్లాడి వీరు మంచి మనసుగలవారలా? లేక వాలి పంపఁగా వచ్చిన వేగులా? ఈ సంగతి వారి నడతలు, మాటలు మొదలగువానిఁ గనిపెట్టి తెలిసికొని రమ్మని సుగ్రీవుఁడు నెప్పెను.

ఇట్లు కడు భయంకరుఁడును, శత్రువుల కలవిగానివాఁడును నైన సుగ్రీవుఁడు నెప్పిన పలుకులు విని, యాతనియానతిని శిరసావహించి, మహానుభావుఁ డగు హనుమానుఁడు బలిష్ఠులగు రామలక్ష్మణు లున్న చోటికిఁ బోయెను.

3-వ సర్గము

హనుమంతుఁడు రామలక్ష్మణులసంగతి విచారించుట

పవననందనుఁ డగు శూరుఁడయిన హనుమంతుఁడు బుద్ధిశాలియగు సుగ్రీవునియానతి నైకొని, మోసంపుఁదలంపుగలవాఁ డగుటచే స్వీయ రూపము వదలి, యతిరూపము దాల్చి, ఋశ్యమూక పర్వతశిఖరము నుండి పైకెగిరి యా రామలక్ష్మణులున్న చోటికి దుమికి, మృదువును, సత్యమును నైనపరాక్రమముగలవారును, శూరులును నైన యా రామ లక్ష్మణులకు సవినయముగ మ్రొక్కి, పలు తెఱఁగులఁ గొనియాడి, యథా విధిగఁ బూజించి తిన్నని యింపుగులుకు పలుకుల నిట్లనియె.

ఓ నరోత్తములారా! మీరు దేవతలం బోలినవారును, కఠిననియమములుగలతాపసులు నైనరాజన్యులుగఁ గన్పట్టుచున్నవారలు. నిగనిగ

మెఱయు మేనిడాలుగల మీ రీ దేశమున కెట్లు వచ్చితిరి? మీ రేల యీ పంపాతీరవృక్షములనేలను దేఱిపాఱఁ జూచుచున్నారు? మిమ్ముఁ జూచి యీ వనమున నున్న మృగపక్షులగుంపు లెల్ల వెఱచుచున్నవి. మీకాంతిచే నీ పంపాసరస్సునందలి తేట నీరెల్లఁ దళతళ మెఱయుచున్నది. ఇట్టి సరోవరప్రాంతమునఁ దిరుగుచు, మునివేషధారులై ధైర్యవంతులు బంగరుకాంతివంటిశరీరము కాంతిగలవారు, నారబట్టలఁ గట్టినవారు, హస్తిహస్తములం బోలు నిడుదచేతులుగల వారు, సింహమువంటి గంభీరదృష్టిగలవారు, సింగముకంటె నెక్కుడు బలిష్ఠులు, ఇంద్రధనుస్సునుబోలిన ధనుస్సును జేతఁ బూని శత్రువులను సంహరించువారు, కలిమిగలవారు, చక్కనైనవారు, ఆఁబోతులవంటి వీరులు, మెఱుఁగు గలవారునైన నరోత్తములగు మీరు మావంటి వారికి వెఱపుగల్గించుచు, నిట్టూర్పులు నిగిడించుచున్నారు. మీ రెవరు? మీ మేనిడాలు చేత బుశ్యమూకము వెలయుచున్నది. తమ్మిరేకులం బోలు కన్నులుగలవారలు, వీరులు, దేవతలంబోలువారలు, రాజ్యపరిపాలనార్హులునైన మీరు జడలగుంపును దాల్చి యేల యీ పర్వతమునకు వచ్చితిరి. మీ రొండొరులం బోలి, శూరులై స్వర్గలోకమునుండి యథేచ్ఛగాఁ బుడమికి దిగివచ్చిన సూర్యచంద్రులం బోలి నిగనిగ మెఱయుచున్నారు. మీరు వెడఁదయొమ్మును, సింగపుమూపురములును గలిగి, మనుజులయ్యు, దేవతలో యనఁబరఁగి, కడు నుత్సాహవంతులై మదించిన యాఁబోతులమాడ్కి నున్నవారలు. మీ బాహువులు నిడుదలు, గుండ్రనివియునై పరిఘాయుధమునుబోలి, సకలభూషణములఁ దొడుగఁ దగినవిగ నున్నను, ఏల భూషణవిభూషితములు గాకయున్నవి? మీ రిరువురును వింధ్యమేరుపర్వతములచే నలంకృతములయియుండు నీభూమండలమునెల్ల సగిరికాననముగఁ బాలింపఁజాలిన వారని తలఁచెదను. వింతగొల్పునవియు, నున్నవియు, వింతయైన బంగారుపూఁత పూసినవియునైన యీ విండ్లు మేలికడానితాపఁబడిన దేవేంద్రుని వజ్రాయుధములమాడ్కి వెలుంగుచున్నవి. ఈ యమ్ముల పొదులు ప్రాణములకుఁ దుది గలిగించునట్టి బుసకొట్టుచున్న ఘోరసర్పములమాడ్కి వెలుఁగుచున్న కఱకుటమ్ములతో నిండియున్నవి. మీ చేతి గదలు రెంటును మిక్కిలి నిడుదలై, వికివి గలిగి, పుత్తడిరంగు గలిగి

కుబుసము విడిచిన పాములమాడ్కి వెలయుచున్నవి. ఓ రాజపుత్రులారా! నే నిన్ని తెఱఁగుల మిమ్ము నడుగుచున్న నొక్కమాటకైన బదులు సెప్పకున్నా రదేమి?

ధర్మకార్యము లొనర్చు స్వభావముగల శూరుఁడయిన సుగ్రీవుఁడను వానరోత్తముఁ డొక్కఁడు గలఁడు. అతఁడు తన తోఁబుట్టువు మూలమున నిడుమ చెంది, వగపాలై యీవనమెల్లఁ దిరుగుచున్న వాఁడు. మహోత్సుఁడగు వానరపతియైన సుగ్రీవుఁడు పంపఁగా నే నిట కేతెంచితిని. నన్ను హనుమంతుఁ డని యందురు. న్యాయపరుఁడగు సుగ్రీవుఁడు మీతోఁ జెలిమిగోరుచున్నాఁడు. నే వాయుపుత్రుఁడను. వానరుఁడను. ఆ సుగ్రీవునికి మంత్రిని. నా కీభిక్షురూపంబు నియతంబు గాదు. నేను దలఁచినరూప మెత్తఁగలను. తలఁచినచోటికిఁ బోవఁగలను. ఆ సుగ్రీవునిమేలు గోరి ఋశ్యమూక పర్వతమునుండి యిట కేతెంచితిని. అని నేర్పరియగు హనుమంతుఁడు వాక్యార్థము నెఱుఁగఁగలవారును, శూరులునయిన రామలక్ష్మణుల కిత్తెఱఁగునఁ జెప్పి, యంతటితోఁ దన మాటలను ముగించెను.

శ్రీమంతుఁ డగు రాముఁడు హనుమంతుని పలుకు లాలకించి, మొగంబునఁ జిఱునగవు గన్పట్ట దండ నిల్చియున్న లక్ష్మణునిం గూర్చి, "లక్ష్మణా, ఈతఁడు మహోత్సుఁడయిన కపీంద్రుఁడగు సుగ్రీవుని మంత్రి. ఆతనినే మనము చూడఁగోరియుండ, మనకొఱ కాతనిమంత్రియే వచ్చెను! శత్రుసంహారకుఁడా! మాటలందు నేర్పరియగు నీ సుగ్రీవునిమంతిరితోఁ దేనియలు వెల్లివిరియఁ బ్రేమ ముట్టిపడ మాటాడుము. ఋగ్యజుస్సామములను వేదత్రయము పఠింపనివాని కిట్లు మాటాడ వీలగునే? ఇతఁడు వ్యాకరణమంతయుఁ బెక్కుమాఱులు చదివిన వాఁడు. కాఁబట్టి యితఁ డెంతయు మాటాడినను, వీని నోటినుండి యొకింతయు నపశబ్దము రాదయ్యె. ఇతని ముఖమునఁగాని, కన్నులందుఁగాని, నొసటఁగాని, బొమలందుఁగాని, తక్కిన యవయవములందుఁగాని యెచ్చటను నొక్కదోషమైనను గానరాదుగదా, ఇతఁ డాడుమాటలు విస్తారముగాకయు, సందియము లేకయు, తడవు గలుగకయు, ఓమ్ము సుండిపుట్టి కంఠమూలమువలన మధ్యమస్వరముతో వినఁబడుచున్నవి.

ఇతఁడు వ్యాకరణవిరుద్ధము గాకుండునట్లును, సరసముగను, తొంపర లేకయు మనస్సు నాకర్షించునట్టి శుభకరమైన మాట పలుకుచున్నాఁడు. వింతలైన యర్థములుగలిగి, ఉరఃకంఠశిరస్సులందు స్పష్టోచ్చారణగల యీ హనుమంతుని మాటల విన్నవాఁ డెవ్వఁడు సంతసింపఁడు? సంహరింపఁబూని, కత్తి చేతదూసిన పగతుఁడుగూడ నితని పలుకులు వినిన, తోడనే ఖడ్గమును గ్రిందఁబడవేయును. రాజున కిట్టి గుణవంతుఁడగు దూత యుండఁడేని, యాతఁడు కార్యముల సాధించు నెట్లు? ఏ రాజున కిట్టి గుణములు గలిగిన కార్యసాధకులైన మంత్రు లుందురో, ఆ రాజు లట్టిదూతలపలుకుల నాలకించి, యీ ప్రకారము నడచుకొన్నచో నన్ని కార్యములు సిద్ధింపఁగలవు."

ఇట్లు రాముఁడు సెప్పఁగా, మాట్లాడనేర్పుగల లక్ష్మణుఁడు విని, మాటల యభిప్రాయము నెఱుఁగఁగల హనుమంతునిఁ గూర్చి, "ఓ పండితుఁడా! మహాత్ముఁడయిన సుగ్రీవునిగుణములు మాకుఁ దెలియును. మేమును వానరాధిపుఁడగు సుగ్రీవునె వెదకుచున్నారము. సాధువా! హనుమంతుఁడా! సుగ్రీవుని మాటగా నీ వేమి చెప్పితివో, నీవు చెప్పిన చొప్పున దాని నట్లే చేసెదము." అని యిట్లు లక్ష్మణుఁడు చెప్పఁగా, మారుతనందనుఁడగు హనుమంతుఁ డాతనిపలుకులు విని మిక్కిలి సంతోషపడి, మనమునఁ గుదుటవడి వాలిజయమునిమిత్తమయి యా రామ లక్ష్మణులతోఁ జెలిమి యొనర్పఁ దలఁచినవాఁ డయ్యెను.

4వ సర్గము.

లక్ష్మణుఁడు హనుమంతునికిఁ దమవృత్తాంతముఁ దెలుపుట

మాటలందు నేర్పరియైన వానరశ్రేష్ఠుఁడగు హనూమానుఁడు లక్ష్మణుఁడు సెప్పిన తేనియలొలుకు పలుకులు విని, "రాముఁడు సుగ్రీవునితో నెయ్య మొనర్ప వచ్చియున్నాఁడు. ఇతనికి సుగ్రీవునివలనఁ గార్య మున్నది. కావున సుగ్రీవుఁడు గోరినపనిని రాముఁడును జేయఁ గలఁడు. ఇఁక సుగ్రీవునికి రాజ్యలాభము గలుగఁగలదు." అని సుగ్రీవునింగూర్చి తనమనమునఁ దలపోసి ప్రమోదమందినవాఁడై, రామునిం గూర్చి, "ఓ రాజా! పంపాసర స్తీరవనములచే శోభిల్లునదియు,

పెక్కు కూళమెకముల కునికిపట్టునగు నీ ఘోరారణ్యమున కేల తమ్మునితోఁగూడి వచ్చితివి?" యని యడిగెను.

అంత రాముఁడు హనుమంతుని వాక్యము విని లక్ష్మణునివైపు చూచి సైగ చేసెను. అంత లక్ష్మణుఁడు హనుమంతునిఁ గూర్చి మహాత్ముఁ డైనరాముసంగతి యిట్లనియె. "ఓ హనుమంతుఁడా! కాంతిమంతుఁడును, ధర్మమునందుఁ గడుఁబ్రేముఁడి గలవాఁడు సైనదశరథనరపాలుఁడు బ్రాహ్మణాదివర్ణముల వారి నెల్లపుడు మర్యాదఁ దప్పక పరిపాలించుచుండెను. ఆతనిపై నితరులకును, అతనికి నితరుల పైనను విరోధము లేదు. ఆతఁడు జనులందఱియందు బ్రహ్మదేవునిపగిది దయాళువై యుండును. ఆ దశరథుఁడు సంతతిఁ గోరి, యగ్నిష్టోమాదులగు పెక్కు యాగములుసేసి, యర్థులకుఁ గావలసినంత యిచ్చెను. ఆతని కితఁడు పెద్దకొడుకు; ఇతనిని రాముఁ డందురు. ఇతఁడు సకల జీవకోటికిని శరణ్యుఁడు. తండ్రియానతి మీఱనివాఁడు. వీరుఁడగు నీరాముఁడు దశరథునికొడుకులలో నెల్ల నెక్కువ గుణవంతుఁడు. రాజలక్షణములును, రాజసంపదయుం గలవాఁడు. తండ్రి యితనిని రాజ్యమునుండి పొమ్మనఁగా, నన్నుఁ గూడఁ బిలిచికొని యీ వనమున నుండ వచ్చెను. ఎక్కువకాంతిగల సూర్యుని సాయంకాలమున వెలుఁగు వెంబడించునట్లు ప్రతాపవంతుఁడగు నీరాముని సీత వెంబడించి వచ్చెను. నే నీతనికిఁ దమ్ముఁడను. నన్ను లక్ష్మణుఁ డందురు. మేలు మఱవనివాఁడు, శాస్త్రముల నెఱిఁగినవాఁడు, సుఖము లనుభవింపఁ దగినవాఁడు, ఉత్తముఁడు, మనసునం దెల్లప్పు డన్నిభూతములకును హితము గోరువాఁడునైన యీ రాముఁ డైశ్వర్యముఁ బోఁగొట్టుకొని, యడవులకు వచ్చినను, ఆతనిగుణములచే నే నాతనికి శుశ్రూష యొనరింప వచ్చితిని. మే మంచఱిమి వనమున నుండఁగా, నేనును రాముఁడును లేనిసమయమునఁ గామరూపియగు నొక రాక్షసుఁ డీతని భార్య నపహరించెను. ఆ యపహరించిన రాక్షసుఁ డెవ్వఁడో తెలియ రాదు. దితిపుత్రుఁడు దను వసువాఁడు శాపమువలన రాక్షసత్వము నొందిన మాకు మార్గమధ్యమునఁ గనఁబడెను. 'సీతనుగూర్చి నీ కేమైనను దెలియునా?' యని యాతనిని నడుగఁగా, "నాకుఁ దెలియదు. ఋశ్యమూకమున సుగ్రీవుండును వానరోత్తముఁడున్నాఁడు. ఆతఁడు

సీత నెత్తికొనిపోయినవానిని నెఱుఁగఁగలఁ"డని యాతఁడు మాతోఁ జెప్పెను. దను విట్లు మాతోఁ జెప్పి, శాపవిముక్తుఁడై, దివ్యశరీరము ధరియించి సుఖముగా స్వర్గమునకుఁ జేరెను. పవననందనా! మా సంగతి యిది. ఉన్నదియున్నట్లు చెప్పితిని. మే మిరువురమును సుగ్రీవునిశరణుఁ జొచ్చితిమి. ఈ రాముఁడు మున్ను యాచకులకు ధనము లొసఁగి, విస్తారమైన కీర్తిఁ జెంది లోకరక్షకుఁడయియుండియు, నిప్పుడు సుగ్రీవుని దిక్కుగాఁ గోరుచున్నాఁడు. ఏరామునితండ్రి ధర్మవంతుఁడును, శరణాగతరక్షకుఁడునై యుండెనో, అట్టి దశరథునకుఁ బుత్రుఁడయి, సకలజనరక్షణమందు నేర్పుగల రాముఁ డిప్పుడు సుగ్రీవుని శరణుచెందఁ గోరుచున్నాఁడు. మునుపు ధర్మాత్ముఁడును, శరణుచొచ్చిన వారిం గాపాడువాఁడునైన నా యన్నయగు నే రాముఁడు సర్వజనమునకు రక్షకుండై యుండెనో, ఆ రాముఁ డిప్పుడు సుగ్రీవుని శరణుచొచ్చి యున్నాఁడు. ఎవనియొక్క మహిమవలనఁ బ్రజలందఱు సంతోషపడు చుందురో, అట్టి రాముఁడు వానరశ్రేష్ఠుఁడగు సుగ్రీవునియొక్క యను గ్రహమును గోరుచున్నాఁడు. లోకమునందలి సకలసద్గుణవంతులయిన నృపాలురను ఏ దశరథనృపాలుఁడు గాపాడెనో, యా దశరథునికి జ్యేష్ఠ పుత్రుఁడయిన రాముఁడు కపీంద్రుఁడయిన సుగ్రీవుని శరణు చొచ్చియున్నాఁడు. వ్యసనముచేఁ గొట్టువడి, నొచ్చి శరణుచొచ్చియుండు రాముని తో వాన రాధిపుఁడగు సుగ్రీవుఁడు చెలిమి చేయునుగాక!

ఇట్లు దీనత్వముతోఁ బలుకుచుఁ గండ్లనీరు పెట్టుకొనుచున్న లక్ష్మణునిఁ జూచి, మాటలనేర్చినవాఁడగు హనుమంతుఁ డిట్లనియె "ఇట్టి బుద్ధిమంతులును, కోపము నడఁచుకొన్న వారును, విషయాశ లేనివారు నైన మీవంటివారి దర్శనమునకయి యా సుగ్రీవుఁడు ప్రయత్నము చేయవలసియుండెను. అట్టివార లగు మీ రాతనిభాగ్యవశమున నతనికి దర్శన మొసఁగుటకై స్వయముగా వచ్చియున్నారు. ఆ సుగ్రీవుఁడు తనయన్న యగు వాలి యేదియో కారణమునఁ దన భార్యను హరించి, తన్ను వంచించి రాజ్యమునుండి తఱుమఁగొట్టఁగా, నీపర్వతమునకు వచ్చియున్నాఁడు. సూర్యునిపుత్రుఁడగు సుగ్రీవుఁడు మాయందఱితోడ్పాటున సీతను వెదకువిషయమున మీకు సాహా

య్యము సేయఁగలఁడు. ఆ సుగ్రీవునికడకుఁ బోవుదము రండు." అని హానుమంతుఁడు తియ్యని పలుకులతోఁ జెప్పెను.

భర్తాతుఁడయిన లక్ష్మణుండును హానుమంతుని పలుకులు విని, మర్యాదకుఁ దగినట్లు హానుమంతుని గారవించి, రామునిఁ గూర్చి, "రాఘవా! నా పలుకులను హానుమంతుఁ డంగీకరించి, సంతసముతో యథార్థముఁ జెప్పెను. ఆ సుగ్రీవునికిని మనవలనఁ గార్యమున్నది. కావున నీ కార్యము నెఱవేరిన ట్లయ్యెను. ఈ పవననందనుఁడగు శూరుఁ డయిన హానుమంతుఁడు తేటమోముగలవాఁడై, సంతసము మీఱ స్పష్టముగాఁ జెప్పుచున్నాఁడు. ఇతఁ డన్యతము సెప్పువాఁడు కాఁడు" అని చెప్పెను.

అంతట బుద్ధిమంతుఁడును, మంచిమనస్సు గలవాఁడును, గీర్తిమంతుఁడును నయిన వానరశ్రేష్ఠుఁడగు హానుమంతుఁడు కపటసన్యాసి రూపము విడిచి, వానరరూపము ధరియించి, శూరులగు రామలక్ష్మణులను దనవీఁపుమీఁద నెక్కించుకొని, యా సుగ్రీవుఁ డున్న ఋశ్యమూక పర్వతశిఖరమునకుఁ బోయెను.

౫-వ సర్గము.

సుగ్రీవుఁడు రామునితోఁ జెలిమి యొనర్చుట

హానుమంతుఁడు రామలక్ష్మణులను దోడ్కొని, వెఱపుచే ఋశ్యమూకమునుండి మలయపర్వతమునకుఁ బోయియున్న సుగ్రీవునిం గని వానరేంద్రా! గొప్పపండితుఁడును, గట్టి పౌరుషము గలవాఁడునైన యీ రాముఁడు తమ్మునితోఁ గూడ వచ్చియున్నాఁడు. ఈ రాముఁడు వీడనిపరాక్రమముగలవాఁడు. ఇతఁ డిక్ష్వాకువంశమున దశరథునికిఁ బుత్రుఁడుగ జన్మించినవాఁడు. ధర్మమార్గముఁ దప్పనివాఁడు; పితృవాక్యపరిపాలకుఁడు. అట్టి యతం డరణ్యమున భార్యతోడ వసించియుండఁగా, రావణుఁ డతనిభార్యయగు సీత నెత్తికొనిపోయెను. ఆసీతను వెదకుటకై రాముఁడు నీ సాహాయ్యము గోరుచున్నాఁడు. రాజసూయములు, అశ్వమేధములు పెక్కులు సేసి, యే నృపాలుఁడగ్నిహోత్రునిఁ దనివినొందించెనో, ఏనృపాలుఁడు యాచకులకు లక్షలకొలఁది ధనమును గోవులను నొసఁగెనో, ఎవఁడు జితేంద్రియుఁడై న్యాయపథము దప్పక

భూమండలమునఁ బాలించెనో, అట్టి దశరథనృపాలునికిఁ బుత్రుఁడయిన రాముఁడు సీతను వెదకు నిమిత్తము నిన్ను శరణుఁజొచ్చియున్నవాఁడు. అన్నదమ్ములగు నా రామలక్ష్మణు లిరువురు నీతోడిచెలిమి గోరి వచ్చియున్నారు. వీరు నిక్కిలి మర్యాదసేయఁదగినవారు. వీరి నెదురొక్కని యాతిథ్యమొనరింపుము" అని చెప్పెను.

సుగ్రీవుఁడును హనుమంతునియొక్క మాటను విని, మనస్సున సంతసించినవాఁడై, దిగులు విడిచి, రాముని వలని వెఱపును వీడెను. మఱియు నవ్వానరశ్రేష్ఠుఁడగు సుగ్రీవుఁడు మానవరూపము ధరియించి, యందఱికిఁ గడుఁ జూడఁదగినవాఁడైవచ్చి రాముని తోఁ బ్రేమమీఱ "ఓరామా! నీవు ధర్మముదప్పనివాఁడవు; పరాక్రమనంతుఁడవు; సర్వభూతములయెడఁ బ్రేమగలవాఁడవునని నీ గుణములెల్ల హనుమంతుఁడు నాకు వాస్తవముగాఁ జెప్పెను. నీవు వానరుఁడనైన నాతోఁ జెలిమిగోరి వచ్చుట నాకే చాల గారవమును, గొప్ప లాభమునైయున్నది. నాతోడి చెలిమి మీ కావశ్యమేని, ఇదిగో చేయిచాఁచితిని, నీ చేతితో నాచేయి పట్టుకొనుము. శాశ్వతమైన యొక యేర్పాటుచేయుము" అని చెప్పెను. రాముఁడు సుగ్రీవుఁడు చెప్పిన మంచిమాటను విని, సంతుష్టాంతరంగుఁడై, తవచేతితో నాతనిచేయి పట్టి, చక్కని స్నేహముపూని గట్టిగాఁ గౌఁగిలించెను.

అంతట శత్రుసంహారియైన హనుమంతుఁడు రామలక్ష్మణులఁ గొనివచ్చిన పిదప సన్న్యాసిరూపము విడిచి, స్వస్వరూపముఁ దాల్చి, రెండుకట్టెలు చిలికి యగ్నిని పుట్టించి, మంచినట్లుచేసి, చక్కఁగాఁ బుష్పములచేఁ బూజించి, యా రాసుగ్రీవులనడుమ నుంచెను. అట్లు జ్వలించుచున్న యగ్నిహోత్రునికి రాసుగ్రీవులు ప్రదక్షిణము గావించి చెలిమి చేసికొనిరి. అంత సంతుష్టాంతరంగులైన యా రామ సుగ్రీవు లొండొరు లెంత తడవు చూచుచున్నను దనివి నొందరైరి. అప్పుడు సుగ్రీవుఁడు రామునిఁ జూచి, "ఓ రామచంద్రా! నీవు మనస్సున కొప్పిన స్నేహితుఁడవయితివి. ఇఁక నాదుఃఖమే నీదుఃఖము. నాసుఖమే నీసుఖము. నీదుఃఖమే నాదుఃఖము. నీసుఖమే నాసుఖము" అని సంతుష్టాంతరంగుఁడయి చెప్పి, ఆకులు, పూవులు గలిగిన యొక కొమ్మను విఱిచి క్రిందఁబడవైచి తానును రాముఁడును దానిపయిం గూర్చుండెను. హను

మంతుఁడును సంతసించి చక్కఁగాఁ బూఁచిన యొకచందనపుఁగొమ్మను విఱిచి యా లక్ష్మణున కాసనంబొసఁగెను.

అంతట సుగ్రీవుఁడు గడుమోదమంది, యానందబాష్పములచే నిండిన కన్నులుగలవాఁడై, రామునింగూర్చి, "ఓ రామా! వాలి నా భార్యను లాగికొని, నన్నుఁ గొట్టి తఱుమఁగా, నతనికి వెఱచి యతనికిఁ జొఱరాని యీ వనమున భయములేక తిరుగుచు నిపుడు నిన్నాశ్రయించితిని. రాఘవా! నా యన్నయగు వాలిచే వంచితుఁడనై, యాతనితోఁ బగపూని, యాతనికి వెఱచి కలగుండువడి, యేమియుఁ దోఁచకయున్నాను. ఓ మహాత్మా! కాకుత్థ్సా! వాలివలనిభయముచే నొచ్చియున్న నాకభయమొసఁగుము. శ్రీరామా! ఆవాలివలని భయము నాకు లేకుండునట్లు చేయుము" అని చెప్పెను.

ఇట్లు సుగ్రీవుఁడు నెప్పఁగా, ధర్మముల నెఱిఁగినవాఁడు, ధర్మము నడపుటయందుఁ బ్రేమగలవాఁడు, ప్రతాపవంతుఁడునైన రాముఁడు విని నవ్వుచు నిట్టులనియె. ఓ కపిశ్రేష్ఠా! స్నేహితుఁడయినందుకు ఫలముపకారము చేయుటే యని నే నెఱుఁగుదును. నీభార్యను దొంగిలించిన యా వాలిని నేను వధించెదను. ఓ సుగ్రీవా! యీ నా బాణములు సూర్యునివెలుఁగువంటి వెలుఁగుగలవి; గ్రద్దతెక్కలుగట్టినవి; ఇంద్రునివజ్రములం బోలునవి! వాఁడికొనలుగలవి; చక్కని గణుపులుగలవి. కోపముచే బుసకొట్టుచున్న పాములంబోలునవి. ఈ బాణములను దుష్టుఁడయినవాలిపైఁ బడునట్లు వేసెదను. సర్పములంబోలు వాఁడిబాణములతో వాలిని గొట్టి, పర్వతమును ద్రోసినట్లుగా నతనినిఁ గ్రిందఁ ద్రోసెదను.

అని రాముఁడు చెప్పిన తనకు మేలుగలిగెడు మాటను విని, సుగ్రీవుఁడు మహానందమును బొంది, రాముంగూర్చి, "పురుషోత్తమా! నేను నీయనుగ్రహమునఁ బ్రియురాలిని, రాజ్యమును ఎట్లు పొందుదునో! నాకుఁ బగతుఁడయిన నాయన్న నెట్లు చంపవచ్చునో, అట్టి ప్రయత్నమును జేయవలయును" అని రామునితోఁ జెప్పెను.

శ్లో. సీతాకపీన్ద్రక్షణదాచరాణాం రాజీవహేమజ్వలనోపమాని,
సుగ్రీవరామప్రణయప్రసక్తే వామాని నేత్రాణి సమం స్ఫురన్తి.

రామసుగ్రీవులు చెలిమిచేసికొన్నప్పుడు సీతయొక్క కమలములం బోలు నెడమకన్నును, వాలియొక్క పసిఁడివన్నె గల యెడమకన్నును, నిప్పుకంబోలు రావణుని యెడమకన్నును నొక్కపర్యాయముగా నవరెను. (స్త్రీలకు నెడమకన్నదరుట శుభము గనుక సీతకు మేలును, పురుషుల కెడమకన్నదరుట యశుభము గావున వాలిరావణులకు కీడు గలుగునని యీ వామాక్షి స్పందనము తెలియఁజేయుచున్నది.)

6వ సర్గము.

సుగ్రీవుఁడు రామునికి సీతభూషణములఁ జూపుట

సుగ్రీవుఁడు సంతసించి, రఘునందనుండగు రామునింగూర్చి వెండియు నిట్లనియె: "ఓ రామా! నీవెందుకై నిర్జనవనమునకు వచ్చి యుంటివో ఆసంగతి హనుమంతుఁడు చెప్పఁగాఁ దెలిసికొంటిని. నీతమ్ముఁడగు లక్ష్మణుఁడును నీవును సీత నొంటరిగ విడిచి వనమునఁ దిరుగు చుండఁగా, రావణుఁడు సందుగనిపెట్టియుండి, జటాయువును సంహరించి, యీ జానకి నెత్తుకొనిపోయెనుగదా. ఓ రామా! నీవు వేగిరమే భార్యావియోగమువలనఁ గలిగిన దుఃఖము వీడుదువు. సోమకాసురునిచే హరింపఁబడిన వేదములను మత్స్యావతారమెత్తిన విష్ణువు తెచ్చినట్లు, నే నా సీతను దెచ్చెదను. శత్రుసంహారీ! ఆబిడ పాతాళమునసున్నను, స్వర్గమున నున్నను నామెను దెచ్చి యిచ్చెదను. రాఘవా! యిమ్మాట నిజమని నమ్ముము. మహాబాహూ! ఇంద్రాదిదేవతలకుఁగాని, అసురులకుఁగాని నీప్రియురాలిని విషముగలిపిన భక్ష్యమునుబోలె ననుభవించుటకు వీలుగాదు. రామా! నీకాంతను దెచ్చియిచ్చెదను. నే నింతకముం దొక కాంత యాకసమునఁ బోవుచుండఁగాఁ జూచితిని. ఆ బిడయె సీతగా నుండనోపును. సందియము లేదు.

ఆయమను కట్టిడియగు రావణాసురుఁడు గొనిపోవుచుండఁగా, "రామా! రామా! లక్ష్మణా!" అని వికృతంపుగొంతుతో నటుచుచు నా రావణునియంకముమీఁద నాగరాజపల్లవలె వెలయుచుండినది. తటుచుగా నాబిడయె సీతయైయుండవచ్చును. నేను నానలుఁగురుమంత్రుల తోడ ఋశ్యమూకపర్వతశిఖరమునఁ గూర్చుండియుండఁగాఁ దన

యుత్తరీయమున మేలివియాభరణముల మూటఁగట్టి మానడుమఁ బడ వైచినది. రాఘవా! మే మాముల్లె నెత్తి దాఁచిపెట్టితిమి. దానిం దెచ్చెదను. వానిలోని భూషణముల గుర్తింపుము" అని చెప్పఁగా, రాముఁడు ప్రియములు వలుకుసుగ్రీవునిఁ జూచి, "చెలికాఁడా! యేల జాగుసేసెదవు? వేగ తెమ్ము" అని యడుగఁగా, సుగ్రీవుఁడు రామునికి మేలుసేయఁ గోరి, చొఱరానిపర్వతగుహలోపలికిఁ జొచ్చి యామేటి యాభరణములు గట్టినయుత్తరీయమును దెచ్చి "ఇదిగో చూడుము" అని రామునకుఁ జూపెను.

అంత రాముఁ డాయుత్తరీయమును, చక్కని సొమ్ములను గైకొని, చంద్రుఁడు మంచుచేఁ గప్పఁబడినచందమునఁ గన్నీటిచేఁ గ్రమ్మఁబడినవాఁ డయ్యెను. అట్లు రాముఁడు సీతయంచలి చెలివిచే దొఱలుచున్న కన్నీటిచే దృష్టి తెలియకుండునట్లు క్రమ్మఁబడినవాఁడై, "హా ప్రియురాలా!" యని విలపించుచు ధైర్యము విడిచి, పుడమిపై వాలెను. అంత రాముఁ డాతొడవుల నెల్లఁ దనడెందముపయి నిడి కొని, తేపఁబడినట్టి పుట్టలోనిపాముమాడ్కి కడు తీవ్రముగా నిట్టూర్పు విడిచెను. ఇట్లు విడువక కన్నీరు మున్నీరై పాఱుచుండఁగా, రాముఁడు ప్రక్కన నిలిచియుండు లక్ష్మణునిఁ జూచి, దీనముగా దుఃఖింప జొచ్చెను.

"లక్ష్మణా! సీత గొంపోవఁబడుచుండగాఁ దన యొడలినుండి యుత్తరీయమును, తొడవులను దీసి క్రిందఁబడవైచినది చూడుము. సీత గొంపోవఁబడుచుండునప్పుడు, ఆసీత తొడవులను బచ్చికబయళ్ళ యందుఁ బడవేసియుండును. కాఁబట్టియో, యివి దెబ్బతగులక ముందున్న తీరుగలవిగానే కానఁబడుచున్నవి" అని యిట్లు రాముఁడు పలుకఁగా, లక్ష్మణుఁ డన్ననుజూచి, "ఆమె దొడుగు బాహుపురు లెట్టివో; కమ్మ లెట్టివో నాకుఁ దెలియదు. నే నెల్లప్పు డామెపాదములకు మ్రొక్కు టంజేసి, యామె కాలియందెలుమాత్రము నే నెఱుఁగుదును" అని చెప్పెను.

అంతట రాముఁడు దీనుఁడై సుగ్రీవునిఁ జూచి, సుగ్రీవా! నా ప్రాణప్రియురాలగు సీతను భయంకరరూపుఁడగు రక్కసుఁ డేదిక్కు నకుఁ గొనిపోవుచుండఁగా, నీవు చూచితివిగా నా కింతటి గొప్ప వ్యస

నము దెచ్చిపెట్టిన యా రక్కసుఁ డెక్కడ నుండువాఁడు? ఆరాక్షసుని నిమిత్త మందఱు రక్కసులను బరిమార్చెదను. అతఁడు సీతను గొని పోవుచు, నాకుం గోపమును గలిగించి, తనప్రాణనాశమునకై మృత్యు ద్వారము తెఱచియుంచుకొనియున్నాఁడు. ప్లవంగాధిపా! నాయనుఁగుఁ జెలిని వనమునడుమనుండి యేరావణుఁడు హింసించికొనిపోయెనో, యారావణుఁ డెక్కడనుండువాఁడో ఇప్పుడే చెప్పుము. అతనిని యమ పురికిఁ బంపెదను" అని సుగ్రీవుని నడిగెను.

7-వ సర్గము.

సుగ్రీవుఁడు రాముని, రాముఁడు సుగ్రీవుఁని నోదార్చుట

రాముఁ డార్తుఁడై యిట్లు పలుకఁగా, సుగ్రీవుఁడు విని, కన్నీ టిచే డగ్గుత్తిక గలుగుచుండఁగా, చేతులు జోడించి, కన్నుల నీరు గార్చుచు నిట్లనెను. "రామా! చెడ్డకులంబునఁ బుట్టిన యాపాపాత్ముఁ డగు రాక్షసుఁ డుండుచోటుగాని, వానిబలపరాక్రమములుగాని, వాని కులముగాని నాకుఁ దెలియవు. శత్రుసంహారీ! నీవు శోకము వీడుము. సత్యముగా నేను ప్రతిజ్ఞ చేయుచున్నాను. సీత నీకు దొఱకులాగున ప్రయత్నము చేసెదను. రావణుని, వానిబలగమును సంహరించి, స్వకీయ పౌరుషంబు కృతార్థమగునట్లుచేసి, నీవు సీతను బడసి, యెట్లు సంత సింతువో, యట్టిప్రయత్నము వేగిరమె చేసెదను. నీవు వ్యసనమునొంది నది చాలును. నీకు స్వాభావికముగా నుండుధైర్యమును దలంపునకుఁ దెచ్చికొమ్ము. ఇట్టిచులకదనము నీవంటివారికి సాటిగాదుగదా. నాకును భార్యకోల్పోకవలన గొప్ప వెత సంభవిల్లినది. అయినను, నేను నీయట్లు శోకమును బొందను; ధైర్యమును వీడను. నే నల్పుఁడనగు కోతినైనను, అభార్యనుగూర్చి వగవను. నీవు ధైర్యసంతోషములు గలవాఁడవు; సకలశాస్త్రముల నెఱిఁగినవాఁడవు. నీవంటివాఁడు శోకము నొందఁదగునే? నీవు ధైర్యము వీని, స్వయముగా వచ్చు చుండు కన్నీటి నాఁపుకొనుము. బలవంతులకు లక్షణమయిన ధైర్య మును వీడకుము. వ్యసనమందును, ద్రవ్యనాశమునందును, ప్రాణము లకు ముప్పుదెచ్చునంత యాపదయందును స్వబుద్ధితోఁ జక్కఁగా నాలో చించునట్టి ధైర్యవంతుఁ డెన్నటికిని నశింపఁడు. ఏ నీచజనుఁడు

ధైర్యము లేక వ్యసనాదులు వచ్చినప్పుడు కలవరపాటు నొందు చున్నాఁడో, వాఁడెక్కువ బరువు వేసినయోడ నీట మునుఁగుకై వడిఁ జేయునడ లేక చింత యను కడలియందు మునిఁగిపోవుచున్నాఁడు. ఇదిగో చేతులు జోడించి, నిన్ను వేఁడుకొనెదను. చనవుచే నిన్నూరడించెదను. ధైర్యము నవలంబింపుము. దుఃఖమున కెడమీకుము. ఎవరు శోకంబు వీడక మాటిమాటికిఁ దలఁపునకుఁ దెచ్చుకొనుచుందురో, వారికి సౌఖ్యము గలుగదు. వారి ప్రతాపము నడఁగును. కావున నీవు శోకము నొందుట తగదు. శోకమునకు లోఁబడినవానికిఁ బ్రాణము లుండుట కూడ సందియమే. కావున రాజేంద్రా! నీవు శోకము వదలి, ధైర్యమునే యవలంబింపుము. నేను జెలిమిచే నీ కితవగు మాట చెప్పితిని కాని, నీ కుపదేశము చేయునంత గొప్పవాఁడను గాను. "మనచెలికాఁ డింతదూరము చెప్పుచుండఁగా, మనము చింతపడుట తగదని యెంచి గైనను శోకము వీడుము."

సుగ్రీవుఁ డిట్లు తిన్ననిమాటలుసెప్పి బుజ్జగింపఁగా, రాముఁడు కన్నీటిచేఁ దడిసియుండు తనమో మును బట్టకొంగుతోఁ దుడిచికొని, యెప్పటియట్లు ధైర్యముపూని, యాసుగ్రీవునిఁ గౌఁగిలించి, సుగ్రీవా! ప్రేమగలవాఁడు, మేలుగోరువాఁడునగు చెలికాఁడు చేయఁదలసిన కార్యమును నీవు చేసితివి. అది నీకుఁ దగియున్నది. సమయోచితముగానున్నది. చెలికాఁడా! నీవు బుద్ధి సెప్పితివిగాన, నే నిదిగో శోకముఁవదలి ధైర్యము పూనితిని. ఇట్టి స్నేహితుఁడు తఱచుగా దొరకుట యరుదు. అదియు నిట్టి యాపదయందు దొరకుట యనునది నాభాగ్యవశముననే. ఇఁక నీవు సీత నపహరించిన చెడ్డనడతగల క్రూరుఁడగు నారావణాసురుని వెదకుటకుఁ బ్రయత్నముచేయవలయును. నే నిప్పుడు నీకై యేమి చేయవలయునో చెప్పుము. వర్షాకాలమున మంచినేలయం దేది విత్తినను ఫలించునట్లు, సకలకార్యములు నాయెడ నిప్పుడు సార్థకములు గాఁ గలవు. హరిపుంగవా! నేను నీయెడ నిప్పుడు ప్రేమతో నేదిచెప్పితినో, అదియెల్ల వాస్తవమని నమ్ముము. నే నింతకుమున్నెప్పుడు కల్ల లాడినవాఁడను గాను. ఇఁకమీఁదను జెప్పను. నే నొట్టువెట్టికొని చెప్పెదను. నీవేవి చెప్పినను జేయ సిద్ధుఁడనై యున్నాను."

అట్లు రాముఁడు ప్రతిజ్ఞాపూర్వకముగాఁ జెప్పినమాటను విని, సుగ్రీవుఁడును, వానిమంత్రులును మహాదానందము నొందిరి. ఇట్లు రామసుగ్రీవు లిరువురు మిక్కిలి మైత్రినొంది యొండొరులకుఁగల సుఖదుఃఖములను గూర్చి తలపోసికొనుచుండిరి. బుద్ధిశాలియగు వానరగణముఖ్యుఁడగు సుగ్రీవుఁడు మహోత్సుఁడగు నరేంద్రునియొక్క పలుకులు విని, తనకార్యమును నెఱవేఱినట్లె తలంచినవాఁడాయెను.

ఠి-వ సర్గము

రాముఁడు సుగ్రీవుని వాలితోడిపైరమునకుఁ గారణంబు నడుగుట

సుగ్రీవుఁడు రాముని వాక్యము విని, సంతసించినవాఁడై లక్ష్మణుని సమక్షమున రాముని జూచి యిట్లనియె. "ఓ రామా! సకలసద్గుణములతోఁ గూడిన నీవు నాకుఁ జెలికాఁడవైతివి గనుక నాయెడ దేవతలు సర్వవిధముల దయ తలఁచిరి. ఇది నిజము. నీవు సహాయుఁడవై యుండఁగా దేవేంద్రుని రాజ్యమైనను బొందఁజాలుదును. అట్లుండఁగా నారాజ్యము నాకు దొరకుటయం దేమి సందియ మున్నది? రఘువంశమునఁ బుట్టినట్టి నీ వగ్నిసాక్షికముగా నాకుఁ జెలికాఁడవైతివి, కావున నేను నాబంధువులకును జెలికాండ్రకును గారవింపఁదగినవాఁడ నయితిని. రామా! నేనును నీకుఁదగిన చెలికాఁడ ననుపంగతి నీకుఁ దిన్నగాఁ దెలియఁగలదు. నాగుణములను నేనే చెప్పుకొనఁజాలినవాఁడనుగాను. ధైర్యవంతులు ధైర్యము నెప్పటికి వీడనిచందమున, మహోత్సులగు నీ బోటిపండితులయొక్క చెలిమి గడుఁ దిరముగా నుండును. చెలికాండ్రు తమచెలికాండ్రయొక్క వెండి, బంగారు, వస్త్రములు, తొడవులు మొదలగునవి వేఱుగాఁ దలఁపరు. చెలికాండ్రు తమద్రవ్యములు తమచెలికాండ్రవిగను, తమచెలికాండ్రద్రవ్యములు తమవిగాను దలంతురు. భాగ్యవంతుఁడైనను, బీదయైనను, దుఃఖముగలవాఁడయినను, సుఖముగలవాఁడయినను, దోషియైనను, దోషరహితుఁడయినను లోకమునఁ జెలికాఁడే గొప్పదిక్కు. ఎక్కువ చెలిమియున్నప్పుడు స్నేహితులు తమచెలికాండ్రకై, ధనమును విడుతురు; సుఖములను విడుతురు; వేయియేల? ప్రాణములనైనను విడుతురు." అంత రాముఁడు సుగ్రీవుని యింపు పలుకులు విని, దేవేంద్రునివలెఁ దేజరిల్లువాఁడు, బుద్ధిమంతుఁడునైన

లక్ష్మణుఁడు ముందట నిలిచియుండ, "సుగ్రీవా! నీవు చెప్పినది నిజమే" యని చెప్పెను.

అంతట రాముఁడును, బలవంతుఁడగు లక్ష్మణుఁడును నిలఁబడి యుండుట చూచి, వానరేంద్రుఁడగు సుగ్రీవుఁడు దనదృష్టి నావనమున నన్ని దెసలఁ బాఱఁజేసి, యచ్చటికిఁ జేరువను బువ్వులతో నిండి, కొలఁది యాకులుగలిగి తుమ్మెదలతో శోభిల్లుచున్న యొక చెట్టునుజూచి, దాని యందు యాకులును బువ్వులును దట్టముగఁ గలిగియున్న యొక కొమ్మను విఱిచి క్రిందఁబడవైచి తాను రాముని తోఁగూడఁ గూర్చుండెను. హనుమంతుఁడు రామసుగ్రీవులు గూర్చుండుటను జూచి, తానొక చెట్టుకొమ్మ విఱిచి, క్రిందఁబఱచి విధేయుఁడయిన లక్ష్మణునిఁ గూర్చుండఁ జేసెను.

ఫలపుష్పములచే నిండియున్న యా ఋశ్యమూకపర్వతశిఖరమునఁ గొమ్మమీఁద సుఖముగాఁ గూర్చుండి సముద్రముచందమున గంభీరుఁడయిన రాముని జూచి, సుగ్రీవుఁడు గడుమోదమంది, ప్రేమచేఁ దిన్నని యింపుమాటలు సంతోషాధిక్యముచేఁ దడఁబడ నిట్లనియె. "ఓ రామా! వాలి నాభార్య నపహరించి, నన్ను మోసపుచ్చి తఱుమఁగా, నే నా వాలికి వెఱచి, వ్యసనపీడితుఁడనై యీ ఋశ్యమూకపర్వతమున సంచరించుచున్నాను. రాఘవా! నేను వాలిచే వంచితుఁడనై, యత నితోఁ బగపూని, యతనికి వెఱచి, భయమున మునిఁగి, మనస్సున నిలు కడలేకయున్నాను. జనులకందఱకు నభయమొసఁగువాఁడా! వాలికి వెఱచి, మిక్కిలి నొచ్చి, దిక్కుదోఁచక యల్లాడుచున్న నాయెడ నను గ్రహించుము."

అని యిట్లు సుగ్రీవుఁడు వేఁడఁగా, ధర్మజ్ఞుఁడును, ధర్మమునం దాసక్తుఁడును, తేజోవంతుఁడునునై న రాముఁడు నవ్వుచు సుగ్రీవునకు బదులు చెప్పెను. "వానరేంద్రా! చెలికానికి లక్ష్మణ ముపకారముచేయుటయె. శత్రువున కపకారముచేయుటయె లక్ష్మణము. సుగ్రీవా! నీప్రియురాలి నపహరించినవాలి నిప్పుడే సంహరించెదను. సుగ్రీవా! యీనాబాణములు మహావేగముగలవి; తొక్కులుగలవి; తీవ్రమైనతేజస్సుగలవి; తెల్లపొదయందుఁ బుట్టినవి; ప్లాస్తులుకులు గలవి; గ్రద్దతొక్కలు గట్టినవి. దేవేంద్రుని వజ్రాయుధముఁ బోలునవి; చక్కనిగణుపులు, కడువాఁడికొన

లునుం గలిగి, కోపవంతములగు సర్పములం బోలునవి. సుగ్రీవా! తోఁబుట్టువురూపముతో నీకు శత్రువై కీడొనర్చిన యావాలిని బర్వతంబునుంబోలె నాబాణములచేఁ జీకాకుపఱచెదను" అని రాముఁడు సుగ్రీవునితోఁ జెప్పెను.

వానరసేనానాయకుఁడగు సుగ్రీవుఁడు రాముని పలుకులు విని సాటిలేని మోదమునంది, 'నీమాట బాగున్నది' యని చెప్పి రామునిఁజూచి, "నేను వ్యసనముచేఁ గొట్టువడియున్నాను. వ్యసనముచేఁ గుందుచుండు వారికి నీవే గతివి. నీవు చెలికాఁడవు గావున నీతో నాకష్టముల నెల్లఁ జెప్పుకొని దుఃఖించెదను. ఓ రామా! నీవు చేయియిచ్చి యగ్నిసాక్షికముగాఁ జెలిమిచేసికొంటివి గనుక, నీవు నాకుఁ బ్రాణములకంటె మిన్నయైనవాఁడవయితివి. నే నాడుసత్యవాక్యములను బెట్టి బాసచేసెదను. నీవు నాకు సరిహయసునేస్తకాఁడవు గనుక, నామనస్సును సర్వదా పీడించునట్టి మనోవేదనను నీతో నమ్మకముగాఁ జెప్పుచున్నాను." అని యిట్లు చెప్పి, కన్నీరు దృష్టిఁ గప్పుచుండఁ గన్నీటిచే మాటలు డగ్గుత్తికపడుచుండఁ గొంతెత్తి మాటాడఁజాలనివాఁ డాయెను. అయినను, సుగ్రీవుఁడు రామునిచేరువ ధైర్యమవలంబించి, నదీప్రవాహముమాడ్కి వేగముతో వచ్చుచున్న కన్నీటి నాఁపుకొనెను. ప్రతాపశాలియగు సుగ్రీవుఁడు కన్నీళ్లనాఁపుకొని, తేటకండ్లను బాగుగాఁ దుడుచుకొని, నిట్టూర్పువిడిచి, రామునితో నిట్లనియె. "ఓ రామా! ముసుపు బలవంతుఁడగు వాలి నన్ను యువరాజ్యమునుండి తొలఁగించి, నిష్ఠూరంపుమాటలాడి, రాజ్యమునుండి వెడలఁగొట్టెను. అంతియకాక, వాలి నాకుఁ బ్రాణములకంటె మిన్నయైన ప్రియురాలి నపహరించెను. నాసంగాతకాం డ్రెవ్వరో వారి నందఱిని చెఱసాలయం దుంచెను. రామా! కడుఁగ్రూరమనస్కుఁగల యా వాలి నాపినాశమున్కై యెన్నియో ప్రయత్నములు చేసెను. వాలి నన్నుఁ జంపుటకై పెక్కుమాఱులు వానరులను బంపెను. వారి నందఱిని నేను జంపితిని. ఓ రాఘవా! మీరు వాలిపంపినవేగుల రసు సందియముచేతనే మిమ్ముఁ జూచి దగ్గఱకు రా వెఱచితి. భయకారణము సంభవించునప్పుడు జనులందఱు వెఱతురుగదా! ఈ హనుమంతుఁడు మొదలగువారు మాత్రమే నాకుఁ దోడ్డైయున్నారు. నే నిన్ని యిడుములఁ బడినను,

ప్రాణములను దాల్చియున్నాను. ఈ వానరులు మాత్రమే నాయందుఁ బ్రేమగలిగి, నన్నన్ని దెసలను గాపాడుచున్నారు. నేను పోయినచోటి కెల్ల నన్ను వెంబడించి వచ్చుచున్నారు. నిలిచినచోట నిల్చుచున్నారు. రామా! వెక్కుమాటలేల? సంక్షేపముగా నొక్కమాట చెప్పెదను. పరాక్రమశాలియని ప్రసిద్ధిగాంచిన నాయన్నయగు వాలియే నాకు విరోధి. ఆతఁడు నశించినపిమ్మటనే నాదుఃఖము చల్లారును. నా సుఖమును జీవితమును వానివధించుటవలననే కలుగునవిగాసున్నవి. రామా! దుఃఖపీడితుఁడనైన నేను దుఃఖనివారణోపాయముఁ దెల్పితిని. వ్యసనముగలవాఁడయినను, సుఖవంతుఁడయినను, చెలికానికిఁ జెలికాఁడే విడువనిగతి" అని సుగ్రీవుఁడు రామునితోఁ జెప్పెను.

రాముఁడు సుగ్రీవుని పలుకులు విని, యతనిం జూచి, "సుగ్రీవా! నీకును వాలికిని యేల వైరము గలిగె? వాస్తవము వినఁగోరుచున్నాను. మొదట వైరకారణము దెలిసికొని, యొండొరుల బలాబలములను నిర్ణయించి యావల నీకు సుఖము గలుగునుపాయము వెదకెదను. సుగ్రీవా! నీవు వాలివలనఁ బడిన భంగపాటును విన్నతోడనే వర్షర్తువునందలి నదీప్రవాహవేగముపలె బలిమిగల యాగ్రహము నామనసును గడగడలాడించుచు వచ్చుచున్నది. నేను విల్లెక్కుపెట్టి నంతలోపల సంతసమంది విశ్వాసముంచి నాకు వైరకారణము చెప్పుము. ఏలయనిన, నేను బాణము విడిచితినేని, నీశత్రువు హతుఁడయినట్లే తలఁపుము" అని యిట్లు చెప్పఁగా, సుగ్రీవుఁడు తననలువురు మంత్రులతోఁగూడి, సాటిలేని యానందమునొంది, లక్ష్మణాగ్రజుఁడగు రామునితోఁ దనకును వాలికిని గల వైరకారణ మంతయు వాస్తవముగాఁ జెప్పఁదొడఁగెను.

9-వ సర్గము.

సుగ్రీవుఁడు తనకును వాలికినిగల వైరమునకుఁ గారణముఁ దెల్పుట

తొల్లి నా యన్నయగు వాలి శత్రుసంహారియై నా తండ్రికిని, నాకును మిగుల మన్ననచేయఁదగినవాఁడై యుండెను. మాతండ్రి కాలధర్మము నొందఁగా, మంత్రులందఱు గలిసి "యాతఁడు పెద్దకొడుకనియు, కడు గారవము నొందినవాఁడనియు నెంచి కపిరాజ్యమున

నతని నభిషేకించిరి. వాలి తాతముత్తాతలనుండి వచ్చు వానరరాజ్యమును బాలించుచుండఁగా, నే నన్ని వేళలందును వాలికి విధేయుఁడనై పరిచారకునిమాడ్కిఁ జెప్పినపనులనెల్లఁ జేయుచుంటిని.

అప్పుడు ప్రతాపశాలియగు దుందుభియొక్క మొదటికొడుకగు మాయావి యను నొక యసురుఁ డుండెను. ఆ మాయావికిని వాలికిని స్త్రీనిమిత్తము గొప్పవైరము గలిగినది. అది లోకప్రసిద్ధమైన విషయము. ఆ మాయావి యొక్కనాఁడు నడికిరేయి యందఱు నిద్రించుచుండఁగా, కిష్కింధాపురముగవనివాఁకిటికి వచ్చి, సింహనాదముచేసి, వాలిని యుద్ధమునకుఁ బిలిచెను. అప్పుడు గాఢనిద్ర చెందియుండిన నా యన్న భీకరమైన సింహనాదమును విని, యలికిపడి లేచి, యా సింహనాదమున కోర్వక, యప్పుడు వేగముతో నాతనిమీఁదికిఁ గవిసెను. వాలి యాగ్రహముచే నసురశ్రేష్ఠుఁడగు నా మాయావిని జంపుటకు వెడలఁగా, నప్పుడు నేనును, ఆఁడువారును వినయముతో వలదని చెప్పితిమి. అతఁడు బలముచే మామాటలను సరకుసేయక యా మాయావిమీఁదికిఁ బోయెను. అప్పుడు నేనును వాలిమీఁదిప్రేమచే నతని కేమి విపత్తు సంభవించునో యని యావాలివెంబడిఁ బోయితిని.

ఆ మాయావి నాయన్నను, ఆతనివెంబడి వచ్చుచున్న నన్నును జూచి, యదరినవాఁడై కడువేగిరముగాఁ బరుగెత్తెను. ఆ మాయావి యట్లు వెఱపుతోఁ బరుగెత్తుచుండఁగా మేమును వానిని వెంబడించి తఱిమితిమి. ఆరేయి వెన్నెల బాగుగాఁ గాయుటచే దారి బాగుగాఁ దెలియుచుండెను. అప్పుడు మాయావి మేము కడుఁ జేరువకు వచ్చుటఁ జూచి, వేగముతోఁ దృణప్రచ్ఛన్నమైయున్న చొఱరాని యొక్క మహాబిలమునఁ బ్రవేశించెను. అట్లు శత్రువు బిలము చొచ్చుటం జూచి, వాలి రోషమునొంది, యింద్రియక్షోభమును బొంది, నన్ను జూచి యిట్లనెను. "ఓ సుగ్రీవా! సొరంగముసొచ్చి, యా యసురునిఁ జంపి వచ్చునంతవఱకును నీవు బిలద్వారమునందు జాగ్రత్తతో నుండుము" అని వాలి చెప్పఁగా, శత్రుసంహారియగు వాలితో నేను కూడ వచ్చెద నని ప్రార్థించితిని. అయినను నావేఁడికోలు నియ్యకొనక, యతఁడు నాచేతఁ దనపాదములమీఁద నానపెట్టించుకొని యా గొప్ప సొరంగమునఁ బ్రవేశించెను.

అతఁడు సొరంగములో ప్రవేశించినది మొదలు పూర్తిగా నొకఁ
?! యేఁడుగడచెను. ఈ యొకయేఁడును నే నాసొరంగముకడఁ గావలి కాచి
యుంటిని. మాయన్న యప్పటికిని రాకపోవుట చూచి యన్నయం దతి
ప్రేమచేఁ దత్తరపాటునొంది, యతనికిఁ గీడుమూడియుండునని శంకించితిని.
అటుతర్వాతఁ జాలఁగాలమునకు నాబిలమునుండి నెత్తురు నురుగులు
గట్టుచు నెఱ్ఱగాఁ బైకివచ్చెను. అది చూచి, నేనుతలఁచినట్లె వాలి మడిసె
నని మిక్కిలి విచారము నొందితిని. సంగరమున రొప్పుచున్న యసుర
కూతలను, యుద్ధరంగమునఁ దఱుమఁబడి యఱచుచున్న యన్న యొక్క
గొంతుచప్పుడును వింటిని. నే నాగుఱుతులవలన మాయన్న వాలి హతుఁ
డయ్యెననియె యెంచి, పర్వతముంబోలు గొప్ప శాతితో నాగుహా
ద్వారమును మూసి, సోదరమరణమునకు వగచుచుఁ గిష్కింధ కేతెంచి.
1 యీసంగతి యెఱులకుఁ జెప్పకయున్నను, మంత్రు లెట్లో తెలిసికొని
యందఱు కలిసి యీలోచించి నన్నుఁ బట్టాభిషిక్తుం జేసిరి. రాఘవా!
నేను పట్టాభిషిక్తుఁడనై రాజ్యమును న్యాయమార్గమునఁ బాలించు
చుండగా, వాలి యసురశ్రేష్ఠుఁడగు మాయావిని జంపి, యాబిలము
మూతను దెఱచికొని పైకివచ్చి కిష్కింధకుఁ జనుదెంచెను. అప్పుడు
నేను పట్టాభిషేకమునొంది రాజ్యముఁ బాలించుటఁగని, వాని కన్నులు
బగ్గున మండఁగా నా మంత్రుల నందఱను విఱిచికట్టి నన్నరాని మాటల
నాడెను. రాఘవా! నే నప్పు డాతనిని నిగ్రహింపఁ జాలినవాఁడ
నయ్యు, అన్నయను గౌరవముచే నామన స్సందు కియ్యకొనదయ్యెను.
అంతటితో నూరకుండక, శత్రుసంహారముచేసి మాయన్న క్షేమ
ముతో వచ్చెనుగదాయని, మహాబలుఁడగు నతనిని గారవించుటకై
యెదురేఁగి, యభివాదనము సేసితిని. అట్లు నేను గోత్రప్రవరములు
చెప్పి మ్రొక్కి యాతనిపాదములను నాశిరస్సుతోఁ దాఁకినను, వాలి
యాగ్రహము పూని, నాయం దనుగ్రహించి దీవనలు సల్పఁడయ్యెను.

10-వ సర్గము

సుగ్రీవుఁడు తనప్రవాసనమునకుఁ గారణము చెప్పుట

తర్వాత సుగ్రీవుఁడు రాముని జూచి వెండియు నిట్లనియె:
"ఓరామా! వినుము. అంత నట్లే తెంచి యత్యంతము కుపితుఁడై

యాటోపముతోనున్న మాయన్నను జూచి, యతని కోపము చల్లార్చి సంతసము గలిగింపఁగోరి, నే నీతీరున బతిమాలితిని. "ఓ యన్నా! యదృష్టవశమున నేమముతో వచ్చితివి! నీవు శత్రువును బరిమార్చితివి. అనాథుఁడనయిన నాకు నీ వొక్కఁడవే కదా నాథుఁడవు. మఱియు నీవనాథుల కష్టముఁ బాపి సంతోషపెట్టువాఁడవు. ఇదిగో యుదయించిన పున్నమచందురుని బోలునదియు, పెక్కు కమ్మలు గలదియునగు తెల్లనిగొడుగు; నేను దానిని పట్టెదను వింజామరములు వైచెదను. నాపైఁ గోపపడకుము. వానరాధిపా! నే నొక్క సంవత్సర కాల మా సురంగద్వారముకడ దుఃఖముతోఁ గాచియుంటిని. అప్పటికి నీజాడ గానిపింపలేదు గాని బిలద్వారమునుండి నెత్తురు పైకి వచ్చెను. అదిచూచి నీవు సంహరింపఁబడితివని తలఁచి నేను వ్యసనమున మునిఁగితిని. అట్లు నామనసు దుఃఖమున మునిఁగి, యింద్రియములు నెలవులు తప్పి యేమియుఁ దోఁపక కొంతతడ వుండి, యా రాక్షసుఁడు మఱల రాకుండుఁగాక యని యొక పర్వతశిఖరము నా బిలమున కడ్డముగా మూసి, యా ప్రదేశమునుండి వెడలి కిష్కింధను ప్రవేశించితిని. ఇచ్చట మంత్రులును పురజనులును కడు విచారమంది యరాజకప్రభుత్వము లేకుండుటకై నాకుఁ బట్టము గట్టిరేకాని, నేను కోరి పట్టాభిషేకముఁ జేసికొన్న వాఁడను కాను. నీవె యెల్లప్పుడు గౌరవింపఁదగిన తేఁడవు. నే నెల్లప్పుడు ముందటి పలె నీకు వరవుడము చేయుచుందును. నీవు దేశాంతరమున నున్నందున నీకు మాఱుగా రాజ్యపరిపాలనరూపమయిన యాజ్ఞ చెల్లించితిని. నిష్కంటకమైన యీ రాజ్యమును మంత్రిపురజననగరములతోడ నాకడ నిల్లడపెట్టితివని భావించి, నీవు మఱలఁ గైకొనుము. నీరాజ్యమును నీ కప్పగించెదను. శత్రుసంహారకా! దయాళువా! నాయెడఁ గోపముసేయకుము. నిన్నుఁ బ్రార్థించెదను. ఇదిగో నేను చేమోడ్పు గావించితిని. మంత్రులును పురజనులును గలిసి రాజులేని దేశమును జయింపఁగోరి, నాకు నిర్బంధపూర్వకముగాఁ బట్టాభిషేకము గావించిరి.

అని యిట్లు నేను వినయముతోఁ జెప్పుచున్నను, అవ్వాలి నన్నుఁ బలుమాఱు బెదరించి, 'ఛీ! నీవు దహింపఁబడుదువుగాక!" యని చెప్పి,

నన్ననరాని పెక్కు-మాటల ననెను. అంతటఁ జాలింపక మంత్రులను, పౌరవృద్ధులను, పెక్కండ్రు చెలికాండ్రను జేర్చి నన్ను వారినడుమ నిల్పి, వారందఱితో నన్నుఁగూర్చి పరమనీచములైన మాటల నిట్లు పలికెను. "ఓ జనులారా! ఒకనాఁటిరేయి కడుఁ జెడ్డబుద్ధిగలవాఁడు, క్రూరుఁడునైన మాయావియను గొప్ప యసురుఁడు నాతో యుద్ధము సేయఁగోరి, పెద్దబొబ్బవెట్టి నన్ననికిఁ బిలిచినసంగతి మీ రెఱుఁగుదురు గదా! ఆ మాయావియొక్క సింహనాదములను విని రాజగృహము నుండి నేను వెడలితిని. నావెంటనే యీ పెనుమోసగాఁడగు తమ్ముఁడును వచ్చెను. నేను రెండవవానితోఁగూడ వచ్చుటంజూచి యీ బలిమిగల మాయావి వెఱపుమీఱఁ బరుగిడఁ జొచ్చెను. వాఁడు పరువిడుటఁ గని మేమును వానివెంబడించి పరుగిడితిమి. మేము వెంబడించి పరుగెత్తుట గాంచి, యీ మాయావి యొక సొరంగము చొచ్చెను. కడు ఘోరమైన బిలము నారాఁకొనుఁడు సొచ్చుటఁగని యీ క్రూర దృష్టిగల నాతమ్మునితో "ఓరీ తమ్ముఁడా! యీ రక్కసునిఁ జూచిన నాకు వానిని జంపక మఱలుటకు వీలుగాఁబోదు గావున, నేను వీనిని జంపి మఱల వచ్చునంతవఱకు నీబిలద్వార సమీపప్రదేశమునఁ గాచి యుండుము" అని సుగ్రీవునితోఁ జెప్పి, వీఁ డిచ్చట నుండు నని యెంచి యీ గుహాలోపలఁ జొచ్చితి. అసాధ్యుఁడైన యీ మాయావిని వెదకి కనుగొనుటకు నాకొకసంవత్సరము పట్టెను. నే నీ బిలమున భీకరుండైన యీ మాయావిని నిర్భయముగాఁ గనిపెట్టి, వానిని బంధుసమేతముగాఁ బరిమార్చితిని. పాతాళమున నాతోఁ బోరి దెబ్బలు తిని యీ మాయావి యార్వఁగా, నతనినోటినుండి నెత్తురు వెలువడి యీబిలమంతయు నిండెను. నేను శూరుఁడగు దుందుభిపుత్రుఁడయిన మాయావిని జంపి, పైకి వచ్చుచుండఁగా, నా బిలము మూయఁబడి యుండుటంజేసి చీఁకటి గ్రమ్మియుండెను. అట్లుండఁ జూచి, "సుగ్రీవా! సుగ్రీవా!" యని యెన్ని తడవలు మొఱయిడినను బదులులేకుండుటఁ యెఱిఁగి, "అక్కటా! ఇఁక మనగతి యే"మని కడుఁ జింతించి, యెట్టకేలకు ధైర్యముపూని, పెక్కుమాఱులు గాళ్ళతోఁ దన్ని, యీమూఁత యెగురఁగొట్టి, బయటికి వచ్చి యెప్పటియట్ల పట్టణముఁజేరితిని. ఈ ఘాతుకుఁడగు సుగ్రీవుఁడు తోఁబుట్టువను ప్రేమముగూడ మఱచి,

రాజ్యాపేక్షతో నన్ను సొరంగములోపలనే యుంచి గొప్పబండతో మూసి వచ్చినాడు. ఇక వీని మోము చూడఁదగదు" అని యందఱి ముందట నన్నవమానించి జంకుమాని, నా యాలి నీడ్చుకొని నన్నుఁ గొట్టి కట్టుబట్టతోఁ దఱిమివేయఁగా, నే నాతనికి వెఱచి, భూలోక మంతయుఁ దిరిగి యేపఱి, యీ పర్వతమొక్క కారణవశమున వాలి కెక్కరానిదై నందున నీ పర్వతమున భార్యాపహరణదుఃఖముచేఁ గృశించి యున్న వాఁడను.

రామా! నాకును వాలికిఁ గలిగిన వైరమునకుఁ గారణముఁ దెలిపితిని. రాఘవా! ఏపాపము నెఱుఁగని నాకెంత యాపద సంభవించినదో చూడుము. సకలలోకుల కభయము నొసఁగువాఁడా! వాలిని సంహరించి, భీతిచే నవస్థపడుచున్న నాయెడ ననుగ్రహము చేయుము." అని యిట్లు సుగ్రీవుఁడు చెప్పఁగా, ప్రతాపవంతుఁడును, ధర్మజ్ఞుడునునైన రాముఁడు చిఱునవ్వు నవ్వుచు సుగ్రీవుంజూచి, న్యాయయుతముగా నిట్లనియె. "ఓ సుగ్రీవా! యీ వాఁడియమ్ములు సూర్యనిమాడ్కిఁ దేజరిల్లునవి. ప్రయోగించినచో వ్యర్థములగునవి గావు. దురాచారుఁడైన యీవాలిమీఁద నీబాణము లతివేగముతోఁ బోయిపడఁగలవు. నీభార్యను హరించిన యీవాలి యెంతపర్యంతము నాకంటఁ బడఁడో, అంతపర్యంతమే చెడునడవడిగల యీపాపాత్ముఁడు బ్రతికియుండును. నే నిప్పుడు భార్యను గోలుపోయి పడరానిపాటు పడుచున్నాను గావునను, నీదుఃఖము నిట్టిదేగనుకను, నీవు శోకసాగరమున మునిఁగియున్నావని తలఁచెదను. నిన్ను వేగిరముగా నీ శోకసముద్రంపుపరిఁ జేర్చెదను. నీవు కోరినకోర్కెను బుష్కలముగా నొందఁగలవు" అని రాముఁడు సుగ్రీవుని మంచిమాటలచే నోదార్చెను. తనకు మేలొదవునట్లుగాఁ జెప్పిన యీరామునిపలుకులువిని సుగ్రీవుఁడు పరమానందము నొంది వక్ష్యమాణప్రకారముగా నిట్లని చెప్పెను.

11-వ సర్గము

సుగ్రీవుఁడు వాలి ప్రభావ మెఱిఁగించుట

రాముఁడు తనపౌరుషంబు వెలుఁగ, ముద ముప్పొంగఁ జెప్పిన పలుకులు విని, సుగ్రీవుఁడు రాముని బూజించి, పలువిధములఁ గొని

యూడి యిట్లనియె: ఓ రాఘవా! నీవు కినుక పూనుదు వేని వెలుఁగు నవియు, వాఁడిమిగలవియు, ఆయఁపట్టులఁ దాఁకునవియునైన యమ్ముల తోడ్పాటుచేఁ బ్రలయకాలసూర్యుండునుంబోలె లోకము నెల్లఁ గాల్చి వేయుదువు.

రాఘవా! వాలికిఁగల ధైర్యశౌర్యములు వినిపించెదను. వానిని సావధానముగా విని యావలిపనిం జేయుము. వాలి యుషఃకాలమున లేచి సూర్యోదయము గాకమునుపే పడమటిసముద్రమునుండి తూర్పు సముద్రమునకును, దక్షిణసముద్రమునుండి యుత్తరసముద్రమునకును గప్పము లేకుండఁ బోయివచ్చును. వాలి తనబలిమి మెఱయఁ గొండల కొనల కెక్కి గొప్ప శిఖరములనైనను బెళ్ళగించి, మీది కెగురవైచి పట్టుకొనును. తన బలము వెల్లడియగుటకై చక్కగా వేళ్ళుపాతిన యెన్ని యో చేవగల గొప్పవ్రాఁకులను విఱుచును.

తొల్లి, కైలాసశిఖరమునుబోలిన యాకారముగలవాఁడును, చేవగలవాఁడునునైన మాహిషరూపంబుఁ దాల్చిన దుందుభియను పేరుగల రక్కసుఁడొక్కఁడు వేయి యేనుఁగులబలము గలిగియుండెను. అతఁడు బ్రహ్మనుగూర్చి తపసుచేసి పెక్కువరములఁ బడసెను. ఆ దుష్టాత్ముఁడగు దుందుభి తన యెక్కువ బలిమికిని, వరములకలిమికిని గడు గరువమొంది, గొప్పదేహమును దాల్చి, యేటిమగఁడగు సముద్రునిఁజేరి, రత్నములగనియగు నాయేటిమగని సరకుసేయక "నదుల తోఁడా! నాతోఁ గయ్యము సేయరమ్ము" అని పిలిచెను. అప్పుడు నృపాలా! ధర్మాత్ముఁడగు బలవంతుఁడైన సముద్రుఁడు, మృత్యుదేవత ప్రేరణచే వచ్చియున్న యాదుందుభిం జూచి, "యుద్ధమునందు నేర్పు గల ఓ దుందుభీ! నేను నీతోడఁ గయ్యంబు సేయఁజాలినవాఁడను గాను. నీతో యుద్ధయు సేయఁగలవానినిఁ జెప్పెదను వినుము. తాపసుల కెల్ల ముఖ్యమయిన యునికిపట్టును, శంకరుని మామయు, పెక్కుగుహలును నెలయేళ్లనుగల వాఁడును, లెక్కలేని ఱాళ్లసందులతోఁగూడిన వాఁడునైన హిమవంతుఁ డనుపర్వతరాజు మహారణ్యమున నున్న వాఁడు. అతఁడు నీతోఁ గయ్యమొనరించి, నీకెక్కువ సంతసము గావింపఁగలఁడు. వానికడకుఁ బొమ్ము" అని చెప్పెను.

అసురాధిపుఁ డామాట విని, సముద్రుఁడు తనకు వెఱచె ననియెంచి, వింటినుండి జాఱినయమ్ముకైవడి వేగిరముగా హిమవత్పర్వత వనమునకు వచ్చి, యేనుఁగులవలె గొప్పవగు నా పర్వతమునందలి తెల్లఁజాల నెల్లఁ గొమ్ములతోఁ జిమ్మి తొలచెను. అప్పుడు హిమవంతుఁడు తెల్లమబ్బువంటి తిన్నైన చక్కని రూపము ధరియించి, తన శిఖరమునఁ నిలిచి, దుందుభిం గని "ధర్మపరుఁడవగు ఓ దుందుభీ! నన్ను నీవు నొప్పింపకుము. నేను యుద్ధములందు గట్టివాఁడను గాను. ఏను మునిజనులకుఁ దావలమయినవాఁడను" అని చెప్పఁగా, దుందుభి బుద్ధిమంతుఁ డగుహిమవంతుని మాటను విని, కోపముచేఁ దనకన్ను లెఱ్ఱనచేసి హిమవంతు నుద్దేశించి, "నీవు యుద్ధమునఁ జాలనివాఁడవై నను, నాకు వెఱచి యుద్ధప్రయత్నమును మానినవాఁడవైనను, సరే. నేను పోరుగోరియున్నాను. నాతో సమరము సేయఁగలవాని నొక్కనిఁ జెప్పుము" అని యడిగెను. ధర్మాత్ముఁడయిన హిమవంతుఁడు పూర్వమెవ్వరు చెప్పని దుందుభిపలుకులు విని, యలుక గదుర నయ్యసురోత్తమునిఁ జూచి యొక మాటఁ బలికెను. "ఓ దుందుభి! వాలియను వానరేంద్రుఁడు వైభవమున నన్నిపట్టణముల మీఱియున్న కిష్కింధాపట్టణము నేలుచున్నాఁడు. అతఁడు గొప్పచదువరి. వేల్పుఁజేనింబోలు పరాక్రమముగలవాఁడు. వన్నెగలవాఁడు. యుద్ధమున నేర్పరి. దేవేంద్రుఁడు నముచితోయుద్ధము సేసినట్లు, నీతో సమానముగా గొప్ప ద్వంద్వయుద్ధము సేయఁగలఁడు. ఓ యసురాధిపా! ఆతఁడు యుద్ధమున గొప్ప శూరుఁడు. ఆతని నెవ్వరును గెల్వఁజాలరు. కావున నీవు యుద్ధము గోరుదువేని, వేగిరముగా నా వాలికడ కేగుము" అని హిమవంతుఁడు దుందుభితోఁ జెప్పెను.

ఆ దుందుభి హిమవంతుని పలుకులు విని, మిగులఁ గోపముతోఁ, వాఁడికొనలుగలిగి చూపఱుకు వెఱపుపుట్టించు మహిషరూపము దాల్చి, వర్షాకాలమున నీటితోఁ నిండినదై యాకసమున నుండు గొప్పమేఘముకైవడి వెలుఁగుచు వెడలివచ్చి, కిష్కింధాపురము చొచ్చి, పురద్వారమునఁ జేరి చేరువ నున్న చెట్లు నెల్లఁ విఱుచుచు, గిట్టలతోఁ బుడమిని ప్రక్కలించుచు, గర్వ మచ్చుపడ నాద్వారమును

గజేంద్రునికైవడిఁ గొమ్ముతోఁగోరాడుచు భూమి యవరునట్లు దుందుభి వాదవ్యముకైవడి గొప్పఱుంకె వేసెను.

అంతిపురమున నున్న వానరేంద్రుఁడగు వాలి యీశబ్దము విని యోర్వఁజాలక, నక్షత్రగణముతోఁగూడవచ్చెడు జంద్రునివలెఁ దన కాంతలతోఁగూడ వచ్చి దుందుభింగాంచి, విడివిడిమాటలతో "ఓ బల వంతుఁడా! నీవు మహిషరూపముదాల్చి నాపురమువాకిటి నడ్డగించి యేల యిట్లఱచుచున్నావు. నీవు దుందుభివిగదా! నీసంగతి నేఁడెఱిఁగితిని. ప్రాణములను గాపాడుకొనుము. పోయిరమ్ము" అని దుందుభితోఁ జెప్పెను.

దుందుభి వాలిపలుకులు విని కోపముచే నెఱ్ఱనైనకన్నులుగలఁ వాఁడై, "శూరుఁడా! ఆఁడువారియెదుట నిట్టి పలుకులు పలుకుట తగదు. నాతోడ యుద్ధము సేయుము. పిమ్మట నీబలిమి నెఱిఁగెదను. ఓరీ కోఁతీ, యీరేయియెల్ల నాకోపము నాఁపుకొనియుండెదను. నీవు ప్రొద్దుపొడుచువఱకు విచ్చలవిడిగా స్త్రీలంగూడి కామ సుఖములం దేలుము. నీ చెలికాండ్రగు వానరులనెల్లఁ గౌఁగిలించి, వారికిఁ గావలసి నది యిమ్ము. నీవు వానరులకెల్ల నధిపతివి. కావున వారికెల్లఁ గోరినది యిచ్చి, చెలికాండ్రనెల్ల సంతసపఱుపుము. కిష్కింధాపురమెల్ల బాగుగాఁ జూచిరమ్ము. నీకు సాటియైనవానికిఁ బట్టముగట్టుము. కాంతలంగూడి యథేచ్ఛగా విహరింపుము. నేను నీ పొగరడంచువాఁడను. ప్రొద్దు పోతె కైపుగలిగియున్న వానిని, ఏమఱుపాటుతో నున్న వానిని, నిద్దురపోవుచున్న వానిని, నిరాయుధుండయినవానిని, నీవలెఁ గామసుఖ ములం దవిలియున్న వానిని లోకమున శత్రువు సంహరింపఁగూడదు. ఎవఁడట్లు తెలియక చంపునో, వాఁడు శిశుహత్య గావించినవాఁ"డని వాలితోఁ నెక్కువ గర్వముతోఁ బలికెను.

వాలి యప్పుడు తార మొదలగు కాంతల నెల్ల విడనాడి, చిఱు నవ్వు నవ్వి కోపముతో నాయసురోత్తముఁడగు దుందుభివంకఁ జూచి, తిన్ననిపలుకులతో నిట్లనియె. ఓ దుందుభీ! "వీఁడు కైపుమీఁద నున్నాఁడు" అని తలంపకుము. నీవు బవరమునకు వెఱవవేని రమ్ము ఇదిగో యుద్ధమున నీమదమే నాకు వీరపాణమగు నని తలఁపుము" అని దుందుభితోఁ జెప్పి, యుగ్రుఁడై తండ్రియగు దేవేంద్రుఁ డొసఁగిన

పసిఁడిహారమును దాల్చి యుద్ధమునకు వెడలెను. కపిశ్రేష్ఠుఁడగు వాలి యప్పుడు పర్వత సదృశుఁడయిన దుందుభికొమ్ములను బట్టికొని, ప్రలయ కాలమేఘమువలె గర్జించుచు గిరగిరఁ ద్రిప్పి క్రిందఁ ద్రోసెను. అట్లు వాలి త్రోయఁగాఁ గ్రిందఁబడిన యాదుందుభి చెవులనుండి రక్తము గాఁజెను. ఒండొరులు జయముఁగోరి, కినుకపూని వాలిదుందుభులు గొప్పపోరొనర్చిరి. దేవేంద్రుని కెనవచ్చు పౌరుషముగల వాలి యా దుందుభిని బిడికిళ్ళతో గ్రుద్దెను; మోఁకాళ్లతోఁ బొడిచెను; తొలతోఁ గొట్టెను; చెట్లతో మోదెను. అప్పుడు వాలిదుందుభులు సమముగాఁ బోరుచున్నను గొంతసేపటికి దుందుభి డస్సెను. వాలి మఱింత రేఁగెను. దుందుభి చెయివులు దక్కి, మగఁటిమి యుడిగి, బలము లేక యెదిరినిఁ గవ్వకొనఁజాలకుండుట యెఱింగి, వాలి యతనినిఁ బైకెత్తి నేలఁగొట్టెను. వాలి ప్రాణాంతికమైన యుద్ధమున దుందుభిని నుగ్గు చేయఁగా, గొప్పదేహముగల యాదుందుభి క్రిందఁబడి, ప్రాణములఁ దొఱఁగెను. అంత వాలి సత్త్వయుడిగి నిర్జీవుఁడయిన యా దుందుభిని యిటటు పొఱలించి యెక్కువ వేగముతో నొక యోజనము దవ్వునఁ బడునట్లు విసరివైచెను. అట్లు వేగముచే విసరివేయఁబడిన యా దుందుభి నోటినుండి కాఱిన నెత్తుటిబిందువులు గాలి కెగిరి, మతంగమహాముని యాశ్రమమున వచ్చిపడినవి.

అయ్యాశ్రమమున నున్న మతంగమహాముని యాదుందుభినోటి నుండి కాఱిపడిన యారక్తబిందువులను జూచి, యలిగినవాఁడై, "ఎవఁడితఁడు దురాత్ముఁడు, ఎవఁడో నాపై నెత్తుటిబొట్లు చిమ్మి నన్నపరిశుద్ధునిఁ గావించెను. అతఁడు దురాత్ముఁడు, బుద్ధిహీనుఁడు, అవినయుఁడు, మూఢుఁడునై యున్నట్లు కానఁబడుచున్నాఁడు" అని తనలోఁపల నిట్లను కొని, పర్ణశాల వెలుపటికి వచ్చి మహిషరూపముఁదాల్చి, పర్వతమువలెఁ జచ్చిపడియున్న యొక రాక్షసునిఁజూచి, యోగబలముచే నది వాలి యొనర్చిన కార్యమని యెఱిఁగి, "ఎవఁడీ యసుమునితనువును జిమ్మి నా యాశ్రమమంతయు నెత్తుటిచుక్కలచే నపరిశుద్ధము గావించి, యిచ్చటి చెట్లనెల్ల విఱిచెనో, వాఁడీ వనమునఁ జొఱరాదు. అట్లు వాఁడు చొచ్చునేని, తప్పక మరణము నొందును. ఈ నావనమున నలుప్రక్కల యోజనముదూరములోపల వాఁడు ప్రవేశించునేని మఱుల ప్రాణ

ములతో నుండఁడు. ఇది తప్పదు. వాని పరిచారులు నెవ్వరు నావన మున సున్నారో, వారు నిచ్చట నుండఁదగదు. వారెల్ల నాశాపవచ నము విని వెంటనే సుఖముగాఁ బోవుదురు గాక! వారు నాశాపవా క్య వినియు, నేను బిడ్డవలెఁ బెంచిన యీ నావనమునందలి యాకులు మొల కలు పండ్లు దుంపలు నాశముచేయఁగోరి యిచ్చట నుందురేని, వారిని శపించెదను. ఈ యొకదినము వారికి గడువొసఁగితిని. ఈ దినమున నీ వనము వదలక రేపు నాకంటఁబడు వానరుఁడు పెక్కువేలయేండ్లు కొండయైయుండును" అని యీ దుందుభిమేనిఁ జిమ్మిన వాలి కోర్వరాని శాపము నొసఁగెను.

అంత వానరులందఱు మతంగముని యొసఁగిన శాపము విని యీ వనమువిడిచి, వాలికడ కేగిరి. అప్పుడు వాలి వారిం జూచి, "మీరం దఱు మతంగవనమున నుండువారలుగదా. మీ రంద ఱేల నాకడ కేతెంచితిరి? వానరుల కందఱకు నేమమేకదా" యని యడిగెను. అప్పుడు వానరులందఱు బంగారుమాలికగల వాలితో నతనికి ముని యొసఁగిన శాపమును, తమరాకకుఁ గారణము నెఱుఁగఁజెప్పిరి. అంత వాలి వానరులు చెప్పినమాట విని వెంటనే యీ మహర్షికడకేగి యంజలిచేసి, "మహాత్మా! నాతప్పిదము మన్నింపు" మని ప్రార్థించెను. ఆ మతంగమహర్షి యీ వాలి ప్రార్థనమును గైకొనకయే తన యీ శ్ర మములోపలికిఁ జొచ్చెను. వాలియు శాపము దగులునేమో యన్న భీతిచే వంతనొంది, యీ ఋశ్యమూకపర్వతము చొచ్చుటకుఁగాని, చూచుటకుఁగాని కోరఁడు. రామన్నపాలా! యీవనమున నతఁడు ప్ర వేశింపఁ డన్నసంగతి యెఱిఁగి, దిగులువిడిచి, చెలికాండ్రతోఁగూడి తిరుగుచున్నవాఁడను. ఓ రామా! ఇదిగో కనఁబడునది వాలి బలగర్వ ముచే విసరివైచిన యీదుందుభియొక్క యెముకలరాశి. ఇది యొక్క గొప్పపర్వతముమాడ్కి నెత్తుగాఁ గానఁబడుచున్నది. ఇవిగో వ్రేలుఁ గొమ్మలుగల యేడు మద్దిచెట్లు. వాలి తనబలిమిచే నొక్క చెట్టున దూఱి పోఫునట్లు బాణమేయఁగలఁడు. రామన్నపాలా! యీ వాలివీర్యము సాటిలేనిది. ఇది నీ కెఱుఁగఁజెప్పితిని. ఇట్టి బలాఢ్యుఁడయిన వాలి నెట్లు యుద్ధమున సంహరింపఁ జాలుదువో తెలియకున్నది" యని సుగ్రీ వుండు రామునితో ననెను.

అట్లు సుగ్రీవుఁడు పలుకుటఁజూచి,లక్ష్మణుఁడు నవ్వుచు "సుగ్రీవా! రాముఁ డెట్టికార్యము సేసి చూపిన, వాలి వధముసేయఁగలఁడని నమ్ము దువు చెప్పుము" అని యడుగఁగా, సుగ్రీవుఁడు లక్ష్మణుంగూర్చి, "తొల్లి వాలి యీ యేడు మద్దిచెట్టులలో నొక్కొక్కదానిని బాణమొక్క యేటునఁ జెట్టునడుమ దూఱిపోవునట్లు పలుమాఱు గొట్టియున్నాఁడు. రాముఁడు నట్లైయొక్కబాణము నొక్కచెట్టున నొక్కయేటునకు దూఱి పోవున ట్లేయునేని, ఈ చచ్చిన మహిషముయొక్క కళేబరము నొక్క పాదముచే నెత్తి యెనిమిదివందల మూరలదూరమునఁ బడునట్లు చిమ్మె నేని, అప్పుడు రాముని పరాక్రమముగని, యితఁడు వాలిం దెగటార్పఁ గలఁడని నమ్మెదను" అని చెప్పెను. ఇట్లు లెక్కనికనుఁగొనలుగలరాముని గూర్చి పలికి సుగ్రీవుఁడు కొంతతడవు చింతించి, మఱల రాముని‌ఁజూచి, "వాలి శూరుఁడు; శూరులను జంపినవాఁడు; బలపరాక్రమములలో సాటిలేనివాఁడని ప్రసిద్ధిగన్నవాఁడు; దేహబలమును, బుద్ధిబలమును గలిగినవాఁడు; ఇంతకుమున్నెప్పుడు బవరములం దోటమినొందనివాఁడు. దేవతలకుఁగూడఁ జేయ నలవికాని పను లెన్ని యో యితఁడు చేసియుం డుట చూచి, యీతనికి వెఱచి, యీ ఋశ్యమూకపర్వతము నొందిన వాఁడను. వానరేంద్రుఁడగు వాలి యొరులకు గెల్వ నలవికానివా డును, ఎదిరింప నసాధ్యుఁడును, పరులయవమానము సోర్వనివాఁడును నై యుండుటం దలఁచికొని, హనుమంతుఁడు మున్నుగాఁగల మేటి యనుఁ గుఁజెలికాండ్రతోఁ గూడ నీ పర్వతము విడువకయున్న వాఁడను. పురుషోత్తమా! స్నేహితులందుఁ బ్రేమగలవాఁడా! కొనియాడఁదగిన గుణములుగల యుత్తమమిత్రుఁడవగు నీవు నాకు హిమవంతము దొఱకి నట్లు దొఱకితివి. అయిన నేల వెఱతువనిన, బలవంతుఁడగు నా చెడు తోఁబుట్టువుయొక్క బలము నెఱిఁగినవాఁడను. సమరమందు నీబలిమి యెట్టిదో నాకుఁ దెలియదు. నేను నీ మగఁటిమిని సమక్షమునఁ జూచిన వాఁడనుగాను. ఓ రాఘవా! నేను నీపరాక్రమము నలక్ష్యపఱచు చున్నానియు, వాలియొక్క పూర్వవిక్రమముఁ దెలిపి నిన్ను వెఱ పించుచున్నానియుఁ దలఁపకుము. మఱేమియనిన, అతఁడు చేసిన యాగడంపుఁబనులు తలఁచుకొన్న నాకుఁ దత్తరపా టొదవుచున్నది. రాఘవా! నీమాటలు, బుద్ధియు, మగతనము, రూపమును నివురుగప్పిన

నిప్పునుబోలె నీయందున్న యొక్కొవ తేజస్సును దెలుపుచున్నవి." అని సుగ్రీవుఁడు రామునితోఁ జెప్పెను.

మంచినడతగల యా సుగ్రీవుఁడు చెప్పిన యా మాటను విని, నిడుదచేతులుగలవాఁడయిన లక్ష్మణుని యన్నయగు రాముఁడు చిఱు నవ్వు మోమునఁ గదుర సుగ్రీవుంగూర్చి "వానరా! మాబలిమివిషయ మయి నీకు నమ్మకములేదేని, యతఁడు యుద్ధము సేయఁగలఁడని కొని యాడఁదగిన నమ్మకముఁ గలిగించెదను" అని చెప్పి, యా దుందుభి కాయము నవలీలగాఁ దనకాలిబొట్టనవ్రేలితో నెత్తి పదియోజనముల దవ్వునఁ బడునట్లు చిమ్మెను.

అంత శూరుఁడగు సుగ్రీవుఁడు శుష్కించిన దుందుభిదేహామును రాముఁడు పదియోజనములదూరమునఁ బడునట్లు బొట్టనవ్రేలితో జిమ్మినఁ జూచి వెండియు నాతనితో లక్ష్మణునిముందట నిట్లనియె. "చెలికాఁడా! తొల్లి వాలి యీ దుందుభి దేహామును జిమ్మినప్పు డిది పచ్చిదై, నంజుడు గలిగి చెక్కుచెదఱనిదిగ నుండెను. ఇప్పు డది యెండ కెండి, గాలి కాఱి, వానకుఁ జివికియున్నందునఁ దేలికయై, నంజుడు లేక, కసవుపోఁచ వలెనైయున్నది. అప్పుడు నాయన్న వాలి దీనిని గడుఁ బ్రయాసముతో విసరికొట్టెను. రఘునందనా! నీ విప్పుడు దీనిని గడుఁ జులకనగా విసరివైచితివి. ఈ కార్యముచే నీ బలమెక్కువో, వాలిబలమెక్కువో తెలియరాదు. రాఘవా! యీ దుందుభిదేహము అప్పుడు తడిది, యిప్పు డెండుదియను గొప్ప వార యుండుటయే మీ యిరువురి బలము నెఱుఁగువిషయమున సందియమున కెడమిచ్చుచున్నది. అయినను నా మద్ది చెట్టు నొక్కబాణముచేఁ జీల్చువేని యప్పుడు మీ యిరువురి బలా బలములు స్పష్టముగాఁ దెలియఁగలవు. రామా! యేనుఁగుతొండము మాడ్కిఁ గడు నిడుపైన నీ విల్లెక్కువెట్టి, యాకర్ణాంత మిమ్మడ్చి గొప్ప శరము విడువుము. నృపకుమారా! నీ వేయుబాణ మీ చెట్టును భేదింపఁ గలదు. ఆ విషయమున నాకేమియు సందియము లేదు. అయినను నా మనస్సునకుఁ దృప్తిగలుగునిమిత్తము నిన్నీపనిఁ జేయఁ బ్రేరించుచున్నాఁడనుగాని, నిన్నుఁ బరీక్షించుటకుఁగాదు. నే నొట్టువెట్టికొని చెప్పెదను, వెలుఁగులలోనెల్ల సూర్యుఁడును, మహాపర్వతములలోనెల్ల హిమవంతుఁడును, మృగములలోనెల్ల సింగము నెట్లు శ్రేష్ఠములో, అట్లు

పరాక్రమవంతులలోనెల్ల నీవు శ్రేష్ఠుఁడవు" అని సుగ్రీవుఁడు రాము నితోఁ బలికెను.

12-వ సర్గము

సుగ్రీవుఁడు వాలిని యుద్ధమునకుఁ బిలుచుట

ఎక్కువ వెలుఁగుగలవాఁడును, శత్రువుల గర్వము నడఁచు వాఁడునైన రాముఁడు సుగ్రీవుఁడు చెప్పిన పలుకులువిని, యతనికి విశ్వాసముఁ గలిగించుటకై భయంకరమయిన వింటిని గైకొని యొకటే బాణమును సంధించి, యల్లెత్రాటి ధ్వనులచే దిశలు పిక్కటిల్ల నారిని మీటుచు చెట్లుపైఁ బ్రయోగించెను. బలవంతుఁడయిన యా రాముఁ డేసిన స్వర్ణాలంకృతమైన బాణము మహార్తకాలములోపల కొండ చరియయందున్న యేడు మద్దిచెట్లను బెకలించి, పుడమింజొచ్చి, క్షణము లోపల మఱింత వేగముతో మఱలి తన యునికిపట్టగు నమ్ములపొది యందుఁ జొచ్చెను.

వానరశ్రేష్ఠుఁడగు సుగ్రీవుఁడు రాముఁ డొక్కబాణ మేయుటచే నేడు సాలములును. దెగుటఁజూచి, యెక్కువ యాశ్చర్యమునొంది, మెడలోని హారములు నేలపయి జీరాడుచుండ సాగిలఁబడి సాష్టాంగప్రణామ మాచరించి, యారాముని యపారప్రజ్ఞకుఁ గడు మోదమందుచు, ధర్మముల నెఱిఁగినవాఁడును, అస్త్రవేత్తలందఱిలోపల శ్రేష్ఠుఁడును, శౌర్యధైర్యాదిగుణములు గలవాఁడునైన రామునిఁజూచి యిట్లనియె.

ఓ పురుషోత్తమా! ఇంద్రాదిదేవతలంద ఱాయుధములతో నెత్తి వచ్చినను, ఓ ప్రభూ! నీవు వారి నందఱిని సంహరింపఁజాలినవాఁడవు. అట్టి నీకు వాలి యన నెంతమాత్రము! రామా! యేడు మ్రాకులను భూమి నొక్క బాణముచేఁ జీల్చిన నీయెదుట నెవఁడని మొననిల్చి యుద్ధముసేయఁజాలును? ఇపుడు నాకు విచారము దొలఁగెను. ఎక్కువ యానందమును గలిగెను. దేవేంద్రవరుణులఁబోలిన నీవు నాకు నెచ్చెలివై యుండ నాకుఁ గొఱఁత యేమియున్నది? కాకుత్స్థా! నీవు నా మేలు గోరినవాఁడవు గావున దోఁబుట్టువనెడి మిషతోఁ బుట్టియున్న నాబగతు నిప్పుడె తెగటార్పుము. ఇదిగో నేను దోసిలిగట్టి మ్రొక్కుచున్నాను" అని సుగ్రీవుఁడు రాముని బతిమాలెను.

అంతట గొప్ప పండితుఁడైన రాముఁడు చూడ నింపుగొలుపు సుగ్రీవునిఁ గట్టిగాఁ గౌఁగిలించికొని, లక్ష్మణునితో నీ సంగతి యాలోచించి, యతని యనుమతి గైకొన్నపదంపడి సుగ్రీవునింజూచి, "చెలికాఁడా! మనము కిష్కింధకుఁ బోదము. నీవు వేగిరముగ ముందుగాఁ బొమ్ము. అచ్చటికిఁ బోయి నీ భ్రాత్రృధముని వాలిని గయ్యమునకుఁ బిలువుము" అని చెప్పెను. అంత వారు మువ్వురు వేగముగాఁ బయనమై, వాలిపాలించెడి కిష్కింధాపురముఁజేరి, యొరులకుఁ గానరాకుండు నట్లు చొరరాని యొకవనమునఁ జెట్లమఱుఁగున నిలిచిరి. అంత సుగ్రీవుఁడు వాలిని జగడమునకుఁ బిలుచునిమిత్తమై మిక్కిలి ధైర్యముపూని, చప్పుడున కాకాశము పిక్కటిల్లునట్లు ఘోరమైన నాదముచేసెను.

బలవంతుఁడగు వాలి తమ్మునియొక్క యా సింహనాదమును విని యలుకఁబూని, పోరునకుఁ గట్టాయితుఁడయి, యస్తపర్వతశిఖరము నుండి సూర్యుఁడుదయించుమాడ్కి పట్టణము వెలువడివచ్చెను. ఆవాలి సుగ్రీవుల కిరువురికిని, ఆకసమునఁ దేజరిల్లు బుధాంగారకగ్రహములకుఁ బోలెను, మహాఘోరయుద్ధము జరిగెను. అంత వారొండొరులు కోపముచే మేనుమఱచి, పిడుగుపడిన ట్లొక్కరి నొక్క రఱచేతితో బాఁదుకొనిరి; పిడికిళ్లతో గ్రుద్దుకొనిరి. అప్పుడు రాముఁడు విల్లు చేతఁబూని, యా వాలిసుగ్రీవులం జూచి, యా వాలిసుగ్రీవు లిద్ద ఱశ్వినీదేవతల మాడ్కి నొండొరులం బోలియున్నందున, అయ్యిరువురిలో నెవ్వఁడు సుగ్రీవుఁడో, ఎవఁడు వాలిదో యెఱుఁగనందునఁ దన బాణము నెవ్వరిపైన వేసిన నేమగునోయని ప్రాణాంతకమగు బాణమును విడువ మనంబునఁ దలఁపఁడయ్యెను.

ఇంతలోపల వాలి సుగ్రీవుని బాగుగ మర్దించెను. సుగ్రీవుఁడు వాలియొక్క దెబ్బల కంగములు శిథిలముగాఁగా, మేనెల్ల నెత్తుటిచేఁ దడియఁ గడుడస్సి, తనకు బాసటచేయవచ్చిన రాముని గానక, యిఁకఁ దాఁ బోరాడఁజాలనని తలఁచినవాఁడై, వెనుకకు మఱలి, వాలి వెంటఁ దఱుముచు వచ్చుచుండఁగా నతని చేతికిఁ జిక్కక ఋశ్యమూకపర్వత మహోవనమునఁ జేరెను. వాలియుఁ బరాక్రమముయొక్క తేజస్సుచే దేదీప్యమానుఁడై శాపభీతిచే మతంగాశ్రమముఁ జొచ్చిన సుగ్రీవుని వెంటా

డక "ఓరీ! తప్పించికొంటివి పొమ్ము" అని చెప్పి, మహాక్రోధముతోఁ దనపురమునకు మఱలివచ్చెను. అంత రాముఁడు లక్ష్మణుని, హనుమంతునిఁ దోడ్కొని యా సుగ్రీవుఁ డున్నచోటికి వచ్చెను.

సుగ్రీవుఁడు లక్ష్మణసమేతుఁడై వచ్చిన రామునిఁజూచి, సిగ్గుచేఁ దలవంచి దీనస్వరముతో నిట్లనియె. "ఓ రాఘవా! నీపరాక్రమముఁ జూపి నీయెడ నమ్మికఁ బుట్టించుకొని, నన్నుఁ బోయి వాలిని గయ్యమునకుఁ బిలువుమంటివి. శత్రువు నన్నుఁ జావుదెబ్బలు కొట్టఁగాఁ జూచుచుంటివి. దీన నీకేమి లాభముగలిగెను? ఓ రాఘవా! నీ వాదినముననే నేను వాలిని గొట్టనని యున్నది యున్నట్లు చెప్పఁగూడదా? నే నిట్లక్కడికేగి యా పగవానిచేతఁ జావుదెబ్బలు తినకయుందునుగదా. నిన్ను నమ్మినందుకు నా కెంత యాపద దెచ్చితి" వని కడు శోకమున రాము నితోఁ జెప్పుకొనెను.

గొప్ప నడతగల యా సుగ్రీవుఁ డిట్లు పలుకఁగా, రాముఁడు మిక్కిలి జాలినొంది, తిన్నని పలుకులతో నిట్లనియె. "ఓ చెలికాఁడా! సుగ్రీవా! నీవు శోకక్రోధములు వీడుము. నేనేల బాణము విడువనైతినో కారణము నెఱ్ఱెద వినుము. సుగ్రీవా! నీవును, వాలియు నొక్కటే వేషము దాల్చియున్నారు. మీరొకటే పొడఁగును లావును గలిగియున్నారు. నీ నడకవంటిదిగనె యతనినడకతీరునున్నది. నీయుడుపులు ఆతని యుడుపు లొక్కటెతీరున నున్నవి. ఇట్లొక్కవేషముననె కాక, కంఠస్వరము, చూపు, సొంపు, మగటిమి, మాటలుం జూచిన, వానిలోను భేదము గనఁబడకున్నది. ఓవానరశ్రేష్ఠుఁడా! మీరూపముల పోల్కవలన నెవ్వఁడు వాలియో, ఎవఁడు సుగ్రీవుఁడో తెలియఁజాలక, యేసినమాత్రముననే శత్రువుం బరిమార్చు కడువడిగల నా బాణము నేయనైతిని. నాబాణమో తిరుగుపాటులేనిది. అట్లు తెలియక ప్రయోగించిన బాణము నీపైననే పడినచో మొదటికి మోసము వచ్చునుగదా. అంతియకాక, నేను రూఢిగాఁ దెలిసికొనక, ముందువెనుకలు యోచింపక బాణప్రయోగము చేసియుందునేని, యాబాణము విధివశమున శూరుఁడవైన నీకే తగిలి, కపీశ్వరా, నీవు మృతినొందినచో, నా యవివేకమును, బసితనమును లోకమున "రాముఁడు మూఢుండనియు, పసితనపుఁజేష్టలింక నాతఁడు విడువలే"దనియుఁ బ్రసిద్ధికెక్కునుగదా

ఒక్కరనుట యటుండనిమ్ము; శరణొసఁగినవానిం జంపుట యను మహా పాపము నాకు సంభవించునుగదా! సుగ్రీవా! నేనేమి, లక్ష్మణుఁడేమి, సీతయేమి మేము నీ యధీనులమై యున్నవారము. ఈ యడవియందు నీవెకదా మాకు దిక్కు కావున సుగ్రీవా! నీవు మఱుల యుద్ధము చేయుము. నా విషయముఁగూర్చి సందియపడకుము. సుగ్రీవా! యిఁక నొక నిమిషమున వాలి నాయొక బాణపుటేటునకుఁ గ్రిందఁబడి పోరలు నపుడు నీవు చూడఁగలవు. అయిన నీవు వానితో ద్వంద్వయుద్ధము సేయునప్పుడు నిన్ను గుర్తించుటకుఁ దగిన యొక యానవాలు దాల్చుము" అని సుగ్రీవునితోఁ జెప్పి, లక్ష్మణుంజూచి, "లక్ష్మణా! యీ కనఁబడుచున్న కొండచరియందుఁ జక్కఁగా విరిసిన గజపుష్పియను తీగను గోసి, యీతనిమెడయందు మాలగా వేయుము" అని లక్ష్మణు నితోఁ జెప్పెను.

అంత లక్ష్మణుఁడాగజపుష్పితీగను గోసి తెచ్చి, యా సుగ్రీవుని మెడలో వైచెను. ఆ పువ్వులతీఁగెను దాల్చిన యా సుగ్రీవుఁడు నక్షత్రగణములచేఁ జుట్టఁబడినసూర్యునితెఱఁగునను, కొంగల వరుస తోనుఁగూడిన సంజప్రొద్దు మేఘముమాడ్కినిఁ దేజరిల్లుచు, రాముని మాటయందు మనసు నుంచి, వాలి యేలెడి కిష్కింధకు వెండియు నేఁగెను.

13-వ సర్గము

సుగ్రీవుఁడు రెండవతూరి వాలిమీఁదికి యుద్ధమునకుఁ బోవుట

ధర్మాత్ముఁడయిన లక్ష్మణుని యన్న యగు రాముఁడు స్వర్ణ భూషణాలంకృతమైన గొప్పవింటిని, సూర్యునిమాడ్కి వెలిఁగెడి జయముగలిగించు బాణములను జేతఁబట్టి, ఋశ్యమూకమునుండి వాలి మగఁటిమితోఁ బాలించుచున్న కిష్కింధాపురమునకుఁ దఱలెను. మహా ధీరుఁడగు నా రాముని కి ముందట బలిసినమెడగల సుగ్రీవుఁడును, బల వంతుఁడగు లక్ష్మణుఁడును నడచిరి. వెనుకప్రక్కన వీరుఁడగు హను మంతుఁడు, నళుఁడు, నీలుఁడు, వానరసేనలకు నాయకుఁడయిన యొక్కువ ప్రతాపముగల తారుఁడును వెంబడించిరి. అట్లు వా రందఱుతఱలి, పుష్పఫలభారముచే వంగిన చెట్లను, తేటనీటితోఁ బాఱుచున్నసాగరంగ

మములగు నదులను కొండఱాల చీలికలను, పర్వతములను పర్వతగుహలను, ఎత్తుశిఖరములను, రమ్యములై యుండు కొండచరియలను వైడూర్యమణులవలెఁ బచ్చనైన తామరాకులును, చక్కఁగఁ బూచిన తామరపువ్వులును గలిగి, బెగ్గురుపక్షులు, చాతకపక్షులు, హంసలు, నీరుకోళ్లు, చక్రవాకపక్షులు మొదలగు పెక్కు పక్షులు చేయు శ్రావ్యనాదములతోఁగూడి మనోహరములై యున్న తటాకములను, లేఁబచ్చిక మొలకలఁదిని నిర్భయముగా వనప్రాంతములం దంతటఁ దిరుగుచున్న లేళ్ళను, తెల్లని దంతములు గలిగినవియు, ఘోరములునునై గుంపులుగుంపులుగాఁ గూడి యడవులందలి చెట్లనెల్లఁ బెళ్ళగించుచుఁ దిరుగుచు నెత్తుచరులు గలిగినట్టి నడయాడుఁ గొండలో యనఁదగియుండునవియు, నేలదున్నుచే నిండిన మేనులు గలవియు, క్రొక్కాఱుమొగుళులం బోలునవియునై కొలఁకులను బాడుచేయుచున్న వన్యగజములను, మఱియు ననేకములైన వన్యమృగములను, ఆకాశమునఁ బఱతెంచునట్టి పక్షులను జూచుచు సుగ్రీవుని యానతిచొప్పునఁ బోవుచుండిరి.

వా రట్లు వేగిరముగాఁ బోవుచుండఁగా, రఘునందనుఁ డొక్కచోట దట్టమైన చెట్లతోపును జూచి, "సుగ్రీవా! దట్టమైన యీచెట్లతోపు చుట్టు నరటిచెట్లుగలిగి, మేఘమండలము మాడ్కి విస్తారమై యాకాశమందలి మేఘజాలముచందమునఁ బ్రకాశించుచున్నది. చెలికాఁడా! ఇదేమియో తెలియవలయునని కుతూహలము గలుగుచున్నది. నీవు నా కుతూహలమును దీర్పవలయు" నని సుగ్రీవు నడిగెను.

మహోత్సుఁడైన యా రాఘవుఁ డడిగిన మాట విని, సుగ్రీవుఁడు నడచిపోవుచునే యా వనమహిమను రామునికిఁ జెప్పఁ దొడఁగెను. "రాఘవా! యీ తపోవనము మిక్కిలి విశాలమయినది. బడలికను దీర్చునట్టిది. దీనియందుఁ బెక్కు తోఁటలు గలవు. మధురములైన పండ్లును, తియ్యని తేటనీరును గలవు. ఈ వనమున సప్తజనులనెడి యేమునురే మునీంద్రులు కఠిననియమంబులు పూని, తలక్రిందుగా నిలిచి, నీటఁ బరుండి, యేమరాత్రుల కొక్కపర్యాయము వాయు! వాహారముగఁ గలవారలై, యేమనూఱుల సంత్సరములు తపస్సు చేయుచుండి బొందితో స్వర్గమును బొందిరి. రాఘవా! యిట్టి ప్రభావముగల యమ్మునీంద్రుల యాశ్రమమిది. చెట్లు దీనిచుట్టును ప్రహరి

వలె నున్నవి. ఈ యాశ్రమమున నింద్రాదిదేవతలుగాని రాక్షసులు గాని ప్రవేశింపఁజాలరు. పక్షులీవనమునఁబొఁఅవు. తక్కిన వన్యమృగము లును బ్రవేశింపవు. అట్లు లెలియక యెవరైన నిందుఁబ్రవేశింతురేని, యచ్చటినుండి మఱలిరాఁరు. ఇచ్చట నింపుగులుకుధ్వనులుగల సొమ్ముల సందడులును, గీతవాద్యధ్వనులును వినఁబడుచుండును; కమ్మనినెయ్యావి గుబాళించుచుండును; గార్హపత్య, ఆహవనీయదక్షిణాగ్నులనెడి మూఁడగ్నులు వెలుఁగుచుండును. ఇదిగో పావురపుమేని డాలు గలిగి దట్టమైయున్న పొగయుఁ జెట్లనుగ్రమ్ముకొనుచుఁ దేజరిల్లుచున్నది చూడుము. ఈచెట్లు కొనలందుఁ బొగతో నిండినవై, మేఘమండలము లచేఁ గ్రమ్మఁబడిన వైడూర్యమయపర్వతములో యనఁ బరఁగుచున్నవి. ధర్మాత్ముఁడా! రాఘవా! నీవు భక్తితో చేతులు జోడించి, లక్ష్మణునితోఁ గూడ నీమునులకు మ్రొక్కుము. ఆత్మజ్ఞానులగు నీమునీంద్రుల కెవ్వరు మ్రొక్కుచున్నారో, వారు దేహారోగ్యముగలవారై యుందురు. అని సుగ్రీవుఁడు రామునికి బదులుచెప్పెను.

అంత రాముఁడు సుగ్రీవునిపలుకులు విని, తానును దమ్ముఁడును జేతులు జోడించికొని యమ్మహాత్ములగు ఋషీశ్వరులకు వందనమాచ రించెను. ధర్మాత్ములయిన రామలక్ష్మణులు మ్రొక్కిన తర్వాత, సుగ్రీ వాదులగు వానరులును నమస్కరించిరి. తర్వాత వారందఱు సంతోష భరితులై యచ్చటినుండి తఱలిరి. అట్లు వారందఱు సప్తజనాశ్రమము దాఁటి చాలదవ్వేగి, యొరులకుఁ జొరనలవికానివిధమున వాలిచేఁ గాపాడఁబడుచుండు నా కిష్కింధాపురముఁ జూచిరి. అంత రామలక్ష్మణ సుగ్రీవులు సూర్యునిఁబోలు వెలుఁగుగలవారయి, యాయుధములు దాల్చి, పగతునిఁ బరిమార్చుటకు దేవేంద్రుని పుత్రుఁడగు వాలిచేఁ బాలింపఁబడుచున్న కిష్కింధాపురము మఱలఁ బ్రవేశించిరి.

14-వ సర్గము

సుగ్రీవుఁడు సింహనాదము సేయుట

శ్రీరాముఁడు మున్నగువారందఱు వేగముగా వాలియేలెడి కిష్కింధాపురము సేరి, యచ్చట నొక చొఱరాని వనమునఁ జెట్ల మఱుఁగుననుండిరి. అరణ్యసంచారమునఁ బ్రేమగలిగి వెడల్పు మెఱతోఁ

గూడిన యాసుగ్రీవుఁడు తనదృష్టిని నలుదెసలఁ బర్వఁజేసి యొక్కఁప కోపమునొంది, పరిజనముతోఁగూడి, పెనుగాలి వీవఁగా నుఱుముచున్న గొప్ప మేఘముమాడ్కి నాకసము బ్రద్దలగునట్లు పెడబొబ్బవెట్టి యా వాలిని యుద్ధమునకుఁ బిలిచెను. లేతసూర్యనివంటివాఁడును, గర్వించిన యేనుఁగుమాడ్కినడచువాఁడునునైన యాసుగ్రీవుఁడట్లు సింహనాదము నేసి, పనులందు నేర్పరియగు రామునిఁజూచి, "రామా! వానరులనెడి వలలతోఁ బర్వఁజేయఁబడినదియు, పసిండితోరణములుగట్టినదియు, బెక్కు ములతోను, యంత్రములతోను గూడినదియునైన వాలివీటికి వచ్చి చేరితిమి. శూరుఁడా! వాలివధముపిమయమున నీవే ప్రతిన మున్నొన రించితివిగదా! ఫలింపుసమయము వచ్చినప్పుడు అది లతను వేగిరమే పుష్పింపఁజేయునట్లు, నీ వీప్రతిజ్ఞను నెఱవేర్పుము" అని చెప్పెను.

సుగ్రీవుఁ డిట్లు పలుకఁగా, న్యాయశీలుఁడును, శత్రుసంహారియు నైన రాముఁడు సుగ్రీవునింగూర్చి యిట్లనియె: "సుగ్రీవా, లక్ష్మణుఁడు గుఱుతుపట్టునిమిత్తమై యొకగజపుష్పలతను నీమెడయందు వేసి యున్నాఁడు. దీనిచే నిన్ను గుఱుతుపట్టవీలగును. సుగ్రీవా! యీ మాలిక నీకంఠమున వైచుటచే, నీవు నక్షత్రములచేఁ జుట్టఁబడిన చంద్రునిమాడ్కిఁ గడు వెలుఁగుచున్నావు. కావున నీవు సుగ్రీవుఁడవని నేను సులభముగా నెఱుఁగఁగలను. ఇక, యుద్ధమున నొకబాణమును బ్రయోగించి నీకు వాలివలనఁ గలిగినవైరమును భయమును పోఁగొట్టె దను. సోదరరూపమునన్నున్న శత్రువగువాలిని సుగ్రీవా, నాకుఁ జూపి నదే తడవుగా అతఁడు నాచేఁ జచ్చి ధూళిని బ్రుంగఁగలఁడు. అతఁడు నాకంటఁ బడి యసువులతో బ్రతికిపోవునేని, యపుడు నాపై దోషము పెట్టి నన్ను నిందింపుము. నీకన్నుల యెదుటనే మద్దిచెట్లు నేడింటిని బాణముచే ద్రుంచితినిగదా! ఆ నాచేత వాలి నిహుఁడు చచ్చినవానిగాఁ దెలియుము. వీరుఁడా! నేనెంతయిక్కట్టున నున్నను, ధర్మలోపము గలుగు నన్న భీతిచే నింతకుమున్ను కల్లలాడినవాఁడనుగాను. ఇఁక మీఁద నెప్పటికిని నాడను. దేవేంద్రుఁడు వానగురిపించి, చేనియందు మొలచిన పైరును దనివి నొందించు చందమున, నేఁ జేసినప్రతిజ్ఞను బూర్తిసేసి, నీకు సంతోషముఁ గలిగించెదను. నీ వీత్వరపాటును వీడుము. సువర్ణమాలగల వాలి విన్నమాత్రమునసే వెడలివచ్చు

నంతటి గొప్ప సింహనాదం బా వాలిరాకకై కావింపుము. ఆవాలి బలముచే వెలుఁగువాఁడు; తనబలిమిఁ దాఁ బొగడుకొనువాఁడు; నీకు లొంగనివాఁడు; యుద్ధమునఁ బ్రేమగలవాఁడునై నందున నీసింహనాదము విన్న మాత్రమునఁ దడవుసేయక వచ్చును. మొనకాండ్రు యుద్ధరంగ మునఁ బగతురసేనెడి యవమానముల నోర్వరు. తమబలిమికొలఁది యెఱిఁగిన వా రందును నాతియెదుటఁ బగతురతిరస్కారము నోర్తురే. కావున వాలి నీ పెడబొబ్బ విన్నమాత్రమునఁ గయ్యమునకు వెడలి వచ్చును" అని శ్రీరాముఁడు సుగ్రీవునితోఁ జెప్పెను.

బంగారువన్నెగలవాఁడగు సుగ్రీవుఁడు రాముని పలుకులు విని, యాకాశము పగిలిపోవుచందమునఁ బెడబొబ్బవెట్టెను. ఆసుగ్రీవుని గొప్ప యార్పునకు, రాజు న్యాయాన్యాయములఁ బరికింపమిచేఁ బరుల దౌర్జన్యముచేఁ గలఁతఁజెందిన కులస్త్రీలచందంబున గోవులు తత్తరపడి పరుగులిడెను. బవరమున గొట్టఁబడినతేజీలమాడ్కి మెకము లెల్లఁ బఱు విడుచుండెను. పుణ్యక్షయముచే గ్రహములు పుడమినిబడునట్లు పఱు లెల్ల నాకసమునుండి క్రిందఁబడెను. ఇట్లు శౌర్యముచేఁ బెంపొందిన ప్రతాపముగలవాఁడును, మేఘమండలముమాడ్కి గర్జిల్లువాఁడును, బలశాలియని ప్రసిద్ధిఁగాంచినవాఁడును నైన యాసుగ్రీవుఁడు గాలిచేఁ గదలునలలుగల సముద్రుని చందమునఁ గడుత్వరగా బెడబొబ్బవెట్టెను.

15-వ సర్గము.

తార వాలిని యుద్ధప్రయత్నమునుండి నివారించుట

అంత శత్రుతిరస్కారము నోర్వనివాలి యంతఃపురమునఁ దారతోఁ గూడియుండునప్పుడు మహోత్సుఁడగు సుగ్రీవునిసింహనాద మును వినెను. సకలజంతువులకు భయంకరమైన యాసుగ్రీవుని నాదము విన్నంతమాత్రమున వాలికి పొంగు కుంగెను. పట్టరాని యాగ్రహ మును బొడమెను. వాలి రోషముఁబూని, సంధ్యాకాలపుసూర్యనిం బోలె నెఱ్ఱనివెలుగుగలవాఁడై, రాహువుచే మ్రింగఁబడిన సూర్యని మాడ్కి వెంటనే కాంతిహీనుఁడై, తనభయంకరములగు గొప్పకోఱలఁ జూపుచుఁ గోపము గదుర మండుచున్న నిప్పునుబోలినవాఁడై, యేనుఁ గులు సొచ్చి కలియఁబెట్టి కమలములం బెఱికివేయఁగాఁ గాడలుమాత్ర

ముగల మడుగుకైవడిఁ దేజరిల్లెను. అంత వాలి యోర్వకాని యాసుగ్రీవుని నాదమును విని భూమి బ్రద్దలగునట్లు నడచుచు వేగముతో దుమికెను.

అప్పుడు తార యులికిపడి, తడఁబడి ప్రేమంబుమీఱ వాలిని గౌఁగిలించి మేలును గలిగించుమాట నిట్లు పలికెను. తలిమమునుండి వేకువ లేచిననరుఁడు తా ననుభవించి వాడుపాఱేయున్న పూవులదండను దీసివేయుచంచమున నదీప్రవాహము మాడ్కి వచ్చుచున్న యీ కోపము నాఁపుకొనుము. వానరపుంగవా! రేపు తెల్ల వాఱ నితనితోఁ బోరుదువు! శూరుఁడా! ఇందువలన నీ శత్రువునకు గొప్పదనముగాని నీకుఁ జులకదనముగాని కలుగఁబోదు. నీవిప్పు డింత వేగిరముగా యుద్ధము నకు వెడలుట యుక్తంబుగా నాకుఁ దోఁపలేదు! నిన్నెందుకు నివారించె దనో యందుకుఁ గారణము చెప్పెద నాలింపుము. తొల్లి సుగ్రీవుఁడు వచ్చి నీకెక్కువ కోపముకలిగించి, నీపరాక్రమమోర్వఁజాలక నీవు తఱుమఁగాఁ బరుగెత్తినవాఁడు. అట్టివాఁ డిప్పుడు నిన్ను లేపి, కయ్యమునకుఁ బిలుచుచున్నాఁడు. వాఁడు నీచేఁ జావదెబ్బలుతిని, తఱుమఁబడినవాఁడు. అట్టివాఁ డిప్పుడు తానే మఱలివచ్చి యుద్ధమునకుఁ బిలుచుటఁజూడ నా కెక్కువసందియము గలుగుచున్నది. ఆ సుగ్రీవుని యార్చుట వినునప్పు డతనిగర్వమును, ప్రయత్నమును, ధ్వనియు, ఆడంబరమును జూడఁగా, దానికేదియో గొప్ప కారణముండవలయు నని తోఁచెడి. ఇతఁ డెవనినో తోడుచేసికొనివచ్చియున్నాఁడు కాని, వేఱుగాదని తలఁచెదను. బాసటగలవాఁడు గనుకనే యితఁ డిట్లు గర్జనముసేయుచున్నాఁడు. వాలీ! సుగ్రీవునికి సహాయుఁడయి వచ్చినవాఁడు సామాన్యుఁడుగాఁడని తలంపుము. సుగ్రీవుండు స్వాభావికముగా నిపుణుఁడు బుద్ధిమంతుఁడును గనుక, నీపరాక్రమము హెచ్చైనదో, లేక తన స్నేహితుని పరాక్రమము హెచ్చైనదో పరీక్షించిచూచి, యాతనివీర్యము నీవీర్యమున కంటె గొప్పదని యెఱిఁగియె, యట్టివానిని దోడ్కొనివచ్చియున్నాఁడు. వీరుఁడా! ముసుపు కుమారుఁడగు నంగదుఁడు చెప్పిన హితవాక్యమును నీకు వినిపించెద నాలింపుము. మన కుమారుఁ డంగదుఁడు వనప్రాంతమునకుఁ బోయియుండివచ్చెను. అతఁ డాప్తులగు వేగులు దెలిపినవృత్తాంతమును నాకుఁ దెలిపెను. అదేదియన,

ఇక్ష్వాకువంశసంభవులును, సంగరమున నేరికిని గెల్వ నలవికాని వారును, పరాక్రమశాలురని వాసికెక్కినవారును, అయోధ్యాపురీశుఁడగు దశరథునికిఁ బుత్రులును, శత్రువులకు లొంగనివారును, శూరులునునైన రామలక్ష్మణు లను రాజపుత్రులు సుగ్రీవునికి మేలుసేయుటకై ఋశ్యమూక పర్వతమునకు వచ్చియున్నారఁట. నీ తమ్మునికి సహాయుఁడయిన రాముఁడు ప్రసిద్ధుఁడు; బవరమునఁ గ్రూరుఁడు; శత్రుసేనలం బరిమార్చువాఁడు; ప్రళయకాలాగ్నింబోలెఁ ప్రజ్వరిల్లువాఁడు; మఱియు నాతఁడు సాధువుల కాశ్రయ పృక్షమైనవాఁడు; ఆపదనొందినవారికి గొప్ప యాదరువైనవాఁడు; నొచ్చినవారికిఁ బ్రాపు; కీర్తికిఁ బ్రధాన పాత్రమైనవాఁడు; లౌకికవైదికజ్ఞానములుగలవాఁడు; తండ్రిమాట మీఱనివాఁడు. గైరికాదులగు ధాతువుల కెల్ల పర్వత మునికిపట్టయిన యట్లు సుగుణముల కెల్లఁ బెన్నిధియైనవాఁడు. కావున శత్రువులకు జయింపనలవికానివాఁడును, యుద్ధమున నింతటివాఁడని తెలిసికొన వీలుగానివాఁడును, మహాత్ముఁడునునైన రాముని తోడి వైరము నీకుఁ దగదు. ఓ శూరుఁడా! నీ కొకటి చెప్పెదను. నీపై దోషముఁ జెప్పను. నీ కితవగుమాట చెప్పెదను. దానిని వినియా ప్రకారముగాఁ జేయుము. నీవు తడవుసేయక సుగ్రీవునికి యువరాజపట్టాభిషేకము సేయుము. బలవంతుఁడగుతమ్మునితో విరోధింపకుము. నీవు సుగ్రీవునితోడి వైరము దవ్వుననే విడిచి, యాతనితోను రాముతోను జెలిమిచేసికొనుము. అది యుక్తమనితలఁచెదను. ఈసుగ్రీవుఁడు నీకుఁజిన్నవాఁడు. వీఁడచ్చట నున్నను, ఇచ్చటనున్నను నీకు బంధువు. లోకమున వానితో సాటి యగు బందుగుఁ డెవ్వఁడును లేఁడని నేఁ దలఁచెదను. కావున నితనిని దగ్గఱకుఁదీసి, కోరినదియిచ్చి, గౌరవించి నీకు బాసటగాయుండునట్లు చేసికొనుము. ఆసుగ్రీవుఁడును ఈ వైరము మాని, నీచేరువ నుండుఁ గాక. పొడుగు మెడగల యాసుగ్రీవుఁడే నీకు శాశ్వతబంధువుగా నున్నవాఁడు. కావున, తమ్మునితోఁ జెలిమిచేసికొనుము. ఇప్పుడు దీనికంటె వేఱొండుపాయము లేదు. నీవు నాకు మేలొనర్పఁగోరుదువేని, నేను నీకు మేలుబోధించుదాననని యెఱుఁగుదువేని, నా ప్రార్థనము నియ్యకొని నామాటప్రకారము నడచుకొనుము. నాథా! శాంతింపుము. నాహిత వాక్యము నాలింపుము. ఆగ్రహము పూనకుము. దేవేంద్రునితో

సమానుఁడగు రామునితోడివైరము నీకెప్పటికిని యుక్తముగాదు. అని యప్పు డవ్విధమున తార వాలికి హితమును, పథ్యమునునై న మాటయే చెప్పెను. అయినను వాలికి మృత్యుకాలము సమీపించి, మృత్యుదేవత యతనిని ప్రేరణచేయుచున్నందున, తార చెప్పిన యిత వగు మాట లాతనికి రుచింపవయ్యెను.

16-వ సర్గము

రాముఁడు వాలిని బడవేయుట

ఇవ్విధమునఁ జంద్రునిఁబోలు మోముగలతార పలుకఁగా, వాలి యా తారపలుకులు తిరస్కరించి యాపెతో నిట్లనియె. ఓ చక్కని మోముగలదానా! నా తమ్ముఁడును, మీఁదుమిక్కిలి శత్రువునైన యీ సుగ్రీవుఁడు యుద్ధమునకై గర్జననేయుచుండఁగా, నితనియాటోపము నే నేకారణమున సైరింతును? ఓ పిఱికిదానా! శత్రువులచేఁ దిరస్కార మొందనివారును, యుద్ధమునందుఁ బగతురకు వెఱచి మఱలనివారును నైన శూరులు తమశత్రువుల తిరస్కారము నోర్చుట మరణప్రాయ ముగా నెంతురు. గొంతులేని సుగ్రీవుఁడే నాతోఁ గయ్యమునేయఁగోరి యొప్పుచు నార్భాటమునేయుచుండ, నే నాయార్భాటము నెట్టు లోర్చి యుందును? ఓసీ ప్రియురాలా! రాముఁడు నన్నేమైనఁ జేయునేమో యని యీరామునింగూర్చి విచారపడకుము. ఆతఁడు న్యాయమునెఱిఁగినవాఁడు; నెనరుగలవాఁడు. అట్టి యతఁడు నిర్దోషినైన నావిషయ మున నేల పాపమునేయఁగలఁడు? తారా! నీ చెలులతోడ నంతిపురము లోనికి మఱలుము. ఎందుకు మఱల నన్ను వెంబడించుచున్నావు? నీవు ప్రియురాలవైనందుకు నాయెడ నెక్కుడు ప్రేమమును భక్తిని జూపితివి. నే నాసుగ్రీవుని నెదురొక్కనెదను. నీ తత్తరపాటు వీడుము. ఆసుగ్రీవుని యహంకారము నణఁతునేకాని, ప్రాణములఁదీయను. నే నీసుగ్రీవునిప్రాణములఁ దీయక, యతనినిఁ జెట్లతో మోదియు, పిడికిళ్లతో గుద్దియు నన్ని తెఱఁగుల బాధించెదను. ఆసుగ్రీవుఁడు నాదెబ్బల కోర్వఁజాలక పరుగిడఁగలఁడు. ఓ తారా! నీవు విన్నసంగతిఁజెప్పి, చాల సాయమొనరించితివి. నాయెడఁగల ప్రేమనుజూపితివి. ఆదురా త్తుఁడగు సుగ్రీవుఁడు నేను ప్రయత్నముతోఁ జూచిన నాబలిమి నోర్వఁ

జాలఁడు. నీవిఁక నావెంబడి వత్తువేని నన్నుఁ జంపినట్లొట్టు పెట్టెదను. నీవు మఱలిపొమ్ము. నే నాసుగ్రీవుని సంగరమున గెల్చి, జయము వడసి వచ్చెదను, అని వాలి తారతో జెప్పెను.

ప్రియములాడునట్టిదియు, దాక్షిణ్యముకలదియునైన తార యా వాలిని గౌఁగిలించుకొని, యశుభ భయమున మెల్లగా నేడ్చుచుఁ దనమగనికిఁ బ్రదక్షిణము గావించి, తనపెనిమిటికి గెల్పుగోరుచుండునది గావున మంత్రపూర్వకముగా మంగళమునుజెప్పి, దుఃఖముచే మైమఱచి, చెలులతోడ నంతఃపుర ప్రవేశము సేసెను. అంత వాలియుఁ బెనుఁ బాముమాడ్కి నిట్టూర్పువిడుచుచుఁ గోపముతోఁగూడినవాఁడై పట్టణమునుండి వెడలెను. ఎక్కువ వెలుఁగుగలవాఁడును, ఎక్కువ కోపము గలవాఁడునైన వాలి నిట్టూర్పు నిగిడించి, పగతునిఁ జూచుతమితో నంతటఁ దనదృష్టిని నిగిడించి పసిడివన్నెగలవాఁడును, నడుమునకుఁ బట్ట గట్టి, యుద్ధమున కాయత్తుఁడై యగ్నిహోత్రుని చందమునఁ దేజరిల్లు చున్నవాఁడునైన సుగ్రీవునిఁ జూచెను. అంతటఁ గడురోషము గలవాఁడైన వాలియు సుగ్రీవుఁడు తనబలిమిమీఱి నిలఁబడియుండుటఁ జూచి, తానును నడుమునకు దట్టి గట్టిగా బిగియఁగట్టెను. శూరుఁడయిన వాలి యట్లు దట్టిగట్టికొని పిడికిలిపట్టి, యుద్ధమునం దెక్కువ మోహాముగల వాఁడై యాసుగ్రీవు నెదురొక్కనిపోయెను. సుగ్రీవుఁడును కాంచన మాలచే నొప్పుచున్న వాలినిగూర్చి గట్టిపిడికిలిపట్టి పై కెత్తుకొనివచ్చెను. వాలియుఁ గోపముచేఁ గన్ను లెట్టుఁగజేసి, కడువేగముతోఁ దనమీఁదికిఁ గవియుచున్న యుద్ధకుశలుఁడగు సుగ్రీవునిఁ జూచి యిట్లనియె.

ఓరీ! యిదిగో చక్కఁగాఁ ప్రేళ్లుగదియఁజేర్చి గట్టిపిడికిలి పట్టితిని. నేను వేగముతో నొక గుద్దు గుద్దుదునేని, యా గుద్దుతోడనే ప్రాణములు వీడఁగలవు" అని వాలి చెప్పఁగా సుగ్రీవుఁడును గడునలిగి, వాలింజూచి, "ఓరీ! నాపిడికిలియొ నీనె తినిబడి నీప్రాణములను దీయును గాక" అని చెప్పెను. అంత వాలి కోపముతోఁ బిడికిటఁబొడువఁగా, సుగ్రీవుఁడును గడునలిగి, వేగిరముగ నవ్వాలిపైకి దుముకుచు నెత్తురు గ్రక్కుచు, సెలయేళ్లతోఁగూడిన పర్వతమువోలెఁ బ్రకాశించెను. అంత సుగ్రీవుఁడు దన ప్రతాపముచే నొకచెట్టును వేళ్లతోడఁ బెఱికి వజ్రాయుధముతోఁ బర్వతమును గొట్టినట్లు లాచెట్టుతో వాలి నన్ని

యంగములకును దగులునట్లు మోదెను. వాలియు నాచెట్టుయొక్క వ్రేటునకు మిక్కిలినొచ్చి, సముద్రమునందలి యొక్కవ బరువుతోఁ గూడిన పర్వతుల యోడకైవడిఁ గడుఁజలన మొందెను. భయంకరమయిన బలపరాక్రమములు గలవారును, గరుత్తంతునిఁ బురుడించు వడిగల వారును, ఒడళ్లు పెరిగి భయంకరరూపముతోనున్న వారును నైన వాలి సుగ్రీవులాకాశమున వెలుఁగు సూర్యచంద్రులంబోలినవారలై, యొండొరులఁ దాఁకుచు అవకాశమునకై వేచియున్న వారును నగుచు సమరము చేసిరి. అప్పుడు వాలి బలపరాక్రమముగలవాఁడై పెంపొందుచుండెను. సూర్యుని పుత్రుఁడగు సుగ్రీవుఁ డెక్కువశౌర్యంబు గలవాఁడయినను వాలితోఁ బోరలేక తగ్గుచువచ్చెను. అట్లు సుగ్రీవుఁడు వాలితోఁబోరి గర్వమెల్లఁ బోఁగొట్టుకొన్నను, ప్రతాపహీనుఁడయినను, రోషము దగ్గకున్నందున వాలితోఁ దన హస్తలాఘవము చూపుచు యుద్ధము చేసెను. ఆవాలిసుగ్రీవులు కొమ్మలతోను, కొనలతోఁగూడిన చెట్లతోను గొట్టుకొనియు, వజ్రాయుధంపుటంచులంబోలు గోళ్లతో రక్కియు పిడికిళ్లతో గ్రుద్దియు, మోఁకాళ్లతోఁ బొడిచియు, పాదములతోఁ ద్రొక్కియు, చేతులతో మాటిమాటికిఁ జఱచియు, వృత్రాసురదేవేంద్రులపగిది ఘోరయుద్ధముఁజేసిరి. ఆవనచారులగు వాలిసుగ్రీవులు రక్తమునఁ దోఁగి యొండొరులను మేఘములకైవడిఁగప్పుచు సంగర విహారము సల్పిరి.

అప్పుడు సుగ్రీవుఁడు డస్సి, వాలితోఁబోరలేకను క్రిందమీఁదను దెసలను మాటిమాటికిఁ జూచుచుండుటను రాముఁడు చూచెను. అంతఁ గడుతీవ్రమగు తేజస్సుగల రాముఁడు సుగ్రీవుఁడు నొచ్చియుండుటను గని వాలివధమునకై, బాణమువైపు దృష్టిఁబోనిచ్చి, సర్పసదృశమైన యా బాణమునుగొని వింట సంధించి, యముఁడు కాలచక్రమును బోలె నాధనుస్సును వంచి చెవివఱకు నీడ్చి నారి మీటెను. ఆధనుష్టంకారమునకు నావనమున నుండు గొప్పపక్షులును, మృగములును ప్రలయకాలంబునందుఁ బోలెఁ గడు భీతినొంది దిక్కులుదోఁచక నలు దెసలకుఁ బరుగులిడెను. అట్లు రాముఁ డాకర్ణాంత మీడ్చి యేసిన బాణము వజ్రముంబోలునాదముగలదై పిడుగువలె మండుచుఁ బోయి యావాలి యుర్మునఁ బడెను. నరశ్రేష్ఠుఁడగు రాముఁడు ప్రళయకాల

మృత్యువుంబోలినదియు, స్వర్ణరజతభూషణాలంకృతమైనదియు, శత్రు హింసచేయునదియునై వెలుఁగుచున్న బాణమును హరుఁడు పొగతోడఁ గూడిన యగ్నిని దనమోమునుండి వెడలించున ట్లా వాలి పై నేయఁగా, నెక్కువ వీర్యంబుగలవాఁడును, బలగర్వితుఁడునైన వానరేశ్వరుఁడగు వాలి రామునియమ్ము ఱొమ్మునఁ దాఁకుటచేఁ గాంతిహీనుఁడై, మయి మఱచి, నేలమీఁదఁబడి నెత్తుటి వెల్లువయందుఁ దడిసినవాఁడై స్మృతిఁ దప్పి, యాశ్వయుజమాసమునఁ బున్నమనాఁ డుత్పన్నమైన పదంపడిఁ గ్రిందఁద్రోయఁబడిన యింద్రాయుధమువ లెను, గాలికిఁగూలిన చక్కఁగాఁ బుష్పించిన యశోకవృక్షము కైవడియు విరాజిల్లుచుండెను.

17-వ స ర్గ ము.

వాలి రాముని దూరుట

రాముఁడు కడువాఁడిబాణము నేయఁగా, రణరంగమున శూరుఁడును, స్వర్ణభూషణములు దాల్చినవాఁడునైన వాలి మొదలునఱికిన చెట్టువ లెను పగ్గములు తెగిన దేవేంద్రునిధ్వజముకై వడిని దనయం గము లెల్ల నేలనానునట్లు కూలఁబడెను. వానరగణాధిపుఁడగు వాలి పుడమినిఁ గూలినప్పుడు, భూమండలము చంద్రుడు లేని యాకసముకై వడిఁ గాంతివిహీనమాయెను. ఆ మహాసమర్థుఁడగువాలి క్రిందఁబడినను, ఆతనిదేహమునుండి కాంతి, ప్రాణములు, తేజస్సు, బలమును తొలఁగ వయ్యె. దేవేంద్రుఁడొసఁగిన వజ్రమణిమయమగు శ్రేష్ఠమైన సువర్ణ హారము వాలి ప్రాణములను, తేజఃకాంతులను నాపి పట్టికొనియుం డెను. కాంచనమాల దాల్చిన యా వానరాధిపుఁడగువాలి సంజెప్రొ ద్దుటి యెఱుపుగ్రమ్మియుండు మేఘముచందమునఁ బ్రకాశించెను. ఆ వాలి క్రిందఁబడినను, ఆతఁడు కంఠమునఁదాల్చిన మాలయు, దేహ మును, ఆయపట్టున నాఁటియున్న యారాముని బాణమునను మూఁడు భాగములుగ విభజింపఁబడిన ట్లాతనితేజస్సు వెలుఁగుచుండెను. ఆ రాముఁడు తన వింటినుండి ప్రయోగించినబాణము తఱుచుగా స్వర్గమునకే మార్గమునుజూపునది కావున శూరుఁడయినవాలికిని నుత్తమగతిని గలుగఁ జేయఁ గలిగెను. అప్పుడు రాముఁడు లక్ష్మణసమేతుఁడై, సంగర మునఁగూలి, మంటలు చల్లాఱిన యగ్నిహోత్రునికైవడి నున్నవాఁ

డును, తన్నుఁ బడనేసిన వీరుఁడెవఁడో యని గారవముతో మెల్లగాఁ
జూచువాఁడును, పుణ్యక్షయమున స్వర్గమునుండి క్రిందఁబడిన యయాతి
వలెను, ప్రలయకాలమునఁ గాలునిచేఁ బడమిని ద్రోయఁబడిన సూర్యుని
వలెను కాంతిదొఱఁగియున్న వాఁడును, వేల్పు జేనికైవడిఁ బగతురకు
గెల్వనలవికానివాఁడును, బగతురకోర్వజాలనివాఁడును, సింహమువలె
వెడదయొత్తుగలిగినవాఁడును, నిడుద చేతులవాఁడును, ప్రకాశించు
మోమును, పచ్చనికన్నులును గలవాఁడును, దేంవేద్రుఁడొసఁగిన
బంగారుదండచే నొప్పినవాఁడునైన మహేంద్రునందనుఁడగు వాలినిఁ
జూచి, దగ్గఱకుఁబోయెను.

ఆవాలియు బలిమిగలవారగు రామలక్ష్మణులఁ జూచి, రామునిఁ
గూర్చి పరుసఁదనము దోఁప, వినయమ్ముమీఱి, న్యాయానుసారముగా
నిట్లనియెఁ: "రామా! నీవు రాజపుత్రుఁడవు; శూరుఁడవని ప్రసిద్ధిగాంచిన
వాఁడవు; చూపటకింపుగొలుపువాఁడవు; సత్కులీనుఁడువు; సత్త్వగుణము
గలవాఁడవు; వెలుఁగుగలవాఁడవు; పితృవాక్యపరిపాలనము మొదలగు
గొప్పవ్రతము లాచరించువాఁడవు. ఇట్టి గుణవిశిష్టుఁడవయిన నీవు
యుద్ధరంగమున మఱొక్కనితోఁ బోరుచున్న నన్ను బాణముతో
వొమ్మునఁ గొట్టితివి. ఇట్లొకనివ్వైపునకుఁ దిరిగియున్న నన్ను వొమ్మునఁ
గొట్టి యేమిఫలము సంపాదించితివి? రాముఁడు దయాళువు; జనులకు
మేలుసేయుటం దాసక్తిగలవాఁడు; నొచ్చినవారియెడ జాలిఁగనబఱచు
వాఁడు; ఆశలను గెల్చినవాఁడు; సదాచారము నెఱింగినవాఁడు, నియ
మము దప్పనివాఁడు" నని భూలోకమున జనులందఱు నీకీర్తిని
బొగడుచుందురు. దమము, శమము, క్షమ, ధర్మము, ధృతి, సత్యము,
పరాక్రమము, అపరాధులను శిక్షించుట యనునవి రాజులగుణములు.
ఆగుణములెల్ల నీయం దుండుననియు, నీవు సద్వంశమునఁ బుట్టినవాఁడ
వనియు నమ్మి, "తార, నీవు యుద్ధమునకుఁ బోవల"దని నన్ను నివా
రించుచున్ననుు, ఆమాటలను సరకుసేయక సుగ్రీవునిఁ దలపడితిని. నేను
నిన్నుఁజూడక మఱొక్కనితోఁ బోరాటము సేయుచు నేమఱు
పాటుతో నుండఁగా, నీవు బాణముతోఁ గొట్టవని నేఁ దలఁచియుంటిని.
నీవు చెడుబుద్ధిగలవాఁడవనియు, ధర్మరతుఁడను వేషముదాల్చినవాఁడ
వనియు, అధర్మపరుఁడవనియుఁ, బాపంపునడతగలవాఁడవనియు

నేఁ దెలియనైతిని. బాగుగా నెదిగినగడ్డితో నొకబావి గప్పఁబడి యున్నప్పుడు జను లది బావియని తెలియక దానిమీఁద నడచుచుఁ బోయి, యాబావిలోఁ బడినట్లు, నీవును ధర్మజ్ఞతాదిగుణములు గల వాఁడవని యెంచి నే నీగతి నొందితిని. నివురుగప్పిన యగ్నిహోత్రుని వైవడి, సత్పురుషవేషధారివగు పాపుఁడవైన నీవు కపటధర్మ వేషధారి వని నే నెఱుంగనైతిని.

ఓ రామా! నేను నీదేశమున కేదియైనఁ గీడొనర్చితినా! లేక నీపట్టణమున నేదియైనఁ దప్పుచేసితినా? లేక నిన్నేమైన నపమానించి తినా? నీవు నిరపరాధుఁడనైన నన్నేల చంపితివి? ఎల్లప్పు డడవిలోని దుంపలను, పండ్లను దిని, యడవియందుఁ గ్రుమ్మరుచుండువాఁడను. అదియుఁగాక, నేను నీతో నిప్పుడు యుద్ధమునకుఁ బూనక మఱి యొక్కనితో యుద్ధముసేయుచు నాతనియందే దృష్టియుంచియుంటిని. అట్టి సమయమున నీవు నాపై బాణము నేసితివే యది నీకు న్యాయమా? ఓ రాజా! నీవుధర్మము నడుపువాఁడవని కపటవేషము దాల్చియున్నట్లు కనబడుచున్నది. క్షత్రియకులమునఁబుట్టి, శాస్త్రము లెల్లఁజదివి, ధర్మ సందేహాముల నెల్ల నెఱిఁగినవాఁ డెవ్వఁడు బూటకపుధార్మిక వేషము పూని యిట్టి క్రూరకర్మమును జేయును? రామా! రాజకులమున జన్మించి, ధర్మము తప్పనివాఁడవని ప్రఖ్యాతిగంటివి. నీవు సాధువవు గాకపోయినను, సాధువవను వేషముతో నెందుకుఁ దిరుగుచున్నావు? ఱేఁడా! నెమ్మది, ఈవి, శాంతము, మంచినడవడి, నిజముపల్కుట, సంతోషము, పరాక్రమము, తప్పుచేసినవారిని దండించుట యనునవి రాజగుణములు. రామా! మేము పండ్లు దుంపలుం దినుచు నడవు లందుఁ గ్రుమ్మరుచుండువారము. ఇది మా స్వభావము. నీవు మనుజుఁ డవు. మానవులకు ఱేఁడవు. మానవేశ్వరుఁడవయిన నీకు వానరులమైన మాతో నేమి పనియున్నది? లోకమున వెండి, బంగారు, భూమి యనునవి కలహామునకుఁ గారణములు. అట్టివి యేవియు నీకును మాకును సంబంధించినవి లేవు. నేనుండెడి యీ వనంబువలనఁగాని, మేము దినెడి పండ్లవలనఁగాని నీ కేవివాంఛగలదు? నీతియు, దండ నమును, తిరస్కారమును, అనుగ్రహించుటయు, వీనిలోపల నెయ్యది

యెప్పుడెచ్చట నుపయోగింపవలయునో, అది యెఱిఁగి రాజులు ప్రయోగించుచుందురుగాని, స్వేచ్ఛమెయి వర్తింపరు.

నీ వన్నినో స్వేచ్ఛయే ప్రధానముగాఁ గలవాఁడవు; కోప స్వభావుఁడవు; నిలుకడలేనివాఁడవు. రాజధర్మములఁ దప్పినవాఁడవు; ధనుఃప్రయోగమునందే శ్రద్ధగలవాఁడవు. నీకుధర్మమున గౌరవములేదు. అర్థసంపాదనమునందు నిలుకడలేనివాఁడవు. నీ విచ్ఛ చొప్పున నడచుచు నింద్రియము లే తెరువున కీడ్చుచున్నవో అట్లెల్లఁ బోవువాఁడవు. ఓ నరాధిపా! తప్పులేని నన్ను వధించి, యొక నింద్యమైన కార్యము చేసి, దీని నేల చేసితివని పెద్దలడగిరేని, నీవు వారినడుమ నిలఁబడి యేమి బదులుసెప్పుదువు? రాజును వధించినవాఁడు, బ్రహ్మహత్య చేసినవాఁడు, గోవధకర్త, చోరుఁడు, ప్రాణివధంబున నిరతుఁడు, నాస్తికుఁడు, అన్నకంటె ముందుగాఁ బెండ్లాడినవాఁడు వీరందఱు నరకమును బొందుదురు. కొండెములు చెప్పువాఁడు, లోభి, విశ్వాస ఘాతుకుఁడు, గురుభార్యను బొందువాఁడు వీరు పాపలోకముల నొందుదురు. దీనికి సందియము లేదు. ఓ రామా! మృగయావిహారము నిమిత్తము నిన్ను వధించితినందువేమో? వానరచర్మము ధర్మపరులగు నీబోటి సత్పురుషులు ధరింపరు. రోమములును, నెమికలను బనికి రానివి. మాంసము భక్షింపఁదగినదికాదు. ఏదుపందులు, అడవి పందులు, ఉడుము, కుందేలు, తాఁబేలు నను నైదుగోళ్ళుగల మృగములు భక్ష్యములుగాని, తక్కిన యైదుగోళ్ళుగల మృగములు భక్ష్యములు గావు. రాజా! విద్వాంసులు పంచనఖుఁడనైన నా చర్మమును, నా యెముకలను దాఁకరు. నా మాంసమును దినరు. అట్టి యభక్ష్యుఁడను, అస్పృశ్యుఁడనునైన నన్నేల వ్యర్థముగా సంహరించితివి. తార యీ సంగతియెల్ల నెఱిఁగినది; నా మేలుగోరి, "నీవిప్పుడు పోవలదు" అని యథార్థమును, హితమునునైన మాటను జెప్పెను. నేను గాలపాశమునకు లోఁబడినవాఁడనై, యా తార చెప్పిన హితసత్య వాక్యముల వినక వచ్చి, యిట్లు మృత్యువుపాలయితిని. కాకుత్స్థా! సచ్ఛీలముగల పతివ్రతయగు మగువ దుష్టుఁడయిన మగనిచేఁ బాలింపఁబడనియట్లు, అథారికుండవయిన నీవేలికగానుండఁగాఁ బుడమి న్యాయపరిపాలితమైన దగునే?

లోలోపల నితరులకుఁ గీ డొనరించువాఁడవు, వంచనాస్వరూపుఁడవు, అల్పుఁడవు, శాంతస్వభావుఁడవువలె నటించువాఁడవు, పాపచింతగలవాఁడవునైన నీ వెట్లు మహాత్ముఁడయిన దశరథునకుఁ బుట్టితివి? గొప్ప నడవడి యను కట్టుత్రాళ్ళను ద్రెంచుకొన్నదియు, పెద్దలధర్ములనెడు మార్గమును మీఱిపోవునదియు, ధర్మమను నంకుశమునకు లోఁబడనిదియునైన రాముఁడను నేనుఁగు నన్నుఁ జంపెను. అమంగళమును, అయుక్తమును, పెద్దలచే నిందింపఁబడినదియు నైన యిట్టి కార్యమెనర్చితివే? నీవు పదుగురు పెద్దలలోపలికిఁ బోయినప్పుడు వారికేమి చెప్పుదువు? ఓ రాజా! జోలిమాలిన మాపై నీ వెంతటి విక్రమము చూపితివో, అంతటి విక్రమము నీ కపకారమొనర్చినవారియెడఁ జూపఁజాలకుందువని తలఁచెదను. ఓ నృపకుమారా! నీవు కనఁబడుచు యుద్ధముఁ జేసియుందువేని, యప్పటికి నాచే నీల్గి యమునిఁ జూచి యుందువు. మద్యపానముసేసి, నిద్రించుచున్న నరునిఁ బొమ్మగఱచిన చందమున, నీవు గంటికిఁ గానరాక మఱుగుననుండి సమరమున శత్రువులకు సాధింపరాని నన్నుఁ జంపితివి. ఓరామా! సుగ్రీవునిసాహాయ్యమొంగోరి యీపనిచేసితినందువేమో? నీ వీసంగతి నాకు ముందుగాఁ దెలిపియుందువేని, నే నొకపూటలోపల సీతనుదెచ్చి నీకిచ్చియుందునే. సుగ్రీవునియిష్టముఁజేసి కార్యము సాధింపఁగోరి యింతపని చేసితివి గదా. ఆమాట నాతోఁజెప్పియున్న నా రావణునిఁ జంపి నామెడకుఁ గట్టికొని యీడ్చి తెచ్చియిచ్చియుందును. నీవే సీతను దెచ్చియిమ్మని యానతియొసంగియుందువేని, తొల్లి మధుకైటభులనెడి రాక్షసులు దొంగిలించి పాతాళమున దాఁచిన శ్వేతవర్ణముగల గర్భిరూపిణియైన శ్రుతిని హయగ్రీవుఁడగు విష్ణువు సాధించినట్లు, ఆ సీత పాతాళమునను, లేక సముద్రజలమునను నా రావణునిచే దాఁపఁబడియున్నను, ఆమెను దెచ్చియుందునే. నేను స్వర్గతుఁడయినపిదప సుగ్రీవుఁడు రాజ్యము వడయుట యనునది న్యాయ్యము. నీ వన్యాయముగా నన్నుఁజంపి, యా సుగ్రీవునికి రాజ్యమొసఁగుట యనునది న్యాయ్యము గాదు. లోకమునఁ బుట్టినవాఁ డీతీరున మృతినొందుట వాస్తవమే. నేనెట్టులో మృతినొందుదును. నీ విప్పు డొనర్చినపని నీకు యుక్తముగాఁ దోఁచునేని నామాటలకు సమాధానము నాలోచించి

చెప్పుము" అని బలశాలియగు దేవేంద్రతనయుఁడయిన వాలి చెప్పి, బాణము దెబ్బకు నొచ్చి, మోమునఁ గళలేనివాఁడై సూర్యునిఁబోలె వెలుఁగుచున్న రాముని జూచుచు నూఱకుండెను.

18-వ సర్గము.

రాముఁడు వాలివాక్యములకు బదులు చెప్పుట

ఇవ్విధమున బాణముచేఁ గొట్టఁబడి, తెలివిదప్పియున్న యా వాలి రాముంగూర్చి వినయయుతమును, ధర్మార్థములతోఁగూడినదియు, కఠినమైనదియునైన మాటఁజెప్పెను. అప్పుడు రాముఁడు వాలిచేఁ దూలనాడఁబడి, వెలుఁగులేని సూర్యునికైవడియు, నీరెల్లఁగురిసి వెలసిన మేఘముచందమునను, చల్లాఱిన యగ్నిహోత్రునిభంగియుఁ గళదప్పి యున్న వాఁడును, ధర్మార్థములతోఁ గూడినవాఁడును, వానరశ్రేష్ఠుఁడును, వానరసేనలకెల్ల నధిపుఁడునైన వాలింగూర్చి యీ శ్లోకము తెఱఁగున బదులు చెప్పఁదొడఁగెను:

వాలీ! నీవు మూఢుఁడవై, ధర్మార్థకామముల నిజస్వరూపమును, లోకనడవడిని నెఱుఁగక యిప్పుడు నన్నేల యిట్లు దూఱుచున్నావు? ఓరి నాయనా! వాలీ! నీ నడతలెల్ల మంచివో చెడ్డవో నేర్పరులైన వారిని, పెద్దలను, పూజ్యులైన గురువులనడిగి తెలిసికొనక, వానరసహజమయిన చాపల్యమువలన నన్నేల యూరక నిందింపఁ గోరుచున్నావు! ఈ పుడమియు, ఈ పుడమియందలి పర్వతములు, వనములును ఇక్ష్వాకు వంశమువారివి. కావున నీ పుడమియం దుండు, పర్వతవనములందు నుండు మృగములేమి, పక్షులేమి, మానవులేమి యందఱు వారి యుత్తరువునకు లోఁబడి నడుచువలయును. వారి దేశములందున్న సకలప్రాణులను వారనుగ్రహింపను గలరు; నిగ్రహింపను గలరు. అట్టి యీ భూమండలమును ధర్మమునడుపువాఁడును, నిజము తప్పని వాఁడును, కపటములేనివాఁడును, ధర్మ, అర్థ, కామముల నిజస్వరూపము నెఱిఁగినవాఁడును, చెడ్డవారిని దండించుటకును, మంచివారిని గనికరించుటకును బూనినవాఁడును నగు భరతుఁడు పాలనచేయుచున్నాఁడు. నయవినయములును, సత్యవాక్యపరిపాలనమును, పరాక్రమమునుగలిగి, దేశకాలస్వరూపము నెఱిఁగినవాఁడయిన భరతుఁడీ

పుడమి కేలికయ్యెయున్నాఁడు. మేమును, తక్కినరాజులును ఆ భరతుఁడు న్యాయ్యముగాఁజేసిన యాజ్ఞలనుగొని, ధర్మవృద్ధిని గోరుచు నీపుడమి యెల్ల సంచరించుచున్నాము. రాజశ్రేష్ఠుఁడయి, ధర్మమునఁ బ్రేమగల భరతుఁడు పుడమి యేలుచుండఁగా నెవఁడు ధర్మలోపమును గలిగించును? అట్లైవ్వఁడైన ధర్మమునకు హానిగలిగించునేని, స్వధర్మమునుండి చలింపనివాఁడైన మేము భరతునియాజ్ఞను ముందిడుకొని, యట్టి ధర్మహాని గలిగించువారలనెల్ల న్యాయముదప్పక శిక్షించుచున్నారము. నీవన్ననో ధర్మమును జెఱిపినవాఁడవు; లోకులు దూరునట్టిపని చేయువాఁడవు. కామతంత్రములం దవిలి రాజమార్గమునుదప్పి నడచుచున్నాఁడవు. అన్నయుఁ దండ్రియు, విద్యాదానముచేసినవాఁడును, వీరు ముగ్గురును ధర్మమార్గమున నడచువానికిఁ దండ్రులని చెప్పఁబడుదురు. న్యాయమార్గముచొప్పున నడవవలయునని తలంపుండునేని, తమ్ముని, గుణవంతుండగు శిష్యునిఁ దనకొడుకుంబోలెనే చూచుకొనవలెనని పెద్దలు చెప్పుదురు. వానరా! ధర్మము సూక్ష్మమైనది; పెద్దలకుఁగూడ మిక్కిలి తెలియరానిది. సర్వభూతములమనస్సుల నుండునట్టి పరబ్రహ్మస్వరూపుఁడు ధర్మాధర్మములకుఁ గారణములైన మంచి చెడ్డల నెఱుఁగును. పుట్టుగ్రుడ్డివాఁడు పుట్టుగ్రుడ్డులతోఁజేరి యాలోచించుతెఱఁగున గురుశిక్ష నొందనివారును, చపలులునైన వానరులతోఁ జపలుఁడవైన నీవు మంతనము చేయుచున్నాఁడవు. ఇక నీ కెట్లు ధర్మస్వరూపము దెలియనగును? నే నీ మాటను నిరూపించి చెప్పెదను. నీవాగ్రహముచే నొడలుమఱచి నన్నూరక నిందింపకుము.

ఓ వానరేంద్రుఁడా! నేను నిన్నెందుకు సంహరించితినో వానికి కారణమిదె చెప్పెదను వినుము. నీవు శాశ్వతమైన యాచారమును వదలి బుద్ధిమంతుఁడగు తమ్ముఁడు సుగ్రీవుఁడు బ్రతికియుండఁగా, నతనిభార్య యగు రుమతోఁ గ్రీడించుచున్నాఁడవు. తమ్ముఁడు కొడుకుతో సమానుఁడుగనుక తమ్మునిపెండ్లాము కోడలితో సమానురాలు. నీవు పాపంపుఁబనులుచేయువాఁడవు గానఁ గొంచెమయినను సంశయింపక, మోహముఁబట్టఁజాలక కోడలితో రమించుచున్నావు. నీ కిది న్యాయమే? వానరా! కావున ధర్మముఁదప్పి, తమ్మునిభార్యను బొందుట యను మహాపరాధము నొనరించితివి గనుక నిన్నిప్పు డిట్లెఱుఁగునఁ

బడనేసితిని. వానరేంద్రా! లోకమునొక్క నడవడివదలి, ధర్మము మీఱి నడచువానికిఁ దగినశిక్ష చంపుటకంటె వేఱొకటిలేదు. క్షత్రియ కులోద్భవుఁడను నేను. ధర్మాధర్మవిచారణ నాకార్యము. కావున నీ వొనర్చిన పాపం, బోర్వలేక యీ కార్యంబొనరించితిని. ఎవఁడు కామం బణఁచుకొనఁజాలక కూఁతురిని, తోఁబుట్టినదానిని తమ్మునిభార్యను గూడుచున్నాఁడో, వానికి వధమే దండనమని శాస్త్రములు చెప్పు చున్నవి. సకలధర్మముల నెఱిఁగిన భరతుఁ డిప్పుడు పుడమియేలిక. మే మన్ననో వాని యాజ్ఞ చొప్పున నడచుకొనుచు ధర్మాధర్మములఁ బరికించు వారము, నీవు ధర్మముదప్పి నడుచుచుండఁగా, నిన్ను పేక్షచేయుట యుక్తమగునే? భరతుఁడు జనులకెల్లఁ దండ్రివంటివాఁడు గనుక న్యాయముఁదప్పినవారిని జట్టముచొప్పున దండించుచుఁ గామవృత్తు లయినవారిని దండింపవలయునని కంకణముకట్టియున్న వాఁడు. వాన రులదొరా! మేము భరతునియాజ్ఞప్రకారము నడుచుకొనువార ము గనుక, నడవడి తప్పి నడుచుకొనెడునట్టి మీబోఁటులనెల్ల శిక్షిం చుటకుఁ గడఁగియున్నారము. అంతియగాక, నాకు సుగ్రీవునితోడిచెలిమి లక్ష్మణునితోడిచెలిమివంటిది. సుగ్రీవుఁడు రాజ్యమునుగోరియు, భార్యను గోరియు నాతోఁ జెలిమి నొనరించుకొనెను. నాకు మేలుచేయుట యందుఁ గడు శ్రద్ధగలవాఁడు. నీ వతనిభార్యను లాగుకొంటివి. రాజ్యమునుండి తఱిమితివి. కనుక ని న్నేను సంహరింపవలసె. ఋశ్య మూకపర్వతమున వానరులు కొందఱిసమక్షంబున నీ శత్రువును జంపి, నీకు రాజ్యమును భార్యను నొసఁగెదను అని ప్రతిజ్ఞ యొనరించితిని. ఆ ప్రతిజ్ఞ యిప్పుడెట్లు నేను మీఱుదును? కాఁబట్టి యీ పైఁజెప్పిన ధర్మవిరుద్ధములుగాని గొప్పకారణంబులచే నీవధము యుక్తమే కావున నీవు దీని నంగీకరింతువు గాక! నీ వధ మన్నితెఱఁగుల యుక్తమనియె తలఁపుము.

ఓ వాలీ! పూర్వకాలమున మనువు సదాచారబోధకములైన రెండుశ్లోకములను జెప్పియున్నాఁడు. ధర్మశాస్త్రపండితులైనవారు గూడ వానిని గ్రహించియున్నారు. నేను నట్లె యాచరించితిని. మీన వులు పాపములొనర్చి, రాజులచేఁ దమపాపములకుఁ దగిన శిక్షలను బొందినవారలై, పాపములనుండి విడువఁబడి పుణ్యాత్ములగు సజ్జనుల

మాడ్కి స్వర్గమునొందుదురు. దొంగలు రాజులచే విమర్శింపఁబడి శిక్షితులై కాని, తప్పులేలనిపట్టుమున విడువఁబడినవారలై కాని, దొంగ తన మనెడి పాపమునుండి విడువఁబడుదురు. అట్లుకాక రాజులు దోషులను విచారింపకయె యుందురేని, యా దొంగతనమువలని పాపమును దామే పొందుదురు. తొల్లి యొకప్పుడు మా పెద్దలలో నొక్కఁడగు పూజ్యుడయిన మాంధాతకాలమున నొక నీచుఁడు నీవలెఁ బాప మొనరింపఁగా, నా మాంధాతయు నా నీచుని క్రౌఁగుననే క్రూర దండనము విధించెను. ఓ వాలీ! నీవును, ఆ నీచుఁడును మాత్రమే కాదు, ఎందఱో మదించి పాపములను జేసియేయున్నారు. రాజులు ఆ పాపముల నొనరించినవారిని విచారించి, వారికి దండనరూపమైన ప్రాయశ్చిత్తములను జేసియున్నారు. వారి కా పాపములట్లే తీణించు చున్నవి. వానరశార్దూలా! నీవగపు మానుము. న్యాయ్యముగానే నీవధము చేయఁబడినదిగాని మేము మా యిచ్చచొప్పుననే నడచి యీ కార్యము చేసినవారముగాము. వానరశ్రేష్ఠా! నీవధమునకు మానవ ధర్మము లనుసరించి యింతవఱకుఁ గారణము చెప్పితిని. ఇఁక నీ వానర ధర్మమునసరించి మఱియొక్క కారణముగూడఁ జెప్పెద నాలకింపుము. దృష్టాంతపూర్వకముగాఁ జెప్పిన యీ కారణమును వింటివేని నీవు నాపై నాగ్రహమునొందవు. హరిశ్రేష్ఠుఁడా! నేను నిన్ను మఱుఁగుననుండి చంపినందుకై నీవు నన్ను నిందించితివని నాకు మనోదుఃఖము లేదు. కోపమును లేదు. రాజులు మఱుఁగుననుండియు, కనఁబడుచునుండియు, వలలొడ్డియు, త్రాళ్లుగట్టియు, మఱి యనేకవిధములైన మాయోపాయ ములచేఁ బెక్కుమృగములను వేఁటాడుదురు. మాంసాపేక్షగల మాన వులు పరుగెత్తువానిని గాని, మిక్కిలి తత్తరపాటునొందినవానిని గాని, నమ్మినవానినిగాని, నిలఁబడియున్న వానినిగాని, యేమఱుపాటు నందిన వానినిగాని, మెలఁకువతోనున్న వానినిగాని, పెడమోము వెట్టిన వానిని కాని యొట్టివానినైన మృగములను వేఁటాడుదురు. దీన దోషము లేదు. ధర్మవిశారదులగు రాజర్షులును వేఁటకుఁబోవుదురు. వాలీ! నీవు కొమ్మ లందుఁ దిరుగు మృగమవుగావున నీవు నాతో యుద్ధముసేసినను, చేయ కున్నను నిన్ను మృగమను హేతువుచేఁ జంపితిని. దీనియం దేమియు దోషము లేదు. వానరశ్రేష్ఠా! రాజులు పొందరానివస్తువులను, ధర్మ

మును, ప్రాణమును, మేలును నొసఁగువారలు. దీనికే సంశయమును లేదు. దేవతలే మనుష్యస్వరూపముతో దుష్టనిగ్రహ శిష్టపరిపాలనము లకై యీ భూమండలమునఁ దిరుగుచున్నారు కావున వారిని హింసింపఁ జనదు; తిట్టఁజనదు; ఆక్షేపింపరాదు. ఇంపుగాని పలుకులు మాటాడ రాదు. నేను మాతాతముత్తాతల పద్ధతిచొప్పున నడచికొంటిని. అట్టి నన్ను, నీవు ధర్మస్వరూపము నెఱుఁగక రోషమునమాత్ర మే పూనిన వాఁడవై నన్నుఁ బలుతెఱఁగుల దూషించుచున్నావు" అని రాముఁడు వాలికి సమాధానంబుఁజెప్పెను.

రాముఁ డిత్తెఱఁగునఁ జెప్పగా, వాలి, యేల రామునిఁదెలియక దూషించితినని మనమున మిక్కిలి నొచ్చినవాఁడై, ధర్మవిషయమునఁ దనమనమునఁ జొప్పించి, జేసినది చెడ్డదేయనియు, రామునియెడ దోషమే మాత్రము లేదనియు నెఱిఁగి, యంజలిబద్ధుఁడై రామునిఁగూర్చి యిట్లనియె: "ఓ నరోత్తమా! నీవు చెప్పినదియెల్ల నిక్కము. దానియందేమియు సందియము లేదు. నాబోటి నీచుఁడు తమబోటి గొప్పవారడిగిన వాక్యములకు బదులుసెప్పఁజాలఁడు. ఓ రాఘవా! నే నింతకుముందు తెలియక తమకప్రియములగు శాస్త్రవిరుద్ధములైన మాట లాడితిని. వానిని మన్నించి, నాయెడ నాగ్రహము నొందకుండఁ గోరెదను. ఓ రామా! నీవు నీతిశాస్త్రరహస్యములెల్ల నెఱిఁగినవాఁడవు. జనులకు మేలొనఁగూర్చుటయందు శ్రద్ధగలవాఁడవు. కార్యమును (శిక్షను), తత్కారణమును (తప్పిదమును) దెలిసికొనుటయందు నీబుద్ధి మిక్కిలి తేటయైనది. చెదరనిది. కావున నీవు నన్నుఁజంపుట యుక్తమేకాని యన్యముకాదు; ధర్మసూక్ష్ములఁ నెఱిఁగిన యో రామా! ధర్మమార్గమును మీఱిన వాఁడను, అధర్మముఁజేసినవాఁడను నైన నన్ను మన్నించి, ధర్మమార్గమును దెల్పునట్టి మాటల నుడివి నన్నుఁ గడతేర్పుము. నేను జచ్చిపోవుచున్నానే యని నాకు వ్యసనము లేదు. తారనుగూర్చియు, చుట్టాలను గూర్చియు వ్యసనము లేదు. సద్గుణములుగలవాఁడును, బంగరుబాహుపురులు గలవాఁడును నైన నా పుత్రుఁడగు నంగదుని దలఁచుకొన్నమాత్రముననే వ్యసనమున మునుఁగుచున్నాఁడను. నేను వానిని బాల్యమునుండి బుజ్జగించితిని. కావున వాఁడు నా మరణముచే దీనుఁడై, సూర్యుఁడు పానముచేయుటచే

నీరెండిపోయిన చెఱువుమాడ్కి నెండిపోవఁగలఁడు. బాలుఁడును, తెలివిచాలనివాఁడును, ఏకపుత్రుఁడును, మహాబలవంతుఁడును, నాకుఁ గడుఁ బ్రియుఁడునునైన యా యంగదుని నీవే కాపాడవలయును. నీవు దుష్టశిక్షకుఁడవు; శిష్టపరిపాలకుఁడవు. కార్యాకార్యముల విమర్శించుటయందు నేర్పరివి. కావున, నీవు సుగ్రీవాంగదులను సమానముగాఁ జూచుకొనుము. నృపాలా! భరతలక్ష్మణులయం దెట్టితలంపు పెట్టియున్నావో, అట్టి తలంపే సుగ్రీవాంగదులయందు నుంచవలయును. తార తానుగా సుగ్రీవుని కెట్టియపరాధము సేయనిదైనను, నేను సుగ్రీవునికిఁ గీడొనర్చుటచేఁ దానును గీడొనర్చినదగును. కావున సుగ్రీవుఁ డాకంటుపెట్టుకొని తార నెంతమాత్ర మవమానింపకుండునట్లు నీవు చేయవలయును. నీ యనుగ్రహముపడసి; నీ వశేమునందుండి నీమనసు ననుసరించి నడచుకొనువాఁడు రాజ్యము నొందఁగలఁడు? భూమండలమేలఁగలఁడు. వేయేల? స్వర్గమునుగూడ నాక్రమించుకొనఁగలఁడు. నీమూలమున మరణమునొందఁగోరియే, తార వలదని నివారించుచున్నను, తమ్ముఁడగు సుగ్రీవునితోడ ద్వంద్వయుద్ధమునకు వచ్చితిని" అని వానరాధిపుఁడగు వాలి వినయముతో చెప్పి యూరకుండెను.

రాముఁడు, మోహాముంబాసి చక్కని తెలివితోఁ గూడియున్న వాలిని ధర్మసూక్ష్మముల యర్థము తేటపడునట్లు తిన్ననిపలుకులతో సమాధానపఱుఁదొడఁగెను; "ఓ వాలీ! నీ విందుకై సంతాపము నొందవలదు. మే మంగదాదులవిషయమున నెట్లు నడచుకొందుమో యనికాని, నే నెట్లు చేయరానిపనులను జేసితినో యనికాని విచారము నొందవలదు. మేము నీకంటె ధర్మమునందు విశేషానుభవము గలవారము గావున నీవొనర్చిన మహాపాతకమునకుఁ దగిన దండనము విధించుటచే నీ పాపములెల్లఁ దొలఁగెనని తలఁచెదము. ఏ నృపాలుఁడు దండింపఁదగినవారిని దండించుచున్నాఁడో, తప్పుచేసిన యే వాఁడు తన తప్పిదమునకుఁ దగినశిక్షను బొందుచున్నాఁడో, వా రిరువురును దమ పాపములు నశించినవారయి కృతార్థులగుచున్నారు. కావున నీవు శిక్షాస్మృతియందుఁ జెప్పినతీరున శిక్షను బొందితివి గనుక, నీపాపమునుండి తొలఁగినవాఁడవై, యెప్పటియట్ల ధర్మస్వభావమును బొందితివి. వానరేంద్రా! నీ మనసునందలి శోకమును, మోహమును, భయమును

వీడుము. విధినతిక్రమింప నేరికిని దరముగాదు గనుక నీవును విధ్యను సృతమైన యీ యవస్థను బొందితివి గావున దీనినిగూర్చి శోకము వీడుము. వానరాధిపా! యీ యంగదుఁడు నీయెడ నెట్లు భయభక్తులు గలిగియున్నాఁడో, అట్లే సుగ్రీవునియందును, నాయందును నుండును గాక! మేమును నీవలెనే వీనియందుఁ బుత్రవాత్సల్యము గలిగి యుందుము" అని రాముఁడు వాలితోఁ జెప్పెను. వాలి, ధర్మమార్గము ననుసరించువాఁడును, రణశూరుఁడును, మహోత్సుఁడునైన రాముఁడు నెమ్మదితో నింపుగులుకఁ జెప్పినమాటనువిని, రాముని నుద్దేశించి, "మహేంద్రుని కెనవచ్చువాఁడా! భీమపరాక్రమా! మహాప్రభూ! నరాధిపా! బాణమునాఁటుటచే నొచ్చి, మైమఱచి, తెలివిలేక నిన్నె న్నియో యనరానిమాటల నంటిని. నీవు నాయెడఁ గరుణించి, కోపము మాని తప్పులను మన్నింతువు గాక!" యని సవినయముగాఁ బలికెను.

19-వ సర్గము.

తార వాలిమరణమును విని వాలికడ కేతెంచుట

వానరమహారాజగు వాలి రాముని బాణముచేఁ గొట్టఁబడి క్రిందఁబరుండిన వాఁడై, రాముఁడు నకారణముగఁ జెప్పిన బదులు పలుకులు విని, యందులకుఁ బైన మాటఁజెప్పఁజాలనివాఁడై, సుగ్రీవుని చేత బాలతోను, చెట్లతోను మితిమీఱి దెబ్బలుతిని యుండుట చేతను, రామునిబాణము నాటుటచేతను మిక్కిలి బాధపడుచు, ప్రాణము పోవుసమయమున మూర్ఛనొందెను. అంతట వాలిభార్యయగు తార తన భర్తయగు వానరేంద్రుఁడైన వాలి రాముఁడు ప్రయోగించిన బాణముచే జమునివీటి కేగెనను కడుదారుణమైన యప్రియమగు మగని మరణవార్తవిన్నదై మిగుల నడలి పలుత్రోవలుగల పర్వతగుహా రూపమైన కిష్కింధసుండి కొడుకును దోడ్కొని వెడలెను. భయంకర పరాక్రమంబు గల యంగదుని యనుచరులగు వానరు లందఱు వింటిని జేతఁ దాల్చియున్న రాముని గని పాఱిపోయిరి. తమ గుంపుకాఁపును కోలుపోవుటచేత గుంపునుండి చెదరి పరుగెత్తుచున్న మృగముల మాడ్కిఁ గడువెఱపుతో నేతెంచుచున్న వానరుల నా తార చూచి, మిక్కిలి దుఃఖమునొంది, రాముని బాణములచే వెంబడింపఁబడుచు

న్నారో యనున ట్లారామునికి వెఱచి పఱతెంచుచున్న వానరులను సమీపించి, "ఓ వానరులారా! కట్టిడియగు సుగ్రీవుఁడు రాజ్యముఁ గోరి, రామునిచే వేగముగాఁబోవు క్రూరబాణములను ప్రయోగింపించి చంపినం జంపనిమ్ము. వానరసేనలకెల్ల నధిపుఁడగు వాలిని విడిచి యేల యిట్లు నీచులై తీరనివెఱపుతోఁ బరుగెత్తుచున్నారు" అని యడిగెను.

కోరిన రూపమెత్తఁగల యా వానరులందఱు వాలిపత్నియగు తారయడిగిన పలుకులను విని, సమయోచితముగను, స్పష్టముగను నిట్లని యాతారతోఁ బలికిరి.

"ఓ బ్రదికియున్న కొడుకుగలదానా! యెక్కడికిఁబోయెదవు? మఱి లుము. పుత్త్రుఁడగు నంగదునిఁ గాపాడుకొనుము. యముఁడు రాముని యవతారముతో వచ్చి వాలిం జంపి కొనిపోవుచున్నాఁడు. వాలి సుగ్రీవుఁడు ప్రయోగించిన వృక్షములను, గొప్ప శాతిబండలను నుగ్గుచేసి, వజ్రాయుధముఁబోలు బాణములతో రామునిచేఁ జంపఁబడెను. దేవేంద్రునిపరాక్రమముఁ బోలుపరాక్రమముగల వానరశ్రేష్ఠుఁడయిన వాలి వధింపఁబడఁగా కిష్కింధనుండి వచ్చిన యీ వానరబల మెల్లఁ జెదరి యిదిగో మఱలి కిష్కింధకుపాఱి వచ్చుచున్నది. పట్టణము వాకిళ్ళకడఁ గావలియుంచుము. అంగదునికిఁ బట్టాభిషేకము చేయుము. వాలి పుత్త్రుఁడగు నంగదునకుఁ బట్టాభిషేక మొనరించెదవేని, వానరు లెల్ల నతనికిఁ గొలుపుకాండ్రయియుందురు. ఓ చక్కనిమోముగలదానా! నీవు మేము చెప్పినచొప్పున నీవొనరింపవేని, యీ కిష్కింధలోపల సుండుటయె కష్టమగును. ఏలయనిన, నీశత్రువులగు వానరులితరదుర్గములను సైత మాక్రమింపఁగలరు. ఇచ్చటఁ గుటుంబులును, కుటుంబములేనివారునైన వానరులు వెక్కుండ్రున్నారు. వాలి వారినందఱిని వంచించి తఱుమఁగొట్టియున్నాఁడు. అట్లు తమభార్యలను బహుకాలము విడిచి యున్నవారును, వంచితులునయిన సుగ్రీవాదులగు దాయాదుల వలన మనకెక్కువ భయము గలుగును" అని వాలిసేనలు తారతోఁ జెప్పెను.

నీచబుద్ధిగల యా వానరు లాడినమాటలను విని, చిఱునవ్వు మోముగల యా తార తన గొప్పతనమునకుఁ దగినమాటల నిట్లనియె.

"ఓ పరిచరులారా! వానరాధిపుఁడును మహాసమర్థుండునునయిన నా పెనిమిటి పోయినపదంపడి నాకుఁ బుత్రునితో నేమి కావలెను? రాజ్యముతో నేమి కావలెను? వేయేల? ఈప్రాణము లెందుకు? రాముఁడు ప్రయోగించినబాణముచేఁ గ్రిందఁబడిన బలశాలియగు నా మగనిపాదములను జేరుకొందును" అని తార చెప్పి, వంతచేఁ గృశించినదై, యేడ్చుచు, చేతులతో నెత్తిని, ఱొమ్మును బాదుకొనుచు వాలికడకుఁ బరుగెత్తెను. అట్లు పరుగెత్తుచువచ్చి, పూర్వము యుద్ధమున నేరికి వెఱవని యసురేంద్రులను సంహరించినవాఁడును, దేవేంద్రుఁడు వజ్రాయుధమును బ్రయోగించునట్లు గొప్పపర్వతములను జిమ్మువాఁడును, పెనుగాలివేగమువంటి వేగముగలవాఁడును, గొప్ప మేఘములకూటముల ధ్వనింబోలు ధ్వనిగలవాఁడును, దేవేంద్రుని పరాక్రమముబోలు పరాక్రమముగలవాఁడును, వర్షించినిలిచిన మేఘమువలె శాంతుఁడైయున్నవాఁడును, గర్జించువారిలోపల భయంకరముగ గర్జించువాఁడును, శూరుఁడును, శూరుఁడయిన రాముని చేఁ వధింపంబడినవాఁడై, మాంసముగోరిన సింహముచేఁ జంపఁబడిన సింహమువలె నున్నవాఁడును, బలశౌర్యపరాక్రమాదులు గలిగియుండియుఁ దమ్మునిభార్యనపహరించిన దోషమునకై రాముని చే సంహరింపఁబడినవాఁడైనందున, జనులందఱిచేఁ బూజింపఁబడి, ఱెక్కెముతోఁగూడి తిన్నెచే వెలయుచున్నదైనను బాముతోఁ గూడియుండుటచే గరుత్మంతునిచేఁ బాదు చేయఁబడిన చైత్యమువలె నున్నవాఁడునై పుడమిఁగూలియున్న వాలిం జూచెను. వాలివెంబడి శ్రేష్ఠమయిన వింటినవలంబించి నిల్చియున్న రాముని, రాముని తమ్ముని లక్ష్మణుని, తనభర్తయొక్క తమ్ముని సుగ్రీవునిఁజూచెను. అంత వారి నందఱిని దాఁటి, యుద్ధరంగమున జచ్చిపడియున్న పెనిమిటిని జూచి, వ్యసనమును, తత్తఱపాటునుపొంది మూర్ఛిల్లి నేలపైఁబడెను. అంత మఱల నిద్రలేచినదానివలె లేచి "నాథా" యని యఱచి మృత్యుపాశముచేఁ గట్టఁబడియున్న భర్తనుజూచి విలపించెను. సుగ్రీవుడును గోరువంకపెట్టువలె నఱచుచున్న తారను, తారతోఁగూడ వచ్చిన యంగదునిఁజూచి, తానును వ్యసనమునొందెను.

20-వ సర్గము.

తార వాలింజూచి విలపించుట

రాముని వింటినుండి విడువఁబడినట్టిదియు, ప్రాణములఁ దీయునది యునైన బాణముచేఁ గొట్టఁబడి నేలఁగూలియున్న వాలినిజూచి, పున్నమ చంద్రునిబోలు మోముగల తార చేరువకేతెంచి పెనిమిటినిఁ గౌఁగిలించుకొనెను. అట్లు తార గౌఁగిలించుకొని లేచి, చింతచేఁ గలంగిన హృదయముతోఁ గూడినదై, బాణముచేఁగొట్టఁబడి మొదలుదెగిన చెట్టువలెఁ బడియున్న వాఁడును, ఏనుఁగునుబోలినవాఁడును, దేవేంద్రుని కెనవచ్చు పౌరుషముగలవాఁడును నైన తన ప్రియుఁడగు వాలింజూచి యిట్లేఁడ్చుచు విలపింపఁదొడఁగెను.

"రణమున శత్రువులకు భయంకరుఁడవును, బ్రతాపవంతుఁడవును, శూరుఁడవును నైన యో వానరేంద్రా! నీ మాట దాఁటనిదాననయిన నేను దుఃఖపరవశనై యిచ్చటికి వచ్చియుండ నీవు నాతోడ నేల మాటలాడకున్నావు? వానరశ్రేష్ఠుఁడా! లెమ్ము. మేటిపాన్పుమీఁదికి రము. ఇట్టి నృపశ్రేష్ఠు లిట్లేఁగున నుత్తనేలపైఁ బరుండుదురే? పుడమితల్లీఁడా! నీకు భూమిదేవి కడుఁబ్రియురాలని తోఁచుచున్నది. లేకున్న, నీవు ప్రాణములు పోయినను, నన్నుఁబాసి యీ భూకాంత నన్నియంగములు దగులునట్లు బిగి కౌఁగిటం జేర్చియున్నావుగదా! ధర్మమార్గమునఁ బుడమినేలునట్టి యో శూరుఁడా! నీవు స్వర్గమునకుఁ బోవుదారి నొక్కపురమును కిష్కింధనుబోలె సొగసైనదాని నేర్పఱచుకొంటివి కాఁబోలు! కాఁబట్టియే యీ కిష్కింధాపురము బాసిపోవుచున్నావు. ఇప్పపూల కమ్మనితావులు గల వనములందు వసంతాదిఋతువులందు మాతోఁగూడి యేయే విహారంబులు సల్పుచుంటివో, యవి యెల్ల నడఁగిపోయె. వానరాధిపులకెల్ల నధిపుఁడవగు నీవు మృతినొంద, నేను వంత యనుకడలియందు మునిఁగి, సంత సముదక్కఁ, కోర్కలెల్ల వీడితిని. ఓ నాథా! నాహృదయము నీమరణ వార్త వినియు, మృతినొందిన నిన్నుఁజూచియు, నంగలార్పుచేఁ గుంది, వేయిముక్కలుగఁ బగులకయున్నదిగా! అక్కటా! నాహృదయ మెంతటి కఠికిదనము గలది యనఁజెల్లును! వానరేంద్రా! నేను నీ

మేలుగోరి "యిప్పుడు నీవు సుగ్రీవునితోడి కయ్యమునకుఁ బోవల" దని యంటిని. నీవు మొఱకుదనముచే నామాట పెడచెవినిబెట్టి వచ్చి యిచ్చట నీగతి నొందితివి. శత్రువుల గర్వమణఁచునట్టి యో నాథా! రూపమునను, ప్రాయమునను మదించిన జాణలగు నచ్చరలతోఁగూడి, వారిమనముల స్వాధీనపఱచుకొనుదువు. నీకు మృత్యుకాలము సమీపించె. కావుననే యెవరికిలొంగని నీ విప్పు డీసుగ్రీవునికి లోఁబడి మృత్యువుపాలయితివి. నే నింతకుమున్ను దుఃఖ మన నెట్టిదో యెఱుఁగనిదానను. అట్టి నా కిప్పుడు వైధవ్యమును దుఃఖము సంప్రాప్తమాయె. ఈ దుఃఖమున మాడుచుఁ దిన్నదనముతోఁగూడి యనాథనై యెట్లు మనఁగలను? వానరాధిపా! నీవు సుగ్రీవునియాలిని గైకొని, వాని నడవులకుఁ దఱిమితివి. దానికి ఫల మిప్పు డనుభవించితివి. సుఖము లందఁదగినవాఁడును, శూరుఁడును, మెత్తనివాఁడునైన యంగదుఁడు మనకడ మిక్కిలి గారాబముతోఁ బెరుగుచుండెను. నీవైఁ గంటువెట్టియున్న సుగ్రీవుఁ డీ చిన్నకుఱ్ఱవాని నెట్టి యిడుమలం బెట్టునో? యేమిచేయునో?' అని తన నాథుంగూర్చి చింతించుచు, నడమ నడుమ కొడుకుంజూచి, "నాయనా! ధర్మమునందెఁ బ్రేమగలవాఁడ యిన నీ తండ్రిని బాగుగాఁ జూడుము. ఇఁక నీ కా నాయన మో సుగ పడుట యరుదుకాఁగలదుగదా!" అని కొడుకుంజీరి వెండియుఁ దన నాథునిఁ జూచి, "యోనాథా! నీ కొడుకునోదార్పము. శిరమున ముద్దాడి చెప్పవలసినమాట చెప్పుము. ఇఁక నీమాట లతనికి దొరకవుగదా! రాముఁడు నిన్నుఁ జంపి గొప్పపని చేసినవాఁడయ్యె. సుగ్రీవునికిఁ జేసిన వాగ్దత్తమునెఱపి ఋణమునుండి వీడినవాఁడయ్యెను"అనిచెప్పి, సుగ్రీవుం జూచి, "సుగ్రీవా! నీ శత్రువగు సోదరునిఁ జంపితివి. నీకోర్కి యీ డేఱె. ఇఁక నీ పత్నియగు రుమను బొంది, దిగులువిడిచి విచ్చల విడిగా రాజ్య మనుభవింపుము. వానరాధిపా! నేనింతగాఁ బలవించుచున్నను, నీవేల నాతోఁ బ్రేమమీఱ మాటాడకున్నావు? ఇచ్చట నే నొక్కతెనే కాక, పెక్కండ్రు చక్కని ప్రియకాంతలు వచ్చియున్నారు. వారి నెల్లరఁ జూడుము. బాహుపురులుదాల్చిన బాహువులుగల యో నాథా! యీ యంగదునిఁబాసి మఱలనిచోటికి బోవుచున్నాఁడ. పుత్రునెడఁ బ్రేమగలనాథా! ఇట్టి సకలగుణవిశిష్టుఁడైన కొడుకు నెడఁ

?!

బాసి పోవుట నీకుఁ దగునే? సొగసువేషముగల యో ప్రియనాథుఁడా! నేనుగాని, మన బిడ్డఁడుగాని యే యపరాధముజేసితిమి? వీరుఁడా! యట్టికారణము లేకున్న మమ్మిరువుర నెడఁబాసి, యెప్పటికి మఱలని తావునకుఁ బయనమైతివిగదా! నిడుదచేతులు గల వానరవంశాధి నాథుఁడా! నే నొక్కవేళఁ దెలియక యేదియైన నీ కిష్టముగానిపని కావించి యుందునేని దానిని మన్నింపుము. శూరుఁడా! యిదుగో నేను నీపాదంబులకు శిరముతో మ్రొక్కుచున్నదానను" అని తార విలపిం చెను. ఆతార విలాపమును చూచి, యచ్చటనున్న వానరాధినాథుని యంతిపురపుటతివలందఱు గూడి, దీనుఁడైన యంగదుని బుజ్జగించుచుఁ గడు శోకపీడితలై, పెల్లుగా రోదనముచేసిరి. అట్లు సౌందర్యవతియగు తార యితరకాంత లందఱితోఁగూడఁ దననాథునిచేరువ జాలిపుట్టున ట్లేడ్చుచుండి, యావలఁ దననాథుఁడు పడియున్న చోటఁ బ్రాయోపవే శము చేయ నిశ్చయించినదాయెను.

21-వ సర్గము.

తార ప్రాయోపవేశమునకుఁ బూనుట

అంత, వానరశ్రేష్ఠుఁడయిన హనుమంతుఁడు పుడమినిబడి, యాకాశము నుండి క్రిందఁబడిన చుక్కవలెనున్న తార నిత్తెఱంగున నూరడింపఁ దొడఁగె. "ప్రాణులందఱు వారువారొనర్చు మంచిచెడ్డ పనుల కనురూపములైన సుఖదుఃఖములను బొందుదురుగావున నొక్క రింగూర్చి మఱియొక్కరు చింతించుటచే నుపయోగములేదు. ఈ దేహము నీటిబుగ్గవంటిది. ఇప్పటికున్నది మఱికొంతసేపటికి లేదు. ఇట్టి శరీరము ధరించిన జాలినొందఁదగిన నీవు వాలిఁగూర్చి జాలి నొందెదవు. దీనవైన నీవు దీనుఁడైన యెవనినిగూర్చి విచారపడెదవు? ఈనశ్వరదేహ మున నెవ్వడెవ్వనికిఁగాను విచారపడవలయును. నీవు జీవపుత్రికవు. కాఁ బట్టి నీపుత్రుఁడగు నంగదుని యోగక్షేమము లరయుచు నతనిమేలునకై చేయవలసిన కార్యములనుగూర్చి విచారించి చేయుచుండుము. నీకుఁ బుత్రుఁడున్నాడు గావున నీకు సహగమనము సేయ నవసరము లేదు. జీవరాసుల రాకపోకలు నిత్యము కాదని నీకుఁ దెలియును. కావున మృతజీవికి శుభమునుగలిగించు పారలౌకికక్రియలు చేయింపవలెను.

రోదనాదికర్మములు పనికిరావు. ఏవాలి జీవించియుండఁగా, వేలసంఖ్యకు మించిన వానరులందఱు తమతమపాళ్లు పంచుకొని జీవనము సేయుచుండిరో, యట్టి వాలి మృతినొందెను. ఈ వాలి న్యాయమునం దాసక్తి గలవాఁడై, సామము, దానము, క్షేమమును ముఖ్యముగాఁగలవాఁడై, న్యాయమార్గమున వచ్చినపుడమిం బాలించుచుండి, యాయువుదీఱుటం జేసి, పరలోకమునకుఁ బోయెను. నీ వాతనిఁగూర్చి చింతించుటతగదు. ఓ యనిందితురాలా! వానరశ్రేష్ఠులందఱును, ఈ నీ పుత్రుఁడగు నంగదుఁడును, ఈ వానరరాజ్యమును నీ యధీనమయ్యె. నీవె దీనినెల్ల భరింపవలయును. ఓ భామినీ! యిఁక శోకసంతాపములు వీడుము. నీ పోషణము నందినవాఁడై యంగదుఁడు రాజ్యపరిపాలనముఁ గావించుఁగాక. పుత్రులుగలిగినందుల కేమియుపయోగమో, ఏది ప్రకృతము చేయఁదగినపనియో, యట్టి పితృకార్యము వాలికి నంగదునిచేఁ జేయింపుము. అదియె యిప్పుడు చేయవలసినపని. వాలికి సంస్కారము చేయింపుము. అంగదునికిఁ బట్టముగట్టుము. నీకుమారుఁడు సింహాసనమెక్కఁగా నీవు చూచితివేని, యీ దుఃఖము గొంత యుపశమింపఁగలదు" అని హనుమంతుండు తారతోఁ జెప్పెను.

పెనిమిటి మరణశోకముచేఁ జిక్కియున్న తారయు నా హనుమంతుని మాట విని, తనయెదుట నిలిచియున్న యా హనుమంతునిఁ గూర్చి యిట్లనియె. "ఓ హనుమంతుఁడా! అంగదుంబోలిన నూఱువుర పుత్రులు గల్గియుండుటకంటె మృతుఁడయినను శూరుఁడయిన యా వాలిని గౌఁగిలించుకొనుటయె మేలు, వానరశ్రేష్ఠుఁడయిన వాలి కుత్తర క్రియలు సలుపుటకుఁగాని, యీ యంగదునికిఁ బట్టాభిషేకము సేయుటకుఁగాని నేను జాలినదాననుగాను. ఆ యంగదునికి సుగ్రీవుఁడు పిన తండ్రి. ఆతఁడే యిఁకమీఁద జరుగు కార్యములెల్ల జరిపింపవలసిన వాఁడు. వానరోత్తముఁడవగు హనుమంతుఁడా! యంగదునిఁగూర్చి తండ్రికిఁబిదపఁ దల్లియె కొడుకుయొక్క క్షేమలాభములను విచారించు కొనవలయునని చెప్పితివి. అది సరియైన యుద్దేశముగాదు. కొడుకునకు బంధువు తండ్రిగాని తల్లిగాదు కావున, తండ్రితో సమానుఁడయిన పినతండ్రియైన సుగ్రీవుఁడే యన్నిసంగతులను విచారించుకొనును. ఓ హనుమానుఁడా! నాకు వానరవీరుఁడగు వాలిని గౌఁగిలించుటకంటె

నిహాపరములందు రెంటియందుమించినది వేఱు లేదు. నాయెదుటఁ జచ్చి యున్న శూరుఁడైనవాలి పరుండియున్న యీ పాన్పునొందుటయే నాకు యుక్తము, దానికంటె వేఱొకటి నాకుఁ గావలసినది లేదు." అని తార హనుమంతునితోఁ జెప్పెను.

22-వ సర్గము.

వాలి సుగ్రీవుని కంగదు నప్పగించుట

71 కొనయూపిరితోనున్న యా వాలి మెల్లగా నిట్టూర్పు విడుచుచు నంతటఁ జూచుచుఁ దనకొడుకు నంగదునిఁ గనుఁగొనుటకు ముందే సుగ్రీవునిఁ జూచెను. అట్లు చూచి, వానరేంద్రుఁడగు వాలియు గెల్పు నొందిన యా సుగ్రీవునిఁ బిలిచి, ప్రేమమీఱిన పలుకులతో నతని కిట్లనియె.

ఓరి సుగ్రీవుఁడా! నిన్ను రాజ్యమునుండి తఱుముటచే, నీభార్యను లాగికొనుటచే నేను పాపకార్యము జేసితినని నాయెడ దోషముఁ దలంపకుము. నావిధి నాచే నట్టి దుష్కార్యములం జేయించెను కాని, నేను బుద్ధిపూర్వకముగాఁ జేసినవికావు. నాయనా! మన మిరువురము నొక్కఁ టెసమయమునఁ దోఁబుట్టుదనమువలని ప్రేమయు, రాజ్యసౌఖ్యమును గలిగియుండునట్లు విధి లిఖింపఁడయ్యె. కావుననే మనకిట్టి వైరము గలిగె. ఆ దైవవిధానముఁ దప్పింప నెవ్వనికైనఁ దరమా? కాదు. ఈ వానర రాజ్యము నిప్పుడే చేపట్టుము. నే నిప్పుడు జమునివీటి కేగుచున్నాను. నా ప్రాణములనే కాక, యీ రాజ్యమును, విస్తారమయిన యీ కలిమిని, ఒచ్చెములేని గొప్పకీర్తిని నేఁ నిదిగో విడుచుచున్నాను. వానరరాజా! యిట్టి వేళయందు నేఁ జెప్పుమాట నీకు సులభముగాఁ జేయఁదగినది కాకయున్నను, దానిని జేయఁగోరెదను. ఈ యంగదుఁడు సుఖము లనుభవింపఁ దగినవాఁడు, గారాబముతోఁ బెరిగినవాఁడు, పసివాఁడు, తెలివికాఁడు. వీఁడు కన్నులనిండఁ గన్నీరు పెట్టుకొని యెట్లు నేలకుఁ గఱచుకొనియున్నాఁడు చూడు! వీనిని నీ ప్రాణములకంటెఁ గడుఁ బ్రియునిఁగాఁ జూచుకొందువుగాక! నేను లేకపోయినను, వానికిఁ గావలసినవి యెల్ల నొసంగి, కాపాడుచుండుము. వానరాధిపా! నావలె నీవే యీ పిల్లవాని కన్నిటి నియ్యవలయును. అన్ని దెసల రక్షింపవల

యును. భయపడవలసిన తరుణములం దభయమొసఁగవలయును. నీవు తక్కినిఁక వీనిని గాపాడువాఁ డెవ్వఁడున్నాఁడు? ఈ తారకొడుకు కాంతిగలవాఁడు; నీతోసాటి యగు పరాక్రమముగలవాఁడు. రాక్షస సంహారసమయమున నీ కితఁడు ముందట వచ్చి నిలువఁగలవాఁడు; బలిమిగలవాఁడు, ప్రాయపువాఁడు, చేవకాఁడునైన తార కొడుకగు నీ యంగదుఁడు సమరమునఁ దనపరాక్రమము చూపి, తన బల్మికిఁ దగిన పనులను జేయఁగలఁడు. ఈ సుషేణునికూఁతురగు తార పను లందలి చిక్కులను విడఁదీసి నిర్ధారణచేయుటయందును, రాఁబోవు నాపదలను దెలుపుటయందును గడు నేర్పుకత్తె; ఈపె యేకార్యము సరియని చెప్పునో, అది నిశ్చయముగా నట్టిదే యగును. తార యొక్క యభిప్రాయ మొక్కటియు విరుద్ధముగా నడవదు. నీవు రాముని కార్యము నిస్సంశయముగాఁజేసి తీరవలయును. చేయనిచోఁ బాపము గలుగును. అంతియకాక రాముఁడు తనమాట వినక తన్నవ మానించినందుకై యలిగి, నిన్ను సంహరింపనువచ్చును. సుగ్రీవా! నాకు దేవేంద్రుఁ డొసఁగిన యీబంగారుదండను దాల్పుము. ఈ మాలయం దెక్కువకాంతి యున్నది. నేను మృతినొందుదునేని, యీ పసిఁడిమాల కాంతిలేనిదగును."

ఇట్లు వాలి సోదరునియందలిప్రేమతోఁ జెప్పఁగా, సుగ్రీవుఁడు విని, సంతసముమీఱి, జాలినొంది, రాహువుచే మ్రింగఁబడినచంద్రుని మాడ్కిఁ బ్రకాశమ్ములేకయుండెను. అట్లు సుగ్రీవుఁడు విన్నదనంబు నొంది, యుక్తమైన యీ వాలిమాట ప్రకారము నడువనియ్యకొని, పరాకుమాని యన్న యానతిగొని, బంగారుమాలను గైకొనెను.

ఆవాలి యట్లు పసిఁడిదండను తమ్మునికొసఁగి, మరణమునకు సిద్ధుఁడై, స్నేహముమీఱఁ దన యెదుట నిలిచిన యంగదునిఁజూచి, "నాయనా! నావియోగము నోర్చుకొని, దేశకాలములనెఱిఁగి, ప్రియా ప్రియములకును, కష్టసుఖములకు నోర్చుకొని, సుగ్రీవుని మాట చొప్పున నడచుకొనుచుండుము. నిడుదచేతులవాఁడా! నీవు నాయెడ నే ప్రకారముంటివో, యట్లు నీ పినతండ్రికడను భయభక్తులతో నడచు కొనుచుంటివేని, యతఁడు నావలెనే నిన్నుఁ బ్రేమతోఁ జూచుకొను చుండఁగలఁడు. శత్రుసంహారీ! యీ సుగ్రీవుని పగతురతోడను, వారి

మిత్రులతోడను జేరకుము. వారితో మంతనము లాడకుము. ఓర్పు గలిగి, యజమానుని కార్యములందు జాగరూకుఁడవై సుగ్రీవుని యిష్టముచొప్పున నడచుకొనుచుండుము. ఎక్కువ చెలిమిగలిగి యుండుటయు, చెలిమి లేకుండుటయు నను నీరెండును గొప్పదోషములే కావున సామాన్యస్థితి నవలంబింపుము." అని చెప్పి, గ్రుడ్లు తేలవైచి, బాణముయొక్క వేదనకుఁ గడునొచ్చి, భీకరములయిన పండ్లు వెలికగు పడ నోరుతెఱచి ప్రాణము వదలినవాఁ డయ్యెను.

అంతట నచ్చటనున్న వానరశ్రేష్ఠులందఱు నిర్జీవుఁడయిన వాలిని జుట్టుకొని, "వానరులకెల్ల దొరయగువాలి మృతినొందఁగా, కిష్కింధా పురము పాడయ్యె. తోఁటలు, పర్వతములు, వనములును సొంపు దఱిగినవయ్యె. వానరశ్రేష్ఠుఁడయిన వాలి చావఁగా వానరు లందఱు కాంతిదఱిగినవారయిరి. ఏవాలి వేగముతోఁ బరుగెత్తునప్పుడు, అతని వేగమునకు, అడవులు తోఁటలును పూవులతో వెంబడించినవో, అట్టి కార్యము నిప్పు డే వాఁడు చేయఁగలఁడు? తొల్లి యొకప్పు డేవాలి బలశాలియగు గోలభుండను గంధర్వునితోఁ బదునైదు సంవత్సరములు రేయింబగళ్ళును నిలువక యుద్ధముచేసి, దుష్టుఁడయిన యాగోలభునిఁ బదునాఱవయేట సంహరించి, మాకెల్ల నభయమొసఁగెనో, అట్టి గొప్ప కోరలుగల యావాలి యెట్లు సమరమున మడిసెనో!" అని విలపించిన వారలై, సింగముతోఁగూడిన కొఱడవియుం దాఁబోతును గోలు పోయినవై యరణ్యమునఁ దిరుగుపసులమాడ్కి వానరేంద్రుఁడయిన వాలిం గోలుపోయిన వానరులెల్ల సుఖమునొందరైరి. అంతఁ దారయు వ్యసనసాగరమున మునిఁగినదై, మృతుఁడైన తన పెనిమిటిమోముం జూచి, చెట్టు నఱుకఁబడినవెంటనే, దానితోఁగూడఁ జుట్టుకొన్న తీగెయు నేలఁబడునట్లు, వాలింగౌఁగిలించి నేలఁబడెను.

23-వ సర్గము

తార వాలింగూర్చి విలపించుట

అంత తార యట్లు నేలఁబడి, వానరేంద్రుని మోమును ముద్దాడి, మృతుండై లోకాంతరమునొందిన వాలింగూర్చి యిత్తెఱఁగున విల పించెను. "ఓ నాథా! నేను నీతో యుద్ధమున కిప్పుడు పోవలదని చెప్పి

తిని. నామాట వినకయిచ్చట వచ్చి మడిసి, మిట్టపల్లములుగలిగి, చదును గాక మొలతోఁగూడి యోర్వఁగూడని యీ కటికి నేలపై బరుండి యున్నాఁడవు. వానరశ్రేష్ఠా! నీకు నాకంటెఁ బుడమిదేవి పయి నెక్కుడు ప్రేమముడిగలయట్లు తోఁచుచున్నది. కావుననే నీవీ భూమింగౌఁగిలించు కొని, నాతో మాటలాడక పరుండియున్నావు. శూరుఁడా! సాహసము గలవాఁడా! కాంతుఁడా! యిట్టి నీవు సుగ్రీవునివశమయి పోయితివి కదా! సుగ్రీవుఁడే బలవంతుఁడయ్యె. ఆహా! దైవమాయ యిట్టిదే! బలిమికలవాఁడు తక్కువవానికి లోఁబడుట విధిబలముచేతనే కదా! వానరముఖ్యులు, ముఖశ్రేష్ఠులు బలవంతుఁడవైన నిన్నుఁ గొల్చు చున్నారు. ఈ వానరవీరులయొక్కయు, దుఃఖితుఁడయిన యంగదుని యొక్కయు ప్రలాపమును వ్యసనపడుచుండు నంగదునియొక్కయు, నాయొక్కయు మాటలను విని యేల బదులు చెప్పకున్నావు? ఓ శూరుఁడా! నీవు తొల్లి శత్రువులఁ బరిమార్చియే వీరశయనమునఁ బరుండఁ బెట్టితివో, నీ విప్పుడు పోర నీల్గి యే వీరశయనమునఁ బరుండి యున్నావో? ఇదియకా యా వీరశయనము. ఒచ్చెములేని బలిమియు, సత్కులమును గలవాఁడా! యుద్ధమునందాస క్తిగలవాఁడా! పగతుర గర్వమడఁచువాఁడా! నాప్రియా! అనాథను నన్నొంటరిగా విడిచి, నీ వేగితివిగదా! వివేకి తనకూఁతు నెప్పటికిని శూరునకియ్యఁరాదు. నేను శూరుని పెండ్లామయి, నిర్భాగ్యురాలనై విధవనయితిని చూడుము. నా పొంగు కుంగె; నాశాశ్వతగతి త్రుంగివోయె. అగాధమయిన గొప్పదుఃఖసముద్రమున మునిఁగిపోయితిని. నాథునిఁ బోఁగొట్టుకొనియు నా హృదయము నూఱు వ్రయ్యలు గాకయున్నది గాన నిక్కముగా, ఈ నా హృదయ ముక్కుతోఁ జేయఁబడినదియు, ఉరిదియయినదియు నని తలఁచెదను. నాకు నెచ్చెలియు, మగఁడును, బిడ్డఁడును, బంధమునఁ బరుల నాక్రమించు మొనకాఁడును నైన వాలి మరణమునొందె.

మగువ మగండులేనిదగునేని, పెక్కు [illegible] నుండినను, కలిమి పెంపు గలదిగానుండినను, దానిని లోకులు విధవ యని యందురు. తక్కిన వెన్నియున్నను, ఆపేరు రాకపోదు. ఈ జన్మ మింక నాకేల? వీరుఁడా! లక్కవంటి రంగుగల బట్టవఱచిన ప్రాపువ్రేఁ బరుండినట్లు, నీవు స్వకీయదేహమునుండి వెలువడిన శక్తప్రవాహము

V.R. NELLORE LIBRARY ACC. No.

నందుఁ బరుండియున్నాఁడవుగదా! వానరోత్తమా! నీ దేహము రక్తము చేతఁ దడిసియుండుటంజేసి, నేను నాచేతులతో గట్టిగాఁ గౌఁగిలింప లేనట్లు, చేతులు జాఱుచున్నవి. వాలిసుగ్రీవులు బద్ధవైరులైయుండఁగా, రాముఁ డొక్కబాణమేసి వాలిని సంహరించుటచే, సుగ్రీవుని భయముదీఱెను. సుగ్రీవుఁడు పనినెఱవేర్చుకొన్నవాఁ డయ్యెను. ఓ వాలీ! నీవు మృతినొందినపిదప నిన్నొకతడవయైనను గౌఁగిలించు కొందుననిన నీ హృదయమున నాటినబాణమ్ము నాకెడమీయకున్నది. కావున నిన్నొఱక చూచుచుండవలసినదానన్నై యున్నాను" అని తార పెక్కువగల వగలంబొగిలినదాయెను.

అప్పుడు నీలుఁడు, కొండగవియందు దాఁగియున్న విషముగల పామును లాఁగినట్లు లావాలిహృదయమున నాటియున్న యమ్మును లాగెను. ఆవాలి ఱొమ్మునుండి తీయుచున్న యా యమ్ముడాలు సంజ వేళయందలి కెంజాయగల క్రుంకుమొట్టునందుఁ దాఁకుపగటియెకివీని డాలుచందమునఁ జూపట్టుచుండెను. ధరాధరమునందలి పలురంగులు గల కావిరాళ్ళనుండి వెలువడు నీటిధారలవలె నా వాలియొడలి గాయ ములనుండి నెత్తుటిధారలు వెలువడెను. అప్పుడు తారయు దుమ్ముతో మేనెల్లనిండి బాణపుదెబ్బలచే నిర్జీవుఁడైయున్న తనమగనియొడలి దుమ్మును ధ్రోయఁగోరినదై, తనకండ్లనుండి కాఱుకన్నీటిచేఁ దడిపిన దాయెను.

అట్లు తార కన్నీరు కాఱించి, నెత్తుటిచే మేనెల్లఁ దడిసిన తన పతింజూచి, పచ్చని కన్నులుగల తన ముద్దులకొడుకగు నంగదుం బిలిచి, ఓరీ కొడుకా! నీతండ్రి పడునట్టి కడపటియవస్థను జూడుము. ఈ ఘోరకృత్యముచే నీ వాలిసుగ్రీవుల వైరమడఁగెను. లేతసూర్యుని పగిది వెలుఁగువాఁడును, జమునివీటి కేగుచుండువాఁడును, శత్రువుల గర్వ మడఁచువాఁడునునైన వానరేంద్రుఁడగు తండ్రికి నమస్కరిం పుము" అని యంగదునితోఁ జెప్పెను. వెంటనే యంగదుఁడు లేచి, "నే నంగదుఁడను" అనిచెప్పుచు, బలిసిన గుండ్రనిచేతులతోఁ దన తండ్రిపాదములఁ బట్టెను.

అప్పుడు తార వెండియుఁ దన భర్తంగూర్చి, "ఓ నాథా! నీ కొడుకంగదుఁడు మ్రొక్కుచున్నాఁడు. నీ వెప్పటివలె "పుత్రుఁడా!

చిరంజీవివి గమ్ము" అని దీవింపకయున్నావు. సింహముచేఁ జంపఁబడిన యెద్దును ఆవు దనదూడతోఁగూడఁ గొల్చునట్లు, నేనును బుత్రసమేతనై, రణనిహతుఁడవైన నిన్నుఁ గొల్చుచున్నాను. నాథా! యుద్ధమును జన్నమొనర్చి, రామబాణము లనెడు నీటియందు దీక్షాంత స్నానము భార్య నగునన్ను విడిచి యేల నేసితివి? అవభృథమునఁ బత్నిసమేతుఁడై స్నాన మొనర్పవలయునుగాదే! తొల్లి దేవేంద్రుఁడు నీయుద్ధచాతుర్యమునకు మెచ్చి యిచ్చిన పసిండిదండ నీమెడయందుఁ గనఁబడలేదు? అదెచ్చటఁబోయె? సౌఖ్యముల నొసఁగువాఁడా! మేరు పర్వతము నడుమనుండుటంజేసి, సూర్యుఁడస్తమించునప్పుడుగూడ సూర్యకిరణములు మేరుమహీధరమునుండి మఱలనట్లు, నిర్జివుఁడవైనను నిన్ను రాజకళ విడువకున్నది. నాథా! నేఁజెప్పిన యితవగు పలుకును వినవైతివి. నిన్ను నివారింపఁజాలనైతిని. నీవు యుద్ధమున సమసినన్నును, నా కొడుకును నన్యాయము నేసితివి. ఇప్పుడు నీవు నన్ను విడువఁగా, నా మోమునకళయుఁ దగ్గిపోయె" అని పెక్కు తెఱఁగుల వగలం బొగులుచుండెను.

24-వ సర్గము.

సుగ్రీవుఁడు వాలివధమునకై యనుతాపము నొందుట

అంత బలవంతుఁడగు సుగ్రీవుఁడును తార యాఁపరాని కన్నీటఁ దొప్పఁదోఁగి, దుఃఖ మను మహాసముద్రమున మునిఁగియుండుటను జూచి, తానును నపూర్వమైన తన యన్నయొక్క చావునకు మిగుల వగలఁబొగిలెను. అంత సుగ్రీవుఁడు కండ్లనిండుగఁ గన్నీరు పెట్టుకొని, మనమున వగపునొందుచుఁ బరిజనులం గూడి మెల్లగా రాముని చేరువకేతెంచి, వింటిని, సర్పముంబోలు బాణమును ధరించియున్న వాఁడును, పరాక్రమశాలియని పేరెన్నిక గన్న వాఁడును, సకలశుభలక్షణోపేతుఁడును నై నిలఁబడియున్న యారాముని తో నిట్లనియె.

"నరేంద్రా! నీ వెంతపని చేయుదువని చెప్పితివో, యంతపని నేసి నాకు రాజ్యము దొరకునట్లు చేసితివి. అయినను, రాజపుత్రా! నాకీ రాజ్యసుఖములందును, తుదకు నాప్రాణములందును మనసు విఱిగెను. రామా! యీ వాలియొక్క దేవేరి కడు విలపించుచుండ,

పగలంగూడి పట్టణ మెల్ల ఘూోషించుచుండఁగా, అన్నమడియగా, అంగదుఁడు దనకిఁక బ్రాపెవ్వరని మిణుకరించుచుండఁగా, నాకు రాజ్య సుఖములందు మనము దగులలేదు. ఇక్ష్వాకు వంశోద్భవా! మొదట వాలియెడఁగల కినుకవలనను, ఓర్వలేమివలనను, ఎక్కువ బాధ వలనను ఆవాలివధము చేయవలసినది యని యొప్పుకొంటిని. ఇప్పు డీ వానరయూథనాథుఁడు చావఁగా, నేనేల యింతటి దారుణ కృత్యము సేయించితినని పొరింబొరి మనమునఁ బొగులుచున్నాఁడను. వివరింపఁగా, నాకిప్పు డా పర్వతోత్తమమగు ఋశ్యమూకమున నెట్లో యొకతీరునఁ గాలముఁ బుచ్చుచు నుండుటయే మిగుల మంచిదిగా నున్నది. ఈ వాలిం జంపినంతట వచ్చు స్వర్గమైనను నా కక్కఱలేదు. మహాత్ముఁడును, బుద్ధిమంతుఁడునునైన వాలి నన్నుఁ దఱిమి "ఓ సుగ్రీవా! నేను నిన్నుఁ జంపుటలేదు. నీ విచ్చమైఁ దిరుగు"మని చెప్పెను. ఆ పలుకు లాతని గొప్పదనమునకును వివేకమునకును దగి యున్నవి. ఆ వాలివధరూపకార్యము నీచుఁడనైన నాకుఁ దగియున్నది. రాఘవా! ఆశ మనుకొని యుండుటచే రాజ్యమునకును, దుఃఖమున కును గల తారతమ్యమిట్టిదని యెఱుఁగక, మహాగుణవంతుఁడైన యన్న మరణమునకుఁ దమ్ముఁడైన నే నియ్యకొంటిని. లోకమున నెవ్వఁడయినఁ దమ్ముఁ డనువాఁ డిట్టి గొప్పవాఁ డగునన్నను జంపఁ గడఁగునే? నా యట్టిపాపి యీ పుడమిని మఱొక్కఁడు లేఁడు. వాలి తన గొప్పతన మును దాఁటనివాఁడగుటచే నన్నుఁ జంపవలె ననుతలంపు వాలికిఁగలుగ దయ్యె. నేను ద్రోహబుద్ధి గలవాఁడనైనందున నన్నయొక్క ప్రాణము లను గొనునంతపాపమున కొడిగట్టుకొంటిని. నేను మొదట యుద్ధము నకు వచ్చినప్పుడు వాలి నన్నొక ఱొమ్మను దీసి మోదెను. నే నామోదు తాళఁజాలక గిజగిజ తన్నుకొనుచుండఁగా, వాలి నన్ను బుజ్జగించి, "ఓరీ! యిఁక నిట్లు యుద్ధమునకు రాకుము" అని నాకు బుద్ధిచెప్పెను. ఈతఁడు తోఁబుట్టుదనమును, సజ్జనస్వభావమును, నడవడిని గాపా డెను. నే నన్ననో, కామమును, క్రోధమును, కోతిస్వభావమును జూపితిని. నరేంద్రా! తొల్లి దేవేంద్రుఁడు త్వష్టకొడు కగు విశ్వ రూపునిఁజంపి, మహాపాతకమును గట్టుకొన్నతీరున, నేనును అన్నను జంపి, యోచింపఁదగనిదియు, విడువఁదగినదియు, కోరఁదగినది గాని

డియు, చూడఁదగినది కానిడియునైన యీ పాపము నొడిఁగట్టుకొంటిని. నేనుజేసిన ద్రోహకార్యము నొక్కఁడు విన్నచో నన్నుఁ జూడఁడు, దగ్గఱఁజేర్పఁడు. నా సాహాయ్యముఁ గోరఁడు. తుదకుఁ దలయెత్తి నా మోమునైనను చూడఁడు. అక్కటా! నేనెంత ద్రోహినైతిని! ఆ యింద్రుఁడుచేసిన బ్రహ్మహత్యాపాతకమును భూమి, జలము, చెట్లు, స్త్రీలును గాపలెనని పంచుకొనిరి. ఆతఁడు గొప్పవాఁడు గనుక నతని పాతకము నవి పంచుకొనెనుగాని కోఁతినైన నే నొనర్చిన తోఁబుట్టువుం జంపిన పాపము నేవాఁడు పంచుకొనును? రాఘవా! నీతిమార్గముఁ దప్పినదియు, వంశనాశకరమైనదియు నయిన యింతటిపాపము నొనర్చిన నా కీ ప్రజలగారవమొండె యువరాజపదవియొండె, రాజ్యమొండె యొందుకు? సకలజననిందితమును నీచమును, లోకమున నొక్కరిచేతను జేయఁబడనిదియు నయిన యిట్టి పాపకృత్యమొనర్చితిని. ఈ గొప్ప వెతయె వర్షజలప్రవాహము పల్లమున కేగునట్లు నన్ను ముంచుచున్నది. తోఁబుట్టువుఁ జంపుట యను వెనుకటిమేనును, దోఁకయుఁగలదియు, వేడివియను తొండము, కన్ను, శిరస్సు, కొమ్ములుగలదియు, పాప రూపమయినదియు నయిన మదపుటేనుఁగే పారుచు నదిగట్టులను బడఁ ద్రోయునట్లు నన్నుఁ గ్రిందఁ ద్రోయుచున్నది. ఓ మానవాధినాథా! పుటముచేయఁబడిన వన్నెలేనిబంగారము మాలిన్యమునఁ వెలికిద్రోయు నట్లు నామనమునసుండు ధర్మవృత్తమును నీ పాపము నోర్వఁజాలక వెడలిపోవుచున్నది. రాఘవా! బలవంతులైన వానరశ్రేష్ఠులయొక్కయు, ఈ యంగదునియొక్కయు, బ్రాణములు నావలనఁ గలిగినవగపుచే సగముపోయినవని యెంచెదను. మంచిగుణములుగలవాఁడు, చెప్పిన మాట వినువాఁడునయిన కొడుకును బడయవచ్చునుగాని యంగదు నితో సమానుఁడగు కొడు కెక్కడ దొఱకును? మఱియు నే డేన మునకేగిన నాకుఁ దోడబుట్టువు దొరకగలఁడు. ఇవి రెండు నీ జన్మమున నాకిఁకలేవు. ఓ పూజ్యుఁడా! అంగదు డొక్కవేళ బ్రతికియుండునేని, వాని తల్లియగు తారయుఁ బుత్రరక్షణమునకై జీవించియుండును. అట్లుకాక యంగదుడు పితృవియోగముచే క్షీణించునేని తారయుఁ బుత్రశోకముచే జీవింపఁజాలదని నేను దృఢముగా నమ్మియున్నాఁడను. రాఘవా! నేను నాయన్నతోను, కొడుకుతోను జెలిమిగోరి, తీక్ష్ణముగ

మందుచున్న యగ్నిం బ్రవేశించెదను. ఈ వానరశ్రేష్ఠు లందఱు నీ మాటచొప్పున నడచుచు సీతను వెదకఁగలరు. రాజపుత్రా! నేను వశించి నను నీకార్యము తప్పక నెఱవేఱఁగలదు. నేను కులమునకుఁ జెఱుపఁ చేటయైనవాఁడను. నే నిఁక బుడమినుండుట సరిగాదు. నేను పాపాత్ముఁ డను. నా కగ్నిప్రవేశమునేయ ననుమతియొసఁగుము" అని యిట్లఁ గున వాలితమ్ముఁడగు నా సుగ్రీవుఁడు దీనముగాఁ బలుకఁగా, పగతుర జోదులం బరిమార్చు రాముఁడును కొండొకసేపు కండ్ల నీరు పెట్టుకొని విచారము నొందినవాఁ డయ్యెను.

భూమిదేవివలె నోర్పుగలవాఁడును, లోకపాలుఁడునయిన రాముఁ డప్పుడే విచారమునొంది, తనచాయఁ బలుమాఱుచూచుచు, వ్యసనసాగరమున మునిఁగినవై పలవించుచున్న తారను బూనికతోఁ జూచెను. అప్పుడు వానరయూథనాథుఁడయిన తనమగనిని గట్టిగాఁ గౌఁగిలించుకొని నేలమీఁదఁ బరుండియుండునదియు, గొప్ప గుణములు గలదియునయిన సొగసుకన్నులు గలదగు తారను మంత్రిశ్రేష్ఠులందఱు లేవఁదీసి కూర్చుండఁబెట్టిరి. ఆతార తనపెనిమిటిని గట్టిగాఁ గౌఁగిలించి కొని యున్నందున మంత్రులు రెండుచేతులసందులఁ జేతులుపట్టి యెత్తి నను, వారిచేతులనడుమనుండి యొడిసి పట్టు విడిలించుకొని క్రిందఁ బోరలుచు, బలాత్కారముగా వారిచే లేవనెత్తఁబడి, సూర్యుని మాడ్కిఁ దన వెలుఁగుచే మెఱయుచున్న ధనుర్బాణధారియైన రామునిఁ జూచెను. జింకపిల్లకన్నులంబోలు కన్నులుగలదియైన యా తార రాజ చిహ్నములతోఁ జక్కఁగా నొప్పినవాఁడును, సొంపుమీఱు కన్నులు గలవాఁడును, ఇంతకుమున్ను తనచేఁ జూడఁబడనివాఁడు నయిన రామునిఁజూచి "ఈతఁ డాకాకుత్స్థవంశోద్భవుఁడయిన రాముఁ"డని యెఱిఁగినదాయెను. సత్కులమున జన్మించిన యా తారయు మిక్కిలి దుఃఖమునొంది నొచ్చినవై సొలయుచుఁ గడువేగిరము వేల్పుఁజేని కెన యగువాఁడును, శత్రువులకు లొంగనివాఁడును, మహానుభావుఁడును నయిన రాముని సమీపమునకు వచ్చెను. నిర్మల స్వభావురాలగు నా తార తత్తరపాటొంది, ధైర్యముమీఱి, గొప్ప మనస్సుగలదై యుద్ధ రంగమున గుఱిచూచి యేయఁగల యా రామునిఁజేరి యిట్లనియె.

ఓ రాఘవా! నీ వప్రమేయుఁడవు; మూఢులకుఁ బొందరాని

వాఁడవు; ఇంద్రియాశ లెల్ల జయించినవాఁడవు; గొప్ప ధార్మికుఁడవు; తఱుఁగని కీర్తిగలవాఁడవు; వివేకివి; భూమివలె నోర్పుగలవాఁడవు; రక్తసదృశ నేత్రములుగలవాఁడవు; మహాబలశాలివి; దృఢాంగుఁడవు; ? ధనుర్బాణములను జేతఁ దాల్చినవాఁడవు. ఇట్టి నీవు మానుషదేహ బలంబును విడిచి దివ్యదేహబలము నొందితివి. ఓ రామా! నీ వేయొక్క బాణముతో వాలినిఁ జంపితివో, అట్లే యా యొక్క బాణముతో నొక్క పెట్టున నన్నును గూల్చుము. నీచేఁ జంపఁబడినదానన్నై, నేనును నా ప్రియునికడ కేగుదును. నన్నుఁబాసి నామగఁ డొక్కనిమిషమైన సుండఁజాలఁడు. తామరపూవుల తేకులంబోలు కన్నులుగల నామగండు స్వర్గమునకేగియు, పలుతెఱుంగులైన యెట్టని క్రొమ్ముడులుగలిగి, వింత గొల్పు వేషములఁదాల్చిన యచ్చరలందఱెంజూచియు, వారితోఁ గూడ టకు మనమున నిష్టపడఁడు. మనోహరమైన పర్వతంపు దరియందు నీవు ✓ సీతనుబాసి యెట్లు కుందుచున్నావో, ఆ చందముననే నా ప్రియుఁ డును ననుఁబాసి స్వర్గమునందు సైతము వ్యసనమును విన్నదనమును బొందఁగలఁడు. రామా! స్త్రీయంపుఁబురుషుఁడు స్త్రీ విరహాముచే వ్యసనమునొందునను విషయము నీకు స్వానుభవవేద్యమే కదా. వాస్తవము నెఱిఁగినవాఁడవుగాన నన్నుఁజంపుము. అట్లయినచో వాలి నన్నుఁ జూడకుండుటచేఁ గలుగువ్యసనము నొందకుండును. మానవాధిపకుమారా! "ఇది యాఁడుదికదా, ఆఁడుదాని వధించుట పాపము. ఆ పాపమునకేల నే నొడిగట్టుకోవలెనని తలంతువేమో! ఈ నా ప్రాణమును వాలిదేయని యెంచి నన్నుఁ బరిమార్పుము. నీకును స్త్రీవధపాతకము సంభవింపదు. ధర్మశాస్త్రవచనములు వేదము లనేకములును, "భార్య భర్తయొక్క యాత్మయేకాని వేఱుగాదు" అని చెప్పుచున్నవి. లోకమునఁ బత్నీదానమునకంటె గొప్పదానము వేఱొక్కటి లేదు. కావున నేను వాలియాత్మనే కనుకను భార్యాదానము శ్రేష్ఠమే కనుకను నన్నుఁ జంపుము. దాన నీకుఁ బుణ్యమేకాని పాతకముగలుగదు. వీరుఁడా! నీవును నా ప్రియుఁడైనవాలికి నన్నొసఁగుటచేఁ బుణ్యమేపొందుదువుగాని, నావధముచే స్త్రీవధపాతకమ్ము నీకుఁ గలుగదు. నొచ్చినదానను, నాథుఁడు లేనిదానను, భర్తచేత వంచింపఁబడుచున్నదానను నయిన నన్నును జంపుము. నరేంద్రా! మదపు

చేసుఁగు కైవడి నొయ్యారముతో నడచువాఁడును, వానరాధిపుఁడును, నేర్పుకాఁడును, మేలిమి పసిండిదండను దాల్చినవాఁడునయిన నా ప్రియునిఁ బాసి చిరకాలము జీవింపఁజాలను. కావున నన్ను వధించి నా ప్రియునికడఁజేర్చి యీ పుణ్యమును గట్టుకొనుము." అని యిట్లు పలుకుచున్న తారఁ జూరడించుచు మహాత్ముఁడగు రామభూవిభుండిట్లనియె.

ఓ వీరునిభార్యా! శూరుని పెండ్లామవైన నీ విట్టులు విచారములఁ గుందుట తగదు. బ్రహ్మదేవుఁడు జనులనెల్ల సృజించెను. కనుక జనులంద ఱాతని యానతి చొప్పున సుఖదుఃఖములఁ బొందుదురని యందఱు పలుకుదురు. ముల్లోకములును ఆ బ్రహ్మకు లోఁబడి యతఁడేర్పఱచిన సుఖదుఃఖముల నందుచుండును. వానిని మీఱుట కెవరును జాలరు. ఇంత తడవు నీవు వ్యసనమునొందితివి. ఇఁక నీపుత్రుఁడు యువరాజపట్టము నొందునుగాన, దుఃఖమునందినట్లే సుఖము నందఁగలవు. కావున నీబోటిశూరుని యిల్లాండ్రు విధిత్రిప్పటలనుగూర్చి వగవరు. ఏది యేవేళకు వచ్చిన, దాని నావేళ కనుభవింపవలయునని దృఢనిశ్చయముమై నుందురు." అని యిట్లు ప్రభావముగలవాఁడును, శత్రుసంహారియునయిన రాముఁ డూరడింపఁగా, చక్కని రూపముగల దగు వీరునిభార్యయగు తార యు గొంతెత్తి కొంతసేపు రోదనము సేసి యంతట నూరటనొందెను.

25-వ సర్గము.

వాలిని దహనమొనర్చుట

వెండియు రాముఁడు లక్ష్మణునితోడఁగూడి, వారితో సమానమయిన వ్యసనమునంది, సుగ్రీవతారాంగదులను గూర్చి యిట్లనెను! "మృతినొందినవానిం గూర్చి విశేషము దుఃఖించిన, నాతనికి మనశ్శాంతి గలుగదు. కావున నిఁక జేయవలసినపని యోజింపుఁడు. లోకాచారము ననుసరించి నడచుకొనవలెను. ఇంక నేడువవలదు. దైవమును మీఱి యెట్టిపనినిచేయ శక్యముకాదు. లోకములో నన్నింటికిని దైవమే కారణము. ఎల్లపనులకును దైవమే సాధనము. సకలభూతములను తమతమ పనులచేయించుటయందు దైవమే కారణము. ఎవఁడును దేనికిని కర్తగాఁడు ఎవఁడును ఎవనిని ఆజ్ఞాపించుట కధికారిగాఁడు. లోకము స్వభావసిద్ధముగనున్నది. దానికి దిక్కు దైవము. దైవ

మాత్రను మీఱఁజాలదు. దైవమునశింపదు. దైవమునకు లోఁబడి యాదైవము నెవ్వఁడు మీఱఁజేవర్తింపఁడు. దైవమునకు మనవాఁడు పొరుగువాఁడను భేదము లేదు; కారణము గావలెనని లేదు; ఇతఁడు బలశాలికదా యని చూడఁడు; ఆతని కొక్కఁడు చెలికాఁడనియు, నొక్కఁడు దాయాదుఁడనియు ఈ మొదలగు సంబంధములు లేవు. ఆ దైవముయొక్క చేష్టలకుఁ గారణము లేదు. అది పురుషునికి లోఁబడినదిగాదు. మఱియేమి యనిన జ్ఞానవంతుఁడగువాఁడు, ఏది సంభవించినను, అది దైవముయొక్క కార్యమనియు, మనుష్యునకు ధర్మార్థ కామమోక్షము లనెడి చతుర్విధపురుషార్థములు వానివానికర్హాను సారముఁగాఁ గలుగుచుండుననియు, ఆ విషయమున మానవుఁడు వ్యసన మొందరాదనియుఁ దెలియుచుండవలయును. వానరేశ్వరుఁడగు వాలియు నాచే వధింపఁబడి, పాపంబులనుండి విడువఁబడి, ధర్మార్థ కామములతోఁగూడి, తా నొనర్చిన కర్మమునకుఁదగిన ఫలమునొందెను. మహాత్ముఁడగువాలియుఁ బ్రాణములను రక్షించుకొనక యుద్ధము నొనర్చి, స్వధర్మము నడపుటవలనఁ దాను ముందుగెల్చిన స్వర్గమునకుఁ బోయి చేరెను. దైవము బలవత్తరము కావుననే వాలి దైవమునకుఁ లోఁబడెను. కావున వ్యసనమునొంది యుపయోగములేదు. ఇఁక జేయవలసినకార్యముఁ జేయుఁడు" అని రాముఁడు సుగ్రీవాదులతోఁ జెప్పెను.

రాముఁ డిట్లెఱిఁగునఁ జెప్పి ముగింపఁగా, పగతురవీరులం బరిమార్చునట్టి లక్ష్మణుఁడు వంతచే మైమఱచియున్న సుగ్రీవునిఁజూచి, "సుగ్రీవుఁడా! యింకలెమ్ము. వాలికిఁ జేయవలసిన యూర్ధ్వదేహసంబంధ క్రియలను జరిపింపుము. నీవు తారాంగదసమేతుఁడవై వాలిదహనము కొఱ కెండిన శ్రీగంధపుఁజెక్కలు మున్నగు కట్టెల నధికముగాఁ దెప్పిం పుము. వాలికి సంస్కారము చేయవలయుఁగానఁ జింతాక్రాంతుఁడై యున్న యంగదు నూఱడింపుము. సుగ్రీవా? యీ పుర మెల్ల నీ యధీనమై యున్నది. నీవు దుఃఖించిన నీ పుర మెల్ల దుఃఖించునుగావున నీవు మూఢునియట్లు దుఃఖము నొందకుము. అంగదునితోఁజెప్పి, పూల దండలను, పలుతెఱఁగులగు వస్త్రములను, ఆజ్యమును, తైలమును, సువాసనద్రవ్యములను దెప్పించి, యీవలఁ జేయవలసిన కార్యములఁ

జేయుము. ఓ తారుఁడా! నీవు వేగముగనేగి పల్లకి నొకదానిని బట్టించు కొనిరమ్ము. కార్యముల నెప్పుడును త్వరగా జరుపుట మేలు. అందును నిట్టిసమయమున మరింత మేలు. పల్లకిని మోయఁగలవారును, బలవంతు లునునయిన వానరులను సిద్ధపఱిపుము" అని చెప్పి, యన్నయొక్కచేరువ నిలువఁబడియుండెను.

లక్ష్మణునిమాట విని, తారుఁడు పల్లకిఁ దేరఁ ద్వరపడుచు గుహకుఁ బోయి, పల్లకినెత్తించికొని, మఱలి వేగమే యేగుదెంచెను. బరువు మోయఁగల మొనగాండ్రగు వానరులచే మోసికొని రాఁబడుచుండు నదియు, మేలిమ్మాసనముతోఁ గూడినదియు, రథమువంబోలినదియు, చిత్రింపఁబడినపక్షులతోను, వృక్షములతోను, బంటులబొమ్మలతోను గూడినదియు, అన్నివైపులఁ జక్కఁగా బిగింపఁబడినదియు, గవాక్షము లతోఁ గూడినదియు, సిద్ధులవిమానములం బోలినదియు, చక్కఁగా నమర్పఁబడినదియు, విశాలముగానున్నదియు, విశ్వకర్మచే జక్కఁగా జేయఁబడినదియు, కొయ్యతోఁజేసిన చిన్నికొండలతోఁ గూడినదియు, చక్కని పనితనముగలిగి శోభిల్లునదియు, ఉత్తమభూషణములచేతను, పలురంగుల పూవులదండలచేతను నొప్పారుచున్నదియు, విలాసార్థమైన గుహలతోను, అరణ్యములతోను గప్పఁబడినదియు, ఎట్టిని గందపుఁ బూఁతగలదియు, పూవులచేఁ గప్పఁబడినదియు, బాలభానుబింబము యొక్కవర్ణముతో వెలుఁగుచున్న తామరపూవుదండలచేఁ నలంకరింపఁ బడినదియు నయిన పల్లకిఁ జూచి, రాముఁడు లక్ష్మణునితో "వాలి నీ పల్లకియం దుంచికొనిపోయి దహనము గావింపవలయు" ననీ యానతిచ్చెను.

అప్పుడు సుగ్రీవుఁడు రోదనముసేయుచు, తాను నంగదుఁడును నిర్జీవుఁడయిన వాలినిబట్టి పల్లకియం దెక్కించి, నానావిధభూషణపుష్ప మాలావస్త్రములచే నలంకరించి, వానరులంజూచి, "అన్నగారి కుత్తర క్రియలు బాగుగా జరుపవలయును. వానరులందఱు నానావిధములగు రత్నముల నవారిగా యాచకులకు వెదఁజల్లుచు పల్లకిముందు నడతురు గాక" అని యానతియొసఁగెను. లోకమునందలి రాజుల వైభవమునకుఁ దగినట్లుగా, వాలికి నుత్తరక్రియలు సత్వరముగా వానరులు నడిపించిరి. అప్పుడు తారుఁడు మున్నగు నాప్తులయిన వానర లందఱు తమబంధు

వును బోఁగొట్టుకొని యార్చుచు నంగదునిఁ దోడుకొని వేగ నడిచిరి. అంత వాలియధీనముననున్న తారముున్నగు ప్రియురాండ్రయిన వానర కాంతలందఱు, ననాథలయి 'వీరుఁడా! వీరుఁడా!' యని దీనస్వరముతోఁ పలుమాఱు విలపించుచు పల్లకిని వెంబడించిరి. ఆ వానరకాంతల యేడ్పులప్రాంతలకు నడవులనడుమనున్న పర్వతములును, వనములును నంతటను మాఱుప్రాంత లీనుచుండెను. అట్లు మోయఁజాలిన వానరు లందఱు చింతచేఁ జిక్కినవారలై, విజనమై, జలసమృద్ధమెయుండు నొక్క సెలయేటియొడ్డున తిన్నెపయిఁబెర్చిన చితిసమీపమున తమమూపుర ములనుండి పల్లకినిదించి, యేకాంతస్థలమున దుఃఖించుచుండిరి.

అంతటఁ దార పల్లకిలోఁ బరుండఁబెట్టియున్న తన పతినిఁజూచి, మిక్కిలి వంతనొంది యాతనిశిరమును దన తొడపైఁ నిడికొని "అక్కటా! వానరమహారాజా! హా! నాథుఁడా! హా! నాపై ప్రేమగలవాఁడా! హా! ఉత్తమపురుషుఁడా! హా! మహాభాగుఁవా! ఓ నాప్రియా! నన్నుఁ గన్నెత్తిచూడుము. వీరందఱు నీ వియోగశోకముచే నొచ్చియున్న వారు. వీరినందఱి నేల చూడకున్నావు? నాథా! నీవు విగతప్రాణుఁడ వయినను, నీమోము చిఱునవ్వునవ్వుచు నున్నట్లును, బ్రతికియున్న ప్పుడుం బోలె సాయంకాలపు సూర్యనివన్నెతో సాటియగు వన్నె గలిగియుండు నట్లును గనఁబడుచున్నది. వానరాధిపా! యీ రాముఁడు నీపాలిటి యమధర్మరాజయ్యె. ఈ రాముఁడు వనమున నొక్కబాణ ముచే నిన్నుఁగూలనేసి మమునందఱి ననాథలంగావించె. రాజేంద్రా! నీమనసునకెక్కిన యీ వానరకాంతలందఱు ఇప్పు డింతదవ్వు నడచి వచ్చిరే నీవది కనుటలేదా! చందురునిఁబోలు మోములుగల యీ కాంత లెల్లరు నీ కెక్కిన ప్రియలుగదా! వానరపుంగవుఁడైన యీ సుగ్రీవుని నిప్పు డేల చూడకున్నావు? ఓరాజా! తారుఁడు మున్నగు నీ మంత్రు లును, పురజనులు నిన్నుఁజుట్టి నిల్చియున్నారు. వీరికందఱికి సెలవిచ్చి పంపుము. మనము మదనపరతంత్రులమై యీ వనముల విహరింతము" అని తనప్రియునింగూర్చి విలపించెను.

ఇట్లు భర్తృమరణజనితశోకముచేఁ జిక్కి విలపించుచున్న తారను వానరకాంతలందఱు వంతచేనొగిలినవారలై యాపలికి లేవఁదీసి కొనిపోయిరి. తరువాత నంగదుఁడు చింతచే నింద్రియజ్ఞానము లేనివాఁడై

రోదనముసేయుచు సుగ్రీవునితోడ్పాటున వాలిని జితిపై నెక్కించెను. డెందమున మిగులగుందినవాఁడై యంగదుఁడు శాస్త్రవిహితరీతిని జితికి నిప్పంటించి, దీర్ఘప్రయాణమునఁ దరలిన తనతండ్రి కప్రదక్షిణము గావించెను. వానరులు వాలికి యథావిధిగ దహనసంస్కారముఁజేయించి, తర్పణము గావించుటకై చల్లనినీటితోఁగూడిన పవిత్రమైన యొక సెల యేటిగట్టునకు వచ్చి చేరిరి. అచ్చట వారందఱు అంగదుని ముందిడు కొని, సుగ్రీవతారలతోఁగూడ వాలికిఁ దర్పణము చేసిరి. రాముఁడును దీనుఁడైన సుగ్రీవునితో సమానమగు వ్యసనముగలవాఁడై వాలికిఁ ప్రేతకర్మలనెల్ల దాపుననుండి జరిపించెను. అంత సుగ్రీవుఁడు మేటిపౌరుషముగలవాఁడును, ఇక్ష్వాకువంశవీరుఁడగు రామునిచేఁ జంపఁబడిన వాఁడునునైన వాలి కిట్లు దేహసంస్కారముగావించి వెలుఁగుచున్న యగ్నిని బోలిన ప్రతాపముగలవాఁడును, లక్ష్మణసమేతుఁడునునైన రాముని దగ్గఱకుఁ జేరెను.

26 వ సర్గము.

సుగ్రీవుని పట్టాభిషేకము

అనంతరమున మంత్రులగు వానరులు వాలి మరణశోకముచే నొచ్చినవాఁడును, తడిబట్టగలవాఁడునైన సుగ్రీవునిచుట్టు నిలుచుండి, మంచిపనులను జేయువాఁడగు నిడుదచేతులవాఁడైన రామునికడ కేగు దెంచి, చేతులుజోడించి, ఋషులు బ్రహ్మను గొల్చునిధమున నారామునిఁ గొల్చుచుండిరి.

అప్పుడు బంగరు కొండడాలువంటి మేనిడాలుగలవాఁడు, బాల సూర్యుని పగిది వెలుఁగు మోముగలవాఁడునైన వాయునందనుఁడగు హనుమంతుఁడు రామునింగూర్చి, "ఓప్రభూ! తమయనుగ్రహమునం జేసి, సుగ్రీవుఁడు పొందుట కలవికానిదియు, తాతతండ్రులనాటినుండి వచ్చినదియునైన యీ మహావానరరాజ్యమును బడసెను. సుగ్రీవుఁడు మీ యనుజ్ఞ వడసి, యమాత్యవర్గముతోడ నందమగు పురము ప్రవేశించి మిత్రులతోఁగూడ నెల్ల కార్యముల నాచరింపఁగలఁడు. ఇతఁడు యథావిధిగా నానావిధంబులగు సుగంధతీర్థములచేతను, ఓషధజలములచేతను బట్టాభిషిక్తుఁడై తమ్మురత్నములచేతను, పూవుల

చేతను విశేషముగాఁ బూజింపఁగలఁడు. ఇచ్చటనుండి తాము రమ్యమగు నీకిష్కింధకు నేతెంచి, వానరులకందఱి కెక్కువ యానందము గలిగించుచు, సుగ్రీవునకు రాజ్యమునొసఁగుఁడు" అని చెప్పెను.

బుద్ధిమంతుఁడును, మాటలందు నేర్పరియు, శత్రుసంహారియు నైన రాముఁడు హనుమంతునిపలుకు లాలకించి, యతనితో "ఓరీ! నాయనా! హనుమంతుఁడా! మాతండ్రి నన్నుఁ బదునాలుగేండ్లు వనవాసముచేయుమని ట్లానతిచ్చెను. కావున నేను పురమునుగాని గ్రామమును గాని ప్రవేశింపను. శూరుఁడగు వానరశ్రేష్ఠుఁడయిన సుగ్రీవుఁడు వేగమే కలుములతో నిండినది యగు చక్కనైన కిష్కింధను ప్రవేశించి, యథావిధిగా రాజ్యాభిషిక్తుఁడగునుగాక!" అని చెప్పి, తాను నడవడుల నెఱిఁగినవాఁడగుటంజేసి, మంచినడవడిగలవాఁడును, విశేషబలపరాక్రమములుగలవాఁడు నగు సుగ్రీవునింగూర్చి, "సుగ్రీవా! యీ యంగదుఁడు నీయన్నకుఁ గొడుకు; బలిమిని నీకెనవచ్చువాఁడు. ధైర్యవంతుఁడు. యువరాజపదమునకుఁ దగినవాఁడు. కావున వీనిని యువరాజపదమున నభిషేకముసేయుము. ఇప్పుడు వర్షాకాలము వచ్చెను. నాయనా! వార్షికము లనఁబడెడి నాలుఁగుమాసములలో నీ శ్రావణమాసము మొదటిది. ఇది సీతను వెదకుటకుఁ దగినసమయము గాదు. నీవు పత్తనమునకుఁ బొమ్ము. నేను లక్ష్మణసమేతుఁడనై, యీ ఋశ్యమూక పర్వతమునందే యుండెదను. ఈ పర్వతగుహయు రమణీయమై విశాలమై యోర్వఁగూడినంత సమశీతోష్ణముగల వాయువుతోఁగూడినదై, విశేషమగు నీటివసతిగలిగి, విస్తారములయిన కమలోత్పలములతోఁ గూడియున్నది. కార్తికమాసము రాఁగానే నీవు రావణవధమునకుఁ బ్రయత్నింపుము. అదియె మన కేర్పాటు. సాధువర్తనుఁడా! నీ విప్పుడు నిజనగరముఁ బ్రవేశింపుము. పట్టాభిషిక్తుఁడవయి నీహితుల కందఱికు బహుమానము లొసఁగి సంతోషపఱుపుము" అని సుగ్రీవునితోఁ జెప్పెను.

వానరాధిపుఁడగు సుగ్రీవుఁ డిట్లు రామునివలన ననుజ్ఞవడసినవాఁడయి, యింతవఱకు వాలిచేఁ బాలింపఁబడుచుండిన కిష్కింధాపురము సొచ్చెను. పెక్కువేల వానరులు మ్రొక్కుచు, నాతనివెంటఁ బ్రవేశించి యంతటఁ గొలిచియుండిరి. ఆ సుగ్రీవుఁడు పురమునకు

వచ్చినప్పు డచ్చటిజనులందఱు వానరగణాధిపుఁడగు నా సుగ్రీవుని దర్శించి మనస్సునఁ గొఱఁత లేనివారలయి సాష్టాంగముగాఁ బుడమిని సాగిలఁబడి మ్రొక్కిరి. వీర్యబలవంతుఁడగు సుగ్రీవుడు జనులనందఱను లేవనెత్తి హెచ్చరించి, చక్కనైయున్న తన యన్నగారి యంతఃపురము సొచ్చెను. అంతట నా సుగ్రీవునిహితులందఱు గూడివచ్చి యంతిపురినుండి వెలువడివచ్చిన వానరపుంగవుఁడగు సుగ్రీవుని, దేవతలు వేయికన్నులతోనిఁ బోలెఁ గిష్కింధాపురమునకుఁ బట్టి భద్రునిఁ గావించిరి. అప్పుడు వానరు లతనికి బంగరుపూతపూసిన తెల్లనిగొడుగు పట్టిరి. బంగరుకాడలుగల కీర్తికరములైన తెల్లని వింజామరలు వీచిరి. సకల రత్నములను, సకలవిధములగు వస్త్రములను, ఓషధులను, పాలుకాఱుచెట్లను, చిగుళ్లను, పువ్వులను, తెల్లజరీబట్టలను, తెల్లనిగంధమును, నెత్తావిగల పూలదండలను, స్థలజనీరజకమలములను, మేలిమిగంధములను, పెక్కుతెఱఁగులగు ననేకపరిమళద్రవ్యములను, విఱుగనిపసపక్షతలను, తెల్లనివాలును, తేనెను, నేయిని, పెరుగును, వాఘ్రిచర్మమును, అడవిపందితోలుతోఁ జేయఁబడిన చెప్పులను దెచ్చియిచ్చిరి. అప్పుడు పదునాఱుగురు కన్నెపడుచులు మైపూఁతలను, గోరోచనమును, మణిశిలను గైకొని సంతసముతోఁ దెచ్చి కానుకలర్పించిరి. అంత వానరులందఱు సుగ్రీవపట్టాభిషేకసమయమున బ్రాహ్మణోత్తములచే వస్త్రకనకరత్నములచేతను, భక్ష్యభోజ్యాదులచేతను దనివినొందించిరి. అప్పుడు మంత్రవేత్తలయిన ఋత్విజులు దర్భలు చుట్టు పఱువఁబడియున్న యగ్నిని బ్రజ్వరిల్లఁజేసి మంత్రములచేఁ బావనములయిన హవిస్సులతో వేల్చిరి. తర్వాత బంగారుకాళ్లుగలదియు, మంచిపఱుపు పఱువఁబడినదియు, పలువన్నెలుగలదియు, పుష్పమాలికలతో నలంకరింపఁబడినదియునైన రమ్యమగు రాచనగరయొక్క పై భాగమున సుగ్రీవుని దూర్పు మొగముగ సింహాసనాసీనుఁజేసి, నదీనదములనుండియు, సకలతీర్థములనుండియు, సకలసముద్రములనుండియుఁ దెచ్చి బంగారుకలశములందు నింపియున్న సుగంధి నిర్మలోదకములను జక్కనియెద్దుకొమ్ములలోను, బంగారుగిండీలలోనుఁ బోసికొని శాస్త్రములందు మహర్షులు చెప్పినతెఱఁగున, వసువులు దేవేంద్రునిఁబోలె నభిషేకించిరి. సుగ్రీవునికిఁ బట్టాభిషేకమయినయప్పుడు వేలకొలఁదిగనున్న

బలశాలు రగువానరశ్రేష్ఠులందఱు సంతోషభరితులై, కోలాహలము లొనర్చిరి.

అంత వానరశ్రేష్ఠుఁడయిన సుగ్రీవుఁడును రామునిమాటచొప్పున నంగదునిఁ గౌఁగిలించికొని యువరాజపట్టాభిషిక్తుంజేసెను. అంగదుఁడు యౌవరాజ్యపదవి నందినప్పుడు వానరులందఱు తండ్రిలేని యంగదుని యందు జాలినొందినవారలై, సుగ్రీవుఁ డొనర్చినపని బాగుబాగని యాతనిం గొనియాడిరి. అట్టి పట్టాభిషేకమహోత్సవము జరిగినప్పుడు వానరులందఱు సంతసించినవారలై, మహోత్సులయిన రామలక్ష్మణుల వలనఁ గదా యీ మహోత్సవము జరిగెనని వారి నిరుపురుని బలు మాఱు పొగడిరి. పర్వత గుహాయందుండు నాచక్కని కిష్కింధా పురమున నుండువారందఱు సంతసముచే నుప్పొంగిరి. పట్టణమెల్లఁ డెక్కెములచేఁ బ్రకాశించుచుండెను. తర్వాత వీరుఁడగు వానరసేనా నాయకుఁడయిన సుగ్రీవుఁడు తనపట్టాభిషేకము జరిగినవృత్తాంతమును రాముని కెఱిఁగించి తనభార్యయగు రుమనుగ్రహించి, దేవేంద్రుఁడు స్వర్గమును బోలెఁ గిష్కింధాపురరాజ్యమును బొందెను.

27-వ సర్గము.

రాముఁడు ప్రస్రవణపర్వతము చేరుట

సుగ్రీవుఁడు పట్టాభిషిక్తుఁడై గిరిగుహాంజొచ్చినపదంపడి, తిన్నని స్వభావముగలవాఁడు పుణ్యాత్ముఁడు నైన రాముఁడు సుగ్రీవునితో నేర్పాటుకావించుకొని, లక్ష్మణసమేతుఁడయి భయంకరముగా నఱచు సింహవ్యాఘ్రాదిమృగముల నాదములతో భ్రాగుచున్నదియు, పెక్కు పొదలతోను, తీఁగెలజొంపములతోను మఱుగుపఱుపఁబడినదియు, ఎలుఁగుబంట్లు, కోఁతులు కొండముచ్చులు, జంగుపిల్లులు మొదలగు మృగముల కునికిపట్టును, మొగిళ్ళులకూటముమాడ్కి నున్నదియు, నెల్లప్పుడు తేటనీటితోఁగూడినదియు నైన ప్రస్రవణపర్వతమునకు నేతెంచి, యాపర్వతశిఖరమున నొక్కవిశాలగుహాయందు నివసించి కాలము పుచ్చుఁగోరి, యడఁకువగలవాఁడును, కాంతిమంతుఁడునయిన లక్ష్మణునితో సమయోచితముగా నిట్లనెను.

శత్రువుల నణఁగఁ ద్రొక్కినట్టి యో లక్ష్మణా! యీ పర్వతగుహ విశాలమయి, గాలి చక్కఁగా వీచుచు మనోహరమయియున్నది. రాజ పుత్రా! తెలుపు, నలుపు, నెఱుపురంగుగల ఱాలచే మెఱయుచున్న దియు, నానావిధ గైరికాది ధాతువులతో నిండినదియు, గుహలతోను, సెలయేళ్లతోను నొప్పారుచున్నదియు, పెక్కుతెఱఁగులగు చెట్లతోను, తీఁగెలజొంపములతోను జెన్నారునదియు, నెమ్మికూఁతలు మొదలగు పలుపులుఁగులకూఁతలతోఁ గూడినదియు, విరులతోఁగూడిన మొల్లల మల్లెలపొదలు, వావిలి, గోరంట, కడప, ఏఱుమద్ది, మద్దిచెట్లచే వెలయు నదియునై యున్నది. రాజపుత్రా!పుష్పించిన తామరపువ్వులచేనలంకృతమై యున్న యీమనోహరమగు కొలనును మనముండు గుహకు దాపుననే యున్నది. ఈశాన్యమూలయందున్న యీగుహయొక్కద్వారమునైరృతి ముఖముగ నుండుటవలన నీశాన్యమూలనుండివచ్చు వానజల్లుకొట్టదు కావునను, వెనుకటివైపున నెత్తుగనుండుటచే తూర్పునుండి వచ్చు చలి గాలియు సోకకుండునుగావునను నిది సుఖకరముగ నుండఁగలదు. సౌమిత్రీ! గుహయొక్కవాఁకిట చదునైన చక్కనిఱాయియున్నది. అది నున్నగను, చాలవిశాలముగను, విఱియఁబోసినకాటుకరాశివలె నున్నది. నాయనా! ఉత్తరముననున్న యీగిరిశృంగమును చూడుము. కాటుక ప్రోవునుబోలి పైకెగసినమబ్బువలె నున్నది. దక్కినంపుదెసయందును, పెక్కుకావిఱాలతో నలంకరింపఁబడినది, అపరకైలాసపర్వతశిఖరమో యనఁబరఁగినదియునయిన యొక శిఖరమున్నది. మఱియు నీ గుహకుఁ దూర్పువైపున సంపెంగ, బొట్టుగు, మద్ది, రేఁగు, కురువెంప, పద్మకము, సరళము, అశోకము, ప్రబ్బలి, తినాస, పొగడ, మొగలి, చంద్ర, గిలక తాటి, లొద్దుగు, కడప, వేప, రేల మొదలగు రెండుగట్టులందలి మొలచిన చెట్లచే వస్త్రాభరణములతోఁ జక్కఁగా నలంకరించుకొనిన యువతివలె శోభిల్లుచు, బురదలేని తేటనీటితోఁ దూర్పునకుఁ బాఱెడు నదియొకటి; త్రికూటపర్వతముచేరువ గంగానదిమాడ్కిఁ బాఱుచున్నది. మఱియుఁ బెక్కుతెఱఁగులయిన కూఁతలుకూయు పక్షుల గుంపులతోఁ గూడినదియు, అన్యోన్యానురాగముగల చక్రవాకములు, రాయంచలు బెగ్గురులు మొదలగు జలపక్షులతోఁగూడిన యిసుక తిన్నెలుగలదియునై యీనది సర్వాభరణముల ధరియించి చిఱునవ్వు

నవ్వుచున్న జవ్వనిమాడ్కిఁ బ్రకాశించుచున్నది. ఈనదియం దొక్క చోట నల్లకలువలున్నవి; మఱియొక్కప్రక్కఁ జెంగల్వలు మెఱయుచున్నవి; మఱియొక్కప్రక్క దివ్యములయిన తెల్లగలువల మొగ్గలు వెలయుచున్నవి. లక్ష్మణా! ఈ నదీతీరము పెక్కు జలపక్షులు, నెమళ్ళు, కొంగలు మొదలగు పక్షులకూఁతలతో నిండి మనోహరమయి మునిశ్రేష్ఠుల కునికిపై వెలయుచున్నది. లక్ష్మణా! నేర్పుతో మాలవలెఁ గూర్పఁబడినవో యన్నట్లులుండు శ్రీగంధపుఁజెట్లయు ఏఱు మద్దిచెట్టులయు వరుసలను జూడుము. సంకల్పించినమాత్రమున పుట్టి పెఱిగినట్లులున్నవి. పగతురకుఁ గంటకుఁడా! యీ ప్రదేశము మిగుల రమణీయమైయున్నది. కావున నిచ్చటనే విహారింతము. ఇదియె మంచిది. ఇచ్చటనే నివసింతము ఇంతియకాక, యీ ప్రదేశమునకుఁ గడుదాపున వివిధవృక్షశోభితమైన కాననములుగల యీ సుగ్రీవుని పట్టణమునున్నది. జయశీలురలో శ్రేష్ఠుఁడా! వానరులు మద్దెలలువాయించుచు పాడుచుండుపాట లిచ్చటికిఁ వినఁబడుచున్నవి. కపిశ్రేష్ఠుఁడయిన సుగ్రీవుఁడు స్నేహితులతోఁగూడి రాజ్యమును, భార్యను, గొప్పకలిమిని బొంది యానందము నొందుచున్నాఁడు. ఇది నిస్సంశయము" అని యిట్లు రాముఁడు లక్ష్మణునితోఁజెప్పి, రమణీయములయిన పెక్కుగవులతోడను, పొదలతోఁడను నిండియున్న యీ ప్రస్రవణపర్వతముననే లక్ష్మణునితోఁగూడ నివసించెను.

ఆ ప్రస్రవణపర్వతము సకలద్రవ్యములుగలిగి, మిగుల సుఖకరమయియున్న యీ పర్వతమున నున్నను ప్రాణములకన్న మిన్నయైన రావణుఁడు గొంపోయిన తనభార్యను తలఁచుచుండుటంజేసి రాముఁడు నకుఁ గొంచెమైనను ప్రీతిగలుగదయ్యెను. పగళ్ళెట్లులోకడపినను, రాత్రులందుఁ దూరుపుకొండపై నుదయించిన చంద్రునిఁజూచిన, విరహవేదనచే రాముఁడు మిక్కిలి నెమ్మదితప్పి, నిద్రలేకయుండెను. అట్లు సీతావిరహవేదనచే మనసునఁ బరితపించుచుండువాఁడును, ఎల్లప్పుడు దుఃఖపడుచుండువాఁడును, శోకమే ముఖ్యముగాఁ గల వాఁడునునయిన రాముని఻జూచి, లక్ష్మణుఁడును నతనితో సమముగ దుఃఖముఁజెందినవాఁడై, యన్న నూఱడింపుచు నిట్లనియె.

"శూరుఁడా! వ్యథపడినది చాలును. నీవు శోకము నొందఁ దగదు. వ్యసనపడువానికిఁ గార్యములెల్లఁ జెడునన్నవిషయము నీ వెఱిఁగినదియే. లోకమున నీవు కార్యముసాధనమే ప్రధానముగాఁ గల వాఁడవు. దైవమును నమ్మియున్న వాఁడవు; ఆస్తికుఁడవు; సత్కార్యములు చేయువాఁడవు. ప్రయత్నముచేయువాఁడవు. అట్టి నీవిట్లు వ్యసనంబునొందుట తగదు. నీవిట్లు ధైర్యంబులేక, వ్యసనముగలిగి, పూనిక లేకయుందువేని, నీ కపకారమొనర్చిన యా రాక్షసుని యుద్ధరంగమున నెట్లు వధింపఁగలవు? కావున నీవు శోకము మొదలంటఁ బెఱికి వేయుము; తిరమైన పూనికతలపెట్టుము. అట్లుగానిచో నీ వారాక్షసుని సపరివారముగా నెట్లు నాశముచేయఁగలవు? కకుత్స్థవంశోద్భవా! నీవు పూనిక గలిగినవాఁడవైనచో సముద్రారణ్యపర్వతములతోఁ గూడి యున్న భూమండలమునెల్లఁ బొరలింపఁగలవు. అట్టి నీ కీ రావణుని వధించుట యొకపనియా? వర్షాకాలమువచ్చినది. శరదృతువు వచ్చు వఱకు వేచియుండుము. అంతట రావణుని, వానిబంధుపరివారములను సంహరింతువు. వాని రాజ్యమును బాడుసేయుదువు. నివురుగప్పిన నిప్పును వెలుఁగుచున్న వేల్పులచేఁ బ్రజ్వరిల్లఁజేయునట్లు, అణఁగియుండు నీ ప్రతాపమును నేను పురికొలుపఁగలను" అని లక్ష్మణుఁడు రాముని శోకోపశమనముఁ జేసెను.

రాముఁడును లక్ష్మణుఁడు చెప్పిన హితమైన మంచిమాటను విని, తనయందుఁ బ్రేమగల తమ్మునిఁగూర్చి "లక్ష్మణా! ప్రేమగలవాఁడును, స్నేహితుఁడును, ఆప్తుఁడునయినవాఁ డెట్టిమాట చెప్పవలయునో, తిరమగు మగఁటిమిగల నీ వట్టిమాటను జెప్పితివి. అన్ని కార్యములను జెఱుపునట్టి యీ శోకమును వదలితిని. శత్రువుల నాక్రమించుటలో నడ్డులేని నా తేజస్సును బ్రేరించెదను. నీ మాటయండె నిలిచెదను. సుగ్రీవునియొక్కయు, నదులయొక్కయు ననుగ్రహము నెదురుచూచుచు శరత్కాలమురాకకయి వేచియుండెదను. శూరుఁడగువాఁడు తన కుపకారముచేయువారికిఁ బ్రత్యుపకారముసేయును. ఒకఁడుచేసిన యుపకారమునుమఱచి, ప్రత్యుపకారముసేయని మానవుఁడు సాధువుల మనస్సును జెఱచును. కావున సుగ్రీవుఁడు మనకుఁ గృతజ్ఞత గనఁబఱుపకయున్నను, సత్పురుషుల కాగ్రహము గలుగునన్న భీతితో

నైనను బ్రత్యుపకారమునేయును." అని చెప్పఁగా, లక్ష్మణుఁడును రాముని పలుకులు విని, చేతులుజోడించి, యాతనిమాటలకుఁ దల పంకించి, తన మంచినడతను దెల్పుచు, కడుఁ జక్కనయిన రామునిఁ గూర్చి, "యోరామా! వానరేంద్రుఁడగు సుగ్రీవుఁడు నీవు కోరినది కోరినట్లల్ల వేగిరమే చేయఁగలఁడు. నీవును శత్రువధమును వూని, శరత్కాలము నెదురుచూచుచు నీవ్యసన మోర్చియుండుము. శత్రువధమునకుఁ దలపెట్టినవాఁడవై, కోపమడఁచుకొని, శరత్కాల మున కెదురుచూచుచు నీ నాలుగునెల లోర్చికొని సింహముల కునికి పట్టయినయీపర్వతశిఖరమున నుండుము" అని చెప్పెను.

28 వ స ర్గ ము

వర్షాకాల వర్ణనము

అప్పుడు రాముఁడు వాలివధమును గావించి, సుగ్రీవునికిఁ బట్టము గట్టి, తర్వాత మాల్యవంతము దరియందున్నవాఁడయి, లక్ష్మణునిఁజూచి యిట్లనియె: "లక్ష్మణా! సుగ్రీవుఁడు తనపురమునను, మనమిచ్చటను నుండున ట్లేర్పఱచుకొన్న యావర్షాకాలము సంప్రాప్తమయినది. ఆకాశము కొండలంబోలు మేఘములచే దట్టముగాఁ గ్రమ్మఁబడియున్నది, బాగుగాఁజూడుము. ఆకాశము సూర్యనికిరణములమూలమున సముద్ర జలము ద్రావి, తొమ్మిదినెలలుమోసిన గర్భరూపమయిన రసముల కెల్ల ముఖ్యమైన జలమును బ్రసవించుచున్నది. ఇప్పుడు మేఘము లనెడి మెట్లమీదుగ నాకసమునకెక్కి, కొండమల్లె పూలదండలతో సూర్యునిఁ బూజింపవచ్చును. వర్షముగురిసిన తర్వాతఁ దెల్లనై యుండు మేఘము సాయంకాలము సంధ్యారాగము సోఁకుటచే నడుమ నెఱ్ఱనివియు, గొనలందు మిక్కిలి తెల్లనివియు నయి యాకసమంతయు నిండి యుండుటచే నాకాశమునకు గాయములు దగులఁగా నడుమ నెత్తురు సోఁకగా నెఱ్ఱనయిన తెల్లనిగుడ్డలతోఁ గట్టినకట్టులో యన్నట్లు దెలి యుచున్నవి. పిల్లగాలియను నూర్పుగలదియు, సంజయెఱుపనెడు చందనపు మైపూఁతగలదియు, అంతటను తెల్లనయిన మబ్బుగలదియునగు నాకా శము కాంతనెడబాసి సంతాపపడుచున్నవాఁడో యన్నట్లు లాకాశము ప్రకాశించుచున్నది. ఈ భూమియు, వేసవివేఁడిమికిఁ గ్రాఁగినదియు గ్రొన్ని

టిచేఁ దడిసినదియునయిన శోకసంతాపమునొందినసీతవలె బాష్పమును (ఆవిరిని-కన్నీటిని) విడుచుచున్నది. మేఘములనుండి వెడలినవియు, యెఱ్ఱగలువలవలె సుఖమును గలిగించు చల్లఁదనముగలవియు వీచుటచేఁ జల్లనివై, మొసలిపూవులవంటి వాసనగలవియు నగువాయువులు దోసిళ్ళతోఁ బ్రాగఁదగియున్నవి. వికసించిన మద్దిచెట్లులతోఁగూడినదియు, మొగలిపూవుల నెత్తావిగలదియు నయిన యీపర్వతము, శత్రుసంహారమయినతరువాతఁ బుష్పమాలాలంకృతుఁడై, సువాసనగల గంధముపూసికొన్న సుగ్రీవుఁడు పట్టాభిషేక సమయమునఁ దీర్థజలములచే నభిషిక్తుఁడయిన చందమున వర్షధారలచేఁ దడుపఁబడుచున్నది. పర్వతములు మేఘములనెడు జింకతోళ్ళుదాల్చి, నీటిధార లనెడిజందెములుగలవై, గుహలందు గాలితో నిండియుండుటవలన వేదాధ్యయనము చేయుచున్న బ్రహ్మచారులమాడ్కి వెలుఁగుచున్నవి. ఆకాశమున మెఱుపులుమెఱయుచు, నుఱుము లుఱుముచునున్నందున నాకాశంబు బంగారు కొరడాలతోఁ గొట్టఁబడి, లోపల వేదనగలిగి మూలుగుచున్న దోయన్నట్లు కనఁబడుచున్నది. నల్లనిమేఘము నాశ్రయించి తళతళ మెఱయుచున్న మెఱుపు నల్లనయిన రావణునితొడమీఁద గూర్చుండ నిష్టములేక పెనఁగులాడుచుండిన దిక్కులేని సీతవలె నాకుఁ దోఁచుచున్నది. ఆకాశమున మేఘములు నక్షత్రములను గ్రహములనుజంద్రుని గ్రస్తి దిక్కులు దెలియకున్నందున, నాదిక్కులు కాముకులకు మేలుచేయునవో యన్నట్లు కనఁబడుచున్నవి. సౌమిత్రి! కొన్నిచోట్లు గొండనెత్తములందు గొండమల్లెచెట్లు బాష్పములతోఁగూడి, వర్షర్తువు వచ్చుటంజేసి చక్కఁగా పుష్పించినవై చిరకాలము ఎడఁబాసియుండిన కాంతలతోఁ గూడుటచే నానందబాష్పములు రాల్చుచు నవ్వుమోముతోఁగూడిన కాముకులమాడ్కి నుండుటంజేసి, ప్రియావియోగశోకముచేఁ గుందుచున్న నాకు మదనతాపమును మఱింత హెచ్చుఁజేయుచున్నవి.

చూడుము లక్ష్మణా! వానగురియుటచే దుమ్మణఁగెను. వాయువు చల్లగా వీచుచున్నది. ఎండబెట్ట తగ్గెను. రాజులందఱు యుద్ధములకు వెడలుటమానిరి. దూరదేశముల కేగిన జనులందఱు తమదేశముల కేగుచున్నారు. హంసలు మానససరోవరమునకు వెడలినవి. చక్రవాకపక్షులు

కాంతలతో గూడియున్నవి. దారులు వానగురిసి తొంపితో నిండినవై
యున్నందున బండ్లు మొదలగునవి నడవకున్నవి. అచ్చటచ్చట మబ్బులు
గ్రమ్మి యొకొక్కచోటఁ బ్రకాశముగలిగియు, నొకొక్కచోటఁ
బ్రకాశములేకయు నున్న యాకాశ మొకొక్కచోటఁ బర్వతములచే
నడ్డగింపఁబడి, మఱొక్కచోట శాంతమైన యలలతోఁగూడిన సము
ద్రమువలె వెలయుచున్నది. సెలయేళ్లయందు ఏఱుమద్దిపూలతోను,
కడపపూలతోను గూడినదియుఁ గావిఱాళ్లతోఁ గలియుటచే నెఱ్ఱ
నిదియునైన క్రొత్తనీరు నెమళ్ళకూఁతలు వెంబడింపఁగాఁ గడు వేగిర
ముగాఁ బాఱుచున్నవి. రసముచేఁ బూర్ణములును, తుమ్మెదలవంటి రంగు
గలవియు నయిన నేరెడుపండ్లను విశేషముగా జనులు దినుచున్నారు.
పెక్కురంగులుగల, మ్రగ్గిన మామిడిపండ్లు గాలిచే మిగుల నూఁగు
చున్నకొమ్మలనుండి క్రిందఁబడుచున్నవి. మెఱుపులను బెక్కేములుగల
వియు, కొంగ లనెడుపూవులసరములతో నిండినవియు, పర్వతశిఖ
రములంబోలు నాకారము గలవియు, గొప్ప గర్జనములుగలవియునైన
మేఘములు యుద్ధమున నొండొంటితోఁ బోరునట్టి మనపుఁజేనుఁగుల
మాడ్కి గర్జనముచేయుచున్నవి. వాననీటిచేఁ దనివినొందిన పచ్చిక
బయళ్లుగలవియు, వేడుకమీఱి నాట్యముసల్పుచుండు నెమళ్లతోఁ
గూడినవియు, మేఘములు వర్షించినతర్వాత దెల్లనివియునైన వనము
లపరాహ్ణములందుఁ గడు వెలుఁగుచున్నవి. మేఘములు నీటిబరువును
మోయుచు, కొంగలుకూడ వచ్చుచుండ నుఱుముచు, నెత్తగు పర్వత
శిఖరములం దాఁగి యాఁగి యలఁత దీర్చుకొనుచుఁ బోవుచున్నవి. గర్భ
ధారణనిమిత్తము మేఘములను గోరి సంతసముతో నేగునట్టి కొక్కెరల
పంక్తి యాకాశమున వ్రేలాడునట్లు కట్టఁబడి గాలి కెగురుచున్న తెల్ల
దామరపూవులమాలికవలె వెలుఁగుచున్నది. నేలయచ్చటచ్చట నారుద్ర
పురుగుల పిల్లలచే నెఱ్ఱనై క్రొత్తపచ్చిక బయళ్లుగలిగియుండుటచే చిలుక
వలె నాకుపచ్చనిరంగులుగల యచ్చటచ్చట లత్తుకరసముదగిలిన కంబ
ళముగప్పుకొన్న యంగనవలెఁ గనఁబడుచున్నది. కేశవునకు మెల్లగా
నిద్దుర వచ్చుచున్నది. ఏఱులు వేగిరముగాఁ గడలిం జేరుచున్నవి.
కొక్కెరలు సంతసముతో మేఘములను బొందుచున్నవి. అతివలు వల
పుతో మగనిని జేరుచున్నారు. వనమధ్యములందు నెమళ్లు మేఘదర్శన

ముచే నాట్యములు సల్పుచున్నవి. కబందవృక్షములు కొమ్మలందు విరిసిన పూవులతోఁ గూడియున్నవి. ఆఁబోతు లావ్రలందు వలపుఁజూపుచు వెంబడించుచున్నవి. పుడమి పైరుపచ్చలచే నొప్పుమీఱియున్నది. నదులు ప్రవహించుచున్నవి. మేఘములు వర్షించుచున్నవి. మదపుటేనుఁగులు ఘీంకారములు సల్పుచున్నవి. వనమధ్యములు వెలుఁగుచున్నవి. ప్రియులం బాసియుండువారలు తమప్రియురాండ్రను దలఁచుకొనుచున్నారు. నెమళ్లాడుచున్నవి. వానరులు నెమ్మదిగలిగియున్నారు. వానగురియుటచే సంతసమునందిన మదపుటేనుఁగులు మొగలిపూవులనెత్తావి నాఘ్రాణించి యానందమునొందినవై, వనమందలి సెలయేళ్లయందుఁ బ్రవాహము మీఁదినుండి క్రిందికిఁబడుటవలని చప్పుడుచేఁ గలగుండువడినవై, నెమళ్లతోఁగూడ ఘీంకారములు సల్పుచున్నవి. తుమ్మెదలు కదంబపుష్పములందలి మకరందమును గ్రోలి మదించినవై, యా వృక్షములకొమ్మలు క్రిందికి వాలియుండునప్పుడు, వానియందు వ్రేలుచు వాననీటిధారల పాటులచేఁ జక్కఁగాఁ గొట్టఁబడినవై తా మంతకుమున్ను సంపాదించిన మదమును దొఱఁగుచున్నవి. నేరెడుకొమ్మలు బొగ్గుపొళ్లరాసులం బోలు నవియు, రసపుష్టిగలవియునైన విస్తారములయిన పండ్లతో నిండినవై తుమ్మెదలగుంపులతోఁ గూడియున్నవో యన్నట్లు ప్రకాశించుచున్నవి. మెఱుపులతోఁగూడి యుఱుము లుఱుముచున్న మేఘములు యుద్ధములకుఁ బూనినవై యెక్కెములతోఁగూడి ఘీంకారము లొనర్చుచున్న యేనుఁగులమాడ్కి శోభిల్లుచున్నవి. పర్వతవనములలోనికిఁ బోవుటకై తఱలి దారినిబోవుచున్న యొక మదపుటేనుఁగు మేఘగర్జనము విని, యెదిరి యేనుఁగు వచ్చుచున్నది యని శంకించి, దానితోఁ బోరుసేయఁ గోరి వెనుకకు మఱలినదాయెను. వనప్రదేశము లొక్కచోఁ దుమ్మెదల ఝుంకారములచే గానము చేయుచున్నటులును, మఱొక్కచో నెమ్మళ్లచే నాట్యముచేయుచున్నటులును, మఱియొకచో మదపుటేనుఁగులవలె మదించియున్నటులును ఈతీరునఁ బెక్కింటికాశ్రయములై వెలుఁగుచున్నవి. వనప్రదేశములు కదంబార్జున సర్జపుష్పములతోఁగూడి, క్రొత్తనీటితో నిండినవై, మదించిన నెమ్మళ్లకూఁతలతోను నృత్యములతోను గూడి, మద్యపానముచేయు స్థలమువోలె వెలయుచున్నవి. పలురంగుల పెక్కులతోఁగూడిన పక్షులు సంతసముగలవై, మిక్కిలి తేట

యైనదియు, మృత్యములవలె నాకులందుఁ బడినదియునయిన లయుదక
మును దప్పిదీరఁ ద్రాగుచున్నవి. వనములందుఁ దుమ్మెదల ఝుంకార
ములె మధురమయిన తంత్రీనాదముగాను, కప్పల బెకబెకనాదములె
నోటితాళముగాను, మేఘగర్జితములె మద్దెలమోఁతగాను నేర్పడుటచే
సంగీతము నడుచుచున్న ట్లున్నది. వ్రేలాడుచున్న పురులనెడు నాభరణ
ములు దాల్చిన నెమళ్ళు కొన్నిచోట్ల నాడుచును, కొన్ని తావులను
గట్టిగాఁ గూయుచును, గొన్ని స్థలములందు నొక కొమ్మలందు
కూర్చుండియు నుండుటవలన నాట్యముచేయువారు, పాటపాడువారు,
విసువారునుంగల సంగీతసభ వనములందు జరుగుచున్నదో యనఁబరగి
యున్నది. పలుతెఱఁగులైన రూపములు, ఆకారములు, వర్ణనములు,
ధ్వనులుగల కప్పలు మేఘముల ధ్వనులచే చాలకాలమునుండి తమ్ముఁ
గ్రమ్మియున్న నిద్రనుండి మేల్కొలుపఁబడినవై వాననీటిధారలచేఁ
గొట్టఁబడినవై బెకబెకమని కూయుచున్నవి. మదించిన యువతులు
యున్నత స్తనములతో నొప్పుచు, క్రొత్తవైన కానుకలను, అనుభవ
యోగ్యపదార్థములను గైకొని, తమభర్తలచెంతకుఁ బోవునట్లు, నదులు
ప్రవాహముపైఁ దేలుచుఁ బోవుచున్న చక్రవాకపక్షులతోఁగూడినవై,
శిథిలములయిన గట్టులను విడిచి, వడిగాఁబాఱుచు, ప్రవాహవేగము
నకుఁ గొట్టుకొనివచ్చిన ఫలపుష్పాదులంగొని, వడిగా సముద్రునిఁ జేరు
చున్నవి. క్రొత్తనీటితో నిండినవై నల్లనై యున్న మేఘములందుఁ
గలిసిన నూత్న జలధరములగు మేఘములు కార్చిచ్చుచేఁ గాల్పఁబడి
నల్లపాఱియున్న కొండలమాడ్కి వెలుఁగుచున్నవి. మేఘదర్శనముచేఁ
నుప్పొంగిన నెమళ్ళుచేయు ధ్వనులతోఁగూడినవియు, ఆరుద్రపురుగు
లతో నిండిన పచ్చికబయళ్ళుగలవియు, కదంబపుష్పములయు, మల్లె
పూవులయు నెత్తావిచే గుబాళించునవియునై యొప్పుచున్న వన
మధ్యములందు గజములు సంచరించుచున్నవి. తుమ్మెదలు క్రొత్తనీటి
ధారలచేఁ గొట్టువడి రాలిపోయిన కింజల్కములుగల, కమలము
లను వేగ విడిచి, చక్కఁగా వికసించినవై, కేసరములతో నిండియున్న
కదంబపుష్పములలోని మకరందమును పానముచేయుటకై వ్రాలు
చున్నవి. గజేంద్రములు మదించియున్నవి. ఆఁబోతు లుప్పొంగుచున్నవి.
సింహములు వనములందు సేదదీర్చుకొనుచున్నవి. పర్వతములు

రమ్యములై యున్నవి. రాజులు నెమ్మదినున్నారు. దేవేంద్రుడు మేఘముతో విహరించుచున్నాడు. మేఘము లాకాశమున నిలిచి, సముద్ర ఘోషమును మాఱుజేయుచు జోరువాన గురిపించి, నదులను, చెఱువులను, కొలకులను, నడబావులను, బుడమినెల్లను జలమయము సేయుచున్నవి. వానలు ముసురుపట్టి కురియుచున్నవి. గాడ్పులు గొప్పధ్వనులతోగూడి వీచుచున్నవి. నదులు ప్రవాహవేగముచే గట్టులంగోసికొని, తప్పుదారులంబడి వడిగా బాఱుచున్నవి. రాజులు మానవులచే సకలతీర్థములనుండి తేబడిన బంగారు గిండీలయందలి తీర్థములచే నభిషేకింపబడినవారలై, తమరాజ్యలక్ష్మిని గనబఱచుతెఱంగునగొండలును దేవేంద్రుడొసగగా వాయువు దెచ్చిన మేఘములనెడి కుంభములచే నభిషేకింపబడినవై తమసొంపయిన రూపును జూపుచున్నవి. ఆకసమున నక్షత్రములు దెలియకుండునట్లు మేఘములు దట్టముగా గ్రమ్మియున్నవి. సూర్యునిదర్శనమే కాకయున్నది. క్రొత్తనీటివెల్లువ లంతటను వ్యాపించియున్నవి. చీకటిక్రమ్మియుండుటంజేసి దెసలు వెలుగులేకయున్నవి. వర్షధారలచే గడుగబడిన పర్వతములయొక్క శిఖరములు కడునెత్తినుండి వెడల్పుగలిగి ప్రవహించుచున్న సెలయేటిజలపాతములు గలిగియుండుటంజేసి, వ్రేలాడుచున్న ముత్యాలహారములతోగూడియున్నట్లు వెలయుచున్నవి. పర్వతములందలి వెడల్పుగల సెలయేటి జలపాతములు కొండఱా లడ్డుపడుటచే వేగముతగ్గినవై, నెమళ్ళకూతలతో నిండిన గుహాలయందు దారములు తెగుటచే జెదరిపడిన ముత్యాలహారములవలె బ్రకాశించుచున్నవి. పర్వతములందు వడిగా బాఱునట్టి వెడదసెలయేళ్లజలపాతములు కొండకొమ్ములపట్టులమీఁదికిని బోగొట్టుచు ముత్యాలహారమువలె బడుచు గొప్ప గుహాలసమీపభాగములందుఁ బ్రవహించుచున్నవి.

స్వర్గలోకమునందలి యంగనల సురతసమయములందుఁ జిక్కుకొనుటచేఁ దెగిన ముత్యాలహారములో యనునట్లు దెసలయం దంతటను వర్షధారలు విశేషముగాఁ గురియుచున్నవి. పక్షులు గూళ్లకుఁ జేరుటచేతను, తామరలు ముడుచుకొనుటచేతను, జాజితీఁగలు పూచుటచేతనుమాత్రము సూర్యుఁ డస్తమించెనని తెలియుచున్నది. రాజుల యుద్ధయాత్రలు నిలిచినవి. సేనలు మఱలుచున్నవి. విరోధములు తగి

నవి. నీరు పల్లములందు నిండుటవలన భూమియెల్ల సమమైయున్నది. భాద్రపదమాసమున వేదాధ్యయనారంభము సేయఁగోరు సామవేదులగు బ్రాహ్మణులకు వేదాధ్యయనయోగ్యమయిన సమయము ప్రాప్తించినది. కోసలదేశాధిపుఁడగు భరతుఁడు వర్షాకాలము నాలుగుమాసములలో నింటికిఁగావలసిన పనులను జేయుటకును, ద్రవ్యమును సేకరించుటకును వీలుగాదు గావున నాషాఢపూర్ణిమకు ముందే యన్నియుఁ జేర్చియుంచుకొనియుండును. నేనువచ్చినప్పు డయోధ్యాపురజనుల కోలాహలము హెచ్చినట్లు, ఇప్పుడు వానగురియుటచే సరయూనది ప్రవాహవేగశబ్దము నిక్కముగ హెచ్చియుండును. ఇట్టి సకలసుగుణో పేతమయియున్న వర్షాకాలమునందు సుగ్రీవుఁడు శత్రుబాధ దొలఁగించుకొని, భార్యనుబొంది, గొప్పరాజ్యమున నున్నవాఁడై సుఖముల నెల్ల ననుభవించుచున్నాఁడు. లక్ష్మణా! నేనన్ననో, భార్యను .దార వోసికొని, విస్తారమయిన రాజ్యమునుండి భ్రష్టుఁడనై, ప్రవాహముచే నానిన యేటిగట్టునుంబోలె నానాటఁ గ్రుంగిపోవుచున్నాను. నా శోకమో కడు గొప్పదై యున్నది. వర్షాకాలమో మిక్కిలి దాఁట నలవి కానిది. రావణుఁడన్ననో సులభసాధ్యుఁడుగాని శత్రువు. నాకుఁ జూడ నివి మూఁడును దాఁటనలవిగానివని తోఁచుచున్నది. ఇది యాత్రకుఁ దగనిసమయమనియు, దారులు నడచుటకు యోగ్యముగాకయుండు ననియు, నిప్పు డేకార్యమును జరుగదనియునెంచి, సుగ్రీవుఁడు చెప్పిన పనిచేయ సర్వసిద్ధముగానున్నను నే నేమియుఁ జెప్పకుంటిని. అంతియ కాక, మనకార్యము చాల గొప్పది. సుగ్రీవుఁడు బహుకాలంబు కష్టము లనుభవించి, యెన్నాళ్లకో భార్యతోఁ గలిసెను. అట్టి వానిని గొంతకాలమైనను, సుఖముతో నుండనీయక, యాతనికిఁ బనిపెట్టుట యనుచితమని మనపనిచేయ నియోగించనైతిని. సుగ్రీవుఁడు కొంతకాలము తన యలఁతదీర్చుకొని, తానే తగినసమయము వచ్చుటకుఁగి తనకుఁ జేసిన మేలునకు బదులుమేలు సేయఁగలఁడు. దీనికి సందియము లేదు. మంచిలక్షణములుగల లక్ష్మణా! నేను సమయం బెదురుచూచుచు, సుగ్రీవునియొక్కయు, నదులయొక్కయు ననుగ్రహమును నిరీక్షించుచుండెదను. శూరుఁడు తనకుఁ జేసినమేలును మఱువక బదులుమేలొనరించును. అట్లు వాఁడు కృతజ్ఞతలేనివాఁడై, ప్రత్యుపకారము సేయఁ

డేని, సత్పురుషులమనస్సును గుందించును. కావున సుగ్రీవుఁడు సాధు జనులయాగ్రహమునకు వెఱచినైనను మనకు మే లొనరింపఁగలఁడు" అని రాముఁడు లక్ష్మణునితోఁ జెప్పఁగా, లక్ష్మణుఁ డన్నపలుకులు విని, చక్కని చూడ్కిగల రాముంగూర్చి తన మంచినడత మెఱయ, "రాజేంద్రా! సుగ్రీవుఁడు నీచెప్పినచొప్పునఁ జేసి వేగిరమే నీ యభిలాషను దీర్పఁగలఁడు. కావున నీవు శత్రువధమున మనస్సుంచి, శరత్కాలము నెదురుచూచుచుండుము" అని చెప్పెను.

29-వ సర్గము.

హనుమంతుఁడు సుగ్రీవుని రాముని కార్యమునకై హెచ్చరించుట

ఆకాశము మేఘములు మెఱుపులును దొలఁగి, పండువెన్నెలతోఁ గూడి, బెగ్గురుపక్షుల యింపగు నాదములుగలిగి తేటయయి వెలుఁగుచుండఁగా, సుగ్రీవుఁడు తనయందుఁ బ్రేమగలభార్యను, తన్ను వలచినతారను బడసినవాఁడై, కోరినకోర్కెలెల్లఁ బొంది యెల్లప్పుడు స్త్రీలయందుఁ దవిలి, చెడుగులదారి నవలంబించి, యేకతమున నుండఁగోరి ధర్మార్థ సంగ్రహమునందు బుద్ధిలేక, నిర్భయుఁడై, మంత్రులందు రాజకార్యములనెల్లఁ బడవైచి, యా మంత్రులను విచారించుకొనక, రాజ్య సందేహాములను దీర్పక, విచ్చలవిడిగా రేయింబవళ్లును దేవేంద్రుఁడు నందనవనమున నప్సరసలతోడంబోలె విహరించుచుండెను. అప్పుడు కార్యములనేర్పఱుచువాఁడును, పనులనడపడులకలరూపు నెఱిఁగినవాఁడును, దేశకాలస్వరూపము నెఱిఁగినవాఁడును, మాటాడుటయందు నేర్పరియును నయిన హనుమంతుఁడు మాటలయభిప్రాయము నెఱుఁగఁగలవాఁడును, వానరేంద్రుఁడును నయిన సుగ్రీవునిపాలికిఁ జని, శ్రావ్యములై సకారణములై మనస్సుకు రమ్యములైయుండు మాటలుసెప్పి యాతనిమనమును శాంతపఱుపఁగోరి, యథార్థమును, హితమును, పథ్యమును, సామ యుక్తమును, ధర్మార్థములకు విరుద్ధము గానిదియు, స్నేహానురాగములతోఁ గూడినదియునైన తనమాటను వినుననుతలంపుతో నిట్లనియె:

వానరాధిపా! రాజ్యమును గీర్తియుఁ బొందితివి. వంశపరంపరగావచ్చినసంపద హెచ్చెను. మిత్రులను సంపాదించుట యను కార్య

మిక శేషించియున్నది. దానిని నీ విప్పుడు చేయవలయును. సమయము నెఱిగినవాడై యెల్లప్పుడు స్నేహితులందు మంచిమనస్సు గలిగియుండు వానికి రాజ్యమును గీర్తియు బరాక్రమమును హెచ్చును. పుడమి తేడా! బొక్కసము, సేనయు, మిత్రులును, ధైర్యమును గూడియుండు వానికి విస్తారమయిన రాజ్యమున కాధిపత్యము గలుగును. కావున నీవు మంచినడవడి గలవాడవు; సన్మార్గమున నడచువాడవు. కావున నీవు ప్రతిజ్ఞ చేసిన చొప్పున మిత్ర కార్యమును జక్కగా నెఱవేర్పుము. తన కార్యములను విడిచిపెట్టియైనను త్వరపడి యుత్సాహముతో చెలి కాండ్రపనులందు బ్రవర్తించువాని కెన్నటికి నాపదలు పొరయవు. స్నేహితుల కార్యములను సమయమునఁ జేయక, యావల యెంతగొప్ప పనులనైన నొనర్చినను, వాడు అదనుదప్పి చేసినవాడగుటచే జెలి కానిపనులను జేయనివాడే యగును. శత్రుసంహారివగు సుగ్రీవుడా! మనమిప్పుడు చేయవలసిన పని రామునికార్యము. అయ్యది సీతను వెదకుటయే. ఆపనిని మనమిప్పుడు తప్పక చేయవలయును. శత్రుసంహా రకా! ఇప్పు డా కార్యమునకు సమయముగూడ మీఱినదయ్యె. వాన రేంద్రా! రాముఁడు నియతకాలము నెఱిఁగినవాఁడైనను, సీతను జూచుటకుఁ దొందరపడుచున్నను, తెలిసినవాఁడు గనుక నీ యిష్టము చొప్పునఁ బోవఁదలఁచియున్నాఁడు గావునఁ దానుగాఁ గాల మతిక్ర మించినదని నీతోఁ జెప్పఁబోఁడు. రాముఁడు గొప్ప వంశమునందుఁ బుట్టినవాఁడు. జీవితమంతయు నీకు బంధువైయుండువాఁడు; సాటిలేని మహిమగలవాఁడు. గుణములందు సాటిలేనివాఁడు. వానరశ్రేష్ఠా! అతని కిప్పుడు నీవు సాహాయ్యముచేయుము. నీ కతఁ డింతకుమున్ను సాహాయ్యముచేసియున్నాఁడు. కావున ప్రత్యుపకారము చేయుటకై వానరశ్రేష్ఠుల కానతిమ్ము. రాముని ప్రేరణకాకమునుపే కార్యము నారంభింతుమేని, కాలము మీఱుదు. అట్లుకాక రాముఁడు ప్రేరణచేసిన పిదపఁ గార్యము నారంభింతుమేని, కాలముమీఱిపోవును. వాన రాధిపా! నీ వుపకారముచేయని వానికైన నుపకారముచేసెడివాఁడవు. నీకు రాజ్యధనము లొసఁగి మహోపకారము గావించిన, రామునికిఁ బ్రత్యుపకారముచేయువిషయమున నాలోచింపవలయునా? వానరు లయు, కొండముచ్చులయు గుంపులకుఁ దేఁడా! నీవు బలపరాక్రమం

బులు గలవాఁడవయ్యును, రామునికిఁ బ్రత్యుపకారముగావించి సంతోషము గలిగించుటకై, వానరసేనల కేల యాజ్ఞ సేయకున్నాఁడవు. రాముఁడు దేవతలను, అసురులను మహానాగములను దనబాణము లచే స్వాధీనపఱచుకొనఁ జాలినవాఁడే. అయినను, నీవుచేసిన ప్రతిజ్ఞ నెఱవేర్పఁగలవా యని పరీక్షింపఁ గోరియున్న వాఁడు. ప్రాణముల విడుచుటయందుఁగూడ వెఱపులేక నీ కతఁడు మేలొనరించెను. అట్టి రామునిపత్నియగు సీతను భూలోకమునను, స్వర్గలోకమునను వెదకుదము. దేవతలొండె, గంధర్వులొండె, అసురులొండె, దేవతాగణము లొండె, యక్షులొండె యా రామునికి భీతిగలిగింపఁజాలరు. అట్టి రామునకు రాక్షసు లేమిచేయఁగలరు? సుగ్రీవా! యంతటి శక్తిగల వాఁడును, తొలుత నీకు మేలొనరించినవాఁడును నయిన రాముని కన్ని విధముల నిష్టము నెఱవేర్పవలయును. వానరపుంగవా! నీ యాజ్ఞ యయ్యెనేని, మాలో నెవఁడును, పాతాళమునఁగాని, భూమియందుఁ గాని, నీటిలోపలఁగాని, యా కాశమునఁగాని యడ్డములేకుండ సంచరింపఁ గలఁడు. శత్రువులకు లొంగనివారును, విధేయులు నగు వానరులు పెక్కండ్రు నీకడ నున్నవారు. ఎవరెవ రేపనిని చేయవలయునో ఆన తిమ్ము" అని హనుమంతుఁడు సుగ్రీవునితోఁ జెప్పెను.

సత్త్వగుణవంతుఁడగు సుగ్రీవుఁడును సమయమునఁ జక్కఁగా నెఱిఁగింపఁబడిన యా హనుమంతునిమాటను విని, కార్యముచేయుట యందే యుత్తమబుద్ధినుంచి, సకలదిక్కులందుండు సేనలను రప్పించు టకై, యెల్లప్పుడు ప్రయత్నపరుఁడై యున్న యిష్టుఁడయిన నీలునిఁ బిలిచి, "ఓసేనాధిపా! నాసేననంతటిని యూథపాలురను తడవుసేయక యిచ్చ టికివచ్చి చేరున ట్లానతిమ్ము. వేగిరముగ నడచువారును, ఉత్సా హముగలవారు నగు సేనలహద్దులను గాపాడువారు నా యాజ్ఞనుగొని తమతమ వశమున నున్న సేనలను వేగిరముగఁ గొనివత్తురుగాక! సమీ పమునఁనున్న సేనలను నీవే కొనిరమ్ము. నేడు మొదలు పదునై దుదినముల లోపల నిటవచ్చిచేరనివానికి మరణదండన విధింపఁబడును. ఇది నిస్సంశ యము. నీవును నా యాజ్ఞ గొని యంగదునిఁ దోడ్కొని ముదుసలు లగు వానరులను దోడ్కొనిరమ్ము" అని యేర్పాటుచేసి, మఱలఁ దనయంతఃపురము చొచ్చెను.

30-వ సర్గము.

శరత్కాలవర్ణనము

సుగ్రీవుఁడిట్లెఱిఁగున నీలుని కానతియొసఁగి వెండియు గుహా లోపలికిఁ జొచ్చెను. మేఘములుడివోవఁగా నాకాశము నిర్మల మయ్యెను. రాముఁడెట్టకేలకు వర్షర్తువుంగడపి, శరదృతువురాఁగా సీతావియోగతాపముచేఁ గడు నొచ్చినవాఁడై, తెల్లనైన యాకాశ మున వెలుఁగుచున్న చంద్రబింబమును వెన్నెలచేఁ బూయఁబడినట్లుండు శరద్రాత్రినిజూచి, సుగ్రీవుఁడు కామపరవశుఁడై తనకార్యముంగూర్చి ప్రయత్నపడకుండుటను, సీతపోవిడి తెలియకుండుటను, దినములు గడ చుటను తలఁచి "యిఁక నేనెట్టు లీ శరదృతువుం గడపఁగల"నని మిక్కిలి నొచ్చినవాఁడై మూర్ఛనొందెను. మతిమంతుఁడయిన యా రాముఁడు మఱికొంత తడవునకు మూర్ఛ దెప్పిఱిలి, సీత తనమనస్సున నున్నను, ఆ సీతనుగూర్చి తలపోయుచు, బంగరుమయమయిన శిలలతో నిండిన ప్రస్రవణపర్వతశిఖరమునఁ గూర్చున్నవాఁడై మెఱుపులును, మబ్బులునుతోలఁగి, బెగ్గురుపక్షులనాదములతో మ్రోఁగుచున్న తేట వెన్నెలతోఁగూడిన శరత్కాలమందలి యాకాశమునుజూచి, ప్రియా విరహాము సహింపజాలక దీనములయినపలుకులతో నిట్లు విలపింపఁ దొడఁగెను.

"మున్ను తపోవనములందు బెగ్గురుపక్షివలె మాటాడునట్టి ముగుద యగు నా ప్రియురా లీ బెగ్గురుపక్షుల కూఁతలను విని యానందించు చుండెను. అట్టి నాప్రియ యిప్పుడెట్లు వినోదించుచున్నదో! తొల్లి నాతో నున్నప్పుడు విరిసినబంగారంపు వన్నెగలిగి నిర్మలములయిన వేగిస చెట్లనుజూచి సంతసంపడుచుండిన యా ముగుద యిప్పుడు నన్నుఁజూడక యెట్లు విహరించుచున్నదో! ఇంపుగాఁ బలుకునదియు, చక్కని యన్ని యంగములుగలదియు నయిన సీత ముందు రాయంచలకూఁతలకు మేలు గొనునది యిప్పుడెట్లు మేలొక్కనుచున్నదో! తెల్లధామకరేకులంబోలు కన్నులుగల సీత, తమప్రియులతోఁగూడి సంచరించు చక్రవాకపక్షుల మనోహరధ్వనులను విని, నావిరహాముచే నెట్టిస్థితి నొందునో! ఇప్పుడు లేఁడికన్నులబోలుకన్నులుగల నా ప్రియురాలింబాసి, యెన్ని కొలఁ

కులుఁ చెఱువులు, నడబావులు, అడవులు, తోపులుంగ్రుమ్మరినను నా మనసునకు సుఖము లేదు. శరత్కాలగుణములచే మఱింత పెంచిన మన్మథుఁడు నావియోగమువలనను, సుకుమారతవలనను సీత తాప మోర్వఁజాలదని యెంచి యా భామినిని మరణావస్థకుఁ దేకుండునా?" అని యిట్లు లెల్లఁ జాతకపక్షి జలముంగోరి యింద్రునింగూర్చి మొఱయిడి నట్లు రాజశ్రేష్ఠుఁడయిన రాజపుత్రుఁడగు రాముఁడు విలపించెను. అప్పుడు లక్ష్మీవంతుఁడయిన లక్ష్మణుఁడు పండ్లకొఱ కందములయిన కొండచరులయం దంతటఁ దిరిగితిరిగి మఱలివచ్చి యన్ననుజూచెను. అప్పుడు విజనమున రాముఁ డోర్వరానివగపుతోఁగూడి యొంటరియై మైమఱచియున్న యన్ననుజూచి లక్ష్మణుఁడు తానును వగచే ధైర్యమేది యాతనితో నిట్లనియె :

"ఓ పూజ్యుఁడా! యిప్పుడిట్లు కామునికి లోఁబడి విలపించుటచే నేమి యుపయోగము? ఇట్లు ధైర్యముగోలుపోవుటచే నేమి యుపయోగము? ఎప్పుడు ఈ నెమ్మది యుండవలసియున్నదో, అప్పుడిట్లుత్సాహము లేక దుఃఖించుటచే నేమియుపయోగము? ఓ దీనముకాని స్వభావముగలవాఁడా! కార్యమునకైను ప్రయత్నము, కలవరపాటులేమి, నెమ్మది, ఉపాయము, దేశకాలములు, సుగ్రీవుఁడు మొదలగువారి సహాయసంపద, స్వకర్మకుఁ గారణమైన దేవాతాప్రార్థనాదులు కార్యసాధనమునకు హేతువులుగాఁ దెలిసి కార్యమును సాధింపఁదల పెట్టుము. మనోవంశోద్ధారకా! నీ ప్రియయగు సీత యొకనికి దొఱకు నదికాదు. మండుచున్న యగ్నిజ్వాలను గదిసి యెవ్వఁడేనిఁ గాలిపోక యుండునే? నీ వాసందియము వాయు"మని రాముని లక్ష్మణుఁ డూఱడించెను.

అంత రాముఁడు పగతురకు లొంగనివాఁడును, శుభలక్షణుఁడును, హితమును, పథ్యమును, ధర్మార్థసహితమును సామవచనయుక్తము నయిన మాటం జెప్పినవాఁడును నయిన యా లక్ష్మణుంగూర్చి యిట్లనెను : "కుమారా! లక్ష్మణా! సందియము లేక కార్యము తెఱఁగు విచారింపవలసినదే. మిత్రసంపదఁ జేర్చుటయు, ఉత్సాహమును బూనవలసినదే. సాధింపరానిదియైన ప్రకృతకార్యముయొక్క ఫలమును గూర్చి యోచింపవలసినదే" అని చెప్పి రాముఁడు పత్నీయగు సీతను

దలఁచుకొని యెండుపాటినమోముతో లక్ష్మణునికి వెండియు నిట్లనెను: "లక్ష్మణా! దేవేంద్రుఁడు వానగురిపించి, పుడమిని దనివినొందించి పైరులను బాగుగఁబండించి, తాఁజేయవలసినకార్య్యమును బూర్తిచేసి కొని మఱలిపోయెను. రాజపుత్రా! మేఘములు గంభీరమయిన చక్కని ధ్వనితోఁగూడి, పర్వత వృక్షములందు సంచరించుచు, వర్షముగురిపించి యలసిపోయుచున్నవి. నల్లగలువతేకులవలె నల్లనయిన మేఘములు పదిదిక్కులను నల్లవిగాఁజేసి, మదముడిగిన యేనుఁగులమాడ్కి వేగము తగ్గినవై యున్నవి. సాధువా! నీటితోఁగూడి, అడవిమల్లెపూవులయు, ఏఱుమద్దిపూవులయు నెత్తావిగలిగి మహావేగముతో వీచుచు వాన గాడ్పు లంతట సంచరించి నిలిచెను. అనఘుఁడవగులక్ష్మణా! మేఘగర్జనములును, ఏనుఁగుల ఘీంకారములును, నెమళ్లకేకానినదములును, నెలయేళ్లు వేగముతోఁబడునప్పుడు గలుగు చప్పుడులును తటాలున నడఁగినవి. వివిధములయిన చరులుగల పర్వతములు జడివానలచేఁ జక్కఁగఁ గడుగఁబడి, మాలిన్యములేనివై, పలురంగులుగల కావిఱాలకూడికచేఁ గుంకుమాదిపరిమళద్రవ్య మిశ్రమైన గంధ మలఁదికొన్నచందమున వెలుఁగుచున్నవి. ముగుదలు గ్రొత్తగా మగలతోఁ గూడిననాఁడు సిగ్గుచేఁ గొంతసేపు బిగింపుసేసి తిన్నగాఁ దమజఘనములు చూపినతీరున, శరత్కాలనదులును ప్రవహించి ప్రవాహములు తగ్గినతరువాత మెల్ల మెల్ల నిసుకతిన్నెలను గనఁబఱుచుచున్నవి. శరద్ఋతువురాఁగా, నేడాకులయరఁటిచెట్లు విరులతోఁ గూడి యలరుచున్నవి. సూర్య్యచంద్ర నక్షత్రములు చక్కఁగా వెలుఁగఁదొడఁగినవి. మదపుటేనుఁగులు సొంపు మీఱియున్నవి. శరత్కాలగుణములచేఁ గలిగిన సౌందర్య్యలక్ష్మి పెక్కుతావులందుఁ బలుతెఱంగుల కాంతిగలదై యున్నను ప్రకృతము సూర్య్యని తొలివెలుఁగులు సోఁకినంత వికసించినపద్మములుగల తామరకొలఁకులయం దెక్కువ శోభిల్లుచున్నది. వనములందు గాడ్పు లేడాకులరఁటిపూవులతావిగలవై తుమ్మెదల ఝుంకారములతోఁగూడి వీవఁగా, మదపుటేనుఁగులకు మదము హెచ్చుచున్నది. ఏళ్లయిసుకతిప్పలనుండి కవగూడివచ్చినవియు, సరోవరములయందలి నివాసము నిచ్చగించుననియు, తామరపూవుల పుప్పొళ్లుగ్రమ్మిన విశాలములయిన జక్కని తెక్కలుగలవియునగు జక్కవలతోఁగూడ నంచలు విహరించుచున్నవి.

శరత్కాలలక్ష్మి మదముచే శోభిల్లు నేనుఁగులయందును, ఆ మెక్కిన యాఁబోతులమందలందును నిర్మలోదకములగు నదులందును బంచిపెట్టఁ బడినట్లు సముగ వెలుఁగుచున్నది. మేఘము లాకాశమును విడిచి పోవుటను గని, వనములందలి నెమళ్లు పురులు ముడుచుకొని, పెంటి నెమళ్ళయం దనురక్తినూని, కాంతితఁగినవై, సంతసము దొఱఁగి శ్రావ్యనాదములుచేయక ధ్యానముచేయుచున్నవి. మనోహరములగు సువాసనగల యనేకములయిన వేగిసచెట్లు పుష్పభారముచే వంగిన కొమ్మలుగలవై బంగారువలెఁ బచ్చనై కన్నులకొప్పియుండుటచేత వన ప్రదేశములు దీపములతోఁగూడినట్లు ప్రకాశించుచున్నవి. ఈ ఋతువు నందు వనవిహారజలవిహారములం దాసతోగల మేటియేనుఁగులు తమ ప్రియలతోఁగూడి, యేడాకులయరటి పూవులవాసనకు వెచ్చిన మదముగలవై మదజలము గండస్థలములను భేదించుకొని కాఱు చుండఁగా మఱింతమదించినవై తిన్నగా నడయాడుచున్నవి. శరదృతు వునం దాకాశము మేఘములులేమిచేఁ గత్తివలెఁ దెల్లనివన్నెగలిగి యున్నది. నదులు సన్నగాఁ బాఱుచున్నవి. గాడ్పు లెఱ్ఱతామరపూవు వలెఁ జల్లఁగా వీచుచున్నవి. దిక్కులు చీఁకటి తొలఁగఁగా వెలుఁగు చున్నవి. చక్కఁగా నెండకాయుటచే బురదయెండి పుడమినుండి దట్ట మైన దుమ్ములేచుచున్నది. ఒండొరులపై విరోధమును, కోపమును గల రాజులు యుద్ధయాత్రకై వెడలుచున్నారు. ఆఁబోతు శరదృతుగుణ ములచే నొప్పారినరూపకాంతులు గలిగినవై యుప్పొంగుచు, దుమ్ము గ్రమ్మిన మేనులతోఁగూడి, మదించినవై, యొండొంటితోడఁ బోరాడఁ గోరి, యాహ్వానడుమ అంకెలువేయుచున్నవి. వనమునందలి యాఁడే నుఁగు లోర్వఁజాలని మోహాముగలవై, తమగుంపులతోఁగూడి, కామాతిరేకముతోఁ గూడి, మదించి, తిన్నని నడకనడచుచున్న తమ భర్తలను జుట్టుకొనిపోవుచున్నవి తొలుత ధనికులుగ నున్నహారు కాలవైపరీత్యమువలన దరిద్రులుగాఁగా, నూతనధనికులు హేళనము చేయ నేమియుఁజేయఁజాలనట్లు, నెమళ్లు వర్షర్తువునందు మేఘోదయ కాలమునఁ దమకలంకారములయిన మేటిపురులను విచ్చియాడుచుండి నవి. ఇప్పుడవి మేఘములుపోవుటంజూచి, తమపురులను ముడుచుకొని, యేటిగట్టులకుఁబోఁగా, హంసలు శరత్కాలము వచ్చుటంజేసి గర్వించి

తమ్ము హేళనముచేయంబడినవివోలె గర్వముడిగి విన్నదనముతోఁగూడి మఱలిపోవుచున్నవి. మదముచేఁగలిగిన గండస్థలంబులనుండి మదజలంబు గార్చునట్టి మేటియేనుఁగులు కారండవములను, చక్రవాకపక్షులను గొప్పహింసకారములొనర్చి బెదరించుచు విరిసినకమలములచే శోభిల్లుచున్న కొలఁకులనుఁ గలియఁబెట్టి కలియఁబెట్టి నీటిని బ్రాఁవుచున్నవి. రొంపిలేక, తేఁటనీటితోఁగూడి యిసుకచే నొప్పినవియు, గట్టులం దాల మందలతోఁగూడి, బెగ్గురుపక్షులనాదములతో నొప్పుచున్నవియునగు నదులందు రాయంచలు సంతసముతోఁ దిరుగుచున్నవి. వర్షాకాలము పోయి, శరత్కాలము వచ్చుటచేత నేఱులును, మేఘములును, నెలయేళ్ళ నీటిధారలచప్పుడును, పెచ్చుపెరిగిన గాడ్పులధ్వనులును, నెమళ్ళ కేకలును, సంతనములేని కప్పలకూఁతలును వేగిరముగ నిలిచి పోయెను. పెక్కురంగులుగలవియు, వర్షాకాలమున వానకు వెలుపల రాక పుట్టలలోనెయుండుటచే మిక్కిలిచిక్కినవియు, తీక్ష్ణవిషము గలవియునైన పాములు చాలకాలము బిలములలోపల నాహారము లేక యుండుటవలన నాఁకలిచేఁ బీడితములగుచు శరదృతువురాఁగా వెలుపలికిఁ బ్రాఁకుచున్నవి. * ప్రకాశించుచున్న చంద్రునికిరణములు

---

*శ్లో. చంచచ్చంద్రకరస్పర్శహర్షోన్మీలితతారకా,
అహో రాగవతీ సంధ్యా జహాతి స్వయ మంబరమ్.

చంచత్ చంద్రకరస్పర్శహర్ష ఉన్మీలితతారకా=ఉదయించుచున్న చంద్రుని కిరణముల తాఁకిడువలని శోభచే వెలుఁగుచున్న నక్షత్రములుగలది యని యొక యర్థము. వెలుఁగుచున్న చంద్రుఁడను పురుషునిచేతితాఁకిడుచేతఁ గలిగిన సంతోషముచేఁ దెఱచికొన్న కన్నులుగలదియని మఱియొక యర్థము. రాగవతీ=ఎఱ్ఱదనము గలదియనియొకయర్థము. ప్రేమగలదియని యొకయర్థము సంధ్యా=సంధ్యాకాలము, అని యొకయర్థము. సంధ్యయను నొకస్త్రీయని మఱియొకయర్థము. స్వయం=తానే, అంబరం=ఆకాశమును అని యొకయర్థము. వస్త్రమును అనియొకయర్థము. జహాతి=విడుచుచున్నది. విచ్చివేయుచున్నది. అహో=ఆశ్చర్యము. ఈశ్లోకమున చంద్ర పదముపుల్లింగమగుటచేతను, సంధ్యాపదము స్త్రీలింగముగనుకను, కరము, తారక, రాగము, అంబరము అను పదములర్థద్వయముగలవగుటచేతను. "ఒకానొకకాముకి యగునతివతనప్రియుని చేయి తగిలినంతట సంతోషముచేఁ గన్నులువిచ్చినదై, సురత ముగోరి తానే శోకవిచ్చుచున్నది. ఆహా! మోహముయొక్కమహిమ యేమనవచ్చు ను!" యని యర్థము ధ్వనించుచున్నది. రామాయణమున నిది యొక వాల్మీకిచమత్కారముఁదెల్పు శ్లోకము. చదువరుల యాహ్లాదమునకై, శ్లోకమునిందుఁ జేర్పబడుచున్నది.

సోకుటచే సంతసించి వెలుఁగొందుచున్న తారకలుగలదియు, రక్త వర్ణముగలదియు నగుసంధ్య తనంతన యాకాశమునువిడిచిపోవుచున్నది. చంద్రుఁడను చక్కనిమోమునుగలదియు, నక్షత్రములనెడు వెలుఁగు చున్న కన్నులుగలదియు, వెన్నెలయను దుప్పటముగలదియు నయిన రాత్రి తెల్లని చీరె గప్పుకొన్న చానవలె నొప్పుచున్నది. బెగ్గురుపక్షులు చక్కఁగాఁ బండినశాలిధాన్యపువెన్నులను దిని యేపుమీఱి వరు సలుదీరి గాలి కెగిరిన మల్లెపూవులసరమువలె విరాజిల్లుచు నాకసమునఁ బోవుచున్నవి. నిద్రించుచున్న యొంటి రాయంచగలదియు, పెక్కు తెల్ల గలువలతోఁ గూడినదియునైన గొప్పమడుఁగులనున్న నిర్మలోదకము, మబ్బులతోలఁగి, చంద్ర బింబముచేతను నక్షత్రగణముచేతను నొప్పు చున్న యాకాశముమాడ్కి వెలుఁగుచున్నది. అచ్చటచ్చట నివసించు చున్న హంసములు చలించుచున్న మొలనూళ్ళయి వికసితకమలోత్ప లములు పుష్పహారములై తలిర్ప, మేటినడబావు లలంకృతలయిన యంగనలచందమున నెక్కువ శోభిల్లుచున్నవి. పిల్లనఁగ్రోవులరవ మును, వేఁకువను వీఁచునట్టి గాలి చప్పుడును, గొల్లతలు పెరుగు చిలుకునప్పుడు గలుగుధ్వనులును, దూడలకై యఱచుగోవుల యఱపు లును, ఆఁబోతులు చేయునట్టి అంకెలు నొండొంటితోఁగలసి పెం పొందుచున్నవి. ఏళ్ళగట్టులు పువ్వులచే నొప్పినవై, మెల్లనిగాలికిఁ గదలుచు నుతికిన ముఱికిలేని తెల్లనిబట్టలచందమున వెలిఁగెడి తెల్లుచేఁ గప్పఁబడినవై తెల్లపట్టుచీరలఁగట్టిన యతివల జఘనములవలె వెలుఁగు చున్నవి. అడవులందు నిరాటంకముగాఁ దిరుగునవియు, పూఁదేనె గ్రోలుటయందు నేర్పుగలవియునైన తుమ్మెదలు ప్రియాసమేతములై కమలంబులందు వాలినప్పుడు, వానిపుప్పొడి యంటుకొనుటచేఁ బచ్చని వన్నెగలవై, గాలియందలి సువాసనగొనుటకై మోహముతో గాలిని వెంబడించిపోవుచున్నవి, తేటనీరును. వికస్వరకుముదములును, కొంగల కూఁతలును, పచ్చగాఁబండిన వరిపైరును, మెల్లనిగాలియు, నిర్మలమగు చందమామయు వర్షర్తువు గతించెనని తెలుపుచున్నవి. కామినులు రేయియెల్లఁ దమప్రియులతోఁ గ్రీడించి వేఁకువలేచి యలసటచేఁ దిన్నగా నడచిపోవుచందమున, చేఁపలనెడి యొడ్డాణములను గనఁ బఱచుచు నదీకాంతలు శరదృతువురాఁగా మెల్లగాఁబాఱుచున్నవి.

చక్రవాకపక్షులతోను, పాచితీఁగెలతోను, వెలిపట్టుచీరెలవంటి పెల్లు పొదలతోనుగూడిన నదులముఖములు మకరికాపత్రములచే నలంక రింపఁబడి, గోరోచనముపూఁతగలిగి వెలిపట్టుచీరల మేలిముసుఁగుగల యువిదలమోములమాడ్కి వెలుఁగుచున్నవి. చక్కగా వికసించిన గోరింటపూవులచేతను వేగిసపూవులచేతను మనోహరములై, మదించిన తుమ్మెదల ఝుంకారములతోఁ గూడియున్న వనములందు మన్మథుఁడు వాఁడితూపులను వింటిని దాల్చినవాఁడై విరహిజనులను బాధింప నిర్భయముగాఁ దిరుగుచున్నాఁడు. వార్షికమేఘములు లోకమును పూర్ణవర్షముచేఁ దనివినొందించి, నదులను చెఱువులను నిండించి. భూమిని పైరుపంటలచే వెలయఁజేసి, యాకాశమువిడిచి పోయెను. కొలఁకులు తేటనీటితోఁగూడినవై, చక్రవాక పక్షులతోను, రమ్య ముగాఁగూయు నాఁడుకొంగలరవములతోను గూడి యొక్కువగా వెలుఁగొందుచున్నవి. కొండచరులందు వేఁగిసచెట్లు, ఏడాకులయరటి చెట్లు, కాంచనపుఁజెట్లు, మంకెనచెట్లు, ప్రేంకణపుఁజెట్లును జక్కఁగాఁ బూఁచియున్నవి. లక్ష్మణా! యేళ్ళయందలి యిసుకదిన్నెలు, రాయం చలు, బెగ్గురుపక్షులు, చక్రవాకములు, కొక్కెరలు మొదలగు పక్షు లతో నంతట నొప్పుచున్నవి చూడుము. రాజపుత్రా! మచ్చరము పెచ్చుపెరిగి యొండొరులను జయింపగోరు రాజులదండయాత్రకుఁ బ్రయత్నించునదనిదె వచ్చినది. రాజపుత్రా! రాజులు దండయాత్ర వెడలుట కిది ముఖ్యమైనకాలము. సుగ్రీవుఁడును గనఁబడఁడు. అట్టి ప్రయత్నమును గానరాదు. ఓ లక్ష్మణా! సీతనుగానక చింతాక్రాంతుఁడనై యీ వర్షాకాలము నాలుగునెలలను నూఱేండ్లతోపాటు గడపితిని. ఆఁడుచక్రవాకపక్షి తనభర్తను వెంబడించి వనమునఁబోవునట్లు, ఈ సీతయు నన్ను వెంబడించి, పూఁదోటకుఁబోవునట్లే యీ భయంకర మగు దండకారణ్యమునకు సంతసముతో వచ్చినది. లక్ష్మణా! రాజ్యము నుండి తొలఁగింపఁబడి యడవులకుఁ బంపఁబడినవాఁడనై ప్రియురాలి నెడఁబాసి, వంతచేఁ గుందినవాఁడనయియున్న నాయెడ సుగ్రీవున కింకను దయపుట్టలేదుగదా! శత్రుసూదనుఁడవయిన యో లక్ష్మణా! "ఇతఁడు దిక్కులేనివాఁడు; రాజ్యముబోఁగొట్టుకొన్నవాఁడు; రావ ణునిచేఁ దిరస్కరింపఁబడినవాఁడు; దీనుఁడు; స్వదేశమునకుఁ గడుదవ్వున

నుండువాఁడు; కాముకుఁడు; నన్నే శరణు చొచ్చినవాఁడు." అను నీకారణములచే నన్ను లక్ష్యపెట్టక దురాత్ముఁడయిన వానరేంద్రుఁడగు సుగ్రీవుఁడు నన్నవమానించినవాఁడు. స్వకార్యము నెఱవేఱెనుగనుక దురహంకారి యగు సుగ్రీవుఁడు శరత్కాలము వచ్చినతోడనే సీతను వెదకుటకుఁ బోయెదనని ప్రతిజ్ఞ నేసియు దినములు లెక్కింపక యట్లు సీతాన్వేషణప్రయత్నము చేయకయున్నాఁడు, నీవు కిష్కింధాపురముసొచ్చి, మూఢుఁడయి, తుచ్ఛసుఖములందుఁ దవిలియున్న సుగ్రీవునితో నా మాటగాఁజెప్పుము. "ఓసుగ్రీవా! లోకమునఁదొలుత నెవఁడు యాచకులకును, డొగ్యులకును, తనకు మేలుచేయువారికిని ఆశనుగల్పించి వారడిగినది యిచ్చెదననిచెప్పి యావల నాశాభంగమునుచేయుచున్నాఁడో, వాఁడు మానవాధముండని చెప్పఁబడుచున్నాఁడు. ఎవఁడు మంచిదో, లేక చెడ్డదో యొకపనిని చేసెదనని మాటయిచ్చి యాప్రకారము జరిపించుచున్నాఁడో, అట్టి మొనగాఁడే మానవులలో నుత్తముఁడన బరఁగును. తా మొరులచేతఁ బనిచేయించికొని, యొరులకుఁ గష్టము సంభవించునప్పుడు ప్రత్యుపకారము గావింపని కృతఘ్నులు చచ్చినను, వారి శవములను కుక్కలు నక్కలుగూడఁ దినవు" అని చెప్పుము. ఆ సుగ్రీవుఁడును సమరమున నేను బంగారుమయమయిన వెనుకభాగము గల ధనుస్సు నీడ్వఁగా, మెఱుపుగుంపువలె మెఱయుచున్న యద్దాని రూపమును జూడఁగోరుచున్నాఁడు గాఁబోలును. ఇది నిజము. నేను కుపితుఁడనై యుద్ధరంగమునఁ జేయు వజ్రఘోషమునుబోలిన యల్లెత్రాటిచప్పుడును మఱల వినఁగోరుచున్నాఁడు గాఁబోలు. ఈ సుగ్రీవుఁడు వాలివధమువలన నీతోఁగూడియున్న నాయొక్కపరాక్రమ మిట్టిదని యెఱిఁగియుండియుఁ గాలముమించినను, సీతాన్వేషణ చింతలేకయున్నాఁడు గదా! శత్రుపురములను ధ్వంసముచేయువాఁడా! యేపని నిమిత్తమై యీ సుగ్రీవునితోడి చెలిమియు, వాలివధమును గావింపఁబడెనో, ఆ స్వకార్యము నెఱవేఱుటచే సుగ్రీవుఁడు ప్రతిజ్ఞను మఱచినవాఁడు. కావుననే యతఁడు వర్షాకాలము వెళ్లఁగా వచ్చెదనని ప్రతినయొనర్చి యీ నాలుగునెలలు గడచినను విహారములుసలుపుచుఁ దెలియకయున్నాఁడు. ఆ సుగ్రీవుఁడు మంత్రిపరిజనములతోఁ గూడినవాఁడై వినోదించుచు మద్యపానమునందే యాసక్తుఁడయియున్నాఁడు.

కాని, శోకపీడితులమయియున్న మనయెడ దయదలఁపక యున్నాఁడు. మహాబలుఁడవగు లక్ష్మణా! సుగ్రీవునికడకుఁబోయి, నాకోపమురీతి యెట్టిదో యతనికిఁదెలిపి జెప్పిరమ్ము. మఱియు "ఓ సుగ్రీవుఁడా! వాలి నాచే హతుఁడయి యేమార్గమునఁ బోయెనో, ఆ మార్గము మాయఁ బడలేదు. నీవు ప్రతిజ్ఞను గాపాడుకొనుము. వాలిదారిని వెంబడింప కుము. నా బాణముతో రణమున వాలియొక్కఁడే మృతినొందెను. నీవు ప్రతిజ్ఞ దప్పితివేని, నిన్ను సకుటుంబముగా ధ్వంసముచేసెదను" అని యతనితో నామాటగాఁ జెప్పుము. పురుషశ్రేష్ఠుఁడవైన లక్ష్మణా! కార్య మితీరున నున్నది గనుక నిక్కార్యమునకు దగినట్లుగా నే యేమాటచెప్పవలయునో యాయామాటం జెప్పుము. కాలము మించి పోవుచున్నది. త్వరపడుము. నీ వా సుగ్రీవునికడకేగి, "వానరపుంగవా ఆడినమాటలచొప్పున నడచుట యుత్తమధర్మమనియు, సత్యముతప్ప రాదనియు, నేను ప్రయోగించిన బాణంబులచే యుద్ధరంగమున నీల్గిన వాఁడవై జమునివీటికిఁజని వాలింజూచునట్లు చేసికొనకుము" అని నా మాటగాఁ జెప్పుము." అని రాముండు లక్ష్మణునితోఁ జెప్పెను. తీక్ష్ణ ప్రతాపుఁడయిన మనువంశమునకుఁ బ్రభువగు లక్ష్మణుఁడు సీతా వియోగశోకముచే దీనుఁడయియున్నను రాముఁడు సుగ్రీవునిమీఁది యాగ్రహముచే నోర్వరాని యెక్కువకోపంబుగలవాఁడై, యూఱ డించినను నిమ్మళింపకయుండుటం గని సుగ్రీవునియందు మిక్కిలి కఠిన మయిన తలంపుగలవాఁడయ్యెను.

31-వ సర్గము.

లక్ష్మణుఁడు సుగ్రీవునికడ కేగుట

ఆ దశరథనరేంద్రుని నందనుఁడయిన లక్ష్మణుఁడు కామకుఁడగు టచే ధైన్యమునందినవాఁడును, స్వాభావికముగా ధీరుఁడును, సీతా వియోగఖిన్నుఁడై, సుగ్రీవుఁడు కాలమునిమీఱి రాకయుండుటచే నతనిమీఁద నెక్కువయాగ్రహము చెందినవాఁడును నయిన యన్న యగు రామునిఁగూర్చి యిట్లనియె. "ఓ పూజ్యుఁడా! సుగ్రీవుఁడు తన కుపకారమొనర్చినవారికిఁ బ్రత్యుపకార మొనరింపవలెనను సజ్జనుల ధర్మమునందు నిలువఁడు. రామునితోడి చెలిమివలననేకదా నా కీరాజ్య

మును, భార్యయు దొరకెననియుఁ దలంపఁడు. ఇతండు వానరరాజ్య సంపద ననుభవింపఁదగఁడు. కావున, ఈతనిబుద్ధి మనకార్యముల కనుకూలింపదు. వీఁడు మదిసెడి, కామసుఖములం దవిలి, నీ యుపకారము నకుఁ బ్రత్యుపకారము సేయుటయందుఁ దలంపులేనివాఁడై యున్న వాఁడు. కావున వీఁడు నాచే హతుఁడై యన్నకడకుఁబోయి చేరును గాక! ఇట్టి చెడుగుణములు గలవాని కెంతమాత్రము రాజ్యము నీయఁ దగదు. నామనస్సున వేగముతోఁ బుట్టుచున్న కోపమును నే నాఁపు కొనఁజాలను. బొంకులాడువాఁ డగు నా సుగ్రీవు నిప్పుడే వధించెదను. వాలిపుత్రుఁ డంగదుఁడు తక్కుంగల వానరవీరులతోఁ గూడి సీతను వెదకుఁగాక! అని తన మనసునఁగల యభిప్రాయము దెలిపి యుద్ధము చేయుటయం దోర్వరాని కోపముగలవాఁడై, ధనుస్సును జేతఁబట్టి యేగుచున్న లక్ష్మణునిగూర్చి శత్రువీరుల సంహరించువాఁడగు రాముఁడు చక్కని యోచనతోఁ గూడినదియు, నెమ్మదిని దెల్పునదియునైన మాట చెప్పెను.

లక్ష్మణా! లోకమున నీవంటివాఁడు మిత్రసంహారరూపమయిన చెడుపనిని జేయఁడు. కోపముచ్చినప్పు డెవ్వఁడు దాని నోర్పుతో నణఁచుకొనునో, వాఁడు పురుషశ్రేష్ఠుఁ డనఁబడును. లక్ష్మణా! నీవు మంచినడవడిగలవాఁడవు గావున నిట్టి పాపముసేయఁ దలంపుగొనకుము. పూర్వము సుగ్రీవునియం దున్నంతప్రేమను, మనము వానితోఁ జేసి కొన్న చెలిమిని తలంచి యతనితో నిష్ఠూరపు మాటలాడక, తిన్నని మాటలతో, నా సుగ్రీవునితో నిట్లు జాగుసేయుట తగునా యని యడుగవలసినది" అని యన్నపలుకఁగా, మంచి బుద్ధిగలవాఁడు, పండితుఁడు, అన్నగారి కిష్టమును హితమునుజేయుటయం దాస్థగలవాఁడు, తనయన్నకు విధేయుఁడు, బుద్ధియందు బృహస్పతిని బురుడించువాఁడునయిన లక్ష్మణుఁడు సుగ్రీవునిమీఁదికోపము నడఁచుకొని, ప్రలయకాలయమునిబోలిన వాఁడయి ఇంద్రధనుస్సును బోలినదియు పర్వతశృంగము వంటిదియునగు ధనుస్సునుపుచ్చుకొని శృంగముతో నొప్పారుచున్న మందరపర్వతమువలె కిష్కింధనుగూర్చి బయలుదేరెను. లక్ష్మణుఁడట్లు కామక్రోధములవలనఁ బుట్టినరాముని కోపాగ్నితోఁగూడి నవాఁ డగుటంజేసి వాయువుతోఁగూడిన యగ్నింబోలి మండుచుఁ

బయనమై, తనవేగముచేఁ బెక్కుమద్దులను, తాటిచెట్లను, ఱనుమద్ది చెట్లను గ్రిందఁబడఁద్రోయుచుఁ బర్వతశిఖరములను, మఱి యనేక వృక్షములను నెగిరిపడునట్లు చేయుచు, వేగముతో నడుచునట్టి యేనుఁగుకైవడి తొలను దుత్తునియలుసేయుచు, దూరదూరముగ నడుగులిడుచు పనియవసరమువలనఁ గడువడిగాఁబోయి, పర్వతముల నడుమ సేనలతోనిండినదయి, శత్రురాజులకుఁ జొఱరానిదగు వాన రేంద్రుడయిన సుగ్రీవునిపట్టణము జూచెను.

ఇక్ష్వాకువంశమునఁ బుట్టినవారిలోపల శ్రేష్ఠుఁడయిన లక్ష్మణుఁడు సుగ్రీవునిమీఁది యాగ్రహముచే నదరుచున్న పెదవులుగలవాఁడై పర్వతపుసందున సేనలతో నిండినదియుఁ జొఱరానిదియు నయిన వాన రాధిపుని పత్తనంబగు కిష్కింధయొక్క వెలుపటఁ దిరుగుచున్న వెఱపు గలిగించువారగు వానరులను జూచెను. ఏనుఁగులంబోలు వానరు లందఱు పురుషశ్రేష్ఠుఁడైన లక్ష్మణునిఁ గోపాటోపముతో వచ్చుచున్న వానిని జూచి, శత్రువువచ్చుచున్నాఁడన్న భీతిచే కొండకొమ్ములను, ఎత్తుగాఁబెరిగినచెట్లను గొని, యా లక్ష్మణునిమీఁదికిఁ గవియఁగా, లక్ష్మ ణుఁడును బెక్కుకట్టలువేసి మంటపెట్టిన యగ్నిహోత్రునికైవడి క్రోధ ముగలవాఁడయ్యెను. ప్రలయకాల యమునిచందమున మండిపడుచున్న లక్ష్మణుంజూచి, వానరులు, మనమున భయము దోప గడగడవణఁ కుచుఁ బలుదెసలకుఁ బరుగులిడి, సుగ్రీవుని యంతఃపురముసొచ్చి, లక్ష్మ ణుఁడు గోపముతో వచ్చియున్నాఁడన్నవార్త నెఱిఁగించిరి. అపుడు వానర రాజగు సుగ్రీవుఁడు మన్మథసుఖములం దవిలి, యేకాంతమునఁ దారతోఁగూడి రమించుచుండుటవలన నా కపివీరులమాటను వినఁ డయ్యె. అప్పుడు మంత్రులు సంగతిఁగనుఁగొని రమ్మని యానతియ్యఁగా, పర్వతములను, ఏనుఁగులను, మేఘములనుబోలిన యాకారములు గలవారగు వానరులు నగరునుండి వెడలిరి. ఆ వానరులందఱు గోళ్లను గోఱలును నాయుధములుగాఁ గలిగినవారు; వికృతస్వరూ పముగలవారు; పులులమాడ్కి గర్వము గలవారు; భయంకర ముఖులు. వారిలో కొందఱు పదియేనుఁగుల బలముగలవారు. కొందఱు వేయియేనుఁగుల బలంబుగలవారు నయి యుండిరి. అట్టి బలవంతులగు వానరులందఱు చేతులతోఁ జెట్లనుబట్టి

కొని కావలికాచుచుండుటవలన నేరికిఁజొఱ నలవికాని కిష్కింధా నగరమును లక్ష్మణుఁడు జూచెను. అంత నప్పు డెక్కువ బలిమిగల యా వానరులందఱు ప్రాకారమునకును పరిఖకును నడుమనున్న మార్గమున వెడలివచ్చి యా లక్ష్మణునికిఁ గనఁబడునట్లు నిలిచిరి. అప్పుడు శౌర్య ధైర్యములుగల రాజపుత్రుఁడగు లక్ష్మణుఁడు సుగ్రీవుఁడు సమయము మీఱుటను, తనయన్న నొచ్చియుండుటను దలఁచి, మఱిలఁ గోపము నొంది, వేడినిట్టూర్పు నిగిడించి, కోపముచేఁ గన్ను లెఱ్ఱగఁజేసినవాఁడై, పొగతోఁగూడిన యగ్నిహోత్రునివలె మండిపడుచు, బాణము ములుకు లనెడి మండుచున్న నాలుకలును, ధనుస్సనెడి పడగయు, వెలుఁగనెడి విషముంగల యయిదుతలలపాము వలె భీకరుఁడై యుండెను. అప్పు డంగదుఁడు ప్రలయకాలాగ్ని నింబోలెఁ బ్రజ్వరిల్లువాఁడును, తోఁప బడిన మదపుటేనుఁగుంబోలు వాఁడునునయిన లక్ష్మణునిఁజేరి, వెఱపుచే మిక్కిలి విచారమునొంది నిలిచియుండెను. వేరుగాంచిన యా లక్ష్మ ణుఁడు, కినుకచేఁ గన్ను లెఱ్ఱచేసి, యంగదునిఁ జూచి "ఓరీ పిన్నవాఁడా! సుగ్రీవునికడ కేగి, "చిన్నాయనా, శత్రువుల నణఁగఁద్రొక్కఁగల వాఁడగు రాముని తమ్ముఁడు లక్ష్మణుఁడు రాముని చింతకు నొచ్చినవాఁడై, నీకడకువచ్చుటకయి వాఁకిట నున్నవాఁడు. అతని మాటయందు నీ కిష్టముగలదేని యట్లు నడచుకొనుము" అనిచెప్పి, పగతుర రూపు మాపు నంగదుఁడా, నీవు వేగరమ్ము" అని చెప్పెను.

బలముగల అంగదుఁడు లక్ష్మణునిమాట విని, వగలఁబొగు లుచుఁ దండ్రికడకేగుదెంచి మనసునఁ గలవరమునంది, మోమున విన్న దనముదోఁపఁ దండ్రిపాదములకును, ఆవల దల్లి పినతల్లుల పాదములకును మ్రొక్కి, లక్ష్మణుఁడు తెలిపిన తెఱఁగెల్ల నెఱిఁగించెను. అయినను సుగ్రీ వుఁడును నిద్రాకామసుఖపరవశుండై, మరునివలపులం దగిలి మైమఱచి యుండెను. అంత వానరులందఱు మిక్కిలి వెఱపునొంది కోపముతోఁ గూడియున్న లక్ష్మణుని శాంతపఱచుటకై యందఱుగూడి గొప్ప ప్రవాహవేగమువలెనున్న లక్ష్మణునిగని పిడుగువలె మ్రోగునట్టి సింహ నాదమును, కిలకిలరవములును జేసిరి. సుగ్రీవుఁడును మత్తుచేఁ దెఱవ నలవికాని కన్నులుగలవాఁడును, క్రిందుమీఁదై యున్న పూలదండ లును ఆభరణములును గలవాఁడునునై, యా సింహనాదమున కులికి

పడి లేచెను. తర్వాత చక్కని యాలోచన చేయఁగలవారును, అంతఃపురమునకులోపలఁ బోఁగలవారు నగు ప్లక్షప్రభాసులనెడు సుగ్రీవుని ప్రియమంత్రు లిద్దఱు నంగదునిమాట విని, యాతనిఁగూడఁదీసికొని "పెక్కులెఱఁగులగు ధర్మార్థస్వరూపములను దెలుపవచ్చియున్నాఁడు" లక్ష్మణుఁడని నివేదించుకోరికతో లోపలికిఁ బ్రవేశించి, దేవతల కధిపతియగు దేవేంద్రునిచందమున సింహాసనమునఁ గూర్చున్నట్టి సుగ్రీవుని నిష్టాలాపములచే నూఱడించి, "యో వానరేంద్రా! ప్రతిజ్ఞదప్పనివారును, మహాత్ములును, నీకు రాజ్యమునొసఁగినవారును, రాజ్యపరిపాలనమునకుఁ జాలినవారు నయిన యన్నదమ్ములు రామలక్ష్మణులు నీకుఁ జెలికాండ్రయిరిగదా! ఆ యిరువురిలో నొక్కఁడగు లక్ష్మణుఁడు వింటిని జేతఁబట్టి వచ్చి వాకిట నిల్చియున్నాఁడు. అతనికి వెఱచి, వడఁకుచు వానరులు భయముతోఁ గేకలిడుచున్నారు. ఈ లక్ష్మణుఁడు మాటలు సారథ్యము సేయఁగా, ప్రయత్నమను రథమువిూఁదఁ గూర్చుండియిచ్చటికి వచ్చియున్నాఁడు. లక్ష్మణుఁడు పంపఁగా, ఈ తారయొక్కముద్దుపట్టియగు నంగదుఁడు వేగిరముగావచ్చియున్నాఁడు. ఆయీమొనగాఁడగు లక్ష్మణుఁడు కన్నులెఱ్ఱగఁజేసి, వానరులను దహించుమాఁక్కఁ జూచుచు వాఁకిటనున్నాఁడు. కావున మహారాజా! బంధుపుత్రమిత్రసమేతుఁడవై త్వరితముగానేగి యతనికిఁ బ్రణమిల్లి, యతని కోపముం జల్లార్పుము. ధర్మాత్ముఁడగురాముఁడు చెప్పినపనిని జాగరూకతతో నెఱవేర్పుము. చేసినప్రతినయొనర్చి, మాటదప్పనివాఁడవగుము" అని యంగదాదులు సెప్పిరి.

32-వ సర్గము.

సుగ్రీవుఁడు హనుమంతునితో నాలోచించుట

బుద్ధిమంతుఁడగు సుగ్రీవుఁడు మంత్రులు దోడ్కొనివచ్చిన యంగదుఁడుచెప్పిన మాటనువిని, లక్ష్మణుఁడు తనపై నాగ్రహముతో వచ్చియున్నాఁడన్నమాటనువిని, సింహాసనమువిడిచి లేచెను. ఆలోచనలందు నేర్పరియగు సుగ్రీవుఁడు స్థూలసూక్ష్ముల నాలోచించి, ఆలోచనలుచేయుటయందు నేర్పరులును, ఆలోచనలయం దనుభవముగలవారునైన మంత్రులతో నిట్లనియె.

"మంత్రిపుంగవులారా! నే నెల్లప్పుడు రామలక్ష్మణులతోఁ జెడ్డ మాటయొక్కటియు నాడలేదు. చెడ్డపనియొక్కటియుఁ జేయనులేదు. ఇఁక లక్ష్మణుఁడు నాపై నేల కోపగించుచున్నాఁడో యని యాలోచించు చున్నాఁడను. నాకుఁ గీడురోయు నాపగతురు, సందుగనిపెట్టియుండి, నేను లేనప్పుడు నాపై లేనితప్పిదము నేపైనను రాముని తమ్మునితోఁ జెప్పియుందురు. ఈ విషయమున మీరందఱు స్వబుద్ధి నుపయోగించి, నీతిశాస్త్రోక్తపద్ధతులను గమనించి, తిన్నగా నీ లక్ష్మణుని కోపమునకుఁ గారణమేమియో యాలోచించి తెలిసికొనవలయును. లక్ష్మణునివలనఁ గాని, రామునివలనఁగాని నాకు భయము లేనేలేదు. అయినను చెలికాఁడు నిష్కారణముగాఁ గోపించుకొనుటవలన నాకు మిగుల భయము గలుగుచున్నది. చెలికానిని సంపాదించుట సులభము. ఆ చెలికానితోడి మైత్రిని గాపాడుకొనుటయరుదు. మనస్సులు చపలములు గనుక, స్వల్ప కారణము వచ్చినను చెలిమి బెడిసిపోవును. రాముఁడు నాకుఁజేసిన యుపకారమునకు బదులుమేలు నేను జేయఁజాలనను నొక్కకారణము చేతనే మహాత్ముఁడగు రామునికి వెఱచుచున్నాను."

సుగ్రీవుఁడు మంత్రులతో నిట్లు చెప్పఁగా, వానరశ్రేష్ఠుఁడయిన హనుమంతుఁడు తనబుద్ధితో నాలోచించి, మంత్రులగు వానరులు వినుచుండ నా సుగ్రీవుని కిట్లనియె. "కోతిమూఁకల నేలువాఁడా! నీతో గట్టిచెలిమి యొనర్చుకొన్నవాఁడును, నీకు మేలొనర్చినవాఁడునగు సజ్జనుని మఱవకున్నావనుట యేమాత్రమును వింతగాదు. మొనగాఁడగు రాముఁడు భయమును దవ్వుననేవిడిచి, నీయిష్టము నెఱవేర్చుటకై దేవేంద్రునిఁబోలు పరాక్రమముగల వాలిని సంహరించెను. రాముఁ డన్నితెఱఁగులఁ నీయెడగల ప్రేమచేతనే కోపగించికొని, సంపదను బెంచువాఁడగు తముని లక్ష్మణుఁ బంపెను. యీ విషయమున నెంతమాత్రము సందియములేదు. సమయమునెఱిఁగినవారిలో నుత్తముఁడా! నీవు మన్మథమోహితుఁడవై సమయము మీఱినదన్న సంగతి యొఱుఁగకున్నావు. ఏడాకుల యరటిచెట్టు పుష్పించి సొబగుమీఱిన శరత్కాలము వచ్చియున్నది. ఆకసమున మేఘములుపోయి, సూర్య చంద్రాది గ్రహములును నక్షత్రములును తెల్లగాఁ బ్రకాశించుచున్నవి. దిక్కులును, నదులును, కొలఁకులును స్వచ్ఛములై యున్నవి.

వానరశ్రేష్ఠుఁడా! జానకిని వెదకఁబ్రయత్నముసేయఁ దగినకాలము వచ్చినను నీవెఱుఁగకయున్నావు. నీవు మైమఱచి యున్నాఁడవన్న కారణముచేతనే లక్ష్మణుఁ డిచ్చటికివచ్చెను. ఇది నిజము. మహోత్సుఁడగు రాముఁడు భార్యగోలోల్పోయి, వ్యసనసముద్రమున మునిఁగినవాఁడై, మఱియొకని మూలమునఁజెప్పిపంపినమాట కఠినముగానున్నను, నీవో ర్చుకొనవలసినదే. నీవు రామునితోఁజేసిన సంకేతసమయమును మాఱితివి గావునఁ దప్పిదము నీపైనున్నది. కావున నీవిప్పుడు చేతులు జోడించి యా లక్ష్మణునికడ కేగి యాతనికోపము నుపశమింపఁజేయుట యుత్తమము. దానికంటె వేఱొక్కటి తగినయుపాయములేదు. రాజుచే నాలోచన యడుగఁబడినప్పుడు, మంత్రులు రాజునకుఁ దప్పక మే లొదవుమాటయే చెప్పవలయును. కావుననే నేను నిర్భయముగా నాకుఁదోఁచిన యథార్థవాక్యమును బలికితిని. రాముఁడలిగినచో, ధను స్సును జేతఁబూని, దేవగంధర్వరాక్షసులతోఁగూడిన మల్లోకములను దనస్వాధీనతయం దుంచుకొనఁగలఁడు. ఎవఁడు కోపవంతుఁడై యుం డఁగా, బతిమాలి నిమ్మళపఱుపఁ దగినవాఁడో, అట్టివానికిఁ గోపము వచ్చునట్లు జేయరాదు. అందును, తానొక్కనివలన నుపకారమునొంది, యాయుపకారమును మఱపనివాఁడు తనమిత్రునికిఁ గోపమువచ్చినప్పుడు బతిమాలుకొని శాంతపఱచుట యెన్నటికిఁ దప్పిదముగాదు. కావున వానరరాజా! నీవిప్పుడు పుత్రమిత్ర పరిజన సహితుఁడవుగనేగి, యతనికి సాగిలఁబడిమ్రొక్కి, భార్య భర్తయధీనతయం దుండులాగున విధేయుఁ డవై యాడినమాటనుజెల్లింపుము. వానరేంద్రుఁడా! రామలక్ష్మణుల యాజ్ఞను మనసులోనైన మీఱుట నీకు యుక్తముగాదు. దేవేంద్రునిఁ బోలు ప్రతాపముగల రాముని యస్త్రబలము మాత్రమేకాక, దేహ బలమును నీమనసునకుఁ దెలిసియేయున్నదికదా! ఇఁక నే విశేషముగాఁ జెప్పవలసినదిలే" దని హనుమంతుఁడు సుగ్రీవునితోఁ జెప్పెను.

33-వ సర్గము.

లక్ష్మణుఁడు సుగ్రీవుని నంతఃపురమునఁ జూచుట

ఇక్కడ హనుమంతుఁడిట్లు సుగ్రీవుని కాలోచన చెప్పుచుండఁగా, లక్ష్మణుఁడు రాముని యాజ్ఞ గొనివచ్చి, కిష్కింధాపురద్వారమున నిలిచి,

యంగదునితోఁ జెప్పిపంపి, యతఁడు మఱలివచ్చి పిలువ లోపలికిఁజొచ్చి, రత్నమయమును, పుష్పించిన వనములతోఁగూడినదియు, మణులతో వెలుఁగునదియు, మేడలు, మాడుగులు మున్నగువానిచే మిక్కిలి యిష్టమైనదియు, పెక్కుతెఱఁగుల యంగళ్లచేఁ బ్రకాశించుచుండు నదియు, కోరినపండ్లతోనిండి, పుష్పించిన చెట్లచే శోభిల్లునదియు, చందనము, అగురు, కమలములయొక్కయు, మద్యమైరేయముల సువాసనలచేఁ బరిమళించుచున్న రాజమార్గములు గలదియు, కమ్మనిపూల దండలను మేలి పలువలనుదాల్చి, చూడఁదగినవారలు, కోరినరూప మెత్తఁగలవారలునైన దేవతలకు గంధర్వులకును జనించినట్టివారలు నయినవానరులచేఁ దేజరిల్లునదియునగు విశాలమును రమ్యమునునై యున్న కిష్కింధాపురమునొచ్చి, యాపురములోపలఁ దేటనీటితోఁ గూడిన పెక్కుసెలయేళ్లను జూచుచు, రాజమార్గమునఁ బ్రవేశించి, యొక్కవదార్థ్యముగలవియు; తెల్లనబ్బులమూఁకఁ వెలుఁగునవియు, శ్రేష్ఠములైన పుష్పమాలలచే నలంకృతములైనవియు, ధనధాన్యసంపద గలిగి, స్త్రీరత్నములతోఁగూడినవియునైన యంగదమ్మంద, ద్వివిద, గవయ, గవాక్షు, గజ, శరభ, విద్యున్మాలి, సంపాతి, సూర్యాక్షు, హనుమత్, వీరబాహు, నళ, కుముద, సుషేణ, తార, జాంబవత్, దధివక్త్ర, నీల, సుపాటల, సునేత్ర లను వానరోత్తములయొక్క రమ్యములైన యుత్తమగృహములనుజూచెను. వెంటనే తెల్లనిప్రాకారముచేఁ జుట్టఁబడినదియు, పగతురకుఁ జొరనలవికానిదియు, దేవేంద్రుని గృహాముమాడ్కి మెఱయునదియునైన రాజభవనమును దవ్వుననే చూచి, దగ్గఱకువచ్చి, కైలాసశిఖరములంబోలు తెల్లని దేవాలయగోపురములతో నొప్పుచు, కోరిన దివ్యపుష్పఫలములుగలిగి, కాంతిచే నొప్పారుచు, నల్లనిమబ్బులంబోలు డాలుగలిగి, చల్లనినీడతోఁగూడి, బాటసారులకు సేదదీర్చునట్టి వృక్షములచే శోభిల్లునదియు, బలవంతులగు నాయుధధారులయిన వానరులచేఁ గావలికాచఁబడినదియు, దివ్యమునైన పుష్పమాలికలచే నలంకరింపఁబడినదియు, మేలిమి పసిఁడితోరణములుగలిగి, తెల్లనై వెలుగుచున్నదియునైన సుగ్రీవుని గృహామును సూర్యుఁడు గొప్పమేఘమును చొచ్చునట్లు, నిరాటంకముగాఁ బ్రవేశించెను. అట్లు లక్ష్మణుఁడు లోపలికిఁజొచ్చి యనేకజనసమూహములతోఁ

గూడినవియగు నేఁడుతోట్టికట్లను దాఁటి, అచ్చటచ్చట బంగారువెండి మంచములతోను, మేటిపఱుపులతోను గూడిన పెక్కు మేలిమి యాసనములతోను వెలుఁగునదియు, కాఁపుగల చేయఁబడినదియు నైన యాసుగ్రీవుని యంతఃపురము సొచ్చెను. లక్ష్మణుఁడు ప్రవేశించుతఱి చక్కనిశ్రుతితోఁగూడి, తంబుర, వీణెమొదలగువాని ధ్వనితోఁగలియునట్లు లింపుగఁబాడుచున్న సంగీతమును వినెను. మఱియు బలవంతుఁడగు లక్ష్మణుఁడు సుగ్రీవునియంతఃపురమునఁ బెక్కు రూపములుగలవారును, సౌందర్యయౌవనములచే మదించినవారునైన జవరాండ్రను బెక్కండ్రను చూచెను. గొప్పకులములంబుట్టినవారును, నానావిధ పుష్పమాల్యములను దాల్చినవారును, పండ్లుకోయుట, పూల దండలుగట్టుటలయందు మెలఁకువతోనుండువారును, చక్కనిసొమ్ములను దాల్చినవారునునయిన యాయుత్తమాంగనలనుజూచి, యచ్చటనే సకలవస్తువులఁబడసి తనివినొందినవాఁడై, మెలఁకువతో రాచకార్యములను జరుపుచు, మేటితోడవులఁదాల్చియునున్న సుగ్రీవుని సేవకులను జూచెను. తర్వాత లక్ష్మణుఁడు మఱికొంతదవ్వేగి యచ్చట నతివల యందెలమ్రోఁతలను, మొలనూళ్లయందలి చిఱుగజ్జెలధ్వనులను విని, కాంతలు తమప్రియులతో సంగమించుసమయ మని మిక్కిలి లజ్జపడి యచ్చటనే నిలిచెను. మహాబాహువగు వీరుఁడైన లక్ష్మణుఁడు స్త్రీలుండు తావునకుఁ బోవుటతగదనియెంచి, యేకాంతస్థలమునొచ్చి రాముని శోక కోపావేశములచే రేఁగినవాఁడై, యాభరణముల ధ్వనినివిని, వింటి నారినిమీటెను. వానరపుంగవుఁడగు సుగ్రీవుఁడా వింటి చప్పుడువిని, లక్ష్మణుఁడచ్చటికివచ్చియున్నాఁడనియెఱిఁగి, యుత్తమాసనమునుండి దిగ్గునలేచి, "సోదరునందుఁ బ్రేమగల లక్ష్మణుఁడు, అంగదుఁడు నాకింతకు మున్నెఱిఁగించినచందముననే యిదిగో నిజముగావచ్చినాఁ" డని యా లక్ష్మణుని ధనుష్టంకారముచేతను, అంగదుని వార్తచేతను నెఱిఁగెను. వెంటనే సుగ్రీవునిమోము కళవళపోయెను. అంతట వానరశ్రేష్ఠుఁడగు సుగ్రీవుఁడు తత్తరపాటుచే నేమియుఁదోఁచక కొంతతడవుండి, జాగ్రత్తతోఁ జక్కనిరూపముగలతారను జూచి యిట్లనియె.

"చక్కని కనుబొమ్మలుగలదానా! యీరాముని తమ్ముఁడు తిన్నని స్వభావముగలవాఁడు. అట్టివాఁడిప్పుడు గోపముతోగూడివచ్చుట కేమి

కారణ ముండవచ్చును? సత్పురుషులకుఁ గారణము లేక కోపమురాదు గదా. ఓయుత్తమాంగనా! యీలక్ష్మణుని కోపమున కేమికారణముండ వచ్చునని నీకుఁదోఁచుచున్నది? మన మీలక్ష్మణునికి సమ్మతముగాని పని యేదియుఁ జేసినట్లు నాకుఁదోఁపదు. నీవు వేగిరము బుద్ధితో యోచించి, దీని కారణమును దెలుపుము. అటుగాదేని నీవే యీలక్ష్మణునిఁజూచి తిన్ననిమాటలుపలికి యీతనికోపము నివ్వళించునట్లు సేయుము. నిన్నుఁ జూచినంతఁ గలఁకదేఱిన మనస్సుగలవాఁడై లక్ష్మణుఁడు నీపైఁ గినుక చూపఁడు. సత్పురుషు లతివలయెడలఁ గ్రౌర్యము నెప్పుడును జూపరు. తమ్మిరేకులంబోలు కనులుగల శత్రుసంహారియగు లక్ష్మణుఁడు శాంత మనస్కుఁడైన పిదప, నేనువచ్చి చూచెదను." అని చెప్పిపంపెను.

ఆతారయు సురతశ్రమచేఁ దొట్రుపడుచు, కైపుచే మోడ్చు చున్న కన్నులుగలదై, యొడ్యాణమును, బంగారు మొలకట్టును జాఱి పోవుచుండ, సురతపు గుఱుతులు కనఁబడుచుండ, రతిక్రీడలబడలికచే ముందుకు వ్రాలిన శరీరముతో లక్ష్మణునిచేరువకు నేతెంచెను. రాజ పుత్రుఁడయిన లక్ష్మణుఁడును ఆఁడుది చేరువకువచ్చుటచేఁ గోపమువీడి, దానిరూపమును జూచుటకు సిగ్గుపడి తలవాల్చెను. అంత, తారయు మద్యపానముచే సిగ్గువిడిచినదిగనుకను, లక్ష్మణుని కోపము చల్లా ఱుటచేతను చనవుచే ధైర్యము దెచ్చుకొని, తిన్ననిమాటలతో గొప్ప యర్థముగలుగునట్లును పలికెను. "ఓ రాజపుత్రా, కోపమున కేమికార ణము? మీమాట నెవఁడుమీఱెను? ఎండుఁజెట్లుగల వనమును గాల్చి వచ్చిన కాఱుచిచ్చునకెదుట నెవ్వఁడు నిర్భయముగాఁ గూర్చుండఁ గలఁడు?" అని యడిగెను.

అట్లు సందేహింపక వినయపూర్వకముగను, ప్రేమతో నడిగిన యాతారమాటనువిని లక్ష్మణుఁడును ప్రేమతో నర్థముగలమాట నిట్ల నెను. "ఓ పెనిమిటికి మేలుగూర్చుదానా! యేమియిది నీమగడు మన్మథ పరతంత్రుఁడై ధర్మార్థములను సేకరించుట మాని యేల యిట్లు తెలివి లేకున్నాఁడు! ఏమి యీ యన్యాయ్యము! తారా! నీమగఁడు రాజ్య వ్యవహారములను బరికింపకయు, వ్యసనమేగతిగానున్న మమ్ము విచారిం పకయు నెల్లప్పుడు మంత్రిపరివారములతోడ మద్యపానలోలుఁడై యున్నాఁడు. ఆవానరాధిపుఁడగు సుగ్రీవుఁడు నాలుగునెలలు సీతను

వెదక గడువు పెట్టి, యానాలుగునెలలు దాఁటినను మత్తుచే, విహారం చుచుఁ దెలియకున్నాఁడు. ధర్మార్థసంపాదనము చేయఁగోరువాఁ డిట్లు మద్యపానము సేయరాదు. మద్యపానమువలన ధర్మార్థకామములకు మూటికిఁ జేటు గలుగును. ఉపకారము చేసినవానికిఁ బ్రత్యుపకారము సేయనివానికి ధర్మలోపము గలుగును. ప్రత్యుపకారము నొందకుండు టచే గుణవంతుఁడగు మిత్రుఁడు నశించినపు డర్థకామములకు రెంటికిని లోపము వాటిల్లును. సత్యమును ధర్మమును విడువకయుండు స్నేహితుఁ డర్థకామములకంటె శ్రేష్ఠుఁ డనఁబడు. ఈసుగ్రీవుఁ డా యర్థకామ ములకు మూలమగు చెలికానిని వదలెనుగదా! ధర్మమునుగూడఁ బరిత్యజించెను! ఓతారా! పనులకలరూపు నెఱిఁగిన నీవే యిప్పుడు సుగ్రీవుఁ డిట్లు తడవుచేయుచుండ మేము చేయవలసినదేమో యోచించి చెపుము." అని లక్ష్మణుఁడుపలుకఁగా, తారయు ధర్మార్థములకుఁ దప్పనిది యునైన యాలక్ష్మణుని యాతిన్నని మాటనువిని, రామునికార్యము నిమిత్తము లక్ష్మణుఁ డేతెంచియున్నాఁడని యెఱిఁగినదై, యాతనితోఁ బ్రీతి గలిగించునట్టి మాటచెప్పెను.

రాజపుత్రుఁడా! యిది కోపమున కదనుగాదు. తనవారన వారియెడ నెక్కువ యాగ్రహము పూనరాదు. ఈ సుగ్రీవుఁడు నీపని చేయుటయందుఁ గోర్కిగలవాఁడు. ఈతఁ డొక్కవేళ నిప్పుడు సమ యము మీఱినను, ఆతనియపరాధము మన్నింపవలయును. లక్ష్మణా! గొప్పగొనములుగల నీయట్టివాఁడు లొంగినివానియెడఁగోపముచేయునే? సాత్త్వికగుణముగలవాఁడు, తపస్సుచేయువాఁడు నగు నీయట్టివాఁడు కోపమునొందునే? వానరవీరుఁడగు సుగ్రీవుని హితుఁడగురాముని కోప మిట్టిదని నేనెఱుఁగుదును. సుగ్రీవుఁడు కార్యము సకాలమునకుఁ జేయ కున్నాఁడనియు నెఱుఁగుదును. మీరు మాకేమి యుపకారముఁ గావిం చితిరో యదియు నెఱుఁగుదును. ఇపుడు చేయవలసినదేమియో యదియు నేనెఱుఁగుదు. రాజోత్తమా! మన్మథునిబలిమి యెంత యోర్వ రానిదో యదియు నెఱుఁగుదు. ఈసుగ్రీవుఁడు కామాతురుఁడై యెల్ల పుడు స్త్రీలయందుఁ దగిలియున్న సంగతియు నేనెఱుఁగుదును. నీవిప్పుడు కినుకపూనుటచూడ, నీకు మాకుఁబోలెఁ గామవికారములందు మనము దగులుటలేదని తెలియుచున్నది. కామవికారములందుఁ జిక్కిన మానవుఁ

డిదియదననియు, ఇది తగుచోటనియు, థర్మార్థములకు లోపమువాటిల్లు ననియు నెఱుఁగఁడు. నీవును సుగ్రీవునట్లు కామపరవశుఁడవయి యుందువేని, నీవును సుగ్రీవునియట్ల దేశకాలథర్మార్థములను మీఱకయుందువు. కావున సుగ్రీవునిప్రమాదమునకుఁ గారణము మదనుఁడే. కాఁబట్టి శత్రువీరుల వధించువాఁడా! మన్మథవ్యాపారములందుఁజిక్కి, మన్మథు నిచేఁ జొఱఁబడినవాఁడై సిగ్గుమాలి నాకడనెయుండి కాలముపుచ్చు చున్న వానరవంశపుఁజేలికయఁగు నీతమ్ముని సుగ్రీవుని మన్నింపుము. ధర్మమును, తపస్సునుగోరి యడవులందున్న మహర్షులు సైతము మన్మథ పరతంత్రులై వలపులందగిలియుండిరి. అటుండఁగా, నీతఁడు కోతిస్వ భావముచేతనే చపలుఁడు. అట్టివాఁడు రాజైనపుడు సుఖములం దగుల కుండునా?" అని యిట్లు తార శత్రువులకు లొంగనివాఁడయిన లక్ష్మణు నితో గొప్పయర్థముగల మాటనుజెప్పి, వెండియు వేడ్కమీఱి, పాన మదముచే ముందుకుఁబడఁబోవుచుఁ దనప్రియునికి హితమగుమాట నిట్లనిచెప్పెను: రాజోత్తమా! సుగ్రీవుఁడు మన్మథునికిలోఁబడియున్నను, మీకార్యము సాధించుటకై, చాలకాలముక్రిందటనే తనపరివారమున కానతిచ్చె. అన్ని కోండలందుండు లెక్కలేని మహావీరులను, బలవం తులునగు వానరులువచ్చిరిగదా! గొప్పబాహువులుగల లక్ష్మణా! స్త్రీలుండెడి యంతఃపురములోపలికిఁ బోరాదని ఇచ్చట నిలిచితివి. సజ్జ నులు మనసునఁ గామవికారములేక మైత్రిచేఁ దనచెలికానిభార్యలఁ జూచుట దోషము గాదు" అని తార లక్ష్మణునికిఁ జెప్పెను.

తార యిట్లు విన్నవింపగా, కార్యత్వర తన్నుఁ బ్రేరణచేయు చుండఁగా, నిడుదచేతులవాఁడగు శత్రుసంహారియయిన లక్ష్మణుఁ డంతఃపురములోపలికిఁజొచ్చి దివ్యములైన యాభరణములు దాల్చినందునఁ బలురంగులుగల యంగములుగలవాఁడును, రూపరియు, విలువగలబట్ట లనుగట్టి, నెత్తావిఁ గుబాలించు పూవులదండలుదాల్చి సూర్యునివలె వెలుఁగువాఁడును, దేవేంద్రుఁడుంబోలె గెలుపనలవికానివాఁడును, మేటిసొమ్ములును దండలునుదాల్చిన యంగనలచేఁ జుట్టఁబడి, మేలిమి దుప్పటముపఱచిన బంగారుమంచముమీఁదఁ గూర్చుండియున్న వాఁడును నగు సుగ్రీవునిఁజూచి కడునెఱ్ఱనైన కన్నులతోఁగూడి జమునిమాడ్కి భయంకరుఁ డయ్యెను. పసిఁడివన్నెయు విరివికన్నులునుగల శూరుఁడగు

సుగ్రీవుఁడన్ననో మంచియాసనమున రుమను బిగికౌఁగిటంజేర్చి కూర్చుండి యున్నవాఁడై, ధైర్యముతో నెదుటవచ్చిన విరివికన్నులవాఁడయిన లక్ష్మణుఁ జూచెను.

34-వ సర్గము.

◆ లక్ష్మణుఁడు సుగ్రీవుని దూఱుట ◆

ఎదురులేనివాఁడును, పురుషశ్రేష్ఠుఁడునునైన లక్ష్మణుం డెక్కువ యాగ్రహముతోఁ దన యంతఃపురమున జొచ్చుటగని, భీతినొంది, యన్నగారివెతచే నొచ్చినవాఁడై, కోపముపూని నిట్టూర్పువిడుచుచుఁ దనతేజస్సుచే ధగధగమని వెలుఁగుచున్న లక్ష్మణుఁజూచి, సుగ్రీవుఁడు తనపసిఁడిపాన్పునుండిదిగి చక్కఁగాఁ గైసేయఁబడిన దేవేంద్రుని గొప్ప ధ్వజముమాడ్కి లేచి నిలిచెను. ఆకాశమునఁ బున్నమచందురుని రిక్క లెల్ల వెంబడించులాగున మంచమునుండి తటాలునదిగిన యా సుగ్రీవుని వెంబడిని రుమమొదలగు నతనికాంతలును మంచమునుండి దిగ్గునడిగ్గి నిలిచిరి. అట్లు కాంతిమంతుఁడైన సుగ్రీవుఁడు తన ప్రియురాండ్రతోఁ గూడదిగి, మద్యపానముచే నెఱ్ఱనైన కన్నులుగలవాఁడై, గొప్ప కల్ప వృక్షముకైవడి యా లక్ష్మణుని ముందట కంపించుచు నిలఁబడెను.

రుమను బ్రక్కన నిల్చుండఁబెట్టికొని, తారతోగూడ నున్న చందురునికైవడి, నాఁడువారినడుమ నిల్చియున్న సుగ్రీవునిఁజూచి, లక్ష్మణుఁడు కోపముతో నిట్లనియె. "బలవంతుఁడు, మంచివంశమునం బుట్టినవాఁడు, దయగలవాఁడు, ఇంద్రియాశల గెల్చినవాఁడు, నెనరుగలవాఁడు, యథార్థము పలుకువాఁడునగురాజు లోకంబున నందఱిచేతను గారవింపఁబడును. మిత్రులవలన మొదట సుపకారముసేయించుకొని, యధర్మనూర్గముఁజొచ్చి, వానికిఁ బ్రత్యుపకారముచేసెదనని వాగ్దత్తముచేసి యట్లు వాగ్దత్తము నెఱవేర్పనివాఁడు నికృతిపరుఁడని చెప్పఁబడును. గుట్టుమువిషయమై యొక యసత్యమాడినపుణ్యమున నూఱుగుట్టులఁ జంపినవాఁడగును. గోవువిషయమున నసత్యమాడిన యెడ, వేయిగోవులను జంపినవాఁ డగును. మనుష్యుని విషయమున నసత్యమాడినచోఁ దన్నును, దనబంధువులను హత్యగావించిన పాపమునొందును. మొదట మిత్రులచేఁ దనకార్యముఁజేయించుకొని, పిమ్మటి

దీతినవెనుక వారికి బదులొనరింపఁదలంపులేని కృతఘ్నుఁడుచేరి వధింపఁ దగినవాఁడు. తొల్లి యొకప్పుడు సుగ్రీవా! స్వాయంభువమను వొక కృతఘ్ననిఁ జూచి, సకలలోకములవారిచేఁ గొనియాడఁబడు నీ శ్లోక మును జెప్పెను. అది నేఁ జెప్పెదను; ఆలకింపుము. "బ్రహ్మహత్య, మద్యపానము, దొంగతనము చేసినవారును, వ్రతములేనివారును నగు మానవులకుఁ బ్రాయశ్చిత్తముగలదుగాని, నెనరులేనివానికిఁ బ్రాయ శ్చిత్తమేలేదు." అని స్వాయంభువు వను పుడమిఱేఁడు చెప్పెను. ఓ వానరా! నీవు చెడ్డవాఁడవు; మేలుమఱచువాఁడవు; బొంకులాడు వాఁడవు. కావుననే నీవు మొదటనే రాముని చేతఁ గార్యముచేయించు కొని యిప్పు డారామునికి బదులు మేలుసేయకున్నాఁడవు. ఓ మర్క టుఁడా! నీవు రాముని చే నుపకారముసేయించికొని, యతనికి బదులు మేలుసేయుటకుఁ దలంపు గలవాఁడవేని, నీవు సీతను వెదకుటకై ప్రయ త్నము సేయవలసియుండునుగదా! అట్టి ప్రయత్నము నీవు చేయమిచే నీవు కృతఘ్నుఁడవు. కప్పలను ఒగ్గరకురానిచ్చి వానిని మ్రింగఁగోరి, కప్పవలెనఱచు పాముపలె నీవు నెన్ని యోనయములునటించి, సత్యమైన ప్రతిజ్ఞ చేసిన ట్లభినయించి, గ్రామ్యసుఖములం దవిలియున్నావు. నీవు గప్పవలెఁగూయు పాముపని యారాముఁ డెఱుఁగఁడయ్యె. కరుణ దలఁచువాఁడును, మహాపూజ్యుఁడును, గొప్పవాఁడునైన రాముఁడు పాపంపుఁ బనులుసేయువాఁడవు, చెడునడవడిగలవాఁడవునైన నీకు వానరరాజ్యాధిపతిత్వము నొసఁగెను. వింతపనులుసేయఁగల రాముఁ డొనర్చిన యుపకారము మఱతువేని, నీవు వాఁడిబాణములచే నేయఁ బడి నీలిగి, వాలినిజూతువు. వాలిపోయినదారి యింక మూయఁబడలేదు. అది తెఱవఁబడియున్నది. ప్రతిజ్ఞఁ జెల్లింపుము. ఆఁడినమాటతప్పి, వాలి పోయినదారిని బోకుము. నీ విక్ష్వాకువంశశ్రేష్ఠుఁడగు రాముని వింటి నుండి జాఱిన వాఁడిబాణములను చూచి యెఱుఁగవేమో! కాఁబట్టియే నీవు రాముని కార్యమును, మనసులోనైనను దలంపక, సుఖవంతుఁ డవై సకలసుఖముల ననుభవించుచున్నావు" అని లక్ష్మణుఁడు సుగ్రీవుని నిందించెను.

35-వ సర్గము.

తార లక్ష్మణునికోపంబు శాంతపఱచుట

అవ్విధమునఁ బలుకుచుఁ దనవెలుఁగుచే మండుచున్నట్లుండు లక్ష్మణుంగూర్చి, చంద్రునిఁబోలు మోముగల తార యిట్లనియె. "ఓ లక్ష్మణా! వానరాధిపుఁడగు నీసుగ్రీవు నిట్లు పరుసనిమాటలాడఁ దగదు. ఇతని నట్టిపలుకులచే నిందింపకుము. అందును బ్రియస్నేహితుఁడ వయిన నీవిట్టిమాటలాడఁదగునా? కోఁతులదొరయగు సుగ్రీవుఁడు నెనరులేని వాఁడు కానేకాఁడు; మోసకాఁడునుగాఁడు; క్రూరుఁడును గాఁడు; కల్లరియుఁగాఁడు; కపటియుఁగాఁడు. వీరుఁడా! రాముఁడు సుగ్రీవునికి బవరమున నితరులచేఁ జేయనలవికాని యుపకారమును జేసెను. రాముఁ డొనర్చినయట్టి మహోపకారమును సుగ్రీవుఁ డెన్నఁడైన మఱచునా? శత్రుతాపనా! రాముని యనుగ్రహమునంజేసియే యిపుడు సుగ్రీవుఁడు కీర్తిని, శాశ్వతమైన వానరరాజ్యప్రభుత్వమును, రుమను, నన్నును బొందెను. ముందు సుగ్రీవుఁడు ఋశ్యమూకపర్వతమున నున్నప్పుడు మిక్కిలికష్టముతో నుత్తనేలమీఁద నొంటరిగఁబరుండి యుండినవాఁడిప్పు డిట్టిమేటిసుఖమును బొంది, తొల్లి విశ్వామిత్రమహాముని కామముచే మేనకతోఁగూడి కాలము నెఱుఁగకయున్నచందమున నిప్పుడు రాము నితోఁ జేసిన సంకేతకాలము నెఱుఁగకున్నవాఁడు. తపస్సుచేయువాఁ డయిన విశ్వామిత్రమునీంద్రుఁడే యొకప్పుడు ఘృతాచియను నప్సరసం జూచి మోహించి యామెతోఁగూడి సుఖము లనుభవింపుచుఁ బది యేండ్లొకదినముగా నెంచెను. లక్ష్మణా! త్రికాలజ్ఞులైనవారిలో నుత్తముఁడయిన తపోమహిమగల విశ్వామిత్రమునీంద్రుఁడె యిట్లు కాలముమీఱుట నెఱుఁగనప్పుడు సామాన్యుఁడయిన సుగ్రీవునివంటి సామాన్యుఁడు సమయము నెఱుగకుండె ననుట యొకవింతయా? లక్ష్మణా! సుగ్రీవుఁడు పెక్కేండ్లు, కడగండ్లనుభవించి యిప్పుడు శరీర ధర్మమగు సురతసుఖములంబొంది, కామసుఖములందుఁ దనివినొందక కాలముం గడుపుచుండినవాఁడు. కావున నితనియపరాధమును మన్నింపుము. లక్ష్మణా! వాస్తవమైన సంగతినెఱుఁగక ప్రాకృతజనునియట్లు క్రోధమునొందుట నీకుఁదగదు. ఓ పురుషశ్రేష్ఠా! నీవంటిసత్త్వగుణము

పలుకుచుండఁగా, లక్ష్మణుఁడు సంతసించి వేడ్కమీఱ నాసుగ్రీవుని కిట్లనియె:

వానరాధిపుఁడవగు సుగ్రీవా! మీఁదుమిక్కిలి వినయవంతుఁడవైన నీవు రామునికిఁ దోడ్పాయుండఁ, నాతఁడన్నిఁ లోఁగుల నాథునితోఁ గూడినవాఁడే. సుగ్రీవా! నీ యుత్తమప్రభావమును, నీయోర్పును జూడ మేటివానరరాజ్యలక్ష్మిని బొందుటకు నీవే తగినవాఁడవు. నీవు సహాయుఁడవైయుండఁగ, ప్రతాపముగలవాఁడైన రాముఁడు యుద్ధమునఁ బగతురను శీఘ్రమే వధింపఁగలఁడు. దీని కేమియు సంశయము లేదు. సుగ్రీవా! నీవాడినమాట, ధర్మముల నెఱిఁగినవాఁడవు, నెనరుగలవాఁడవు, యుద్ధములందు మఱులనివాఁడవునైన నీకుఁ దగినదిగను, న్యాయ్యముగను నున్నది. వానరశ్రేష్ఠా! నేర్పున్నను, తాను జేసినతప్పిదము నెఱిఁగినవాఁడు, నీవును మాయన్నయుఁదప్ప నెవ్వఁడు తనయపరాధము నొప్పుకొనును? వానరాధిపా! నీవు బలపరాక్రమములందు రామునితో నెనవచ్చువాఁడవు. బహుకాలముక్రిందటనే దేవతలు నిన్ను రామునిసాహాయ్యమునకై సృజించిరి. ఇప్పుడు నేఁ జెప్పునది యేమనిన, వీరుఁడా! నీవును వేగిరముగా నాతోడ నిచ్చటినుండి వెడలివచ్చి, భార్యావిరహశోకమ్ముచేఁ జిక్కియున్న చెలికాని నోదార్పుము. వగచేఁ గొట్టఁబడినవాఁడైయున్న రాముఁడు నెప్పినమాటను విని నీకడ కేగుదెంచి నిన్నుఁ జెప్పిన పరుసనిమాటల నెల్ల మన్నింపవలెను అని లక్ష్మణుఁడు సుగ్రీవునితోఁ జెప్పెను.

37వ సర్గము.

సుగ్రీవుఁడు వానరుల నందఱిని బిలిపించుట

మహాబుద్ధియగు లక్ష్మణుఁ డిట్లుపలుకఁగా, సుగ్రీవుఁడు చేరువనిలఁబడియున్న మంత్రియగు హనుమంతునిఁ జూచి, "మహేంద్రము, హిమవంతము, కైలాసము, వింధ్యము, తెల్లనికొనలుగల మందరము ననెడి యీనాలుదుకొండలందున్న వారిని, బాలసూర్యనిమాడ్కి నెఱ్ఱనై యంతటవెలుఁగుచున్న పడమటిదిక్కునఁ బడమటిసముద్రమున నున్న పర్వతములందున్న వారిని, సంజవేళయందలి మేఘములఁబోలిన యుదయపర్వతమునందును, భీకరమయిన పద్మతాళవనమున నుండు కాటుక

కొండయందు నివసించునట్టి కాటుకను, క్రొక్కాటు మొగుళులను బోలి యేనుఁగులం బురుడించువారిని, మనశ్శిలా గుహాయందుండు పసిండిచాయగలవారిని, మేరుధూమ్రపర్వతములం దుండువారిని, గొప్పదైన యరుణపర్వతంబున వసించుచు మైరేయమనుమద్యము ద్రావువారు, బాలసూర్యుని కాంతివంటికాంతి గలవారు కడువేగిర ముగాఁ జనువారు నైనవారిని, మఱియుఁ గమ్మనితావులు గలిగి, జడదారుల మనికిపట్టయి చూపఱకింపుగలిగించునవై యున్న గొప్ప యడవులందును, తత్ప్రదేశములం దంతటను వసించునట్టి వానరులనందఱిని బిలిచికొనివచ్చుటకై సామదానాద్యుపాయము లుపయోగించి, వానరులను వేగిరముగాఁ బంపుము. వానరులను బిలిచికొనిరా నేను మొదటఁ బంపిన వేగవంతులగు నాదూతలను ద్వారపెట్టుటకై మఱికొందఱి వానరులను మఱలఁ బంపుము. ఎవరు మన్మథవ్యాపారములందుఁ జిక్కియున్నారో, ఎవరు తడవుచేయుచున్నారో, వారినందఱిని వేగిరముగా నాయుత్తరవయ్యె నని పట్టితెమ్ము. నాయాజ్ఞ మీర కెవరిచ్చటికిఁ బడిదిన ములలోపల వచ్చిచేరరో, యట్టి నాయాజ్ఞ నుల్లంఘించువారిని వధింప వలయును. మనపురమున సాయభిమతము ప్రకారము నడచుకొనుచు నున్నట్టి మబ్బులను గొండలనుబోలిన భయంకరాకారముగల కోట్లకొలఁది వానరశ్రేష్ఠులంద ఱిచ్చటినుండి తరలి యాకాశమును గప్పునట్లు కన్పట్టుచుఁ బుడమియందుఁ దా మెఱిఁగిన దారులం దెల్లఁబోయి నాయానతి యయ్యె నని వానరవీరులను దోడితెత్తురుగాక!" అని హనుమంతుని కానతియొసఁగెను.

వాయుతనూజుఁడును నామర్కటముల యేలికయొక్క మాటను విని, యన్ని దెసలకును బలశాలురయిన వానరవీరులను బంపెను. సుగ్రీవుఁడు పంపిన యావానర వీరులందఱు వెంటనేతరలి పక్షులును నక్షత్రములును దిరుగునట్టి యాకాశమార్గమునఁ బోయి, పర్వతములందును, సముద్రములందును, కానలయందును, కొలఁకులయందును వసించెడి వానరులనందఱిని "రామునికార్యమునకై మిమ్ము సుగ్రీవుఁడు పిల్చికొని రమ్మనెను" అని చెప్పిరి. అంత వానరులందఱు యమునిఁబోలు రాజరాజగు సుగ్రీవుఁడు చెప్పిపంపిన మాటను విని, పోకున్న సుగ్రీవుఁడేమి సేయునో యని వెఱచినవారై, యన్ని దెసలనుండి వచ్చిరి. అంజన

పర్వతమునుండి యూకొండవంటి మేని చాయగలవారైన వానరులు మూడు కోట్లమంది వచ్చిరి. అస్తమయపర్వతమునుండి పుటముదీర్చిన పసిఁడివన్నెగల పదికోట్ల వానరులు వచ్చిరి. కైలాసపర్వతము కొనల నుండి సింగపుఁజూలువంటి డాలుగల వానరులు వేయికోట్లు విచ్చేసిరి. హిమవంతమునఁ బండ్లు దుంపలు దిని బ్రతికెడి వేయి కోట్లు వానరులు విచ్చేసిరి. వింధ్యపర్వతమునుండి వెలుపు పుట్టించుకార్యములు సేయువారు, అంగారకునితో సమానులునైన వానరులు పెక్కువేలకోట్లమంది వేగిరముగాఁ బఱతెంచిరి. మఱియు క్షీరసముద్రతీరమున నుండువారు, తమాలవననివాసులు, నారికేళములఁ దినువారునగు లెక్కపెట్టనలవి కాని వానర లేతెంచిరి. వనములనుండియు, గుహలనుండియు, నదీతీర కులనుండియుఁ గడుబలముగల వానరసేన సూర్యుని క్రింగులాగునఁ

పర్వతముఁజేరి, లక్ష్మణుఁడును దానును బల్లకినుండి దిగి, రాముని చెంతకుఁ బోవఁగనే చేతులుజోడించికొని నిలిచెను. తక్కిన వానరులును, నట్లే చేతులుజోడించుకొని నిలువఁబడిరి. తామరమొగ్గలతోఁగూడిన చెలువు మాడ్కి ముడిచినచేతులతో నున్న యాగొప్పవానరసేనంజూచి, సుగ్రీవుఁడు తనకార్యమును జేయఁబూనెఁగదాయని యపారసంతోషము నొందెను. అంత సుగ్రీవుఁడు బద్ధాంజలియై రాముని పాదములందుఁ బడఁగా, రాముఁ డాసుగ్రీవునిఁ బ్రేమగౌరవములతో నాలింగనముచేసి కొని కూర్చుండ నానతిచ్చెను. సుగ్రీవుఁడు కూర్చుండిన పదంపడి రాముఁ డతనితో నిట్లనియె.

"ఓ వానరశ్రేష్ఠా! కాలమును విభజించుకొని ధర్మార్థకామముల నన్యోన్య కాలములందుమాత్రము సేవించువాఁడే మేటియగు రాజనఁ బడును. ఎవఁడు ధర్మార్థసంగ్రహమును విడిచి యెల్లప్పుడు కామమును సేవించుచున్నాఁడో, వాఁడు చెట్టుకొనయందు నిద్రించి, క్రిందఁబడి మేలుకొన్నపిమ్మట జింతించును. శత్రువధమున నాసక్తిగలవాఁడై చెలి కాండ్రను సేకరించుటయందు శ్రద్ధపూని, ధర్మార్థకామముల నాయా సమయములందు సేవించువాఁడు సుకృతముచేసినవాఁడగును. శత్రు నాశకా! శత్రువధమునకై ప్రయత్నపడవలసిన సమయము వచ్చినది. నీవు మంత్రులతోడఁగూడి చేయవలసిన కార్యం[illegible]"

మగఁటిమిగలిగినవారు మేరుమందరపర్వతములను బుడుఁచువారును నైన మేరువింధ్యాదిపర్వతములందు వసించు పెక్కుండ్రు వానరవీరులు నూఱులు, వేలు, పదివేలు, లక్షలు, కోటులు, శంకువులు, అర్బుదములు, నూఱర్బుదములు, మధ్యములు, అంతములు, సముద్రములు, పరార్ధము లను సంఖ్యగల సేనలను వారివారిశక్తికిఁ దగినట్లుగాఁ దీసికొని వచ్చుచున్నారు. ఆ వానరవీరులు సేనలతోఁగూడినవారై రావణునిమీఁదికిఁ గవిసి, రావణుని బంధుమిత్రపరివారములతోఁ గూడ సంహరించి సీతాదేవిని మీసన్నిధానమునకుఁ దెచ్చి యప్పగింపఁగలరు" అని సుగ్రీవుఁడు పలుకఁగా, బుద్ధిమంతుఁడగు రాముఁడు తనయాజ్ఞ ప్రకారము సుగ్రీవుఁ డొనర్చిన గొప్పప్రయత్నముం జూచి, యిఁక సీతాన్వేషణప్రయత్నము జరుగఁగలదుగదా యని యానందముచే వికసించిన నల్లకల్వవంటి కన్నులుగలవాఁ డయ్యెను.

39-వ సర్గము

నలుదెసలనుండి వానరసేన లేతెంచుట

ఇట్లు సుగ్రీవుఁడు పలుకఁగా, ధర్మవేత్తలలోపల శ్రేష్ఠుఁడైన రాముఁడు చేమోడ్చి నిలిచియున్న యా సుగ్రీవుని గట్టిగాఁ గౌఁగిలించుకొని "ఓ సాధువా! దేవేంద్రుండు వానగురిపించి జనులను దనివినొందించుటయు, వేయివెలుఁగులతేఁడు చీఁకటిని బోకార్చి వెలుతురొసఁగుటయు, చంద్రుఁడు రేలయందుఁ దనకిరణములచేఁ బుడమిని తేటపఱచి, యానందము గలుగఁజేయుటయు, శత్రుసంహారీ! నీవంటివాఁడు చెలికాండ్రకుఁ బ్రత్యుపకారము సేయుటయు నొక్కవింతసంగతి గాదు. ఇట్లె నీయందు మంచిగుణముండుట యొక వింతగాదు. సుగ్రీవా! నీవు నాకెల్లప్పు డిష్టముగా మాట్లాడువాఁడవని యెఱుఁగుదును. నీవె నామేలు గోరు చెలికాఁడవు. నీవు నాకు సహాయుఁడవ్వైయుండువేని, నేను శత్రువులనందఱను గెల్వఁగలను. కావునఁ జెలికాఁడా! నీవు నాకు బాసట సేయవలయును. పూర్వము దేవేంద్రుని మోసపుచ్చి శచీదేవిని దొంగిలించుకొనిపోయినట్లు, రాక్షసాధముఁడయిన రావణుఁడు తన చేటుకై యీదేహిని (సీతను) నపహరించెను. యుద్ధరంగమున వేల్పుల తేఁడు శచీదేవి ననుహ్లాదుం డపహరించినందుకై సమ్మతించియుండిన

గర్వితుఁడయిన శచీదేవితండ్రియగు పులోమునిఁ జంపినట్లు, నేను వేగి రమే వాడిబాణముల నేసి యారావణునిఁ జంపెదను" అని సుగ్రీవు నితోఁ జెప్పెను.

ఇట్లు రామసుగ్రీవులు మాట్లాడుచుండఁగా నింతలో నాకాశ మున వెలుఁగు వేవెలుఁగుయొక్క వేఁడివెలుతురుం గ్రమ్ముచు దుమ్ము లేచెను. అట్లు వృద్ధినొందుచున్న దుమ్ము దెసలెల్లఁ గ్రమ్మి యేమియుఁ దెలియకుండెను. పర్వతవనములతోఁగూడిన పుడమి కదలెను. అంతఁ గొండంతయెత్తుగలవారు, వాడికోఱలుగలవారు, ఎక్కువ బలిమిగల వారు, లెక్కపెట్ట నలగానివారు, పెక్కుకోట్ల పరివారములతోఁ గూడినవారు, కోరినరూపముదాల్చువారు, మేఘగర్జనంబోలు ధ్వనులు గలవారునైన బలవంతులగు వానరవీరులు నదులగట్టులందుఁ బుట్టిన వారు, కొండలందుఁబుట్టినవారు, కడలిగట్టులందుఁ బుట్టినవారు వచ్చి నిమిషములోపలఁ బుడమియెల్లఁ గ్రమ్మిరి. అందు కాంతిమంతుఁడగు శతవలి యను నొక వానరులమేటి బాలసూర్యనివంటి మేనిచాయగల వారు, చందురునివలెఁ దెల్లనివారు, పద్మకేసరములవంటి వన్నెతోఁ గూడినవారునైన పదివేలకోట్ల వానరసేనలతోడఁ గన్పట్టెను. మేరు పర్వతపుంజాయగలవాఁడు, వీర్యవంతుఁడు నయిన తారతండ్రి సుషే ణుండు పెక్కువేలకోట్ల వానరసైన్యములఁ దోడ్కొనివచ్చెను. అట్లు రుమ తండ్రియగు సుగ్రీవునిమామయైన తారుఁడు వేయికోట్లసేనలం గొనివచ్చెను. పద్మకింజల్కములఁబోలు వన్నెగలవాఁడు, బాల సూర్యనివంటి మోముగలవాఁడు. బుద్ధిమంతుఁడు, వానరు లందఱి లోపల బలవంతుఁడు నుత్తముఁడు కాంతిమంతుఁడు హనుమంతుని తండ్రియునయిన కేసరి పెక్కువేల వానరసేనలతో వచ్చి చూపట్టెను. భీతిగలిగించు విక్రమముగల కొండమచ్చుల రాజగు గవాక్షుఁడు విక్రమముగల కోతిమూఁకలతోఁగూడ నేతెంచెను. శత్రువులఁబరి మార్చు ధూమ్రుఁడు వడిగాఁబోవు రెండుకోట్ల యెలుఁగుబంట్లసేన లను వెంటఁగొనివచ్చెను. మహావీర్యుఁడగు పవనుఁడను కోతిగుంపు కాఁపు గొప్పకొండలంబోలు ఘోరరూపులయిన మూడుకోట్లసేన లతోఁగూడి వచ్చెను. నల్లనికాటుకరాశివంటి డాలుగల గొప్ప మేనుగలవాఁడయిన నీలుఁడను వానరయూథపుఁడు పదికోట్లసేన

లతోఁ గూడుకొన్నవాఁడై వచ్చెను. మఱియు, పసిఁడికొండవలె వెలుఁగు గొప్పశూరుఁడగు గవయుఁడును వానరయూథపాలుఁడు పది కోట్లసేనలతోఁ గూడివచ్చెను. అట్లె దరీముఖుండును బలవంతుఁడగు నొకకోఁతిగుంపు వేయికోట్లవానరబలగముతోడ సుగ్రీవునికడ కేగు దెంచెను. అశ్వినీదేవతలబిడ్డలయిన బలిష్ఠులగు మైందద్వివిదులు వేయి వేయికోట్ల సేనలతో చనుదెంచిరి. ఎక్కువ ప్రతాపముగల గజుఁడును మూడుకోట్లసేనలతోఁగూడి సుగ్రీవునిసన్నిధి కేతెంచెను. మహా తేజస్సుగల జాంబవంతుఁ డను భల్లూకరాజును బదికోట్లసేనలతో సుగ్రీవునిచేరువకు వచ్చి నిలఁబడెను. మొనగాఁడగు రుమణ్వంతుఁడును వానరుఁడు నూఱుకోట్లబలగముతో సుగ్రీవుని సన్నిధానమున కేతెంచెను. అంత గంధమాదనుఁడు పదిలక్షలకోట్ల వానరులతోను, లక్షకోట్లవానరులతోను గూడి యా సుగ్రీవునిసన్నిధి కేతెంచె. పరాక్రమమునఁ దండ్రితో నీడయిన యువరాజగు నంగదుఁడు వేయిపద్మములు, నూఱుశంకువులు సంఖ్యగాఁగల సేనలతోఁగూడి పినతండ్రికడ కేగుదెంచెను. భీమబలుఁడు నక్షత్రప్రకాశుఁడునయిన తారుఁ డైదు కోట్ల సేనలతోను, ఇంద్రజానుఁ డును యూథపాలుఁడు పదునొకండు కోట్ల సేనలతోను విచ్చేసిరి. అంత సూర్యనిఁబోలు వెలుఁగుగల రంభుఁడును వానరుఁడు పెక్కువేల వానరులం దోడ్కొని వచ్చెను. తర్వాత గుంపుకాఁపును శూరుఁడునునైన చేవకాఁడగు దుర్ముఖుఁడును వానరుఁడు రెండుకోట్లసేనలతోఁ గన్పట్టెను. హనుమంతుఁడు కైలాస శిఖరమువలె నెత్తయినవారు, పగతురను జడిపించు మగతనముగల వారునునైన వానరవీరుల వేయికోట్లమందిని దోడ్కొనివచ్చెను. మహా వీరుఁడగు నలుఁడును పదిలక్షలకోట్ల వానరపరివారమును వెంటఁ గైకొని వచ్చెను. అట్లె కాంతిమంతుఁడును, సుగ్రీవునికిఁ బ్రియ స్నేహితుఁడునునైన దధిముఖుఁడు పదికోట్ల కోతిమూఁకతో వాన రాధిపునికడకు వచ్చెను. శరభుఁడు; కుముదుఁడు, వహ్ని, రంహుఁడు మొదలగు కామరూపులయిన పెక్కండ్రు వానరులు తమతమ సేనలను గూడఁదీసికొని పుడమినెల్లను, పర్వతములను, వనములను గ్రమ్ముచు వచ్చిరి. వారిని లెక్కింప నలవియేకాదు. అట్లువచ్చి పుడమియెల్లనిండిన యావానరసైనికు లందఱు సంతోషముచే నెగురుచు, డాఁటుచు. కిల

కిలధ్వనులు చేయుచు, మేఘములు సూర్యునిఁగప్పినచందమున నాసుగ్రీవునిఁ జుట్టుకొనిరి. ఎక్కువబలముచే నొప్పిన యావానరవీరులుప్పొంగుచుఁ బెక్కుతెఱఁగులఁ గిలకిలధ్వనులు సేయుచుఁ దలలు పైకెత్తి వానరరాజగు సుగ్రీవునికిఁ దమరాక యెఱిఁగించిరి. మఱికొందఱు వానరశ్రేష్ఠులు బట్టలను బిగించి కట్టుకొని యాసుగ్రీవునిప్రక్కఁ జేతులుమోడ్చి నిలఁబడియుండిరి. అప్పుడు ధర్మముల నెఱిఁగిన సుగ్రీవుఁడు త్వరితముగా లేచి నిలిచి చేమోడ్పుచేసి రామున కాసేనలం జూపెను. అంత తాను వానరసేనలం జూచి, "వానరేంద్రులారా! సేనలకాపరులు దమసేనలను పర్వతములందును నెలయేళ్ళయందును సుఖముగాను యథావిధిగను విడియునట్లుచేసి, నప్పుడు బలమునెఱిఁగినవాఁడు దనబలఁగ మింతయని యెఱుఁగఁగలిగియుండవలెనని చెప్పెను.

40-వ సర్గము.

సుగ్రీవుఁడు వానరవీరులను తూర్పునకు పంపుట

అంత వానరులకు జేఁడగు సుగ్రీవుఁడు కావలయువారి నెల్లఁ జేర్చికొన్నవాఁడై, శత్రువుల నడఁగార్చగల నరోత్తముఁడగు రామునిఁ జూచి, "ఓ రాజేంద్రా! బలవంతులు, కోరినరూపమెత్తఁగలవారు, దిగ్గజములఁ బోలువారునైన నానాదేశవాసులగు వానరులందఱు వచ్చి విడిసియున్నారు. ధైర్యదానవులం బోలువారు, వెఱపు పట్టించువారునైన మేటివానరులందఱు విశేషబలపరాక్రమములుగల వానరసేనలతోఁ గూడినవారయి వచ్చియున్నారు. వీరందఱు వీరకార్యములచేఁ బ్రసిద్ధికెక్కినవారు, బలిమిగలవారు, శ్రమలకోర్చువారు, పగతురమీఁదఁ బడులందు వాసికెక్కినవారు, పనులందు మిక్కిలి పట్టుదలగలవారు, నీటను బుడమిని దిరుగునట్టివారు, నానాపర్వతములనున్న వారునైన యావచ్చిన వానరసైనికులు కోట్లకంటె మించియున్నారు. వీరందఱు నీ సేవకులు; విధేయులు; యజమానులకు మేలొనఁగూర్చుటయందు నేర్పరులు. శత్రువుల నణఁగఁద్రొక్కువాఁడా! వీరు నీకోరినకార్యము సాధింపఁజాలుదురు. వీరు పెక్కువేల నేనలతోఁగూడ వచ్చియున్నారు. నరశ్రేష్ఠా! మీ కెయ్యది యుక్తముగాఁ దోఁచెఁడి దానిని జెప్పుము. నీయధీనత యందుండఁగోరిన యీసైన్యంబున కాజ్ఞ యొసఁగుము. ఈ వానరవీరు

లిప్పుడు చేయవలసినపని యిది యని వాస్తవముగా నెఱుఁగుదును. అయినను నీవే యీవానరసేన కాజ్ఞయొసఁగుము" అనిచెప్పెను.

దశరథునికొమరుఁడగు రాముఁ డిట్లనుఁగునఁ బలుకుచుండు సుగ్రీవుని నిరుకేల గట్టిగాఁ గౌఁగిలించుకొని, "ఓ చెలికాఁడా! యీగొప్ప తెలివికాఁడా! నాప్రాణనాయిక యగు సీత ప్రాణములతో నున్నదా లేదా?" యనియు "ఆరావణుఁ డుండుదేశమేదియో" అనియు నెఱుఁగవలయును. సీత జీవించియుండు సంగతిని, రావణునియునికిపట్టు నెఱిఁగినపిదప నీవును నేనును చేయవలసినది చేయుదము. వానరులకు ఱేఁడా! యీకార్యమున నేనుగాని, లక్ష్మణుఁడుగాని సమర్థులము గాము. నీవె యీకార్యము నేర్పఱచువాఁడవు; సాధింపవలసినవాఁడవు నై యున్నావు. నేర్పుకాఁడా! నీవ యప్పుడు చేయఁదగినపనిని వీరి కాజ్ఞాపింపుము. ఏలయన శూరుఁడా! నా కిప్పుడు సేయవలసినపని యేదియో నీవెఱుఁగుదువు. ఇదినిక్కము, ఇదినిక్కము. నీవుమంచిమనసు గలవాఁడవు; సరివాఁడవు; మగఁటిమిగలవాఁడవు; తెలివికాఁడవు; కాలమునొక్క తీరునెఱిఁగినవాఁడవు; మాకు మేలొడఁగూర్చుట యందు శ్రద్ధగలవాఁడవు; పుణ్యకార్యములే ప్రయోజనముగాఁ గల వాఁడవు. కార్యములనడపడిఁ జక్కగాఁ నెఱిఁగినవాఁడవు" అని సుగ్రీవునికే తనకార్యము సేయ నానతిచ్చెను.

అట్లు రాముఁడు పలుకఁగా, సుగ్రీవుఁడును రామలక్ష్మణుల సమ ఱుమునఁనే కొండంతవాఁడు, ఉఱుమువంటిగొంతుగలవాఁడు, బలిమి గలవాఁడు నయిన వినతుఁడనెడి యొక గుంపుకాఁపును బిలిచి యిట్లనియె: "ఓ వానరోత్తమా! దేశకాలోచితమగు నీతి ననుసరించి యుక్తాయుక్త ముల గమనించుచు, బలవంతులగు లక్షవానరులను, చంద్రసూర్యుల పుత్రులగువానరులను బాసటగాఁగొని తూర్పుదెసకేగి, యచ్చటి పర్వత శిఖరములందును, నదులందును, వనములందును, సీతాదేవిని, రావ ణుని నివాసస్థలమును వెదకుము. మీరంద ఱిచ్చటినుండి వెడలి తూర్పు మొగముగా బయలుదేరి, మనోహరమయిన గంగాతీరమునను, సర యువు, కౌశికి, యమునానదులగట్టులందును, యామున మను గొప్ప కొండయందును, సరస్వతి, సింధువు, మణివలె తేటనైన నీటితోఁ గూడిన శోణనదము నను నదుల వీనిగట్టులందును, కొండలతోడను అడ

వులతోడను నొప్పారుమహికాల మహియను దేశములందును బ్రహ్మమా
లము, విదేహము, మాళవము, కాశి, కోసలము, గొప్పగ్రామములు
గల మాగధము, పుండ్రము, వంగము నను దేశములందును కోశకా
రుల పత్తనంబునను, వెండిగనులుగల దేశమునందును మీరు రాముని
ప్రియ భార్యయు, దశరథుని కోడలునైన సీతాదేవి నచ్చటచ్చట నన్ని
ప్రదేశములందును బాగుగా వెదకవలయును.

సముద్రములోపల నున్న కొండలను, పట్టణములను, మందర
పర్వతంపు నిడివికోనలను భయంకరరూపులగు మనుష్యు లాశ్రయించి
యున్నవారు. వారిలోఁ గొందఱు చెవులులేనివారు; కొందఱు పెదవు
లందుఁ జెవులుగలవారు; కొంద ఱుక్కునలె గట్టిమోముగలవారు;
వడిగాఁబోవువారు; ఒంటికాలితో నడుచువారు; నాశములేనివారు;
బలిమిగలవారు; మానిసిదిండులైనవారు. బోయలు చెవులందు జుట్టు
గలవారు, పసిఁడివన్నె దేహముగలవారు, చూడఁదగినరూపముగల
వారునై యున్నారు. మఱియు పచ్చిచేఁపలనే తినువారై నీటిలోపలనే
తిరుగునట్టి భయంకరులయిన సగము మనుష్యరూపము, సగము పులి
దేహమును దాల్చిన కిరాతులు వసించుచున్నారు. వీరందఱి గృహము
లన్నియు వెదకవలయును.

పర్వతములుదాఁటి పోవలసిన ద్వీపములకును, ఎగిరి దాఁటి
పోయి చేరఁదగిన ద్వీపములకును, తెప్పలమీఁద దాఁటఁదగినద్వీపము
లకును బోయి, రత్నములు గలదియు, నేడురాజ్యములచే శోభిల్లున
దియు నయిన యవద్వీపమును, బంగారు గనులచే వెలుఁగు సువర్ణ
రూప్యకద్వీపమును వెదకి యారెంటినిదాఁటి, దేవదానవులకు మనికి
పట్టును, నింగినిదాఁకు శిఖరములతోఁగూడినదియునైన శిశిరపర్వతము
చేరి యాపర్వతమున సెలయేళ్లయందును, చొరరానిదుర్గములందును,
చరియలందును, వనములందును మీరందఱుగూడి పేరెన్నికగన్న సీతా
దేవిని వెదకవలయును.

తర్వాత మీరు లవణసముద్రంపు టావలిగట్టుచేరి, యచ్చట
సిద్ధచారణులతోఁ గూడినదియు, వడిగాఁబొఱునదియు, లోఁతయి
నదియు, నెఱ్ఱనినీరుకలదియు నయిన శోణనదమునొంది, యానదిగట్టున
నున్న విచిత్రములయిన వనములందును, రమ్యములయిన రేవులందును

సీతాదేవిని, రావణుని వెదకవలయును. అంతఁ బ్లక్షద్వీపమందు, కొండ లనుండి పుట్టుమనోహరములయిన నదులందును, ఆ నదీతీరములండలి పొదలందును, పెక్కుచయలతోఁగూడిన పర్వతములందును వనము లందును వెదకవలయు. అంత కడుభీకరములగు నిక్షుసముద్రమునందలి ద్వీపములను, గాలికిఁ బైకిలేచి మ్రోయుచుండు పెక్కుతరంగములు గల యిక్షుసముద్రమును జూడవలయు.

అచ్చట, గొప్పమేనులు గలరాక్షసులు బహుకాలమునుండి నిరాహారులై యున్నందున బ్రహ్మదేవుని యాజ్ఞవడసి, యెల్లప్పుడు జీవకోటులనీడనులాగి మ్రింగుచుండిరి. అటుపిమ్మట ప్రళయకాల మేఘముఁ బోలినదియు, గొప్పపాముల కునికిపట్టును, గొప్పనాదముగల దియునయిన యయ్యిక్షుసముద్రము నుపాయముచేత రాక్షసులచేతఁ జిక్కక దాఁటి, యావల నెఱ్ఱనిజలముగలదియు, భీతినిగలిగించునదియు నయిన లోహితమను సముద్రమునుబొంది యచ్చటఁ బ్రసిద్ధమయిన గొప్పదగు కూటశాల్మలిని అచ్చటనే విశ్వకర్మచేఁ గట్టఁబడిన నానావిధ రత్నములచే నలంకృతమైయున్న కైలాసముంబోలు గరుత్మంతునిగృహ మును జూడఁగలరు. ఆశాల్మలిద్వీపమునఁ బలురూపములు గలిగి, భీతి గలిగించువారు, పర్వతసదృశులు నయిన మందేహులనెడి రాక్షసులు పర్వతశిఖరములందు వ్రేలాడుచున్నారు. ఆమందేహులనెడి రాక్షసులు నిత్యము ప్రతిదినము నరుణోదయకాలమున బ్రాహ్మణులు జపించు గాయత్రీమంత్ర జపప్రభావముచేఁ గొట్టఁబడినవారలయి సముద్రోదకము లందుఁ బడుచుందురు.

తదనంతరము పగతురకెదిరింపనలవిగాని మీరు తెల్లనిమేఘముఁ బోలి, తెల్లనితరంగలచే ముత్యాలహారముగలదానివలె శోభిల్లు పాల్క డలినిఁ జూడఁగలరు. ఆ పాల్కడలినడుమ మేటితావిగలిగి, పుష్పించిన రజతమయంపుఁజెట్లతోఁ గూడినదైన గొప్పదగు ఋషభ మను నొక పర్వ తము గలదు. బంగారుకింజల్కములు కలిగి వెలుఁగుచున్న వెండివన్నె తామరపువ్వుతోఁగూడి, రాయంచలతో నిండిన సుపర్ణ మనుపేరు గలయొక సరస్సుగలదు. యక్షకిన్నరగంధర్వ చారణాప్సరసలును దేవత లును జలక్రీడలు సల్పుటకై యాకొలనికి సంతసముతో వచ్చుచుందురు.

వానరులారా! పాల్కడలిం దాఁటినపిదప జంతువులకన్నిటికిని భీకరము, దానికోపమువలనఁబుట్టిన సముద్రములలో శ్రేష్ఠమునయిన మంచినీటిసముద్రమును జూడఁగలరు. ఆమంచినీటి సముద్రమున గుజ్జుమోమొగల బడబాగ్ని యను నొక గొప్పతేజస్సు నెలకొని యున్నది. ఆబడబాగ్నికి స్థావరజంగమములతోఁ గూడినదియు, విశేష వేగముగలదియునయిన యా శుద్ధజలసముద్రమే యాహారముగానున్న దని చెప్పుదురు. ఆ సముద్రమున నున్నట్టి భూతములు సామర్థ్యముగల వైనను, ఆ బడబాగ్ని ముఖమును జూచి యేమియుఁజేయఁజాలక యఱచు చుండును. ఆ శబ్దమును మీరును వినఁగలరు. మంచినీటికడలికిఁ బదిమూడుయోజనము లుత్తరమున జాతరూపశిలము (బంగారుఱాలు గలది) అను గొప్పపసిఁడి కొండయొకటి కనఁబడును. వానరులారా! అప్పర్వతమునఁ జంద్రునివలెఁ దెల్లనై తామరరేకులంబోలుకన్నులు, వేయితలలు గలిగి, నల్లనివలువ దాల్చి సకలజంతువులచేఁ నమస్కరింప బడుచు నా పర్వతశిఖరమునఁ గూర్చుండి భూభారము మోయుచున్న యాదిశేషునిఁ జూడఁగలరు. మహాత్ముఁడగు నయ్యాదిశేషుని ధ్వజ మయిన మూఁడుతలలుగల బంగారు తాటిచెట్టు పర్వతశిఖరమునఁ దిన్నె యందు స్థాపింపఁబడినదై వెలుఁగుచున్నది. దేవతలకుఁ బ్రభువులయిన బ్రహ్మ విష్ణు రుద్రు లా తాటిచెట్టును దూర్పుదిక్కు నెల్లగా నేర్పఱచి యున్నారు.

ఆ పర్వతమువెంబడిఁ బసిఁడిమయమై కాంతిగల పొడుపుగుబ్బలి కనఁబడును. బంగారుమయమై తిన్నెతోఁగూడి దివ్యమై వెలుఁగుచున్న యా పొడుపుగుబ్బలికొన నూఱామడల పొడవుగలదై నింగినిఁ దాఁకుచు వెలుఁగుచున్నది. ఆయుదయపర్వతశిఖరమున బంగారుమయములై సూర్యబింబమువలె వెలుఁగు సుందరములైన పూచిన మద్దిచెట్లు, తాటి చెట్లు, కానుఁగుచెట్లు, కొండగోఁగుచెట్లు కడుశోభిల్లుచుండును. అచ్చట యోజనమువెడల్పును, పదియోజనముల యెత్తునుగలిగి బంగారుమయమైయున్న కదలనిదగు సౌమనస మను శిఖరము వెలుఁగు చున్నది. తొల్లి వామనావతారమున విష్ణువు మూఁడడుగులు పెట్టి నప్పుడు, ఆ సౌమనసశిఖరమున మొదటియడుగుపెట్టి, రెండవయడుగు మేరుశిఖరమున నుంచెను. సూర్యుఁడు జంబూద్వీపము నుత్తరభాగ

మును జుట్టివచ్చి, మిక్కిలి యెత్తయిన యీ శిఖరము సేరినతోడనే, మేరుపర్వత దక్షిణభాగమున నున్న వారికందఱికి వెల్తురు గానఁబడు. అస్తపర్వతశిఖరమునఁ దపస్సుచేయుచుఁ బ్రభాకరునిమాడ్కి వెలుఁగు వాలఖిల్యులు, వైఖానసులు ననెడి మహర్షులు గనఁబడుదురు. సమస్త జీవరాసులకుఁ గంటికి వెలుతురొసఁగు సూర్యుఁ డేయుదయపర్వతమున వెలుఁగుచున్నాఁడో, అయ్యది సుదర్శనద్వీప మనఁబడును. ఆ ద్వీపమున నచ్చటచ్చట రావణుని సీతాదేవిని వెదకవలయును.

ఆ బంగారు కొండడాలుచేతను, మహత్తుఁడగు సూర్యుని వెలుఁగుచేతను న్యాప్తమై ప్రాతస్సంధ్య యెట్లనై వెలుఁగుచుండును. తొల్లి యిది పుడమికిని, లోకములకును ప్రథమద్వారముగాన, సూర్యుఁ డుదయించుతావుగాను బ్రహ్మదేవునిచే నిర్మింపఁబడియుఁ గాన నిది పూర్వదిశ యని చెప్పఁబడుచున్నది. ఆ యుదయపర్వతముయొక్క చరియలందును, సెలయేళ్లయందును, గుహాలయందును అచ్చటచ్చట రావణుని, సీతాదేవిని వెదకవలయు. ఆ యుదయపర్వతమున కావలఁ దూర్పుదిక్కు సూర్యచంద్రులవెలుఁగు సోఁకమిచేఁ జీఁకటితోఁగూడి, చూడ నలవికానందునఁ బోనలవికాకయుండును గాన నచ్చట దేవతలుమాత్ర మే సంచరింతురు. వానరులారా! తూర్పుదెసను నేను జెప్పక విడిచిన యీయీ గుహాలందును, కాననయందును, వేయేల, యన్ని ప్రదేశములయందును సీతాదేవిని వెదకవలయును. వానరులారా! తూర్పుదెసయందు మీ రింతవఱకే పోఁదగును. సూర్యరశ్మి సోఁకక, హద్దులులేక యున్నందున, నావల నేమి యున్నదో తెలిసినదికాదు. కావున నింతవఱకుఁబోయి, యచ్చటచ్చట వెదకి రావణునియొక్కయు, సీతాదేవియొక్కయు పోవిడి గనుఁగొని రావలయు. మీ రొక్కనెల కంటె నెచ్చుదినము లెచ్చట నుండఁగూడదు. అట్లైవఁడైన నుండునేని, వాఁడు వధ్యుఁడగును. కావున నాసీతాదేవిసంగతిఁ దెలిసికొని, కృతార్థులై మఱలిరండు. ఓ వానరులారా! దేవేంద్రునిచేఁ బాలింపఁబడి నదియు, పెక్కు వనములచేఁ బ్రకాశింపఁజేయఁబడినదియునైన తూర్పు దిక్కున నేర్పుతోఁ దిరిగి, రఘురామునిభార్యయొక్క వృత్తాంతముఁ దెలిసి మఱలివత్తురేని, సుఖములఁ బొందుదురు" అని సుగ్రీవుఁడు వానరులతోఁ జెప్పెను.

41-వ సర్గము.

సుగ్రీవుఁడు హనుమదాదులను దక్షిణదిశకుఁ బంపుట

వీరుఁడు, వానరాధిపుఁడు, భృత్యులతారతమ్యము నెఱిఁగిన వాఁడునైన సుగ్రీవుఁ డవ్విధమున విస్తారమైన వానరసేనను తూర్పు దిక్కునకుఁ బంపి, అగ్నియొక్కపుత్రుని నీలుని, వాయుపుత్రుఁడగు హనుమంతుని, బ్రహ్మమానసికపుత్రుఁడైన జాంబవంతుని సుహోత్రుని, శరారిని, శరగుల్మని, గజుని, గవాక్షుని, గవయుని, సుషేణుని, ఋషభుని, మైందద్వివిదులను, విజయగంధమాదనులను, అగ్ని పుత్రులగు నుల్కాముఖుని, అసంగుని, అంగదుఁడు మొదలగు బలవేగములుగల ప్రసిద్ధులైన పెక్కు వానర వీరులను దక్షిణంపుదిశకుఁ బంపఁదలచిన వాఁడయి, యా వానరవీరులముందట వడిగాఁబోవునట్టి గొప్పసేన నొక్కదానిని నియమించి యా వానరవీరుల కాదిక్కునందుఁ దెలియని ప్రదేశము లేవియున్నవో, వానినెల్లఁ దెలుపఁగోరినవాఁడై యిట్లనియె.

ఓ వానరపుంగవులారా! మీ రిక్కడనుండి తఱలి దక్షిణంపు వైపునకుఁ దిరిగినవెంటనే పలువిధములయిన చెట్లతోఁగూడి వేయిశిఖరములు కలిసియున్న వింధ్యపర్వతమును, పెనుఁబాములతో నిండినదై దాఁట నలవికాకయుండు నర్మదానదిని, తరువాత దండకారణ్యమునందలి మనోహరమగు గోదావరీనదిని, మహానదియగు కృష్ణవేణీనదిని, మహిమ గలదియు, మహోసర్పముల కావాసమునైన వరదానదిని, మేఖలానదిని, ఉత్కలానదిని దాఁటి, దశార్ణదేశములను, అశ్వవతి, యవంతి యను దేశములను మఱియు ననేకదేశములను జూడఁగలరు. తర్వాత విదర్భ ఋషిక దేశములను, మనోహరములైన మాహిషకదేశములను, వంగ, కళింగ, కాశికదేశములను గలయం జూచి; పర్వతములతోను, గుహల తోను, నదులతోను గూడిన దండకారణ్యమును చక్కఁగాఁ దిలకించి, మఱల గోదావరిని దాఁటి యావల నాంధ్ర పుండ్ర చోళ పాండ్య కేరళ దేశములను జూడఁగలరు. ఆదేశములందంతటను మీరు సీతాదేవిని వెదకవలయు. అచ్చటనుండి కొంతదవ్వేగినచో గైరికాదిధాతువులచేఁ గైసేయఁబడియున్న సహ్యపర్వతము గానిపించును. విచిత్రమయిన శిఖరములుగలదియు; పుష్పితములైన నానావిధవృక్షములచేఁ బ్రకా

శించునదియు, చందనవృక్షములతోఁ పులతోఁ గూడినదియునై సొబగు మీఱియున్న యా గొప్పసహ్యపర్వతమున సీతను చక్కఁగా వెదక వలసినది.

అటుతర్వాత నిర్మలజలముగలిగి, పావనమై యప్సరసలచేఁ బూజింపఁబడినదై ప్రసిద్ధిగాంచిన దివ్యమైన కావేరినదిం జూడఁగలరు. మఱికొంతదూరము పోయిన మీకు మలయమను పర్వతము పొడ సూపును. ఆపర్వతశిఖరమునఁ దనతపోమహిమచే సూర్యునిపగిది వెలుఁగువాఁడును, ఋషులలో నుత్తముఁడునునైన యగస్త్యమునీం ద్రునిఁ జూడఁగలరు. అమ్మునీంద్రునిఁ జూచి, పూజలుసల్పి, సంతుష్టుఁడయిన మహానుభావుఁడగు నాతనివలన నానతివడసినవారలై మఱి కొంతదూరమునని మొసళ్లతోఁగూడిన తామ్రపర్ణియను గొప్ప నదిని దాఁటుఁడు. చందనము లలఁదుకొని, యున్నతస్తనములతోఁగూడిన ప్రియురాలగు జవ్వని తనప్రియునికడ కేగునట్టులిరుదరుల చందనవనము లచే నొప్పుచు, దీవులచేఁ బ్రకాశించుచున్న యా తామ్రపర్ణినది సముద్రమును బొందుచున్నది. ఆనదిని దాఁటి నడచినతరువాత, బంగారుమయమయి ముత్యములచే శోభితమయి వెలుఁగుచున్న పాండ్యదేశపు రాజులనగరద్వారకవాటమును జూతురు.

అచటినుండి వెడలి మఱికొంతదవ్వేగినచో దక్షిణసముద్రము గనఁబడును. అచ్చటికిఁ జేరి సీతాన్వేషణకార్యమునకై యాలోచించి కార్యనిశ్చయము సేయవలసినది. అక్కడనుండి వెడలినచో, నా సముద్రముచేరువ నగస్త్యమునీంద్రుఁ డుంచినదియు, నానావిధవృక్షములు గలదియుఁ గాంతిగలదియునైన మహేంద్రమను పర్వతశ్రేష్ఠము సముద్రజలము లానికొనియున్నది. నానావిధములగు వృక్షలతలచే మెఱయునదియు, దేవర్షియక్షోత్తములచేతను, అచ్చరలచేతను, సిద్ధచారణసంఘములచేతను గొల్వఁబడినదియుఁ గడునింపు గులుకునదియునైన యా మహేంద్రపర్వతమునకు దేవేంద్రుఁ డెల్లప్పుడు పర్వదివసములందు సముద్రస్నానమునిమిత్తము వచ్చుచుండును. ఆ మహేంద్రముదాఁటి, ఆ కడలినడుమ నావలితీరమువైపుగా నూఱుయోజనములు వైశాల్యముగల యొక్క ద్వీపమున్నది. అయ్యది మానవులకుఁ బోఁదగినదికాదు. ఆద్వీపము దేవేంద్రునితో సమానమగు వెలుఁగుగల

దుష్టుఁడయిన రాక్షసాధిపుఁడగు రావణునియొక్క యునికిపట్టు. ఆ ద్వీప మున మీరు తక్కినచోట్లకంటె నెక్కువగా సీతాదేవిని వెదకవలయును.

దక్షిణసముద్రమధ్యమున నంగారకుని తల్లియగుసింహికయని ప్రసిద్ధిగాంచిన యొకరాక్షసి నీటిపైఁ బరుండి నింగిని బోవువారినీడనీడ్చి భక్షించునది. మీరు దానికిఁ జిక్కక జాగ్రత్తతోఁ బోవలయును. అపరి మితపరాక్రమముగల వానరులారా! మీరు భయము మానినవారలై, యెచ్చటెచ్చట సీతాదేవి యుండవచ్చునని సంశయము గలుగునో, అట్టి సంశయస్థలములందెల్ల సీతాదేవిని వెదకి సంశయంబుఁ దీర్చుకొని రండు. లంకాపురముదాఁటి నూఱు యోజనములు పోయినతర్వాత, సముద్రము ననే సిద్ధచారణుల కునికిపట్టయిన పుష్పితక మను పర్వత మొక్కటి యున్నది. ఆ పుష్పితకపర్వతము చంద్రునివలె నొక్కప్రక్కఁ దెల్లనిదై, సూర్యునివలె మఱొకప్రక్కనెఱ్ఱనై సముద్రజలముచేఁ జుట్టఁబడి యెత్తు కొనలతో నింగి నొఱయుచున్నదో యనునట్లు వెలుఁగుచుండును. దాని శిఖరములలోఁ గాంచనశిఖరమును సూర్యుఁడు దక్షిణాయనమునఁ బొందును. చంద్రుఁడును వెండిశిఖరమునుబొందును. ఆకొండ నెనరు లేనివారికిని, క్రూరులకును, నాస్తికులకును గానఁబడదు. మీ రా పర్వ తమునకుఁ బ్రణమిల్లి యచ్చట సీతాదేవిని వెదకుఁడు.

శత్రువులకు లొంగని మీ భృత్యులారా! మీరు పుష్పితక పర్వతము దాఁటి పోనలవికానిదారిని పదునాలుగు యోజనముల దవ్వో గితిరేని, యచ్చట సూర్యవంతమను పర్వతమును మీరు చూడఁగలరు. అది దాఁటిన, నన్ని కాలములలోను మనోహరమ్మై కోరినపండ్లుగల వైన చెట్లతోఁగూడిన వైదూర్యతమను నొకకొండ తెలియనగును. వానరు లారా! ఆపర్వతమున నుత్తమములయిన గడ్డలను, దుంపలను, మంచి తేనెలను గ్రోలి, యావలఁ బొండు. అచ్చటనే కుంజరమను పేరుగల యొక మహాపర్వతమున్నది. ఆ పర్వతము మనస్సునకుఁ గన్నులకు నా నందదాయకమై యుండును. ఆపర్వతమున యోజనము వెడల్పును, పదియోజనముల నిడివియుగలిగి యెత్తుగానుండు సువర్ణమణిభూషిత మైన యొక గృహమును విశ్వకర్మ యగస్త్యమునికిఁగాను కట్టియిచ్చెను. దానికిఁ బ్రక్కన బాఁపఱేఁడగు బుద్ధిమంతుఁడయిన వాసుకి కునికి పట్టును, వాఁడికోఱలుగలిగి, యోర్వరాని విసముగలవైన భీకరము

లగు పాములచేఁ గావలి కాచఁబడినదియు, అన్నివైపులఁ జక్కఁగాఁ గావలియుంచఁబడి యుండుటచే నొరులకుఁ జొఱ నలవికానిదియు, వెడల్పు తొట్టికట్లు గలదియునైన పాముల కిరవగు భోగవతియును పుర మున్నది. మీ రచ్చటఁ జక్కఁగా నామెను వెదకవలసినది.

అక్కడికిఁ జేరునట్లుగానున్న దేశములందును సీతను మీరు బాగుగా వెదకవలసినది. ఆ భోగవతీపురము దాఁటఁగా, సకలరత్న ములచే నిండినదై యెద్దురూపమునను౦డు సుందరమయిన ఋషభమను గొప్ప పర్వతము గనఁబడును. ఆ ఋషభపర్వతమున గోరోచనపు వన్నె గలది, కమలవర్ణముగలది, ఆకుపచ్చ వన్నెగలది, నీలవర్ణముగలదియై, యగ్నితో సాటిగా వెలిఁగెడి దివ్య శ్రీగంధవృక్షవనము గనఁబడును. శ్రీచందనవనమును మీరు చూచినను, మీ రెప్పటికిని దానిం దాఁక వలదు. ఆవనమునకు భీకరులయిన రోహితులనెడి గంధర్వులు గావలి యున్నవారు. శైలూషుఁడు, గ్రామణి, శిగ్రువు, బభ్రివు, శుభ్రిఁడను నను పేరుగల యేవురుగంధర్వనాయకు లాచందనవనంబున వాసము చేయుచుందురు. సూర్యునివలెను, చంద్రునివలెను, అగ్నివలెను తేజ రిల్లు పుణ్యాత్ముల కది యునికిపట్టు. భూమియొక్క చిట్టచివరనున్న యా ప్రదేశమున స్వర్గమునుజయించిన మహాత్ములునుందురు. ఆ ఋషభపర్వత మున కావలఁ గడు భీకరమై, యమునిరాజధానియగు పితృలోకమున్న యది. అది యాఁపరాని కారుచీఁకటితో నిండి యుండును గావున నది ప్రవేశింపఁదగదు. ఓ వీరులగు వానరపుంగవులారా! మీ రా దిక్కు నందుఁ బోఁదగినది యంతవఱకే. వెదకవలసినది యంతవఱకే. దాని కావలఁ బోవుటకు సాధ్యముకాదు. మీ రీ దేశములను, ఇంకను నే విడిచిన దేశములను అచ్చటచ్చట వెదకి సీతాదేవిపోవిడి తెలిసికొని రావలెను. మీలో నెవ్వఁ డొక్క నెలలోపల "నేను సీతను జూచి తిని" యని వచ్చి చెప్పుచున్నాఁడో, వాఁడు నాతో సమానవిభవము గలవాఁడై సుఖముగా నుండఁగలఁడు. వాఁడు నాకుఁ గడుఁ బ్రియుఁడు. వేయేల? వానిని నాప్రాణసఖునిగా నెఱిఁగెదను. వాఁ డెన్ని తప్పిదము లొనరించినను, వాని తప్పిదములు మన్నించి, వానిని నా బంధువునిగాఁ జూచుకొందును. విశేషగుణములుగల కులము లందుఁ బుట్టినవారల్, బల పరాక్రమ సంపన్నులయిన యో వానర

వీరులారా! సీతాదేవి యెట్లు దొరకఁగలదో యట్టి ప్రయత్నము విశేషముగాఁ జేయుఁడు" అని సుగ్రీవుఁడు నీలుఁడు మున్నగువారితోఁ జెప్పెను.

42-వ సర్గము.

సుగ్రీవుఁడు సుషేణాదులను బడమటిదిక్కునకుఁ బంపుట

అంత సుగ్రీవుఁడు హనుమదాదివానరవీరులను దక్కినంపుదెసకుఁ బంపి, యావలఁ దారకుఁ దండ్రియు, తనకు మామగారునునైన భయంకరవిక్రముఁడగు సుషేణుఁడును వానరయూథపతిని జూచి, చేతులు జోడించి మ్రొక్కి, "యో వానరేంద్రా! తాము తేజస్సుగలవాఁడును, శూరులైన వానరులతోఁ గూడినవాఁడును, దేవేంద్రునిఁ బోలు వెలుఁగుగలవాఁడును, తేలీయు మగటిమియుఁ గలవాఁడును, గరుత్మంతునిఁ బోలు ప్రకాశముతోఁ గూడినవాఁడునైన మరీచిమహర్షి జ్యేష్ఠపుత్రుఁడయిన మారీచుని, కాంతులకుఁ దావలములును బలవంతులునునైన యామారీచుని తమ్ములను, తక్కిన మరీచి మహర్షి కొడుకుల నందఱిని మఱి రెండులక్షలసైన్యములను దోడ్కొని సీతాదేవిని వెదకుటకై పడమటిదిక్కునకుఁ బొండు" అని చెప్పి యందఱు వానరులం జూచి యిట్లనెను! వానరయూథములకుఁ గాఁపులారా! మీ రిచ్చటినుండి తఱిలి, సురాష్ట్ర, బాహ్లీక, శూరదేశములను, సకలసంపదలతోనిండిన చక్కని గ్రామములను, వైశాల్యముగల పత్తనములను, పున్నాగవనమును, బొగడ, విఱిగిచెట్లతో నిండియున్న కుక్షిదేశమును, మొగలిపొదలుగల కేతకషండదేశమును జూచి యచ్చట సీతాదేవిని వెదకుఁడు. అచ్చటనుండి తఱిలి, పడమటికిఁ బాఱెడి తేటనీటితోఁ గూడిన పుణ్యనదులను, ఆ నదులకట్టులందున్న యడవులను, ఋషుల తపోవనములను, చేరువనుండు పర్వతములను బొంది యచ్చట సీతాదేవిని వెదకుఁడు. అక్కడనుండి వెడలి మఱికొంతదవ్వేగిన, నచ్చట నీరులేని బయళ్ళును, గొప్ప బండలతోఁ గూడిన పర్వతములును, చొఱరాని పెక్కు కనుమలవరుసలును గానిపించును. వానియందంతట సీతాదేవిని బాగుగా వెదకి యచ్చటఁ గానరేని, మొసళ్ళు, సొరచేపలు మొదలగు జంతువులతో నిండినదై ప్రవేశించుటకలవిగాని పడమటి

సముద్రతీరమునకుఁ బొండు. ఆ సముద్రతీరమున నున్న పర్వతము లందును, వనములందును, మొగలిపొదలందును, కానుఁగుతోఁపు లందును సేనలతోఁగూడఁ గొంత తడవు విహరించి, యా ప్రాంతపుఁ గొండలందును, అడవులందును రావణుని యునికిపట్టును, సీతాదేవిని వెదకుఁడు.

అక్కడనుండి వెడలి సముద్రతీరముననున్న మురచపురమును, మనోహరమైన జటీపురమును, ఆవంతి, అంగలోపములనెడి పురము లను, అలక్షితవనమును, మఱియు నచ్చటచ్చటనున్న వెడల్పయిన పత్త నములను, దేశములను జూచి, యా దేశములందును, ఆ పురములం దును సీతాదేవిని వెదకుఁడు. సింధునది సముద్రముతోఁ గలియుచోట, నూఱు శిఖరములుగల్గి, పెక్కువృక్షములతోఁ గూడియున్న హేమగిరి యను పర్వతమున్నది. చక్కనైయున్న యీ కొండచరియలందు తెక్క లుగల సింహములున్నవి. అవి సముద్రమునందలి సొరచేపలను, ఏనుఁగులను గొని తమగూండ్లలోనికిఁ దీసికొనిపోవును. ఆపర్వతంపుఁ గొనయందును, విశాలమయిన యీ జలమయిప్రదేశమందునుగల యేనుగులు మదించి మిగుల నుల్లాసముతో నురములుమాడ్కి గర్జి ల్లుచు, నాసింగములగూండ్లయందు విచ్చలవిడిగాఁ దిరుగుచుండును. ఆకసమును దాఁకునంతటి యెత్తుగలదియు, చిత్రవృక్షములు గలది యునైన యీ కాంచనమయ శిఖరమునందుఁ గామరూపులగు మీ రాలస్యముచేయక సీతాదేవిని వెదకవలయును. అట్లే సముద్రమునఁ గొంతదూరము పోయిన, నచ్చట సముద్రమధ్యముననున్నది యము, నూఱు యోజనముల పొడవుగలదియు, చూపు చెదఱునట్లుచేయు కాంతి గలదియునైన పారియాత్ర పర్వతమునొక్క బంగారు శిఖరమును జూడఁగలరు. ఆపారియాత్ర పర్వతశిఖరమున బలముగలవారును, అగ్నివలె వెలుఁగు వారును, చూపఱకు వెఱపు పుట్టించువారును, కోరినరూపము ధరింపగలవారును నైన యిరువదినాలుగుకోట్ల గంధర్వులున్నవారు. ఓవానరశ్రేష్ఠులారా! మీరెక్కువమగఁటిమిగలవా రుగనున్నను, ఆ గంధర్వ లగ్నిహోత్రునిమాడ్కి వెలుఁగువారగుటం జేసియు, గుంపులు గుంపులుగాఁ గూడియుండుటంబట్టియు, వారినిఁ జేర కుఁడు. వా రుండు పర్వతశిఖరమునుండి మీరొక్క పండునైనను

దీసికొనఁగూడదు. ఏలయనిన, ఎక్కువ దిట్టతనమును, బలిమియు, మగటిమియుఁగలవారగుటంజేసి, యొరులకుఁ జేరరానివార్లై యా శూరులగు గంధర్వ లాపర్వతశిఖరమునందలి పండ్లను దుంపలను గావలి కాచుచుందురు. మీరు వానరులు గావున మీకు వారివలన నెంత మాత్రము భయముగలుగదు గనుకఁ బూనికితో నా పర్వతశిఖరమున సీతాదేవిని వెదకవలయును. ఆపర్వతము దాఁటిపోయిన వైడూర్య వర్ణముగలదియు, వజ్రమువలె గట్టిగనుండునదియు, నానావిధవృక్షలతలతోఁ గూడినదియునైన వజ్రమను గొప్పకొండయున్నది. ఆపర్వతము సముద్రమధ్యమున నూఱుయోజనముల వైశాల్యమును నెన్నత్యమును గలదైయున్నది. వానరవీరులారా! ఆపర్వతగుహాలందు మీరు ప్రయత్నపూర్వకముగా సీతాదేవిని వెదకవలయును.

ఆసముద్రముయొక్క నాలుగవభాగమునఁ జక్రవంతమను పేరుగల పర్వతమొకటియున్నది. ఆపర్వతమున విశ్వకర్మ నూఱుంచులుగల చక్రము నొకదానిని నిర్మించెను. ఆపర్వతమునఁ బురుషోత్తముఁడగు విష్ణువు చక్రరక్షకుఁడయిన హయగ్రీవుఁడను రాక్షసుని సంహరించి చక్రమును, పంచజనుఁడను రాక్షసుని సంహరించి, శంఖమును గైకొనెను. ఆపర్వతమునందలి విశాలములై వింతగొల్పునట్టి గుహాలందును రావణుని, సీతాదేవిని వెదకవలయును. తర్వాత నరువదియోజనముల దవ్వుగితిరేని, యగాధమగు సముద్రమున బంగారు శిఖరముగలదియు, విశేషకాంతితోఁగూడినదియునైన వరాహగిరి కనఁబడును. ఆ వరాహగిరి యందు బంగారుమయమైన ప్రాగ్జ్యోతిషమను పుర మొండుకలదు. చెడుస్వభావముగల నరకుఁడను దానవుఁడప్పురము నేలుచుండును. మీ రాపర్వతముయొక్క వింతలైన చరియలందును, విశాలగుహాలయందును రావణుని, సీతాదేవి నచ్చటచ్చట వెదకవలయును.

ఆపర్వతము దాఁటిన నెలయేళ్ళతోఁగూడినదియు, బంగారు వన్నెగల గుహాలతో వెలుఁగునదియునైన సర్వసౌవర్ణమను పర్వత మొక్కటి కాననగును. ఆపర్వతమున నెల్లెడల సింహవ్యాఘ్ర వరాహములు మూఁకుమ్మడిగా లీనునట్లు గర్జించుచు నామూఁకుమ్మడులకు మదించి, వానికిఁ బ్రతిగాను గర్జించుచుండును. దానికి వెంబడే మేఘవంతమను పర్వత మొక్కటియున్నది. దానియందే వేల్పులు పాకాసు

రుని వధించిన దేవేంద్రుని స్వర్గరాజ్యపట్టాభిషిక్తుం గావించిరి. దేవేం
ద్రునిచేఁ బాలింపఁబడు నా మేఘవంత మను పర్వతమును దాఁటి,
చక్కగాఁ బూచిన పసిఁడివన్నెగల చెట్లచే శోభిల్లునవియు, బాల
సూర్యనిమాడ్క నంతట వెలుఁగునవియునైన పసిఁడితిప్ప లయువదివేలు
వరుసగాఁ గనఁబడును. ఆ పర్వతములనడుమ మేరువను నుత్తమపర్వత
మున్నయది. సూర్యుఁ డొక్కపుడు సంతసించినవాఁడై, "ఓ పర్వత
శ్రేష్ఠమా! నా వరప్రభావమున నీయందున్నట్టి యన్నివస్తువులును
రేయింబవళ్లు బంగారంపు వన్నెగలిగి వెలుఁగుచుండును. నీయం
దున్నట్టి దేవదానవ గంధర్వులును పసిఁడిచాయయు, నెట్టినికాంతియుగల
వారై యుండఁగలరు" అని యా పర్వతరాజమునకు వరమొసఁగెను.
మఱియు విశ్వేదేవులును, మరుత్తులును, అష్టవసువులును, దేవతలును
సాయంసంధ్యాకాలమున నా పర్వతమునకు వచ్చి, సూర్యునుపాసిం
తురు. సూర్యుఁడును వారిచేఁ బూజలను గొన్నవాఁడై యన్నిభూతము
లకుఁ గానఁబడక యస్తపర్వతమును జేరుచుండును. మేరుపర్వతమునకును
నస్తపర్వతమునకును బదివేల యోజనముల దూరమున్నది. సూర్యుఁ
డింతవవ్వును అర్ధముహూర్తములోపల దాఁటి, యస్తగిరిని జేరుచుం
డును. ఆమేరుపర్వతశిఖరమున, వింతవింతల పక్షులతోడను బలురంగుల
చెట్లతోడను శోభిల్లునట్టిదియు, విశ్వకర్మచే నిర్మింపఁబడినదియు, పెక్కు
మేడలతోఁగూడినదియు, సూర్యునివలె వెలుఁగునదియునైన మహోత్తుం
డగు పాశముదాల్చిన వరుణుని దివ్యభవనము వెలుఁగుచున్నది. ఆమేరు
పర్వతమునకు నస్తమయ పర్వతమునకును నడుమఁ బలురంగులతిన్నె
గలిగి, పసిఁడిమయమైన పదికోనలు గలిగియున్న యొక గొప్పతాటిచెట్టు
వెలుఁగుచున్నది. సకలధర్మముల నెఱిఁగినవాఁడును, తపోమహిమచే
వెలుఁగువాఁడును, బ్రహ్మతో సమానుఁడునైన మేరుసావర్ణికి నివాస
స్థానమైన యా మేరుపర్వతముయొక్క దుర్గములం దన్నింటియందును
రావణుని యునికిపట్టును, సీతాదేవిని వెదకవలయును. వానరులారా!
సూర్యునివలె వెలుఁగునట్టి మేరుసావర్ణిమహర్షికడకేగి, యా మునిం
ద్రునికి సాష్టాంగముగాఁ బ్రణమిల్లి, సీతాదేవిని గూర్చిన పోవిడి యేమై
నను దెలియునా, యని యాతని నడిగి తెలుసుకొనుఁడు.

ఇంతవఱకే సూర్యుఁడు వేకువ లేచి, యుదయపర్వతము మొద లస్తమయ పర్వతమునఱకుఁగల ప్రదేశమునంతయుఁ దనకిరణముల వ్యాపింపఁజేసి, చీఁకటినంతయుఁ బోఁగొట్టి, యస్తపర్వతమునకుఁ జేరు చుండును. ఓ వానరశ్రేష్ఠులారా! వానరుల కస్తమయపర్వతమువఱకే పోవ శక్యమగును. ఆపర్వతమున కావలిప్రదేశము సూర్యనిరశి లేకయు, ఎట్లు లుండునదియు తెలియకయు నుండుటవలన నావలిప్రదేశ మెట్టిదో మాకుఁ దెలియదు. మీఁ రిచ్చటినుండి యస్తపర్వతమువఱకుఁ బోయి సీతాదేవిని, రావణుని స్థానమును గనుఁగొని యొక నెలలోపల వచ్చి చేరవలయును. ఒకనెలకంటె నెక్కువకాలము మీరెక్కడ నుండఁదగదు. అట్లుకాక, మీలో నెవ్వఁడయిన నా యాజ్ఞ మీఱి తడవుసేయునేని, వానికి వధమే దండనగా విధింపఁబడును. ఓ వానరు లారా! మీకుఁదోడుగా మామామ శూరుఁడగు సుషేణుఁడు మీతోడ వచ్చును. నా యాజ్ఞప్రకారము నడవఁగోరుదురేని, మీరంద ఱితని మాటప్రకారము నడవవలయును. ఈ నా మామగారును పెద్ద వాఁడు; బలిమిగలవాఁడు దీర్ఘ బాహువు. మీరును బరాక్రమముగలవా రలు. కావున నన్నిపనులను మీ యిష్టమునసుసరించి జరుపవచ్చును. మనకుఁ గార్యసిద్ధికావలయును. ఈసుషేణుని ముఖ్యునిగాఁజేసికొని పడ మటిదిశకుఁ బోయి వెదకిరండు. సాటిలేని వెలుఁగుగల రామనృపాలుని భార్యను మీరు గనుఁగొని వచ్చితిరేని, యుపకారికిఁ బ్రత్యుపకారము సేయుటచే మేము కృతార్థులమగుదుము. నే నిప్పుడు చెప్పినదానికంటె నెద్దియైన నీ కార్యమునకుఁ దగినట్లుగాఁ జేయవలసినదియుండిన నట్టి కార్యమును దేశకాలముల కనుగుణముగా, మీరంద ఱాలోచించి చేయవలయును" అని వానరులకందఱికిని సుగ్రీవుఁడానతిచ్చెను. అంత సుషేణుఁడు మున్నగు వానరులు సుగ్రీవునిమాటను నేర్పుతోవిని, వాన రేంద్రుని వీడ్కొని పడమటిదిక్కునకుఁ దఱలిరి.

43-వ సర్గము.

సుగ్రీవుఁడు శతబలిని నుత్తరదిశకుఁ బంపుట

ధర్మముల నెఱింగిన వానరేంద్రుఁడగు సుగ్రీవుఁడు తన మామను సుషేణునిఁ బడమటిదిక్కునకుఁ బోవఁ బనిచి, పదంపడి,

శూరుఁడును, వానరులందఱిలోపల నుత్తముఁడునునైన శతవలిం గూర్చి, తనకును రామునకును హితమగుమాట యివ్విధమునఁ జెప్పఁ దొడఁగెను.

ఓ శతవలీ! నీయట్టి బలవంతులగు లక్షమంది సైనికులను దీసి కొని, యమపుత్రులగు నీ మంత్రులం దోడ్కొని హిమవంతమే శిరో రత్నముగాఁగలదియు, విశాలమునునైన యుత్తరదిక్కున నంతటఁ బతి వ్రతయని ప్రసిద్ధిగాంచిన సీతాదేవిని వెదకుఁడు. కార్యవేత్తలలో నుత్తములారా; యీ కార్యము నెఱవేర్చి, రామునికిఁ బ్రీతియొనర్చితి మేని, మనము ఋణమునుండి విడువఁబడి కృతార్థులమగుదుము. మహానుభావుఁడగు రాముఁడు మన కుపకారముచేసెను. మనము దానికి బదులు మేలొనర్చితిమేని, మనజన్మములు సార్థకములగును. ఒకఁడు మన కుపకారమునేయనివాఁడయినను యడిగినదానిని నెఱవేర్చినచో, నట్టివాని జన్మము సార్థకమగునని పెద్దలు సెప్పుదురు. అట్లుండ మొదట నుపకారము సేసినవాని కుపకార మెనర్పకున్న నతనిజన్మము నిరర్థకము గదా! ఓ వానరవీరులారా! మీరీ తలంపును జ్ఞప్తియుంచుకొని, మా కిష్టమును మేలును జేయఁగోరుదురేని, సీతాదేవిని వెదకుటకుఁ బ్రయత్నింపుఁడు. శత్రువులపట్టణములఁ బొడుసేయునట్టి, సకలప్రాణు లచే గారవింపఁదగిన యీ రాముఁడు మనయెడ నెక్కువ ప్రేమగలిగి యున్నాఁడు. కావున నతఁడు పూర్వోపకారి గనుకను, మనయందుఁ బ్రేమగలవాఁడు గనుకను మన మతనికార్యముఁ దప్పకచేసి తీర వలయును.

కావున మీ రుత్తరదిక్కునకుఁ దరలి, యచ్చట ప్లక్ష, పులింద, శూరసేన, ప్రస్థల, భరత, కురు, మద్ర, కాంభోజ, యవన, శక, ఆరట్టక, బాహ్లీక, ఋషిక, పౌరవ, టంకణ, చీన, పరమచీన, విహార, దరదదేశములను, హిమవంతమునుబొంది, యచ్చట మీ యాపత్తుబలవిక్రమములనుపయోగించి, చొఱరాని నదులందును, పర్వత గుహాలందును, లొద్దుగు, చందనము, దేవదారువు గలవనములందును రావణుని, సీతాదేవిని వెదకవలయును.

అవియెల్ల వెదకి, దేవదానవుల కునికిపట్టగు సోమాశ్రమము దాఁటిన, నావల గొప్పచఱులుగల కాలపర్వతమును బొందుదురు. ఆ

కాలపర్వతముయొక్క విశాలమునైన కోనలయందును, గుహాలయందును మహాపతివ్రతయగు రామునిదేవి నచ్చటచ్చట వెదకుఁడు. అంతట బంగారు గనులుగల యాకాలమను పర్వతశ్రేష్ఠమునుదాఁటి సుదర్శనమను పర్వతమునకుఁ బోవలయును. పర్వతనివాసులారా! ఆ సుదర్శన పర్వతము దాఁటి, పెక్కు చెట్లతోఁగూడి, యనేకవిధములగు పక్షుల గుంపులతో నిండిన దేవసఖమను పర్వత మొక్కటి మీకుఁ గానిపింపఁగలదు. మీరా పర్వతమున నచ్చటచ్చట నడవులగుంపులందును, సెలయేళ్ళ గట్టులందును, గుహాలయందును సీతాదేవిని, రావణుని వెదకవలయును.

ఆ దేవసఖపర్వతము దాఁటినపిమ్మట, నూఱు యోజనముల దూర మేతట్టును గొండలుగాని, నదులుగాని, వనములుగాని యుండ ననువు గాక, యొట్టి జంతువున కునికిపట్టుకాక యుత్త యొడారియై యుండఁ గలదు. మీరా భయంకరమైన యొడారిని దాఁటితిరేని, తెల్లనైన కైలాసపర్వతము గనఁబడును. మీరా పర్వతమునుజూచి మిక్కిలి సంతసము నొందఁగలరు. ఆ కైలాసపర్వతమునఁ దెల్ల మబ్బు చాయ గలదై, బంగారుచే నలంకృతమైన విశ్వకర్మ నిర్మించినట్టి కుబేరుని దివ్య నగరున్నది. ఆ నగరుచేరువ విస్తారములైన కమలములు నుత్పలములుఁ గలదై రాయంచలకు, బెగ్గురుపక్షులకుఁ దావలమై, యచ్చరలకు నివాసమై యొప్పుమీఱు నొక విశాలసర స్సున్నది. అచ్చట సకలజన వందితుఁడును, జక్కలకు జేఁడును, రొక్కముల నిచ్చువాఁడునునైన కుబేరుఁడు వైభవోపేతుఁడై, యక్షులతోఁగూడి విహరించుచుండును. చంద్రునిఁబోలు నా పర్వతములయొక్క తిప్పలందును, గుహాలయందును సీతాదేవిని, రావణుని వెదకవలయును.

అటుతర్వాతఁ గైలాసముదాఁటి, క్రౌంచపర్వతము సేరి, యందలి గుహ చొఱరానిదియని చెప్పఁబడును గనుక, మీరు జాగ్రత్తగల వారలై యందుఁ బ్రవేశింపవలయును. ఆగుహయందు సూర్యుని మాడ్కి వెలుఁగువారును, దేవతలచేఁగూడ లెస్సగాఁ బూజింపఁబడిన వారును, వెలుఁగుచున్న రూపములుగలవారునునైన మహాత్ములగు పరమర్షులు తపము లొనరించుచుందురు. మీరా పర్వతముచేరి, దాని గుహాలయందును, చఱియలయందును, శిఖరములందును, కోనలందును, మధ్యభాగములందును నచ్చటచ్చట సీతాదేవిని వెదకవలయును.

ఆ క్రౌంచపర్వతముయొక్క ప్రధానశిఖరమునను, చెట్లులేని కామ
శైలమునందును, పక్షుల కనికిపట్టగు మానసపర్వతమునను వెదకవల
యును. ఆ మానసపర్వతమున సకలభూతములకు మాత్ర మేకాక దేవ
దానవరాక్షసులకుఁ గూడ సంచరింపనలవిగాదు. మీరంద ఆపర్వ
తమునఁ జయీయలందును, విషమప్రదేశములందును, శిఖరములందును
సీతాదేవిని జాగ్రత్తతో వెదకవలయును.

క్రౌంచపర్వతము దాఁటినపిదప మైనాకమను పర్వతమొక్కటి
యున్నది. ఆ మైనాకపర్వతమున మయుఁడు స్వగృహమును దానే
నిర్మించికొని యున్నవాఁడు. ఆ పర్వతమున గుట్టిపు మోములుగల
కిన్నరస్త్రీలయొక్క నివాసము లున్నవి. మీ రాపర్వతముచేరి, యా
చఱులయందును, విషమభూములందును, గుహాలయందును, ఆ కిన్నర
స్త్రీల యునికిపట్టులందును సీతాదేవిని వెదకవలయు. ఆ పర్వతప్రదే
శము దాఁటినతరువాత నచ్చట సిద్ధులుండెడి యాశ్రమమున్నది.
ఆ యాశ్రమమునందు నష్టైశ్వర్య సిద్ధిగలవారును, తపస్సుచేయు స్వభా
వము గలవారునైన వైఖానసులును, వాలఖిల్యులు నను మును లున్న
వారు. వారు తపస్సుచేఁ బరబ్రహ్మసాక్షాత్కారమువడసి, పాపముల
నుండి విడువఁబడినవారు. వారికి మీ రడఁకువతో నమస్కరించి, వారిని
సీతాదేవిసంగతింగూర్చి యడుగుఁడు.

ఆ యాశ్రమమున బంగారుకమలములు గలదియు, బాల
సూర్యుని పగిది వెలుఁగు నందమునైన రాయంచలతోఁ గూడినదియు
నైన వైఖానసమను సరస్సున్నది. సార్వభౌమమను పేరుగల కుబేరుని
పట్టపేనుఁగు ఆఁడేనుఁగులతోఁ గూడి యా కొలనిగట్టులయందుఁ
దిరుగుచుండును. ఆ వైఖానససరస్సున కావల సూర్యచంద్రుల సంచా
రము లేదు. నక్షత్రగణములు గానరావు. మేఘసంచారమును లేదు.
ఆకాశము నిశ్శబ్దమైయుండును. అయినను అచ్చట శ్రమదీర్చుకొను
చుండువారును తపస్సుచేసి సకల కామములఁ బడసినవారును, దేవ
తలతో సమానులై తమంతట వెలుఁగువారునునైన సిద్ధులచేనాదేశము
సూర్యకిరణములచే వ్యాప్తమై యుండునట్లు వెలుఁగుచున్నది. ఆ ప్రదే
శమున కావల శైలోదమను పేరుగల నదియొక్కటి పాఱుచున్నది.
ఆ నదియొక్క యిరుప్రక్కలను బొంగువెదుళ్లు విశేషముగా నున్నవి.

ఆ వెదుళ్లు మిక్కిలి పొడుగై ముందుకు నదులలోనికి వాలియుండు టచే సిద్ధు లీతట్టునుండి యాతట్టునకు దాఁటిపోవుచుందురు. ఆ నది కావలఁ బుణ్యాత్ముల కాశ్రయములైన యుత్తరకురుదేశము లున్నవి.

ఆ కురుదేశము పుణ్యముచేసినవారు పుణ్యఫలము ననుభవించు టకై యేర్పడిన దేశముగనుక, నచ్చట బంగారుతామరపూవులతోఁ గూడి, నీలవైడూర్యమణుల వన్నెగల తామరతీఁగలతోఁ గూడిన మంచినీరుగల పెక్కునదులు పాఱుచున్నవి. మఱియు నచ్చటఁ గొలఁకులు బాలసూర్యనిచందమున మెఱయు బంగారుమయపు మెట్లుగలు వలవనముతోఁగూడినవై దీపించుచున్నవి. అంతియకాక, ఆ కురుదేశము మేలైన నీలములవంటి రేకులును, పసిఁడిచాయగల కింజల్కములును గలిగి విచిత్రములైయున్న నల్లఁగలువలతోఁగూడిన కొలఁకులు గలిగి యున్నది. మఱియు నాకురుదేశమునందలి నదులు సాటిలేనిముత్యముల చేతను, మిగుల విలువగల రతనములచేతను, బంగారుచేతను నిండిన యిసుకదిన్నెలుగలవియు, నడుమనడుమ నానావిధరత్న ప్రచురములై, పసిఁడితోఁగూడి, పలురంగులుగలిగి, యగ్నిమాడ్కిఁ దేజరిల్లు తిప్పలతోఁ గూడినవియునై వెలుఁగుచుండును. అచ్చటి వృక్షములు విడువని పువ్వులు పండ్లతోఁగూడి నెత్తావియుఁ దీపియుఁ స్పర్శముగలిగి, యన్ని కోర్కులను నొసఁగుచుండును. మఱికొన్ని వృక్షములు పలుతెఱఁగులగు బట్టలను గాయుచుండును. కొన్ని వృక్షరాజములు ముత్యాలును, పచ్చ లును జెక్కియుండుటచేఁ బలువన్నెలుగలవియు, స్త్రీలకుఁ బురుషులకును నన్నిఋతువులందుఁ దాల్చుటకు యోగ్యములునయిన భూషణములను బండుచున్నవి. కొన్ని వృక్షములు మిగుల విలువగలవియు పలురంగులు గలవియు పలువన్నెల పైబట్టలు పఱచినవియునైన బంగారు పాన్పులను గాయుచున్నవి. కొన్ని చెట్లు మనోహరములగు పుష్పఫలదండలను, మేలైన పానద్రవ్యములను, వివిధ భక్ష్యములను, సొంపును, బ్రాయ మును గలిగిన గుణవతులగు నతివలను నొసఁగును. సూర్యనింబోలె వెలుఁగునట్టి గంధర్వ, కిన్నర, నాగ, విద్యాధర, సిద్ధులు తమ చెలులం గూడి యా కురుక్షేత్రవనములందు విహరించుచుందురు. అచ్చట నుండువారందఱు పున్నెంపుఁబనులు సేయువారు, క్రీడలందాసక్తులు, కోరిన కోర్కులం బడసినవారునై తమ చెలువలంగూడి విహరించు

చుందురు. మఱియు నచ్చట నవ్వులచప్పుడు గలదియు, నన్ని జంతువులకు మనస్సుల కింపైనదియునైన పాటలయొక్కయు, వీణాదివాద్యములయొక్కయు నాదం బెల్లప్పుడు వినఁబడుచుండును. అచ్చట సంతసమునొందనివాఁడు లేఁడు; చెడ్డవిషయములం దాశగలవాఁడు లేఁడు. అచ్చట దినదినమునను మనోహరములగు సుగుణములేవియో వృద్ధినొందుచునే యుండును. ఆ కురుదేశము దాఁటిన నావలనుండునది యుత్తరసముద్ర మే.

ఆ సముద్రమునడుమ బంగారుమయమయిన సోమగిరి యను గొప్పపర్వత మొక్కటియున్నది. ఇంద్రలోక బ్రహ్మలోకములనొందిన వేల్పులు స్వర్గమున నుండి యాపర్వతశ్రేష్ఠమును చూచుచుందురు. ఆ ప్రదేశము సూర్యరశ్మి లేనిదియయ్యు, సూర్యరశ్మిగల ప్రదేశము వెలుఁగుగలదియగునట్లు అమ్మహాపర్వతముయొక్క వెలుతురుచే వెలుఁగుచుండును. అచ్చటఁ బ్రపంచస్వరూపుఁడగు విష్ణువును, ఏకాదశ (పదునొక్కండు) రుద్రాత్మకుఁడగు శివుఁడును, దేవదేవుఁడయిన బ్రహ్మర్షి సమేతుఁడగు బ్రహ్మయు వసింతురు. మీ రుత్తర కురుదేశమున కావల నెప్పటికిని బోవలదు. అది మీకుమాత్ర మే కాక, యితరులకును నెంతటి సామర్థ్యముగలవారికేని బోవ నలవికాదు. ఆ సోమగిరి దేవతలకుఁ గూడఁ బోవీలుగాదు. కావున మీ రా సోమగిరిని జూచినవెంటనే, వెనుకకు మఱలవలయును. వానరశ్రేష్ఠులారా! వానరుల కంతవఱకే పోవ సాధ్యమగును. ఆ పర్వతమున కావల సూర్యరశ్మి లేకయు, అడవులు మొదలగు నేర్పాట్లులేకయు నుండుటవలన నావల నేమియున్నదో మన మెఱుఁగము. ఇప్పుడు నేఁజెప్పిన ప్రదేశములందెల్ల నామెను వెదకవలయును. నేను జెప్పక విడిచినది యే తావేనిఁ గనఁబడినచో నచ్చటఁగూడ సీతాదేవిని మీరు వెదకవలయును. అగ్ని వాయువులంబోలు వానరులారా! మీరు సీతాదేవిని జూచివత్తురేని, మీరు రామునికి గొప్ప ప్రియముచేసినవార లగుదురు. నాకు రామునికంటె మఱియెంతో యొక్కువ ప్రియమొనర్చినవార లగుదురు. ఓ వానరులారా! పిమ్మట మీరు కృతార్థులలై, నాచే సకలవిధ రమ్యవస్తువులచే సమ్మానింపఁబడినవారలై, శత్రువులులేక, బంధువర్గములతోను, ప్రియురాండ్రతోను గూడి ప్రాణి

కోటులధరించిన పుడమిని సంచరింపఁగలరు" అని సుగ్రీవుఁడు శతవలి మొదలగు వానరవీరులతోఁ జెప్పెను.

44-వ సర్గము.

రాముఁడు హనుమంతునిచేతికి నుంగరమిచ్చుట

వానరులకెల్ల నధిపుఁడగు సుగ్రీవుఁ డివ్విధంబున నలుదెసలకును సేనలఁబోవఁ బనిచినను, హనుమంతుఁడే యీకార్యము సాధింపఁగల వాఁడను నమ్మికకలవాఁడై, యందఱితోఁ జెప్పినదేకాక ప్రత్యేకముగా బలశాలియయిన వాయునందనుఁడగు హనుమంతునిఁజూచి, కడు మోదముతో నిట్లనెను. "వానరశ్రేష్ఠా! భూమ్యంతరిక్షములందుఁగాని, సిద్ధ విద్యాధరాదులు సంచరించెడి యంబరమునందుఁగాని, స్వర్గమునందుఁ గాని నీటిలోపలఁగాని, నీకడ్డములేదు. దేవాసుర గంధర్వ సిద్ధ చారణ గరుడ సర్పములు, సముద్రపర్వత పాతాళములు గలిగిన యన్నిలోక ములును నీకుఁ దెలియును. వానరోత్తమా! నీకును బలిమిగలవాఁ డయిన నీతండ్రికుండునట్టి బలవేగప్రతాపలాఘవములకంటె మించినవి యున్నవి. నీప్రతాపముఁబోలు ప్రతాప మిభూలోకమున మఱెవ్వని కిని లేదు. కావున నెన్నివిధములనైనను సీతను గనిపెట్టుభారము నీదియే. న్యాయవిశారదుఁడా! హనుమంతుఁడా! బలిమియు, తెలివియు, పరా క్రమమును, దేశకాలములకుఁ దగినట్లు నడచుకొనుటయు, వినయమును నీయందె యున్నవి. కావున నీవె యీకార్యము సాధింపవలె"నని సుగ్రీవుఁడు హనుమంతునిఁ బ్రోత్సాహపఱచెను.

రాముఁడును సుగ్రీవుఁ డిట్లు హనుమంతునితోఁ జెప్పు మాటనువిని, "సుగ్రీవుఁ డెంతయు హనుమంతునియందే కార్యానుకూల్యము గాఁగలదని నిశ్చయించియున్నాఁడు. హనుమంతుఁడును కార్య మనుకూలించువఱకుఁ జెప్పినంతపని చేయఁగలవాఁడనితోఁచెడి. ఈ హనుమంతుఁడును మున్నెన్నియో కార్యములు సాధించి ప్రసిద్ధిచెందియుండువాఁడు గావున సుగ్రీవుఁ డితనినిఁ జేరఁదీసి యింతగా నితనితోఁ జెప్పినట్లున్నది. కావున నీతనియెడలఁ గార్యముసఫల మగుట తప్పదు" అని యాతనినింగూర్చి తనమనమునఁ దలపోసి, హను మంతుఁడు మిక్కిలి పూనికగలవాఁడై యుండుటఁ జూచి, తనివి

నొందినవాఁడై, తనపని నెఱవేఱెనని యెు తలఁచి, యా హనుమంతుని చేతికి సీతకుఁ జూపునిమి త్తమై తన ముద్దుటుంగరమును గుఱుతుగా నొసఁగి "యెా వానరో త్తమా! యీ యుంగరముఁ జూపితివేని, జానకి భీతినొందక నాకడనుండి యేఁతెంచిన నిన్ను నమ్మకముతోఁజూచును. మొన కాఁడా! నీ పూనికియు, నీ బలపరాక్రమములును సుగ్రీవునియొక్క- యాజ్ఞయుఁ జూడఁగా కార్యము నెఱవేఱుఁగలదని తోఁచెడి" అని చెప్పఁగా హనుమంతుఁ డా రాముని ముద్దుటుంగరమును గైకొని నెత్తినిబెట్టుకొని, చేతులుమోడ్చి రామునిపాదములకు మ్రొక్కి పయ నమై, తనతోవచ్చెడి వానరబలమునెల్లఁ దీసికొని, నిర్మలమైన యాక సమునకెగిరి, నిర్మలబింబముగలిగి,నక్షత్రగణములచేఁ జుట్టఁబడిన చంద్రుని మాడ్కి వెలుఁగుచుండెను. ఆ హనుమంతుఁ డట్లు పయనమైనప్పుడు రాముండు వెండియు నతనిఁజూచి "ఓ బలవంతుఁడా! నీ బలిమిని నే నాదరువు చేసియున్నాను. సింహముంబోలిన పరాక్రమవంతుఁడా! నీ పరాక్రమమెల్ల వినియెోగించి, సీత కనఁబడునట్లు ప్రయత్నపడుము" అని హనుమంతునితోఁ జెప్పెను.

45-వ సర్గము.

వానరవీరులు సీతను వెదక వెడలుట

అంత వానరాధిపుఁడగు సుగ్రీవుఁడు రామునికార్యము నెఱ వేఱునిమి త్తమై వానరవీరుల నందఱఁ బిలిచి, "యెా వానరవీరులారా! మీరు నేఁ జెప్పిన తావులకెల్లఁ బోయి బాగుగ వెదకిరావలయును" అని యానతిచ్చెను. వానరశ్రేష్ఠులందఱు తమ యెుడయనికడిఁది యానతిని శిరసావహించి, మిడుతలంబోలె భూమినెల్లఁ గప్పికొని వెడలిరి. రాముఁ డును సీతను వెదకుటకై యేర్పడిన యా యెుక్కనెల యెుప్పుడు ముగి యునా యని యెదురుచూచుచు నా ప్రస్రవణపర్వతమున నుండెను.

వానరవీరుఁడగు శతబలి హిమవత్పర్వతముచేఁ జుట్టఁబడియున్న యుత్తరదిశకుఁ దఱలెను. వానరయూథపాలుఁడగు వినతుఁడు తూర్పు దిశకుఁ బయనమయ్యెను. వానరయూథనాథుఁడగు మారుతతనయుఁడు హనుమంతుఁడు తారుఁడు, అంగదుఁడు మొదలగు వానరులతోఁగూడి దక్షిణదిశకేగెను. వానరుల కధిపుఁడును బలవంతుఁడును నగు సుషే

ణుఁడు వరుణునిచే నేలఁబడునట్టి పడమటిదిశకుఁ బోయెను. ఇట్లు సుగ్రీవుఁడు వానరముఖ్యుల నందఱిని నన్నిదిశలకుఁ బంపి, రాముని కార్యము నకై ప్రయత్నపడుటచే సుఖసంతోషములం బొందెను.

అప్పుడు వానరసేనా నాయకులందఱు తమ యేలిక యానతిని గొని, "మేము సీతను దెత్తుము. రావణునిఁ బరిమార్తుము" అని చెప్పుచుఁ దమతమకు నియమించిన దెసలకు వేగిరముగాఁ దఱలిరి. వారి వెంబడించిన వానరులలో నొక్కఁడు "నే నొక్కఁడనే యుద్ధమునకు వచ్చిన యారావణునిఁ జంపెద" ననియు, వేఱొక్కఁడు "నేను రావణునివధించి, బడలికచే వడఁకుచున్న సీతాదేవిని దెచ్చెదను. మీరందఱొక్కడ నిలువుఁడు" అనియు, మఱొక్కఁడు "నే నొక్కఁడనే పాతాళమందున్న దానినైనను సీతాదేవిని దెచ్చెద" ననియు, వేఱొక్కరుఁడు "నేనా సీతాదేవిని దొఱకువఱకుఁ జెట్లను విఱిచెదను. పర్వతములను ద్రోచెదను. భూమి బ్రద్దలు సేసెదను" అనియు "సముద్రములను గలఁచి వైచెదను. నే నొక్కయోజనము దవ్వైనను ఎగుఱఁగలను. దీనికి సంశయము వలదు" అని యొక్కఁడును, నేను నూఱు యోజనముల దవ్వునకంటె నెక్కువ దూరమైనను దాఁటఁగలను" అని యొక్కరుఁడును, "నాకు భూతలమునను, సముద్రములందును, కొండలందును, వనములందును, పాతాళమునందును నడ్డులేదు" అని వేఱొక్కఁడును దమ రాజునెదుట బలగర్వితులై పొగడ్తలఁ జేసికొని, యందఱు తఱలి, యఱచుచుఁ, గేకలిడుచు, నుఱుముమాడ్కి నుఱుముచు, సింహనాదంబులు సేయుచు, దుముకుచు, వికారంపుఁ గూఁతలు కూయుచుఁ బరువులిడుచుఁ బయనమై పోయిరి.

46-వ సర్గము.

సుగ్రీవుఁడు తనభూలోకపరిజ్ఞానమునకుఁ గారణముఁ జెల్పుట

వానరాధిపులందఱు దఱలఁగా, రాముఁడు సుగ్రీవుఁ జూచి, "నీవెట్లు భూమండల మెల్ల నెఱుఁగుదువు చెప్పుము" అని యడుగఁగా, సుగ్రీవుఁడు రామునికి మ్రొక్కి యిట్లనియె. "ఓ నరశ్రేష్ఠా! సంగతియంతయు విస్తరించిచెప్పెదను వినుము. తొల్లి మహిషరూపుఁడగు దుందుభిపుత్రుఁడయిన మాయావియను రాక్షసుఁడు వాలితోఁ

బోరాడవచ్చినప్పుడు, వాలి యా రాక్షసుని మలయపర్వతమువఱకుఁ దఱిమెను. అప్పు డాతఁడు వెఱచి యొక గుహాయందుఁ బ్రవేశించెను. వాలియు నా మాయావిని సంహరింపఁగోరి యా గుహాలోపలికిఁ దానును బ్రవేశించెను. అప్పుడు మాయన్న విధేయుఁడనైన నన్నా గుహాముఖమునఁ గావలిపెట్టెను. అట్లు నే నొక్కసంవత్సరము నిండు వఱకుఁ గావలియుంటిని. వాలి యొక్కయేఁడు గడచినను రాఁడయ్యె. అప్పు డాగుహా రక్తప్రవాహముచే నిండఁగా, నేను భయంపడి, యన్న కేమి హాని గలిగెనో యన్న శోకముచే నొచ్చినవాఁడనై, కడపట మా యన్న తప్పక మృతినొందెనని యెంచి, మహిషరూపుఁడగు మాయావి, వెలుపటికి రాఁజాలక లోపలనే మడియునుగాక యను తలంపుతోఁ బర్వతంబుఁ బోలు నొక్క బండ నాగుహకడ్డముగా వేసితిని. అంత మాయన్న ప్రాణములం దాశమానినవాఁడనై, కిష్కింధకు మఱలి వచ్చి, గొప్ప రాజ్యమును బడసి, రుమను దారను గూడి సుఖముంటిని. ఏనును మిత్రులుంగూడి సుఖముననుండఁగా, వాలి యా రాక్షస శ్రేష్ఠుని సంహరించి, యిక్కడి కేతెంచెను. నేనును బెద్దవాఁడన్న గౌరవముచేతను, యేమిచేయునోయన్న భయముచేతను రాజ్యము నొసఁగితిని. అయినను, వాలి కలవరపాటునొందినవాఁడై, తనకు నేను ద్రోహంబుచేసితినని తలఁచి, నన్నుఁ దఱిమెను. వాలి నన్నట్లు తఱుమఁగా, నే నెందును శరణుగానక, సపరివారుఁడనై పెక్కునదులను, వనములను, పత్తనములను జూచుచుఁ బరుగెత్తితిని. అప్పుడు నా కీ పుడమియెల్ల నావుపాదము మోపునంతటిదిగానై, యద్భమువలెను, కొఱవిచక్రమువలెను జక్కఁగాఁ జూడ వీలుగలిగెను. మొదటఁ దూర్పుదిశకేగి, పెక్కు వృక్షములను, మనోహరములైన పలు పర్వతములను, నదులను, చెఱువులను జూచితిని. ఆ దిక్కుననే గైరికాది ధాతువులచే నలంకరింపఁబడిన యుదయపర్వతంబును, ఎల్లప్పుడు నవ్వు రసల కునికిపట్టయిన పాల్కడలిని జూచితిని. అచ్చటికిని వాలి నన్నుఁ దఱుముకొని వచ్చుటచే, త్వరగా వెనుకకు మఱలి, మఱియొక పార్శ్వమునకు మఱలితిని. అచ్చటికిని నన్నుఁ దఱుముచు వచ్చినందుచే నా తూర్పుదిక్కునుండి మఱలి, వింధ్యవనములతోఁ గూడినదియు, చందనవృక్షములచే శోభిల్లునదియునైన దక్షిణదిశకు మఱలితిని.

అచ్చటి పర్వతములను వనములను పత్తనములను జూచుచు నచ్చటికిని వాలి దఱుముచువచ్చినందునఁ బడమటిదిక్కునకు మఱలితి. అచ్చట నస్తమయపర్వతమువఱకుఁ గల దేశములను, అస్తమానపర్వతమును జూచుచుఁ బోఁగా, వాలి యచ్చటికిని నన్నుఁ దఱుముకొనుచు వచ్చెను. అంత నుత్తరదిక్కునకు మఱలి, హిమవన్నేరు పర్వతములను, ఉత్తరసముద్రమును జూచితిని. అచ్చటికిని వాలి దఱుముకొనిరాఁగా నిఁక నెందును బోలేక తత్తరపడి యిఁక నేమి చేయుదుఁనని దిగ్భ్రమ నొందితిని. సమయోచిత స్ఫురణగల హనుమంతుఁడు "వానరాధిపా! యేల యిట్లు పరుగెత్తెదవు? తొల్లి మతంగమహర్షి తన యాశ్రమము లోపల రాఁగూడదని వాలికి శాపం బొసఁగెనుగదా! వాఁ డచ్చటఁ బ్రవేశించునేని వానితల నూఱు ప్రయ్యలుగాఁగలదు. కావున మన మచ్చట నిర్విచారముగా నుండఁగలము" అని నాతోఁ జెప్పఁగా, నది మొదలు నేనీ మతంగాశ్రమమున నున్నాను. వాలియు శాపభయము వలన నిచ్చటికి రాకయుండెను. నృపాలా! నేనిట్లు మొఱట భూమండల మెల్లఁ బ్రత్యక్షముగాఁ దిలకించి యీవల నీగుహలో వాసముచేయు చుంటిని" అని రామునితోఁ జెప్పెను.

47-వ సర్గము.

తూర్పు, పడమర, ఉత్తరదిశలకుఁ బోయిన వానరవీరులు మఱలుట

వానరసేనానాయకులందఱు సుగ్రీవుని యాజ్ఞను శిరసా వహించినవారలై, సీతను వెదకుటకై వారివారి కేర్పఱచిన దిశలకు శీఘ్రముగాఁబోయి, చెఱువులను, ఏళ్లను, పొదలను, ఆకసమును, నగరములను, కోటలను, కొండలను గలయఁ జూడసాగిరి. వారు పగ లెల్ల నన్ని ఋతువుల ఫలములతోను, పుష్పములతోను గూడి యొప్పు చున్న సకలదేశములందలి వనములను వెదకుచు రాత్రులందుఁ జక్కఁగాఁ బండిన చెట్లమీఁదఁ బరుండుచు వచ్చిరి. వానరవీరు లెల్లరు సుగ్రీవునియొద్ద నెలవుగైకొన్నదిమొద లొకనెల పూర్తిగా వెదకి సీతనుగానక, యాశ నిరాశచేసికొన్నవారలై ప్రస్రవణపర్వతమునకు మఱలివచ్చిరి. మహాబలుఁడగు వినతుఁడు నేనలతోఁగూడి తూర్పు దిక్కెల్ల వెదకి, యాదిక్కున సీతాదేవిని గానకవచ్చెను. ఉత్తరదిక్కు

నకుఁ బోయియుండిన శతవల్యియు నచ్చట నామెను సేనాసమేతుఁడై వెదకియుఁ గానక వచ్చెను. సుషేణుఁడును వానరసైన్యముతోఁ గూడి, పడమటిదిక్కునందెల్ల వెదకియు నామెను గానక నెల పూర్తికాఁగా సుగ్రీవునికడ కేగుదెంచెను. వారందఱువచ్చి, ప్రస్రవణపర్వతమున రామునితోఁగూడఁ గూర్చుండియున్న సుగ్రీవునిఁజేరి, మ్రొక్కులిడి, "యో వానరేంద్రా! మేము తమయానతిచొప్పునఁ బర్వతములన్నియు, చొఱరాని యడవులన్నియు, నదులన్నియు, దేశములన్నియు, తమరు చెప్పిన గుహలన్నియు, తీఁగెల జొంపములతో దట్టములైయున్న గొప్ప పొదలన్నియు వెదకితిమి. ప్రవేశింపరాని దేశములందును, ఎక్కరాని కోటలందును గొప్పదేహాములు గలప్రాణుల నడిగితిమి. వారినెల్ల సంహరించితిమి. అయినను సీతాదేవిమాత్రము కనఁబడ దయ్యెనని చెప్పిరి. గొప్ప నడతయు, సత్కులప్రసూతియుఁగల బుద్ధిమంతుఁడగు సుగ్రీవుఁడు, సీతాదేవి యేదిశకుఁ బోయినదో, యా దిశకు హనుమంతుఁడు పోయియున్నాఁడని తనలోఁ దలఁచెను.

43-వ సర్గము

హనుమంతుఁడు సీతను వెదకఁబోవుట

ఆ హనుమంతుఁడు తారాంగదులు మొదలగువారితోఁ గూడిన వాఁడై, సుగ్రీవుఁ డానతియొసఁగిన చొప్పున దక్షిణదిశకుఁ దఱలెను. అట్లతఁ డా వానరవీరులను తోడ్కొని, కడుదవ్వేగి, వింధ్యపర్వతము చేరి, యాపర్వతమునందలి గుహలను, అడవులను, కొండకొనలను, ఏళ్లను, దుర్గములను, కొలఁకులను, విశాలవృక్షములను, తోఁపులను, దట్టమగుచెట్లుగల పెక్కుతిప్పలను వెదకెను. ఆవానరులు ఆదిశయందంతటను సీతాదేవిని వెదకియుఁ గానరైరి. పగతురకు గెల్వనలవికాని యా వానరులు సీతను వెదకుచు, నచ్చటచ్చటనున్న దుంపలను, నానావిధములగు పండ్లను దినుచు నచ్చటచ్చట విశ్రమించిరి. ఆ వింధ్యాద్రిప్రాంతము పెక్కుగుహలును, అరణ్యములును గలదిగ్గై గొప్పదిగానుండుటవలన వెదక నలవిగాకయుండెను. ఎవరికిని వెరవని వానరవీరులందఱు నట్టియడవులనెల్ల వెదకి, కడు నలసినవారలై, జనరహితమును, నీళ్లులేనిదియు, శూన్యమునైనందుచేఁ జొఱరానిదై గగ్గురు

పాటు పుట్టించునదియు, దాఁటనలవిగానిదియునైన మఱొక్కదేశము నకుఁ బోయిరి. ఆదేశమునందున్న చెట్లాకులుం బూవులులేనివై కాయలు కాయకయుండును. నదులు నీరింకియుండును. దుంపలు గడ్డలు దొర కుట కడు నరిది. దున్నలు, జింకలు, ఏనుఁగులు, పులులు మొదలగు మృగములును, పక్షులును, తక్కుంగల వనసంచారులగు పశుపక్ష్యాదు లును అచ్చటలేవు. చెట్లును, ఓషధులును లేవు. తీఁగలును లేవు. తీఁగెలజొంపములునులేవు. మెట్టదామరతీఁగలు నునుపయినయాకులు, విరిసినపువ్వులుంగలవై, నెత్తావులుఁ చిమ్ముచుఁ జూడఁదగినవిగానున్నను, తుమ్మెదలు లేకుండినవి.

సత్యవాదియు, తపస్సే ధనముగాఁగలవాఁడును, మహామహిమ గలవాఁడును, నియమములచేఁ జేరుపకువచ్చుటకుఁ గూడఁ దగినవాఁ డునై, యోర్వరాని కోపముగలవాఁడగు కండువను మహాముని యొక్కరుఁ డచ్చట నుండెను. ఆతనికొడు కొక్కఁడు పదునాఱేండ్లవా ఁడా యరణ్యమున బ్రవేశించి కానరాక యుండే నశించిపోయెను. అమ్మహాముని యా కాననముపై నలిగినవాఁడై, యీ వనమంతయు మృగపక్షులులేనిదై, యొక్కరికిఁ బ్రాపుగాక, చొఱనలవిగానిదై పాడు పడిపోవునుగాక యని శపించెను. ఆ వానరసైనికు లంద ఱాపాడు పడిన యడవిప్రాంతములను, నదులయుత్పత్తులను, పర్వతగుహలను సుగ్రీవుని మెప్పువడయఁగోరి, సీతాదేవిని, సీత నపహరించినరావణుని వెదకిరిగాని వారిని గానరైరి. తరువాత నా వానరవీరులు తీఁగెల జొంపములచే నిండిన ప్రసిద్ధమగు భీకరమయిన యొక యడవింజొచ్చి, యచ్చటఁ గ్రూరంపుఁబనులు సేయువాఁడును, దేవతలకుఁగూడ వెఱవని వాఁడునైన యొక రాక్షసునిఁ జూచిరి. వానరులందఱు మఱొక్క పర్వతమో యనఁదగియున్న యా యసురునిఁజూచి, యందఱును దట్టి బిగించికట్టిరి. బలవంతుఁడగు నా యసురుఁడు పర్వతములంబోలు నవ్వానరవీరుల నందఱం జూచి, "ఇదిగో చచ్చితిరి మీరంద ఱిప్పుడు" అని పలికి యార్భాటముతో గట్టి పిడికిలిపట్టి యెత్తి వారిపైకి దుముకఁ బోయెను. అట్లు వచ్చునట్టి యా యసురునిఁజూచి యతఁడు రావణుఁ డని యెంచి యంగదుఁడు వానిఱొమ్మునఁ బిడికిటితోఁ గ్రుమ్మెను. ఆ యసురుఁడు వాలిపుత్రుని చేతిగ్రుద్దు దిని నోట నెత్తురు గ్రక్కుచు, పర్వ

తముక్రిందఁ ద్రోయఁబడి కూలినట్లు పుడమిని గూలెను. ఆ యసురుఁ డూపిరివిడిచినంతటనె యా వానరులందఱు జయశాలులై, యాకొండ గుహాయందంతటను బలుమాఱు చక్కఁగా వెదకిరి. ఆవనమున వెద కియు, సీతను గానక, వానరవీరులు భయంకరమైన మఱియొక పర్వత గుహాను జొచ్చి, యచ్చటను మాటిమాటికి వెదకియుఁ గానక, యంద ఱొక్క యేకతమగు చెట్టుమొదటఁ గూర్చుండి, వగలపాలై యుండిరి.

49-వ సర్గము.

అంగదుఁడు వానరులను ప్రేరణసేయుట

అటుతరువాత గొప్పవివేకవంతుఁడగు నంగదుఁడు మిక్కిలి యల సటనొందినవాఁడయినను, ధైరటదెచ్చుకొని, యా వానరుల నందఱి నూఱడించి తిన్నగా నిట్లనెను: "ఓ వానరవీరులారా, మనము వన ములు, కొండలు, కోటలు, కొండచఱియలు, పర్వతగుహాలును అంత టను వెదకితిమి. అచ్చట నెక్కడేని నొక్కచోటనైన నాసీత గానరాదు. వేల్పుటన్నువలంబోలు నా సీత నపహరించిన యారాక్షసుఁడును గానఁ బడఁడు. మనగడువుకాలము చాలవఱకుఁజెల్లినది. సుగ్రీవుఁ డున్ననో క్రూరముగా దండనచేయువాఁడు. కావున మీరందఱుగూడి యంతట సీతను వెదకుఁడు. మీరు సోమరితనమును, చింతను, వచ్చుచుండెడి నిద్రను విడిచి, యా జానకిని పరిశోధించి వెదకి కనుఁగొనవలెను. విసుగు లేకుండుటయు, పట్టుదలయు, మనస్సునొక్క నిలుకడయుఁ, గార్యాను కూలతయుఁ జేయునవియని పెద్దలందురు గాఁబట్టి, నేను మీతో నిట్లు చెప్పితిని. ఇప్పటికి మీరు విచారముమాని యాయా వనములందు సీతను వెదకుఁడు. విడువక చేయునట్టి పని కెన్నఁటికైనను సిద్ధిగాక మానదు. వగచినది చాలును. మన మిట్లు సోమరులమైయుండుట యుక్తముగాదు. వానరరాజగు సుగ్రీవుఁ డోర్వరాని కోపముగల వాఁడు; కఠినముగ దండించును. కావున నతనికిని మహాత్ముఁడయిన రామునికిని మనము వెఱచి వారియాజ్ఞను నడచుకొనవలయును. లేనిచో వారు మనలను వధింతురు. నే నిప్పుడు మీ మేలుగోరి యీ మాట పలికితిని. మీకిది యుక్తముగాఁ దోఁచిన నట్లు చేయుఁడు. లేనిచో మనకందఱి కేది యుక్తమనితోఁచెడి దానిం జెప్పుఁడు"

అని యంగదుఁడు చెప్పినమాటను విని, గంధమాదనుఁడను వానరుఁడు దప్పిచేతను దారియలసటచేతను మాటలు దొట్రుపడు చుండఁ దిన్ననిగొంతుతో "వానరులారా! యంగదుఁడు చెప్పినమాట మీకందఱకుఁ దగియున్నది; మేలయినది; అనుకూలమైనది. కావున నీతని మాటప్రకారము సేయవలయును. మనము మఱలఁ బర్వత ములు, గుహలు, బిలములు, జనరహితవనములు, సెలయేళ్ళ వెదకు దము. సుగ్రీవమహారాజు చెప్పినచొప్పున నందఱముగూడి పర్వతము లందలి దుర్గములందు వెదకుదము" అని చెప్పెను.

ఆ బలవంతులగు వానరులందఱు మఱల లేచి, దక్షిణదిక్కు నందే వింధ్య పర్వతారణ్యములందుఁ దిరుగుచు, శరత్కాలమేఘము మాడ్కిఁ దెల్లనైనదియు, పెలుఁగుగలదియు, శిఖరములుగలిగి, గుహ లతోఁగూడియున్నదియు వింధ్యపర్వతములోని యొకభాగమగు రజత పర్వతమునెక్కి, యచ్చట చక్కనైన యారుగుపైరునందును, ఏఁడాకుల యరఁటితోఁపులందును సీతాదేవిని వెదకిరి. విస్తారమగు శౌర్యముగల వారగు వానరు లలఁతచెందినవారలయ్యు నా పర్వతాగ్రమునెక్కి రాముని కనుఁగుపట్టపుదేవియగు సీతను వెదకిరి. వా రట్లు వింధ్యపర్వ తంపు గుహాలయం దన్నింటను గలయఁజూచియు సీత యగుపడనందున నచ్చటనుండి దిగి, మిక్కిలి డస్సినవారయినందునఁ బ్రజ్ఞదప్పి, కొంత తడవు నిలిచియుండి, యొకచెట్టుక్రింద విడిసిరి. హనుమంతుఁడు మొద లగు వానరోత్తము లట్లు మహార్తకాల మూఁటు నొంది, కొంచెము నేద దీర్చుకొని, మఱలఁ బూనికతో నా దక్షిణదిశనే వెదక నారం భించి, యా వింధ్యపర్వతమునే మొదటనుండి కడవఱకు నచ్చటచ్చట ప్రదేశములనెల్ల వెదకిరి.

50-వ స ర ము.

➤ హనుమదాదులు సీతాదేవిని వెదకుట ➤

హనుమంతుఁడు తారాంగదులతోఁ గూడినవాఁడై వింధ్య పర్వతమందలి గుహాలయందును, అడవులందును, సింహ శార్దూలాదు లుండెడి యొగుడుదిగుడుగానున్న ప్రదేశములందును, గొప్పసెలయేళ్ళ యందును నుండు నదులను, బండలను వెదకుచు నా పర్వతముయొక్క

నిర్ఋతిమూలయందున్న శిఖరమును జేరి యచ్చటనే చాలకాలము గడఁ పిరి. పెక్కు గుహలు, అడవులుగలది యగుటచేత నాదేశము వెదకుట కలవికాకయుండెను. అట్టి యాపర్వతంపు నిర్ఋతిమూల నొండొరులకు జేరువనే యొండొరులుగూడి వెదకిరి. హనుమంతునివెంబడివచ్చిన గజ, గవాక్ష, గవయ, శరభ, గంధమాదన, మైంద, ద్వివిద, సుషేణ, నళ, జాంబవంతులును, యువరాజగు నంగదుఁడును, తారుఁడును దక్షిణ దిశయందుఁ గొండలతో నిండియున్న దేశములను వెదకి యావల నచ్చట విశాలమైన యొకగుహను జూచిరి.

దానికిఁ జేరువ ఋక్షబిలమను పేరుగల యొక్క గుహ యున్నది. అయ్యది మయుఁడను రాక్షసునిచేఁ గావింపఁబడుచుండు. ఆ వానవీరు లాఁకలిదప్పులచేఁ జుట్టఁబడినవారును, అలసినవారు నైనందున నీరు ద్రావఁగోరినవారయి, తీఁగెలజొంపములతో నిండిన యా బిలమును గాంచిరి. ఆ బిలమునుండి క్రౌంచ, సారస, చక్రవాక పక్షులు నీటిచేఁ దడసినవియు, పద్మములపుప్పొళ్లు తగులుటచే నెఱ్ఱి నైన యొడళ్లతోఁ గూడినవియునై వెడలినవి. హనుమంతుఁడు మొదలగు వానరశ్రేష్ఠులందఱు కమ్మనితావిగలిగి, చొర నలవికాక యున్న యమ్మహాబిలమునుగాంచి, యొక్కువ యానందము నొందిరి. అంతటఁ దేజోవంతులయిన వానరోత్తములు పలువిధంబులైన జంతు వులతోఁ గూడియు, పాతాళమును బోలియు, చూడనలవికాకయు, నే వైపునను జొఱ నలవికాకయుఁ గడు భయంకరమైయున్న యా సొరం గమును జూచి, యిది యెవరిదో, పాతాళలోకమో, లేక రాక్షస మాయయో యని సంశయించి యా బిలమును జేరుటకు వెఱచిరి.

అప్పుడు కాననములను వనదుర్గములను జక్కఁగా నెఱిఁగిన వాఁడు, పర్వతశిఖరముఁబోలువాఁడునైన వాయునందనుఁడగు హను మంతుఁడు వానరులనందఱిని జూచి, "మనము దక్షిణదిక్కున పర్వత ములగుంపుచేఁ జుట్టఁబడిన యన్ని దేశములను వెదకి వేసారితిమిగాని యా మైథిలిం జూడమైతిమి. ఈ బిలమునుండి హంసములు, క్రౌంచ పక్షులు, సారసపక్షులు, చక్రవాక పక్షులు నీటఁదడిసిన యొఱుకలతోఁ గూడి యన్నివైపులనుండి వెడలుచున్నవి. తప్పక యిచ్చట నీటితో నిండిన యొక బావియో, లేక గుంటయో యుండి తీరవలెను. దానికి

సూచనముగా నీ బిలద్వారమున సున్న యీ వృక్షములు పచ్చనై వెలుఁగుచున్నవి" అని చెప్పఁగా, వానరులందఱు చంద్ర సూర్య సంచారము లేమిం జేసి చీఁకటిచే నిండినట్లై భయము గల్గించుచుండు నాబిలమునుండి సింహాములు, మఱి యాయా మృగంబులు, పక్షులును వెలువడుటంజూచి, యిది యేదియో కనుఁగొందమని యా సొరంగములోపలఁ బ్రవేశించిరి. వారి కాగుహయందు, గన్నులు కానిపింప వయ్యె. తేజస్సును, శౌర్యమును, నడఁగెను. వారు వాయువుంబోలె మిట్టపల్లములు దెలియక యిచ్చవచ్చినట్లెల్లఁ బోయిరి. ఆవానరోత్తము లట్లు పోయిపోయి, సౌందర్యముతో వెలుఁగుచున్న యుత్తమదేశము నకుఁ బోవుదారింబడి, సకలవృక్షములతో నిండి, చొఱ నలవికాక యున్న యా దేశమున నవ్వానరశ్రేష్ఠు లొండొరులచేతులు పట్టు కొని యామడదూరము పోయిరి. అటుపై వారు పోఁజాలక దప్పి గొని, నీరుగానక, మైమఱచి తొట్రుపాటుపడుచున్నను, గొంతతడవు సోమరితనంబులేని యాబిలంబునఁ దిరిగిరి. అట్లు ఆ వానరులు చీఁకటి యందుఁ దిరుగుచు నీరువట్టుచేఁ జిక్కి మోమున దీనభావము దోఁప నలసట హెచ్చఁగాఁ బ్రాణములం దాశవిడిచినవారలై వగచుచుఁ గొంతసేపటికి నొక వెలుతురుం జూచిరి.

ఆ హరిశ్రేష్ఠులు చీఁకటిలేక యందమై యొప్పుచుండు నా దేశమునుబొంది, మండుచున్న యగ్నిహోత్రంబోలు వెలుఁగుగలవియు, పసిఁడివన్నెగలవియునైన మద్దిచెట్లను, త్రాటిచెట్లను, పొన్నచెట్లను, ఏఱుమద్దిచెట్లను, అశోకవృక్షములను, చంద్రచెట్లను, సంపంగిచెట్లను, నాగకేసరవృక్షములను, చక్కఁగా విరిసిన కొండగోఁగుచెట్లను, పలువన్నెలుగల బంగారుగంటి పూలగొత్తులను, ఎఱ్ఱని చిగుళ్ళను, కొనలును, తీఁగెలునుగల్గి, బంగారు భూషణములచే నలంకరింపఁబడినవై బాలసూర్యునివలె వెలుఁగుచు, వైడూర్యమణులతోఁ గట్టఁబడిన తిన్నెలుగలిగి, మిక్కిలి తేజరిల్లుచున్న పసిఁడిప్రాఁకులను, నీలవైడూర్యమణులకాంతిగలిగి, పక్షులతోనిండి, బాలార్కసదృశద్యుతిగల గొప్ప పసిఁడితామరపువ్వులచే వెలుఁగుచు, సువర్ణస్వరూపములగు గొప్పచేపలును, తాఁబేళ్ళును గలిగి, తేటనీటితోఁ గూడియున్న కొలంకులను, బంగారు గవాక్షములు గలవియు, ముత్యాలహారములచే

నలంకరింపఁబడినవియునైన బంగారు వెండి విమానములను, సువర్ణరజత మయమయిన నేలలతోఁగూడి, పచ్చలుచెక్కియున్న యుత్తమగృహాములను, పుష్పఫలములతో, గూడినవైన పగడపువన్నెగల వృక్షములను, బంగారపుఁ దుమ్మెదలను, పూఁదేనియలను, రత్నములు చెక్కిన బంగారుమంచములను, పీటలను, ఉత్తమవాహనములను, బంగారు వెండి కంచుపాత్రల రాసులను, మేలిమివాసనగల యగురుచందనముల రాసులను, చక్కఁగాఁ బండి తినఁదగియున్న ఫలమూలములను, ఉత్తమపాన ద్రవ్యములను, తీపిగల మద్యములను, మిగుల విలువగల మేటివలువలరాసులను, అచ్చటచ్చటఁబడినవై యగ్నిహోత్రునిమాడ్కిఁ దేజరిల్లు చొక్కపు బంగారురాసులను జూచుచు, నా బిలమున నచ్చటచ్చట సీతాదేవిని వెదకుచు సమీపమున నొక్క తాపసాంగనను గాంచిరి. ఆ తాపసి నారబట్టలను గట్టి, కృష్ణాజినమును గప్పుకొన్నదై, యాహార నియమము గలిగి, తపస్సుచేయుచుఁ దనతపోమహిమచే వెలుఁగు చుండుటనుజూచి యా వానరులందఱు మిక్కిలి భయముచే నులికిపడి వెఱఁగుపాటుతో నచ్చటనే నిలిచిరి. అంతఁ బర్వతముంబోలు హనుమంతుఁ డా తాపసిని జూచి, చేతులుమోడ్చి మ్రొక్కి "నీ వెవతెవు? ఈ బిలమెవనిది? ఈ గృహ మెవ్వనిది? ఈ రత్నము లెవ్వనివి? మాకుఁ జెప్పు" మని యా తాపసి నడిగెను.

51-వ సర్గము.

హనుమంతుఁ డొకతాపసితో మాటలాడుట

హనుమంతుఁడు కృష్ణాజినముదాల్చినదియు, పుణ్యకార్యములు చేయునదియు, తపస్సుచేయునదియునైన యా యంగన నవ్యిధమున నడిగి, మఱల నావిడంగూర్చి, "ఓ మహాత్మురాలా! మేము చాల దవ్వు నడచి నడచి యాఁకలిదప్పులచే మిక్కిలి నొచ్చినవారమై, యిందున జలముండు నని యెంచి యంధకారబంధురమైయున్న యీ బిలమునఁ జొచ్చితిమి. మాకు నీరువట్టు హెచ్చైచయున్నందున నీబిలమున నెచ్చటనైన నీరు దొరకఁగలదని యెంచి యీ బిలము సొచ్చితిమి. ఇచ్చట వింతవింతలైయున్న వస్తువులనుజూచి, మేము మిక్కిలి వ్యసనమునొంది, తొట్రుపాటునొంది, సోలితిమి. బాలసూర్యనింబోలె

వెలుఁగునవి, నెత్తావియు, పూవులు పండ్లును గలవియునైన బంగారు వృక్షములును, పరిశుద్ధములై తినఁదగియున్న ఫలమూలములును, బంగారుకిటికీలును, రతనాలతెఱలును గలిగియున్న బంగారు వెండి విమానములును హారములును నెవ్వనివి? ఎవనితేజస్సుచే నీ వృక్షములును నిర్లోదకమునఁబుట్టిన పద్మములును బంగారుమయములై యున్నవి? ఎట్లు మత్స్యములు, తాఁబేళ్ళును బంగారువన్నెగలిగియున్నవి? ఇవి నీ ప్రభావముచేతనా? లేక, మఱియెవ్వరి తపఃప్రభావముచేతనా? మాకుఁ దెలియక యడుగుచున్నాము గావున, నీవు మా కీ సంగతియెల్ల వివరించి చెప్పుము" అనవుడుఁ బుణ్యకార్యములు సేయునదియు, సర్వభూతములకు మేలుసేయునదియునైన యా తాపసి హనుమంతునితో నిట్లనియె:

"పూర్వము మహాప్రతాపవంతుఁడును, తంత్రశాలియునైన మయుఁడను పేరుగల రాక్షసశ్రేష్ఠుఁ డొక్కఁడుఁ డుండెను. ఆతఁ డీ వనము నంతయుఁ దనతంత్రముచే బంగారుమయముగ నిర్మించెను. తొల్లి మయుండు దానవశ్రేష్ఠులకెల్ల వడ్రంగియై యుండెను. ఈ దివ్యమైన బంగారపుమేడను మయుండు నిర్మించెను. ఆ మయుఁ డీ మహావనమున వేలకొలఁది సంవత్సరములు తపస్సుగావించి, బ్రహ్మదేవునివలన శుక్రునికి సంబంధించిన యీవ ద్ధనమును దనకుఁ దెలియునట్లు వరముఁ బొందెను. అట్లతఁడు బ్రహ్మవలన వరముఁ బడసి యీవనము నిర్మించి యందలి కోరుకొను ధనము నొందుచుఁ గొంతకాల మీవనమున సౌఖ్యముతో నుండెను. ఆ యసురవరుఁడు హేమయను నప్సరసయందుఁ దగులుగలిగియున్నాఁడని యెఱిఁగిన వాఁడై, దేవేంద్రుఁడు కినుకఁబూని వజ్రాయుధముఁ బ్రయోగించి యీమయుని గొట్టెను. మయుఁ డీవనము విడిచినతర్వాతఁ బితామహుఁ డీ యుత్తమవనమును, నిత్యానుభవయోగ్యపదార్థములను, సువర్ణవికారమయిన యీగృహమును హేమ కొసఁగెను. వానరోత్తమా! ఏను మేరుసావర్ణియొక్క కూఁతురను; స్వయంప్రభ యనుదానను. నే నా హేమకుఁ జెలికత్తెనై దానియింటిని గావలికాచియుందును. హేమ నా కనుఁగుఁజెలికత్తె. నాట్యమునందును, పాటయందును నేర్పుకత్తె. నే నాపెవలన నొరులకుఁ దిరస్కరింప నలవికాక యుండునట్లు వరముఁ

బడసినదానానుగాన, ఈ దివ్యభవనమును గాపాడుచుందును. వానరులారా! మీ రేమిపనివడి యిచ్చటికి వచ్చితిరి? ఏల యడవులఁగ్రుమ్మరుచుఁ జూచుచున్నారు? చొఅనలవికాని యీవనము నెట్లు మీరు కాంచఁగల్గితిరి? ఈభక్షణీయములైన కందమూలఫలములను భక్షించి, నీరుద్రావి, మీసంగతి యీవత్తును విస్తరించిచెప్పుడు" అని యీ తాపసి హనుమంతు నడిగెను.

52-వ సర్గము.

హనుమంతుఁడు స్వయంప్రభకుఁ బ్రత్యుత్తర మొసఁగుట

ఏకాగ్రతగలవై పుణ్యపుఁబనులుసేసెడి యీతాపసి బలిమిగల యీవానరశ్రేష్ఠుల నందఱనుజూచి, "వానరులారా! పండ్లుదినుటవలన మీదారిబడలిక దీరియుండెనేని, మీరాకకుఁ గారణము నాచే వినఁదగి యుండెనేని వచింపుఁడు. నేను వినగోరెదను" అనఁగా, వాయునందనుఁడగుహనుమంతుఁ డత్తాపసియొక్కపలుకులు విని, కపటములేక యున్నది యున్నట్లు చెప్పఁబూనెను.

సకలలోకములకు రాజును, పరాక్రమమున నింద్రుని, శౌంతము నందు వరుణునిఁబోలినవాఁడును, సౌందర్యవంతుఁడునునైన రాముఁడు తమ్ముఁడగు లక్ష్మణునితోను, భార్యయగువైదేహితోనుగూడి దండకావనముఁ బ్రవేశించెను. వారు జనస్థానమునననుండఁగా, రామలక్ష్మణులు దగ్గఱ లేనప్పుడు రావణుఁడను నసురుఁడు సీతాదేవిని బలవంతముగా నెత్తికొనిపోయెను. ఆ రామునికి సుగ్రీవుఁ డను వానరుఁ డొక్కఁడు స్నేహితుఁడుగలఁడు. ఆతఁడు వానరులకెల్ల రాజు. ఆసీతాదేవిని వెదకుటకై యగస్త్యమహాముని చరించినదియు, యమునికాపుదలలో నుండు నదియునైన దక్షిణదిశకు మమ్ముఁబంపి, "ఓ హనుమంతుఁడా! భయంకరులగు నంగదుఁడు మున్నగు వానరులతోఁగూడి, కామరూపుఁడగు రావణాసురుని, సీతాదేవిని వెదకుము" అనిచెప్పెను. మేమందఱము దక్షిణపుదిక్కెల్ల సంచరించి యీఁకలిచేఁ డస్సి యొక్క చెట్టుక్రిందఁ జేరితిమి. మేము మోముల విన్నదనము దోఁపఁ జింతయె ప్రథానముగాఁ గొని, చింత యను గొప్పకడలియందు మునిఁగి, యీవలిగట్టు దొరకక శ్రమపడితిమి. అప్పుడు మేము నలుదెసలఁదేఁకి పాఱఁజూచి,

తీఁగెలజొంపములతోను, వృక్షములతోను గప్పఁబడి, యంధకార బంధురమైయున్న యీబిలముఁ బొడఁగాంచితిమి. ఈబిలమునుండి రాయంచలు, కొక్కెరలు, సారసములు మొదలగుపక్షులు నీట మునిఁగి, తమతొక్కలనుండి నీరు విదిలించుచు వెడలుటఁజూచి, యీబిలమునఁ గొలఁకున్నట్లున్నది. ఈబిలమునఁ బ్రవేశింతమని నేనుచెప్పితిని, వారును ప్రభువుకార్యము నెఱవేర్చుటయం దాసక్తులై "అట్లె పోదము; ప్రవేశింతము. ఇచ్చట సీతాదేవి యుండునేమో" యని సంశయపడిరి. అంతమే మొకరిచేతుల నొక్కరు పట్టుకొని, చీఁకటిచే దట్టమైయున్న యీగుహాయందుఁ బ్రవేశించి వేగిరముగా వచ్చితిమి. ఓతాపసీ! యిది మాపని. ఈ పనిని నుద్దేశించి యీదేశమునకు మేము వచ్చితిమి. మేము మిక్కిలి యాఁకలిదప్పులచే డస్సినవారమై నిన్ను శరణుఁజొచ్చితిమి. అతిథుల కొసఁగవలయుమర్యాదతో నీవిచ్చినమూలఫలంబులను తూర్తులమైయున్న మే మెక్కువ యాతురతతో భుజించితిమి. చావనున్న యీ వానరులందఱిని నీవుగాపాడితివి. దీనికి వీరేమి ప్రత్యుపకారము సేయవలయు చెప్పుము" నావుఁడు, సర్వము నెఱిఁగిన యాస్వయంప్రభ యావానరయూథనాథులను జూచి, "బలిష్ఠులగు మీ యొక్క సాహస కృత్యమునకు నేను సంతసించితిని. ధర్మసంపాదనమం దాసక్తురాలనైన నాకు మీప్రత్యుపకారముతోఁ గావలసినది లేదు" అని చెప్పెను.

53-వ సర్గము.

హనుమదాదులు గడువుమించినందుకై చింతించుట

వానరవీరుఁడగు హనుమంతుఁ డివ్విధంబునఁ దాపసిచెప్పిన ధర్మయుక్తమును హితమునైన పలుకును విని, సత్కార్యము లొనరించునట్టి యాస్వయంప్రభఁ జూచి, "ధర్మము నడపుదానా, మేమందఱము నిన్ను శరణుచొచ్చితిమి. సుగ్రీవుఁడు మాకొక నెల గడువిచ్చెను. మే మీ బిలమునఁ దిరుగుచుండఁగా నొక్కమాసము గడచెను. మేము సుగ్రీవునిమాట మీఱితిమి గావున మమ్మాతఁడు తప్పక సంహరించును. గతాయుష్కులమై, యాతనివలనిభయముచే భీతిలియున్న మమ్ము నీవు గాపాడవలయును. మే మెంతయో గొప్పకార్యము చేయవలసినది యున్నది. ఈ బిలమున నుండినందున నా గొప్పపనిని జేయనైతిమి.

కావున ఓధర్మపరురాలా! నీవు మమ్మాభయంకరమైన గుహానుండి వెలు పలికిఁ జేర్పుము" అని యా స్వయంప్రభను బ్రార్థించెను.

హనుమంతునిమాట విని యాస్వయంప్రభ యా హనుమదాది వానరులంజూచి, "ఓ శాఖాచరులారా, యీగుహాయందుఁ బ్రవేశించిన వాఁడు ప్రాణములతో బయటికి వెడలుట సాధ్యముగాదు. నేను నియమపూర్వకముగా సంపాదించిన తపోబలముచే మిమ్ము నందఱను వెలుపలికిఁ జేర్చెదను. వానరశ్రేష్ఠులారా, మీరు కన్నులు మూసికొనుఁడు. కన్నులుమూసికొనక యీగుహానుండి వెడలుట కెవనికిఁ దరముగాదు" అని చెప్పఁగా, వానరులందఱు బయటికిఁబోవ గోరికతో మెత్తనివ్రేళ్లుగల తమచేతులతోఁ గండ్లు గట్టిగా మూసికొనిరి. వెంటనే యాస్వయంప్రభ యొక నిమిషములోపల వానరుల నందఱిని బిలము నుండి వెలుపలికిఁజేర్చెను. ధర్మమునడచుకొనునట్టి తాపసియగు స్వయం ప్రభ, కష్టసాధ్యమైన యాబిలమునుండి యావానరుల నందఱను వెలు పలికిఁజేర్చి, వారి నూఱడించి, "వానరశ్రేష్ఠులారా, పెక్కుచెట్లతోను దీఁగెలతోనుగూడిన వింధ్యపర్వత మిది. ఇది ప్రస్రవణపర్వతము. ఇది మహాసముద్రము చూడుఁడు. మీకందఱకు మేలయ్యెడుఁగాక. పోయి వచ్చెద" ననిపలికి తనగుహాలోపలికిఁ జొచ్చెను.

అంత నావానరవీరులు దరిదెలియనిదియు, భీకరమైన యల లతోఁ గూడి వీచుచున్నదియునైన వరుణునియునికిపట్టగు కడలింగాంచిరి. మయుఁడు తనమాయతోఁజేసిన పర్వతబిలమును వెదకుచుండఁగా, వారికి సుగ్రీవుఁ డొసఁగిన గడువుగడచెను. అప్పుడు మహాబలశాలు రగు వానరులంద ఱావింధ్యపర్వతమున వసంతఋతువునందుఁ బూఁచు నట్టి మామిడి, జువ్వి మొదలగు చెట్లులెల్లఁ బువ్వులబరువుచే ముందుకు వంగినవై, పెక్కుతీఁగలచేఁ జుట్టబడి యుండుటనుఁజూచి, శిశిరఋతువు పోయి వసంతసమయము సంప్రాప్తమగుచున్నదని యొండొరు లను కొని, సీతాదేవిని కాంచకపోవుటచే, సుగ్రీవుని యాజ్ఞను గడువును మీఱుటచే మిక్కిలి వెఱచినవారలై స్మృతిదప్పి క్రిందఁబడిరి. అప్పుడు సింహవృషభములమూఁపురములంబోలు మూఁపురములుగలవాఁడును, బలిసిన నిడుపు చేతులుగలవాఁడును, గొప్పబుద్ధిమంతుఁడునగు యువ రాజగు నంగదుఁడు తనకంటెఁ బెద్దలైన వానరులను, తక్కిన వానరుల

నందఱిని నింపుమాటలచేఁ బిలిచి తగుమర్యాదలు సేసి, వారితో నిట్లనెను:

ఓ వానరులారా, మనము వానరేంద్రుఁడయిన సుగ్రీవుని యా నతిగైకొని వెడలితిమి. మనము బిలమున నుండఁగా నెల గడచెను. మీకిది యేల తెలియలేదు. మనము మొదట నాశ్వయుజమాసంబు ననే పదునైదుదినంబులు గడవు పెట్టి పంపఁబడితిమి. అదికాక లక్ష్మణుఁడు కోపపడినతర్వాత మఱలఁ బదిదినములు గడవు పెట్టి పంపఁబడితిమి. ఆవల మార్గశీర్ష మెల్ల గడచె. పుష్యమాసారంభమున నెలకు మఱలవచ్చి చేరున ట్లాజ్ఞాపింపఁబడితిమి. ఆయాజ్ఞప్రకారమే మనము వెడలివచ్చితిమి. ఆ సమయముదాఁటెను. ఇఁక మన మిప్పుడు చేయవలసినపనియేమి? మీరందఱు జ్ఞానవంతులు నీతిమార్గము నెఱిఁగినవారలు. యజమానుని మేలుసేయుటయం దాసక్తిగలవారలు. అన్నిపనులం దెదురులేని వారలు. దెసలందుఁ బ్రసిద్ధికెక్కిన పరాక్రమముగలవారలు. సుగ్రీవుని యాజ్ఞచే నావెంబడి వచ్చినవారలు. మనము మనరాజు నాజ్ఞ మీఱితిమి గావున నిఁక మృతినొందవలసినవారమే. అందుకేమియు సందియములేదు. వానరరాజు నుత్తరువు మీఱినతర్వాత నెవఁడు చావును దప్పించుకొనఁగలఁడు? వానరేంద్రుఁడొసఁగిన గడువుమీఱితిమి గాన మనమిప్పుడు ప్రాయోపవేశముచేయుట యుక్తము. సుగ్రీవుఁడు స్వాభావికముగాఁ గ్రూరుఁడు. ఇప్పుడు తానేరాజై యున్నాఁడు. కావున మనము కార్యములు సాధింపక, గడువున మీఱితే యాతనికడకుఁ బోతిమేని తప్పక యాతఁడు మనల బొలియించునుగాని, మనయపరాధము క్షమింపఁడు. మనము గడువుమీఱినను, సీతాదేవిపోవిడి తెలిసికొని పోవుదుమేని, యతఁడు కొంతమన్ననచేసినను చేయవచ్చును. మనము గడువు దప్పి సీతాదేవి వృత్తాంతమును దెలియక పోయితిమేని సుగ్రీవుఁడు తప్పక మనకు వధమునే విధించునుగావున, మనమందఱము భార్యా పుత్రులను, బిడ్డలను, ఇండ్లువాకిళ్లను, ధనధాన్యములను విడిచి యిపుడిచటనే ప్రాయోపవేశముచేయుట యుక్తము. మనమిచటినుండి బయలు దేరిపోతిమేని, రాజు మనలను తప్పక వధించును. అన్యాయముగా నాతనిచేతఁ జచ్చుటకంటె నిచ్చటఁజచ్చుటయే మేలు. నాకు సుగ్రీవుఁడు యువరాజపట్టముగట్టఁడయ్యె. ఎంతటికార్యమునయినను శ్రమలేక చేయునట్టిరాముఁడే నాకుఁబట్టాభిషేకము సేసెను. సుగ్రీవుఁడు మొదటనే

నాతో వైరము పూనియున్నాఁడు. నాయెడ స్వల్పాపరాధము గనఁబడె నేని, తప్పక వాఁడార్వకాని కఠినదండనను జేయును. నేను కిష్కింధా పురమునకుఁబోయి, యచట సుగ్రీవునిచే మరణదండనను బొందిన, నామిత్రులందఱు నన్నుఁగూర్చి విలపింతురు. అట్లు వారిని దుఃఖింపఁ జేయుటచే నేమియుపయోగము? కావునఁ బవిత్రమైన యీసముద్రతీర మునకే ప్రాయోపవేశముసేసెదను" అని యనెను.

అంగదుఁడు సెప్పినమాట విని యావానరశ్రేష్ఠులందఱును, "సుగ్రీవుఁడు స్వాభావికముగాఁ గ్రూరుఁడు. రాముఁడన్ననో ప్రియురా లియం దాసక్తిగలిగియున్నాఁడు. మనము సీతనుగానక చెప్పిన గడువు నకే యాతనిసన్నిధికిఁబోయినను, మనము కార్యముసాధింపకవచ్చినామన్న కోపముచే రామునియిష్టమునకై మనలను దండించును. ఒకవేళ సీతా దేవివృత్తాంతమును దెలిసికొని, సమయముమీఱిపోయినను, మనలను గార్యము సాధించితి మన్న హేతువుచే నేమియుఁ జేయకుండును. కావున మన మిప్పుడు తప్పిదమొనర్చి ప్రభువుసమీపమునకుఁ బోవుట యుక్తము గాదు. కావున నిచ్చటనే సీతాదేవిని వెదకిచూచి కాని, సీతాదేవి పోవిడి తెలిసికొని కాని పోతిమేని మన కుగ్రదండనముతప్పినను తప్ప వచ్చును. అట్లుకాక యూరకపోతిమేని, మనలను సుగ్రీవుఁడు యమునివీటికి నంపుట నిజము" అని మిక్కిలి దీనముగాఁ బలుకఁగా, తారుఁడు వెఱపుచేఁ బీడింపఁబడియున్న యా వానరులమాటలను విని, "ఏల మీరిట్లు దిగులుపడెదరు. మీకందఱి కిష్టమేని, యీగుహలోఁ బ్రవేశించి సుఖముండము. ఈ బిలము మయుఁడు తనమాయచే నిర్మించినది; చొరరానిది; వృక్షములు, నీరు, ఆహారపదార్థములు, పానీయ ద్రవ్యములును విస్తారముగాఁగలది. ఇచ్చట మనకు దేవేంద్రునివలనఁ గాని, రాముని వలనఁగాని, సుగ్రీవునివలనఁగాని భయము లేదు" అని వానరులతోఁజెప్పెను. అప్పు డంగదునిమాటను విన్న మఱికొందఱు వానరులును దమకుఁదోఁచిన యభిప్రాయములఁజెప్పి, యెట్లుచేసిన మనకు మృత్యువుసంభవింపదో యట్టిప్రయత్నము వెంటనే చేయుఁడని యందఱుం జెప్పిరి.

54-వ సర్గము.

హనుమంతుఁ డంగదునకు హితము సెప్పుట

చంద్రునిఁబోలు కాంతిగల తారుఁ డామాటచెప్పఁగా విని, హనుమంతుఁడు సుగ్రీవునిరాజ్య మంగదునిచే హరింపఁబడినదే యనియు, అంగదుఁ డెనిమిదివిధంబులగు బుద్ధియు, చతుర్విధమగు బలమును, పదునాలుగువిధములైన సుగుణములును గలవాఁడని దలఁచి ఎల్లప్పుడు విడువని తేజస్సు, బలము, పరాక్రమము గలవాఁడును, శుక్లపక్షారంభమునాఁటి చంద్రునికైవడిఁ గాంతిచే వెలుఁగునాఁడును, బుద్ధియందు బృహస్పతితో సమానుఁడును, పరాక్రమమునఁ దండ్రికీడగువాఁడును దేవేంద్రుఁడు బృహస్పతివచనము వినునట్లు, తారునిమాట వినఁగోరుచున్నవాఁడును, యజమానుని కార్యమునకై మిక్కిలి శ్రమపడినవాఁడును, అన్నివిషయములను జక్కఁగా నెఱిఁగినవాఁడునైన యాయంగదునికి నీతిగఁబలుకఁదలఁచి, సామదానభేదదండము లను నాలుగు విధములైన యుపాయములలోపల భేదోపాయము వర్ణించి, యావానరుల నందఱి నంగదునితోఁగూడ నాబిలమున నుండువిషయమున భిన్నాభిప్రాయు లగునట్లు చేసెను. వారందఱు నంగదుని యభిప్రాయమునకు వ్యతిరిక్తాభిప్రాయులగుట యెఱిఁగి, దండోపాయమున కనుసరించిన భయంకరములైన పెక్కుమాటల నీక్రిందితెఱఁగునఁ జెప్పి యంగదుని వెఱపింపఁదొడఁగెను.

"తారాపుత్రుఁడా! నీవు తండ్రికంటె యుద్ధమునందుఁ జాలినవాఁడవా? నీతండ్రి రాజ్యభారము వహించినట్లు, నీవు వానరరాజ్యభారము మోయఁగలవా? వానరోత్తమా, వానరులెల్లప్పుడు తిరమైన మనస్సుగలవారుకారు. వారు భార్యలను బిడ్డలనుబాసి, నీయాజ్ఞకు లోఁబడి యుండఁజాలరు. నీసమక్షమునఁనే చెప్పెదను. జాంబవంతుఁడు నీలుఁడు, సుహోత్రుఁడు మొదలగువారందఱు నీయభిప్రాయముననుసరించియుండఁజాలరు. ఆ యీ వానరులును, నేనును సుగ్రీవుని యందు మిక్కిలి యనురాగముగలవారము. సామదానభేదదండోపాయములలో నొక్కదానిచేతను మమ్ము సుగ్రీవునినుండి చీలఁదీయుటకు నీకలవికాదు. బలవంతుఁడు దుర్బలునితో విరోధించి యుండ

వచ్చునుగాని, బలహీనుఁడు బలవంతునితోఁ బగపూనుట యొన్నఁటికిని క్షేమంకరముగాదు. కావునఁ దన్నుఁ గాపాడుకొనఁగోరు దుర్బలుఁడు బలవంతునితో విరోధము పూనరాదు. అంగదా, నీ వేబిలమును నీకుఁ గాఁపుదలయని తలఁచుచున్నావో, ఆయాబిలమును భేదించుట యా లక్ష్మణునిబాణముల కెంతమాత్రము? తొల్లి దేవేంద్రుఁడు వజ్రాయుధముఁ బ్రయోగించి, కొలఁదిపనియే చేసెను. లక్ష్మణుఁడైనచో దీని నాకు దొన్నెనుబోలెఁ దనవాఁడిబాణములచే జిల్లులుపడ నేయఁగలఁడు. లక్ష్మణునికడ వజ్రాయుధముఁబోలు పెక్కుబాణములున్నవి. అవి పర్వతములనైన భేదింపఁగలవి. వాని కీగుహ యెంతమాత్రము. శత్రు హింసనా, నీవెప్పుడు సుగ్రీవునితోఁ బగపూనుదువో, అప్పుడే వానరులందఱు లోలోపల నొకకట్టు కట్టుకొని నిన్నువిడిచిపోఁగలరు. వీరు నీతోఁగూడ బిలముఁ బ్రవేశించినను, తమయాలుబిడ్డలను దలఁచుకొని, యెడతెగని దుఃఖముగలవారలై, యాఁకలికి డస్సి, యీఁకొలమీఁదఁ బరుండుకొనఁజాలక, నిన్నువెనుకఁ ద్రోచిపో గలరు. అప్పుడు నీవు నీమిత్రులను, ఆప్తులను, బంధువులనువిడిచి, మిక్కిలివగచి, కదలుచుండు గడ్డిపోచకంటెఁ జులకనైపోవుదువు. అంతియకాక, శత్రువులను జంపు నవియు, కడువేగముతో నేగునవియు, శత్రువులకు సైరింపరానివియు నైన బాణములతో లక్ష్మణుఁ డెన్నటికైన సీతను వెదకకపోవుటయేకాక రాజునాజ్ఞనుల్లంఘించినవాఁడవగు నిన్నుఁ జంపకుండునను మాటలేదు. అట్లుకావున నీవు మాతోడవచ్చి యడఁకువతో మ్రొక్కి యతని నెప్పటివలెఁ గొల్చుచుంటివేని, సుగ్రీవుఁడు క్రమక్రమముగా నీకేరాజ్యమునఁ బట్టాభిషేకము గావింపఁగలఁడు. నీపినతండ్రి యెల్లప్పుడు న్యాయము గోరువాఁడు; జనులకిష్టమునేయఁగోరువాఁడు; నియమమునుతప్పనివాఁడు; కపటము లేనివాఁడు; ఆడినమాట తప్పనివాఁడు. కావున నిన్నెప్పటికి వధింపనొల్లఁడు. అంతియకాక, నీతల్లి కిష్టముచేయఁగోరినవాఁడు. ఈ సుగ్రీవుఁడు ప్రాణములతోనుండుట యామెకొఱకే. అదిగాక సుగ్రీవునికి నీకంటె వేఱుబిడ్డలును లేరు. కావున నంగదా! నీవు సంశయపడక మాతో రమ్ము" అని హనుమంతుఁ డంగదునితోఁ జెప్పెను.

55-వ సర్గము.

వానరులు ప్రాయోపవేశమునకుఁ బూనుట

అంగదుఁడు హనుమంతుఁడు న్యాయమునకు విరుద్ధముగాకయు, రాజభక్తి గనఁబఱచునట్లును, అడఁకువమెఱయఁగను జెప్పినమాటనువిని యతని కిట్లనియె: ఓ హనుమంతుఁడా! నిలుకడయు, దేహమనశ్శుద్ధియు, మోసము లేమియు, క్రౌర్యము లేమియు, మగతనమును, దిట్టతనమును సుగ్రీవునియెడ లేవు. ఏ సుగ్రీవుఁడు తనయన్న బ్రతికియుండఁగా, నతని పట్టపుదేవిని, న్యాయముగాఁ దల్లినిబోలుదాని నందఱు చీయనునట్లుగాఁ దానుగ్రహించెనో, ఏసుగ్రీవుఁడు మహాసమర్థుఁడయిన వాలి యుద్ధమునకుఁబోవుచు, బిలద్వారమునఁ గావలియుంచిపోఁగా, నాతనిబలము నెఱిఁగియుండియు బిలద్వారమును మూసికొనివచ్చెనో, యట్టి పాపాత్ముఁడు ద్రోహియనగు నాసుగ్రీవునికడ ధర్మమున్నదన నెట్లు పోసఁగును. అదిపోనిమ్ము! ఇప్పు డగ్నిసాక్షికముగా స్నేహముచేసికొన్న వాఁడు, తనయన్నను జంపుట, తనకురాజ్యము నిప్పించుటయను నుపకారమునుజేసినవాఁడు, బలాదులచేఁ బ్రసిద్ధిచెందినవాఁడునైన రాముని మఱచి యాతనికార్యమును మఱచినాఁడె. అట్టి కృతఘ్నుఁ డెవని కార్యము మాత్రము జ్ఞప్తియుంచును? ఇప్పుడు వాఁడు లక్ష్మణునికి వెఱచి సీతాదేవిని వెదకుటకై మనల నాజ్ఞాపించెనేకాని, యుపకారికిఁ బ్రత్యుపకారము సేయకున్నఁ బాపము సంభవించునని యెంచి యీపని సేయలేదు. అట్టివానియెడ న్యాయ మనునదెక్కడిది? అట్టిపాపాత్ముఁడు, కృతఘ్నుఁడు, బుద్ధిలేనివాఁడు, చపలబుద్ధియునగు వానిని మంచికుల మునఁబుట్టి, కొంతకాలము బ్రదికి బాగొందవలెనని కోరికగల యోగ్యుఁడెవ్వఁడు నమ్మును? సుగ్రీవుఁడు గుణహీనుఁడయినను, గుణవంతుఁడయినను దనకొడుకునకు రాజ్యమునఁ బట్టముగట్టునుగాని, శత్రువంశమునఁబుట్టిన నన్నెట్లు పట్టాభిషిక్తుఁజేయును? నేనుచేసిన యాలోచన వెల్లడియయ్యె. నే నసలు తప్పుచేసినవాఁడను, బలహీనుఁడను. నేను కిష్కింధకువచ్చితినేని, సుగ్రీవుఁడు నామీఁది తప్పిదమును, నే నతనికి వెఱచి యీబిలమునలో యుండనెంచినసంగతిని తెలిసికొన్నచో, నేను దిక్కులేనివాఁడుంబోలె బలహీనుఁడనై యెట్లు మనఁగలను. మోస

గాఁడు, కటికివాఁడు, ఘాతకుఁడునైన సుగ్రీవుఁడు రాజ్యముమీఁది యాసచే నన్నెవరికిఁదెలియకుండ నులిమి చంపును. కావున నేను కిష్కింధకువచ్చి యచ్చట సుగ్రీవునిచేత నురిదీయఁబడిచచ్చుటకంటె నిక్కడఁ బ్రాయోపవేశము చేయుటమేలు. కావున మీరందఱు నాకనుజ్ఞయిండు. మీరందఱు గృహంబులకుఁబొండు. నేనొక్కటె ప్రతిజ్ఞయొనర్చెదను. నేను పట్టణంబునకురాను. ఇచ్చటఁ బ్రాయోపవేశంబు సేసెదను. నేనచ్చటికి వచ్చుటకంటె నిచ్చటఁ బ్రాయోపవేశంబుచేయుటయే మేలు. బలశాలురగు రామలక్ష్మణులకు నానమస్కృతులఁ జెప్పుఁడు. వానరాధిపుఁడగు మాపినతండ్రియైన సుగ్రీవునికి నానమస్కారములు సెప్పి, యీవల నాక్షేమంబులు జెప్పవలసినది. మాపినతల్లియగు రుమను క్షేమమునడిగి, నా యారోగ్యమును జెప్పవలసినది. మాతల్లిని బుత్రవియోగమునకుఁ జింతింపవలదని యూరడింపవలసినది. మాతల్లి స్వాభావికముగా నాయెడఁబ్రేమయు, దయయుఁగలది. ఆమె, నేనిచ్చట నశించితినని యెఱిఁగినచో, మిక్కిలి దుఃఖించి, ప్రాణములఁదొఱఁగును" అని యీమాటచెప్పి యంగదుఁడు కలవరపాటుతోలేచి, యచ్చటి పెద్దలకెల్ల నమస్కరించి, శోకించుచు భూమియందు దర్భలపైఁ బరుండెను.

అట్లతఁడు ప్రాయోపవేశముచేసినప్పుడు, అచ్చటనున్న వానరశ్రేష్ఠులందఱు పలవించి తమకన్నులనుండి వెచ్చనికన్నీరువిడిచిరి. అప్పుడు వానరులంద అంగదునిపలుకులువిని వాలిని పొగడుచు, సుగ్రీవుని దూఱుచు నంగదునిఁజుట్టుకొని ప్రాయోపవేశముచేయ నిశ్చయించి, యీసముద్రతీరమునొంది, స్నానముచేసి పైయుత్తరీయము నడుముకుఁ గట్టికొని దక్షిణంపుఁగొనలుగల దర్భలుపఱచి, "యీసమయమునకిదియే తగినది" యని యెంచి మరణమునొంద నపేక్షతో నాదర్భలపైఁ దూర్పు ముఖముగాఁ గూర్చుండిరి. అప్పుడు ప్రాయోపవేశమునకుఁబూనిన గొప్పపర్వతశిఖరములంబోలు నా వానరోత్తములందఱు రాముఁడు వనమునకేతెంచుట, దశరథుఁడు మృతినొందుట, రాముఁడు జనస్థానమును బాడుసేయుట, రావణుఁడు సీతనపహరించుకొని పోవుచు నడ్డము వచ్చిన జటాయువును బరిమార్చుట, వాలిని రాముఁడువధించుట, సుగ్రీవుఁడు చెప్పినప్రకారము సీతనువెదకఁబోవుటకై రాకపోవుటచే

రామునికికోపమువచ్చుట, సుగ్రీవుఁడు వానరులను సీతాన్వేషణమునకై పంపుట మొదలగునడచిన వృత్తాంతములు చెప్పుకొనుచుండఁగా, మిక్కిలి యుఱుముచున్న వర్షాకాలపు మేఘములగర్జనముబోలు నావానరశ్రేష్ఠుల యార్తధ్వనులా పర్వతముయొక్క గుహాలయందంతట నిండుటచే నాపర్వతమునందు గొప్పధ్వనిగలిగెను. ఆధ్వనిని విని సంపాతి యను గృధ్రరాజు వారిని భక్షింపనేతెంచఁగా, వారికి మిక్కిలి వెఱపు గలిగెను.

56-వ సర్గము.

సంపాతి వానరులకడకు వచ్చుట

జటాయువునకు నన్నయు, బలపరాక్రమములందుఁ బ్రసిద్ధిచెందిన వాఁడును, తేజోవంతుఁడును, చిరకాలజీవియునైన సంపాతియను గ్రద్దలరేఁడు వింధ్యపర్వతముయొక్క గుహాలోపలినుండి వెలువడి వానరులు ప్రాయోపవేశముచేసియున్న పర్వతసమీపమునకేతెంచి, ప్రాయోపవిష్టులైయున్న యా వానరులనందఱినిజూచి, కడుసంతోషమునొంది, "లోకమున దైవము మానవునికి వానివాని కర్మాధీనముగా మేల్లొడఁగూర్చును. కాఁబట్టియే నాకుఁ జాలకాలమున కీ భక్ష్య పదార్థమును నిర్మించినాఁడు. నేనీవానరులలో నొక్కొక్కనిగాఁ జచ్చినవానినెల్ల భక్షించెదను" అని తనలోఁదానెనుకొనెను. అప్పుడు తమ్ముఁ దినఁగోరుచున్న యాసంపాతిమాట విన్నవాఁడయి యంగదుఁడు గడుదిగులొంది హనుమంతునితో నిట్లనెను.

"హనుమంతుఁడా! చూచితివా గ్రద్దరూపము ధరించి యమునిఁడే వానరులను రూపుమాపుటకై యీ తావునకువచ్చి యున్నాఁడు. మనము రామునికార్యముఁ జేయనైతిమి; రాజు నానతిని మీఱితిమి. కావున నిప్పుడు వానరులకుఁ దలఁపని యాగడమున్నట్టులుండి దుమికెను. నైదేహికి మేలుచేయఁగోరి జటాయువు దండకారణ్యమునఁజేసిన పనియెల్ల మీరు వినియుందురుగదా! మనవలెనే తిర్యగ్యోనియందుఁ బుట్టినజంతువులు సైతము ప్రాణములవిడిచియైనను రామునికిఁ బ్రియము సేయఁగోరుచున్నవి. ఒక్కొక్కరును ప్రేమయు దయయుఁగలవారలై రామున కుపకారము సేయుచున్నారు. కావున

ధర్మములనెఱిఁగిన జటాయువు తనప్రాణములు వదలునప్పుడుగూడ రాముని కుపకారముసేసెను. మనము రామునినిమిత్తమై యడవులకు వచ్చి త్రిమ్మఁదిఱిగి వేసారి యలసి ప్రాణములవిడువ సిద్ధులమైతిమి. కాని మనకా సీతాదేవి గానఁబడదయ్యెను. గ్రద్దలఱేఁడగు జటాయువు యుద్ధరంగమున రావణునిచేఁ జంపఁబడి, సుగ్రీవుని భయముఁబాసి యుత్తమగతిని బొందెను. జటాయువు చచ్చుటచేతను, దశరథనృపాలుఁడు మృతినొందుటచేతను, రావణుఁడు సీతాదేవిని నపహరించుటచేతను వానరుల కిట్టియవస్థ సంభవించెను. జటాయువు బ్రతికియున్న సీతాదేవిని రావణుఁ డెత్తికొనిపోయిన సంగతి రామునకుఁ దెలిసియుండును. దశరథుఁడు బ్రతికియున్నచో రామునిఁ గొంతకాలమున్కైనను దనకడకుఁ బిలిపించుకొనియుండును. రావణుఁడు సీతను గొనిపోకయున్నచో మనకు వెదకవలసిన ప్రయత్నములేక యుండును. రామలక్ష్మణులు సీతాదేవితోఁగూడ వనవాసముచేయుటయు, రాముని బాణముచే వాలి చచ్చుటయు, రామునికోపముచే జనస్థానమునఁ బెక్కురు రాక్షసులు చచ్చుటయు నీమొదలగునట్టి విపరీతములెల్లఁ గైకేయికి దశరథుఁడు వరములొసఁగుటచేఁ గలిగినవి" అని యంగదుఁడు వానరులతో ననెను. మహాబుద్ధిగల యాగృధ్రరాజు అంగదుఁడుచెప్పిన యా యింపుగానిమాటనువిని, వానరులట్లు ప్రాయోపవిష్టులయియుండుటఁజూచి, మిక్కిలి యలికిపడి దీనముగా వారితో నిట్లనెను.

వాఁడిముక్కుగలవాఁడగు సంపాతి యంగదునినోటినుండివచ్చిన మాటవిని పేరెలుఁగున నిట్లనెను: "నాకుఁ బ్రాణములకంటెఁ గడుఁ బ్రియుఁడయిన జటాయువధ వృత్తాంతమును బిగ్గరగాఁజెప్పి, నామనస్సునకు నెవ్వఁడు కలవరము పుట్టించుచున్నాఁడు? జనస్థానమున రాక్షసుఁడగు రావణునికి గృధ్రమగు జటాయువునకు నెట్లుపోరు గలిగెను? నాతమునిపేరు చాలదినములకు తఱువాత నేఁడువింటిని. గుణములనెఱిఁగినవాఁడును, కొనియాడఁదగిన పరాక్రమము గలవాఁడునునైన నాతమ్మునిపేరు బహుదినములకు మీవలన వినఁగలిగినందుకు నేను సంతసించితిని. వానరశ్రేష్ఠులారా! జనస్థానమున నున్న నాతమ్ముఁడు జటాయువెట్లు చంపఁబడెను? నాకుఁ దెలియఁజెప్పుఁడు. గురుజనులందుఁ బ్రియుఁడయిన రాముఁడెవనికిఁ బెద్దముద్దులకొడుకో, అట్టి దశరథునకు

నాతమ్మునికి నెట్లు చెలిమిగలిగెను? సూర్యనికిరణముల వేఁడిమికి నా
ఱెక్కలు మాడిపోవుటంజేసి, నేను పర్వతమునెక్కి మీకడకు రాఁజాల
కున్నాను. శత్రుసంహారులారా! మీరే యీపర్వతమునుండి దిగివచ్చి
నాకీసంగతిఁ దెలుపుదురుగాక" యని యాసంపాతి వానరుల నడిగెను.

49-వ సర్గము.

అంగదుఁడు సంపాతికి జటాయువధ వృత్తాంతము నెఱిఁగించుట

ఆ వానరయూథనాథులు సంపాతి మిగులవగతోఁగూడి తిన్నని
గొంతుతోఁజెప్పిన మాటనువిని, యాసంపాతి యేమిచేయునో యని
వెఱచి, యాతని మాటను నమ్మరైరి. అంతియకాక, ప్రాయోపవేశము
చేసిన వారందఱు ఆసంపాతినిఁజూచి "యితఁడు మనలను దినవచ్చిన
వాఁడు" అను చెడుతలంపుచేసి, యాతనికడకు వచ్చుటకు మొదట
వెఱచిరి. మఱికొంతసేపటికి వానరులు "ఎట్లయినను మనము చావఁదెగఁ
బడి మనము ప్రాయోపవేశము చేసియున్నాము. ఇతఁడు మనలను
భక్షించెనేని, మనము కృతార్థులమే యగుదుము కావున సంపాతి దగ్గ
ఱకుఁ బోవుదము" అనుతలంపుగొనిరి. అంత నంగదుఁడు కొండనుండి
దిగివచ్చి సంపాతితో నిట్లనెను.

ఓ గృధ్రరాజా! ప్రతాపశాలియగు ఋక్షరజసుఁడను వానరరా
జొకఁడుండెను. ఆతఁడు నాకుఁ దాత; ధర్మజ్ఞుఁడు. నూఱుకోట్ల
పురుషులబలముగల వాలి సుగ్రీవులను నిర్వురు పుత్రులతనికిఁ గలిగిరి.
నాతండ్రియగు వాలి లోకప్రసిద్ధములైన సాహసకృత్యములు చేసెను.
భూమండలమునెల్ల నేలువాఁడును, ఇక్ష్వాకువంశస్థులలో మహారథుఁ
డునునైన దశరథనందనుఁడగు రాముఁడు తండ్రియాజ్ఞను పాలించుట
యందు శ్రద్ధవహించి, న్యాయమార్గమునుబూని, తమ్ముఁడు లక్ష్మణుని
తోను, భార్యయగు సీతతోను గూడి దండకారణ్యమున కేతెంచెను.
వారు జనస్థానమున నుండఁగా; రామలక్ష్మణులను వంచించి, రావ
ణుఁడు సీతాదేవి నెత్తుకొనిపోయెను. రామునితండ్రికి నెచ్చెలియు,
గ్రద్దలకు జేఁడునగు జటాయువు, రావణుఁడు సీతనెత్తికొని పోవుటను
జూచి, రావణు నడ్డగించి, యతనిరథము నుగ్గునేసి, సీతను నిలిపెను
గాని, రావణునితోడి పోరునందు డస్సినవాఁ డగుటచేతను, ముసలి

వాఁడగుటచేతను రావణునిచేత సంహరింపఁబడెను. ఇట్లు జటాయువు రావణునిచేత మృతినొందెను. తర్వాత రాముఁడు వచ్చి విచారించి యతనికి దహనసంస్కారము గావించుటచే నుత్తమగతినొందెను. రాముఁడు సీతనుబోఁగొట్టుకొని, విచారముతో ఋశ్యమూకపర్వత మునకు వచ్చెను. అప్పుడు నాపినతండ్రియగు సుగ్రీవుఁడు నా తండ్రితోఁ బగపూని యాపర్వతముననే తనమంత్రులఁ గూడియుండెను. రాముఁడును నాపినతండ్రియగు సుగ్రీవునితోఁ జెలిమిచేసికొని యాత నికిఁ బ్రియముగావించుటకై నాతండ్రిని వాలిని జంపి, కిష్కింధా రాజ్యము నాతనికిచ్చెను. రామునిచే రాజ్యమున నుంచఁబడినతర్వాత సుగ్రీవుఁడు రాముని భార్యను వెదకుటకై మమ్ముఁబంపెను. మీ మా రాముని నిమిత్తమువచ్చి యొక్కడొక్కడవెదకియు రాత్రియందు సూర్యుని కాంతిఁజూడఁజాలనట్లు సీతను గానకున్నాము. మేము మొదట దండకా రణ్యమెల్ల జాగ్రత్తతోవెదకి తెలియక యిచ్చట నొక తాపసియొక్క గుహఁ బ్రవేశించితిమి. మయునిమాయచే నిర్మింపఁబడిన యాగుహా యందు వెదకుచుండఁగా, మారాజు మాకొసఁగిన యొక నెలగడువు తప్పిపోయెను. ఆసుగ్రీవుని భృత్యులమైన మేము రాజునానతిమీఱుట చేత నతనికడకుఁబోవ వెఱచి ప్రాయోపవేశము చేయఁబూనితిమి. మే మక్కడికిఁబోయినను మాకుఁ బ్రాణములు దక్కవు. మేము కాలము మీఱితివచ్చితిమని రామలక్ష్మణులును, సుగ్రీవుఁడును మాపై సత్వోగ్ర హముగలవారై, మమ్ముఁ జంపుదురు గనుక, మేమిక్కడనే చావనెంచి తిమి" అనియంగదుఁడు సంపాతితోఁ జెప్పెను.

ఏకోనవ సర్గము.

సంపాతి వానరులకు సీతసంగతి నెఱిఁగించుట

ప్రాయోపవేశంబుకుఁ బూనిన వానరులిటు చెప్పినమాటనువిని, సంపాతి కన్నీరునించి, పేరెలుఁగున వానరులతో నిట్లనెను: "వానరు లారా! బలవంతుఁడయిన రావణునిచేఁ జంపఁబడినాఁడని మీరిప్పుడను నట్టి యాజటాయువు నాతమ్ముఁడు. నేను ముదుసలినగుటచేతను, రెక్కలు లేనివాఁడనగుటచేతను, రావణుఁడు జటాయువుం జంపినాఁడని విని నను, ఓర్చియున్నాను. నాతమ్ముని వధించినవానిపైఁ బగదీర్చుకొన

నాకిప్పుడు బలిమిచాలదు. తొల్లి వృత్రాసురసంహారముజరిగినప్పుడు మేమన్నదమ్ముల మిరువురము నొండొరులజయముఁగోరి యాకాశమునఁ జరించుచున్న సూర్యునికడకుఁబోతిమి. అప్పుడు మేమాకాశమార్గమునఁ బలుమాఱుచుట్టిచుట్టి వేగముతోఁ దిరుగుచుంటిమి. అట్లుమేము తిరుగునప్పుడు, సూర్యుఁడు నడినెత్తికివచ్చుటయు, జటాయువుడస్సెను. అప్పుడు నేను తమ్మునిమీఁదిప్రేమచేఁ గడువ్యసనము నందినవాఁడనై, ఎండవేఁడిమికి నొచ్చియున్న నాతమ్ము నా రెక్కలతో నెండసోకకుండఁ గప్పితిని. వానరశ్రేష్ఠులారా! అప్పు డాయెండసోఁకుటచే నా రెక్కలు మాడిపోఁగా, నే నీ వింధ్యపర్వతమునఁ బడితిని. నాటినుత నేనెగుర లేమిఁజేసి యిచ్చటనే యున్నాఁడనుగానఁ దమ్మునివృత్తాంతమునే యెఱుఁగను. మీరిప్పుడుచెప్పఁగా నది దెలిసినది" యని జటాయువు తోఁబుట్టువగు సంపాతిచెప్పఁగా విని, గొప్పపండితుఁడయిన యువరాజగు నంగదుఁ డతనితో నిట్లనియె.

ఓగృధ్రరాజా, నీవుచెప్పినది వింటిమి. నీవు జటాయువు నన్న యగుదువేని, యారావణుని యునికిపట్టుఱుఁగుదువేని, మాకెఱిఁగింపుము. దీర్ఘాలోచనలేని (బుద్ధి హీనుఁడైన) యారావణుఁడు దగ్గఱనుగాని, లేక, దవ్వునఁగాని యెక్కడనుండునది యెఱుఁగఁజెప్పుము" అని యంగదుఁ డడుగఁగా, నెక్కువ వెలుఁగుగలవాఁడును, జటాయువు నన్నయునగు సంపాతి, వానరులకు సంతసం బెసఁగఁజేయుచుఁ దనశక్తికిఁ దగినమాట యిట్లనెను.

ఓ వానరయూథనాథులారా! నేను రెక్కలుగాలినవాఁడను గావున బలిమియుడిగినవాఁడను. ఏను మీతోఁగూడవచ్చి రామునికి సాహాయ్యముచేయఁజాలను గావున నోటిమాటతోమాత్రము సాయము చేసెదను. నేను వరుణునికి సంబంధించిన అతల, వితలాదులగు క్రిందిలోకములను, త్రివిక్రమావతారమున విష్ణువుపాదములతోఁ గొలిచిన పైలోకములను, దేవాసురులయుద్ధములను, దేవతలు క్షీరసముద్రమును జిలికి యమృతముఁదీయుటయు నెఱిఁగియున్నాను. రాముని యే యీకార్యము మీరుచేయనున్నారో, ఆ కార్యమును నేనే ముఖ్యముగాఁ జేయవలసినది. అయిన, ముదిమిచే నాబల ముడిగినది. అంగములును చివికియున్నవి. ప్రాయముగలదియు, చక్కఁదనముతోఁ

గూడినదియు, తొడవులనన్నింటిని ధరించినదియునైన సీత నాదురాత్ముఁడగు రావణుఁ డెత్తుకొనిపోవుచుండఁగా నేను జూచితిని. ఆసీతయు, రావణుఁ డెత్తికొనిపోవునప్పుడు, "హారామా" యనియు "హాలక్ష్మణా" యనియు నఱచుచుఁ దొడవులఁదీసివేయుచు నంగముల విదిలించుకొనుచుఁ బోవుచుండఁ జూచితిని. ఆనల్లని యసురునియందున్న యా వెలిపట్టుచీరగట్టిన సీతాదేవి పర్వతాగ్రమునందలి యెండవలెను, క్రొక్కాఱు మేఘమునందలి మెఱుపువలెను వెలుఁగుచుండెను. ఆమె పోవునప్పుడు "రామరామ"యని యఱచినందున నామె సీతయైయుండవచ్చునని తలఁచెదను. ఆ సీతాదేవి నెత్తుకొనిపోయిన యా రావణుని మనికిపట్టియనినఁ జెప్పెద నాలింపుఁడు.

విశ్రవసునికిఁ గుమారుఁడును, కుబేరునికి సాక్షాత్తుగాఁ దమ్ముఁడునైన రావణుఁడు లంకాపురమునం దుండువాఁడు. ఇక్కడికి నూఱు యోజనములదూరమున సముద్రమధ్యమున నా లంకాపురమున్నది. అయ్యది విశ్వకర్మచే నిర్మితమయి, బంగారు మయమునైన ద్వారమునును, బంగారపుఁ దిన్నెలును గలిగి, సూర్యనిమాడ్కిఁ దేజరిల్లు ప్రాకారముతోఁగూడి చక్కనైయుండును. లంకాపురమునఁ దెల్లని వలిపంబులుదాల్చిన సీతాదేవి రావణుని యంతిపురమున నుంపఁబడినదై, రాక్షసాంగనలచేఁ గావలికాచఁబడుచున్నది. ఓవానరులారా! మీరు దక్షిణసముద్రముచేరి, యచ్చటనుండి తఱలి నూఱు యోజనముల దవ్వేగి సముద్రముచే నలువైపులఁ జుట్టఁబడియున్న యా లంకాపురము బ్రవేశింతురేని, యచ్చట సీతాదేవిని, రావణాసురునిఁ జూడఁగలరు. ఓ వానరులారా! మీరు త్వరతో నచ్చటికే పొండు. ఆసీతను రావణునిఁ జూచుకొని మఱలరాఁగలరని నేను జ్ఞానదృష్టితోఁ జూచితిని. పిచ్చుకలును, ధాన్యజీవులగు తక్కిన జంతువులు నాకాశమున మొదటి మార్గమునను, కాకులు, మఱియుఁ బండ్లుదిని జీవించునవియు రెండవ మార్గమునను, నీరుకాకులు, కొంగలు, లకుముకులు మూడవమార్గమునను, డేగలు నాలవమార్గమునను, గ్రద్ద లైదవమార్గమునను బోవును. బలవీర్యరూపయౌవనములచే నొప్పిన హంసము లాఱవమార్గమునను వినతాపుత్రులగు వా రేడవమార్గమునను బోవుచుందురు. వానరశ్రేష్ఠులారా! మేమెల్లరు వినతాపుత్రుఁడయిన యరుణునివంశమునఁ బుట్టిన

వారము. ఇచ్చటనుండియె రావణుని సీతను జూచుచున్నాను. మాకును గరుడునికివలెనే దివ్యదృష్టియు బలమున్నవి. వానరులారా! యాహార బలముచేతను, స్వభావముచేతను బూర్తిగా నూఱుయోజనములదవ్వు వఱకు నేవస్తువునైనఁ జూడఁగలము. కోళ్లకుఁ దమపాదముల మొదటనే యాహారము దొరకునట్లు, మాకును స్వాభావికముగా దూరమునసే యాహారము దొఱకున ట్లేర్పఱుపఁబడియున్నది. సీతాదేవ్యపహరణరూప మయిన నిందితకార్యముగావించిన యారావణుని మీరు గనుఁగొని యాతనిని రామునిచేఁ జంపించితిరేని వాఁడు నాతమ్మునిఁ జంపిన పగను నేను దీర్చికొన్న వాఁడ నయ్యెదను. మీరు లవణసముద్రమును దాఁటుటకుఁ దగునుపాయము వెదకుఁడు. మీరు సీతను జూచి కార్యసిద్ధినందిన వారలై మఱలిరాఁగలరు. నేను స్వర్గమునొందిన బలశాలియగు నాతమ్మునికిఁ దర్పణంబుఁ గావింపఁగోరెదను. మీరు నన్ను సముద్రతీరముఁ జేర్పుఁడు" అని సంపాతి యడిగెను.

మహాబలతేజస్సులుగల వానరు లా తెక్కలుకాలిన సంపాతిని సముద్రపుదరిఁజేర్చి యాతండు తన తోఁబుట్టువునకుఁ దర్పణముచేసిన తరువాత మఱలనతనిని యథాస్థానముచేర్చి, యా సంపాతివలన సీతయు రావణుఁడు నున్న తా వెఱుఁగుటచే మిక్కిలి సంతసించినవారలైరి.

59-వ సర్గము.

సంపాతి వానరులకు సీతావృత్తాంతము నెఱిఁగించుట

అంతట వానరోత్తములందఱు గృధ్రరాజగు సంపాతి చెప్పిన యమృతముఁబోలు మాటనువిని, సంతసముచే గగ్గురుపాటొందిరి. అప్పుడు జాంబవంతుఁడును వానరశ్రేష్ఠుఁడు కోఁతులందఱితోఁగూడి, వేగిరముగాఁ ప్రాయోపవేశము విడిచిలేచి, యా సంపాతినిఁజూచి, "గృధ్రరాజా! సీత యెక్కడ ఆమె నెవ్వఁడు చూచెను? ఎవఁడామె నెత్తుకొనిపోవుచుండెను? ఎవఁడు రాముఁడును లక్ష్మణుఁడును వజ్రాయుధమువఁబోలు బాణములపోటు నెఱుఁగకయున్నాఁడు? ఇవియెల్ల నీ వెఱిఁగించి, మాకు రక్షకుఁడవగుము" అని యడుగఁగా, సంపాతియుఁ బ్రేమమీఱి సీతావృత్తాంతము నాలకింప సావధానులైయున్న వానరుల నోదార్చుచు నిట్లనియెను.

వానరులారా! సీతను రావణుఁ డెత్తుకొనిపోయిన సంగతి నే నెట్లు విన్నదియు, ఎవఁడు నాకీసంగతిఁ జెప్పినదియు, ఆ నిడివికన్నులుగల సీత యిపు డెచ్చటనుండునదియు నెఱిఁగించెదను. వినుఁడు; ఏను పెక్కు యోజనముల నిడివిగల యీ చొరనలవికాని పర్వతమునఁ బెక్కేండ్లకు ముందు తెక్కలుగాలఁగాఁ బడి, బలపరాక్రమములు లేకయుండి, యిపుడు ముసలివాఁడ నయితిని. అదిమొదలుకొని, నా పుత్రుఁడయిన సుపార్శ్వుఁడను పక్షిశేఖరుఁ డిట్టి గతినొందిన నా కాహారముఁ దెచ్చి పెట్టి నన్నుఁ గాలముతప్పక పోషించుచుండును. గంధర్వులు కామమోర్వఁజాలనివారు; పాములు కోపము నాపుకొనఁజాలనివి. మృగములకు భయమెక్కువ. మేమన్ననో యాఁకలి కోర్వఁజాలనివారము. నేనొక్కదినమున నాఁకలికి నకనకలాడుచు నాహారముగోరుచుండఁగా, ప్రొద్దుగ్రుంకిన తర్వాత, నాపుత్రుఁడెరచి తేకయె వట్టిచేతులతోవచ్చెను. ముసలివాఁడను, ఆఁకలిదప్పులచే మిక్కిలి నొచ్చినవాఁడను నైనందున నే నాగ్రహముతో నా కుమారునిఁ దిట్టఁగా, నప్పుడు ప్రీతినెసఁగఁజేయు వాఁడగు నా పుత్రుఁ డాహారము లేమిఁజేసి నకనకలాడుచుండు ననున్నాఁ డింది యీనాఁడు నడచిన సంగతి నిట్లని నాతోఁ జెప్పెను.

నాయనా! నే నెప్పటియట్ల వేళతప్పక యెరతెచ్చుటకై యీకాశమున కెగిరి, మహేంద్రపర్వతద్వారమునేరి, సముద్రమధ్యమున వసించు జంతువుల నడ్డగింపఁదలఁచి తలవాల్చి యొంటిగా నుంటిని. అప్పుడు కాటుకకొండవంటి మేనుగల యొక్కపురుషుఁడు సూర్యుని కాంతిఁబోలు కాంతిగల యొక కాంతను గైకొని పోవుచుండుట గంటిని. అప్పుడు నేను వారి నిరువురినిజూచి, వారినే యాహారముగాఁ గొనుట కిచ్చగించితిని. ఇంతలోపల నాపురుషుఁ డడఁకువ మెఱయఁ దిన్నని పలుకులతో దారిదీయుమని యాచించెను. ఎంతనీచు లయినను బతిమాలినవారిని గొట్టరుగదా! ఇఁక నాయట్టివాఁడు బతిమాలినవాని నేమియైనఁ జేయునే? అంత నాపురుషుఁడు తనబలముచే నాకాశము భేదించువానివలె వేగిరముగా నేగెను. అప్పు డాకాశమునందుఁ దిరిగెడు భూతములెల్లను, మహర్షులును నాకడకువచ్చి, "నాయనా! బ్రతికితివిగదా. ఈతఁ డెట్టకేలకు రక్ష్యవస్తువుతో దాఁటిపోయెను.

నీకు మేలయ్యెను. సందియములేదు." అని చెప్పఁగా, నేను గడు డొగ్యులైన యా మహర్షులంజూచి, వారలెవ్వరని యడుగఁగా, వారు నన్నుఁగూర్చి, "ఓ పక్షీంద్రా! యాతఁడు రావణాసురుఁడు. దశరథపుత్రుఁడగు రామునికి భార్యయు, జనకరాజుకూతురు నగు సీత తనతో రానిష్టములేక, యాభరణములనెల్లఁ బాఱవైచి, దుఃఖాతిశయమునకు లొంగినదై, జుట్టు విడియఁబోసికొని, "రామా! లక్ష్మణా!" యని వాపోవుచుండ నాసీతను గొనిపోవుచున్నాఁడు" అని తెలిపిరి. ఓ తండ్రీ! నే నాలస్యముగా వచ్చినందుకుఁ గారణమిదియ" అని కాలము నెఱిఁగినవారిలోపల నుత్తముఁడయిన సుపార్శ్వుఁ డీసంగతిని బూర్తిగా నా కెఱిఁగించెను.

ఆమాట వినినతర్వాతను నాకు ఆరావణునిపయిఁ బరాక్రమము నెఱపబుద్ధి పొడమదయ్యె. నేను పక్షిని; నాకుండునవి రెక్కలే. కావున నారెక్కలు పోయినపదంపడి నేనే పనిని జేయఁగలను? కావున మాటలు, యుక్తినిదెలుపునట్టి వాక్సాహాయ్యమైనఁ జేసెదను. దానిని మీరు పౌరుషముచే సాధింపవలెను. అది యేదియో చెప్పెద వినుఁడు. ఏది రామునికార్యమో యది నాకార్యమే. దానికి సందియములేదు. మీకందఱకు నాపనివిషయమయి మీరడిగినదానికి బదులుచెప్పెదను. నాకుఁదోఁచినంత యోచనయుఁ జెప్పెదను. మీరందఱు బుద్ధిమంతులరు; బలవంతులరు; ధైర్యవంతులరు; వానరరాజగు సుగ్రీవునిచేఁ బంపఁబడినవారలు. మిమ్మెదిరింప దేవతలకును వశముగాదు. కావున సుగ్రీవుఁడు చక్కఁగా యోచనచేసియే మిమ్ముఁ బంపియుండును. రామ లక్ష్మణులబాణములు వాఁడిమిగలవి. కంకపత్రములు గట్టినవి. ముల్లోకములహారిని ముంచను తేల్చను జాలినవి. రావణుఁడన్ననో విశేషబల పరాక్రమములుగలవాఁడన్నమాట వాస్తవమే. అయినను మీరందఱు చాలినవారలుగనుక, మీకలవికాని పని యొండును లేదు. కావున నాలస్యముచేయవలదు. మనమున నొకవిషయము తీర్మానముచేసికొనుఁడు. మీబోటి బుద్ధిమంతులు కష్టకార్యములు వచ్చినప్పుడు వెనుకపడరు గదా" అని సంపాతి వానరులతోఁ జెప్పెను.

60-వ సర్గము.

సంపాతి వానరులకు గుఱుతు సెప్పుట

సంపాతి తనతమ్ముఁడయిన జటాయువునకుఁ దిలతర్పణ మొనర్చి, స్నానముచేసి వచ్చినతరువాత, వానరవీరులందఱు చొఱ నలవికాని యా పర్వతమున నా సంపాతిచుట్టును గూర్చుండిరి. అంత సంపాతి, మంత్రులందఱితోఁగూడి దగ్గఱఁగూర్చుండియున్న యంగదునిఁజూచి, వానరులు తనమాటలను శ్రద్ధతో వినుటచే నమ్మకముగలవాఁడై, సంతసముతో నా యంగదాదులతో నిట్లనియె:

"వానరులారా! సందడిసేయక, గమనముంచి, నామాటను వినుఁడు. నేను సీతాదేవివృత్తాంతము నెట్లు తెలిసికొన్నది చెప్పెదను. నేను సూర్యునిచేరువకేగ, నాతని వేఁడివెలుఁగు వెలుఁగులు నాదేహము సోఁకి, నాఱెక్కలను మాడ్చివేయఁగా, నీవింధ్యపర్వత శిఖరమునఁ బడితిని. పడిననాటినుండి యాఱుదినములవఱకు నాయొడలు నాకుఁ దెలిసినదికాదు. ఆఱవనాఁడు తెలివినొంది కన్నులు తెఱచిచూచినను స్వాధీనత దప్పినవాఁడనై, మైకము గ్రమ్మునట్లుండెను. అన్నిదిక్కులను జూచితిని. ఏదియును దెలియదయ్యె. తరువాత సముద్రమును పర్వతములను, నదులను, కొలఁకులను, వనములను, సముద్రతీరమును జూచిన తర్వాత, నిది సంతసముగల పక్షులతో నిండిన నెత్తములును, గుహలును, శిఖరములునుగల దక్షిణ సముద్రతీరమునందలి వింధ్యపర్వత భాగమని నిశ్చయించితిని.

ఈ వింధ్యపర్వతమున దేవతలకుఁగూడఁ బూజసేయఁదగిన పరిశుద్ధమైన యాశ్రమ మొకటి యుండెను. దానియందు నిశాకరుఁడనెడి యొక మహాముని వాసముచేయుచుండెను. ధర్మజ్ఞులారా, ఆ నిశాకరమహర్షి గతించినపిదప, నే నీ వనమున నమ్మహర్షి నివఁదలి యెనిమిదివేల సంవత్సరములుగా నున్నాఁడను. నేను మిక్కిలి ప్రయాసముతో నెగుడుదిగుడ్డైయున్న వింధ్యపర్వతశిఖరమునుండి మెల్లగాఁ గ్రిందికి దిగి, మునులు త్రుంచుటచే వాఁడికొనలుగలవైయున్న దర్భమొక్కలతోఁగూడిన యా యాశ్రమమునకుఁ బరమదుఃఖముతో మఱల వచ్చితిని. నేనును, నాతమ్ముఁడు జటాయువును బలుమాఱు

ఆ మునీంద్రునికడకేగి యాతని సందర్శించియుండుటవలన నేను మిక్కిలి దుఃఖముతోవచ్చి యమ్మహాముననిఁ జూడఁగోరియుంటిని. ఆ మునీంద్రుని యాశ్రమముచేరువ వాయువులు నెత్తావులతోఁగూడి వీచినవి. పువ్వులును బండ్లును లేని యొక్కచెట్టును నా యాశ్రమమునఁ గానరాదయ్యె. అట్టి యాశ్రమమున నొకచెట్టుమొదటఁ గూర్చుండి, మహాత్ముఁడయిన నిశాకరు నెదురుచూచుచు నుంటిని. అంతఁ గొంతతడవునకు స్నానముచేసినవాఁడై, తన వెలుఁగుచేఁ జూడ నలవికానివాఁడై, యుత్తరదిక్కు నెదురొక్కనివచ్చుచున్న యా నిశాకరమునీంద్రునిఁ జూచితిని. బ్రహ్మదేవునిఁ బ్రాణులెల్ల వెంబడించు లాగున, నామునీంద్రునిఁ జుట్టుకొని ఎలుఁగుబంటులు, చమరమృగములు, సింహములు, ఏనుఁగులు, పులులు, పాములువచ్చి, రాజు పురము ప్రవేశించినతోడనే మంత్రులు మున్నగు సేనలెల్లఁ దమతమ నివాసములకుఁ జనునట్లు, ఆ మహర్షి యాశ్రమము ప్రవేశించినతోడనే, తమతమ పాదలలోనికిఁ బోయెను.

అంతట నమ్మునీంద్రుఁడు నన్నుఁగాంచి సంతసించి, హెచ్చరించి కొని పర్ణశాలలోపలికిఁ జొచ్చి, మఱల గొంతసేపటికివచ్చి, నన్నుఁ జూచి "యేమిపనివడి వచ్చితివి. నాయనా! నీకు నీకలు లేకయుండుట చూడ నీరూపమె గుఱుతు తెలియకయున్నది. ఈ నీ తెక్కలు గాలి పోయియున్నవి. నీచర్మము మాఁడి పుండయియున్నది. వాయు వేగముబోలు వేగముగలవారును, గ్రద్దలతేఁడులును, కోరినరూప మెత్తఁగలవారునైన యన్నదమ్ములగు రెండు గ్రద్దలను జూచి యున్నాను. సంపాతీ, నీవు పెద్దవాఁడవుగదా! జడాయువు నీతమ్ముఁడు గదా! మీ రప్పుడప్పుడు మానుషరూపముతో వచ్చి నాకు మ్రొక్కుచుందురుగదా! నీకేమి వ్యాధివచ్చెను? ఏల నీకు తెక్కలు పడిపోయెను. ఎవఁడు నిన్నిట్లు చావమోదెను! నేను వినఁగోరియున్నాను. వాస్తవము చెప్పు"మని యా నిశాకరమహర్షి నన్నడిగెను.

61-వ సర్గము.

సంపాతి నిశాకరునితో సంభాషించిన సంగతి చెప్పుట

అమ్మునీంద్రుఁడట్లడుగఁగా, నప్పుడు నేను సాహసముతోఁ జేసి నదియుఁ, జేయనలవికానిదియునైన సూర్యుని వెంబడించుటయును సర్వ

కార్యము నమ్మునీంద్రునితోఁ జెప్పితిని. ఓ మునీంద్రా! నాయొడలు కాలి మాంసముద్దయై యుండుటవలనను, సిగ్గుచే ముడికలఁగినవాఁడ నగుటవలనను డస్సి యున్నాఁడనుగాన మాటలాడఁజాలకయున్నాను. అయిన నెట్టులో చెప్పెదను. శూరులమైన జటాయువును, నేనును బలమువలని గర్వముచే మంచిచెడ్డల నెఱుఁగనివారమై యొండొరుల బలిమి నెఱుఁగఁగోరి, కైలాసశిఖరమునన్న మునులయెదుట "ఉదయ పర్వతము మొద లస్తమయపర్వతమువఱకు నెవరు ముందుపోవుదురో, వారు బలశాలు"రని పందెముకట్టి యాకాశమున కెగిరి, సరిసమానముగాఁ బోవుచుఁ గ్రిందఁజూడఁగా, పట్టణములెల్ల వేఱువేఱుగా బండిచక్రముల వలెఁ గనఁబడినవి. మేము పోవునపుడు మార్గమధ్యమున వాద్యధ్వనులను, వేదఘోషలనువినుచు, ఎఱ్ఱనిబట్టలుగట్టిన పాటపాడెడు పెక్కుంద్ర కాంతలను జూచుచుఁ ద్వరితముగా నాకాశమున కెగిరి, సూర్యమార్గమునుబొంది యచ్చటినుండిచూడఁగా నీవనము పచ్చికపడియవలెను, భూమియందలి పర్వతములు చిన్నఱాలవలెను, నదులెల్ల దారములవలెను, హిమవంతము, వింధ్యము, మేరు, మహామహీధరమును నొక మడుగులోపల విహరించెడి యేనుఁగులమాడ్కి యుఁ గానఁబడినవి. అంత దూరముపోయినతర్వాత మా కిరువురకు నోర్వని చెమటయు, బడలికయు, వెఱపును, మోహమును, మసకయు, మూర్ఛయుఁ గలి గెను. ఇది దక్షిణము, ఇది యాగ్నేయము, ఇది పడమర, యనుదిక్కుల జ్ఞానమే లేకపోయెను. లోకమెల్ల మర్యాదదప్పి ప్రలయకాలాగ్నిచే గాల్పఁబడి నశించినట్లు కానఁబడెను. మనస్సు చెదరుటవలనఁ బలుమాఱు దృష్టి తప్పిపోయెను. మఱల బహు ప్రయాసముతో మనస్సును జక్షు రింద్రియమునందుఁ జొప్పించి సూర్యునివైపు చూచితిని. అప్పుడు సూర్యుఁడు భూమియంత ప్రమాణముగలవాఁడుగా మాకుఁ దోచెను. అంత జటాయువు నాతోఁజెప్పకయ భూమియందుఁ బడెను. అతఁడుప్ప రమునుండి నేలకుదిగుచుండుటఁజూచి, నేను, ధైర్యముపడలి, యా జటాయువున కెండసోఁకకుండవలెనని తలంచి నాఱెక్కలతో నాతని దేహముఁ గప్పితిని. నేను పొరపాటున నాఱెక్క లడ్డపెట్టుటవలన, నెండవేఁడిమికి నాఱెక్కలు మాత్రము గాలిపోయినవి. ఆ జటాయువు జనస్థానమునఁ బడియుండునని తలఁచెదను. నేను మాత్రము ఱెక్కలు

గాలుటచే నిశ్చేతనుఁడనై యీ వింధ్యపర్వతమునఁ బడితిని. నేను జేసిన బుద్ధిపూర్వకమైన కర్మముచే రాజ్యమును, దమ్ముని, తొక్కలను, పరాక్రమమును బోఁగొట్టుకొని, యిట్లుండుటకంటె మృతినొందుట మేలని యెంచి, యొక్క పర్వతశిఖరమునొంది యచ్చటినుండి పడఁగోరి యున్నాను" అని నే నా నిశాకరమహర్షితోఁ జెప్పితిని.

62-వ సర్గము.

సంపాతి వాక్యము

ఓ వానరులారా! నే నీప్రకార మా మునిశ్రేష్ఠునితోఁ జెప్పి వెక్కి వెక్కియేడ్వఁగా, అంత భగవంతుఁడగు నిశాకరముని కొంత తడవు మనమున ధ్యానించి నాతో నిట్లనియెను. "ఓ సంపాతీ! నీకుఁ గావలసిన నిప్పుడే తొక్కలును, పిల్ల తొక్కలును మఱలఁబుట్టును. కన్నులును, మగటిమియు, బలిమియు వచ్చును. నీవలన నుత్తరకాలమున గొప్పకార్యంబు గావలసియున్నదని నేను వింటిని. తపోబలముచే నేగనుఁగొంటిని. నేను పూర్వికులవలన వినియున్నాను. ఓ సంపాతీ! యిక్ష్వాకువంశమున దశరథుఁడను రాజుండును. ఆతనికి రాముఁడను పేరుగల యొకపుత్రుఁడు పుట్టఁగలఁడు. తండ్రి వనవాసముసేయు నిమిత్తమై యానతిచేయఁగా, నప్పుడు సత్యమును దప్పని శూరుఁడయిన యా రాముఁడు తమ్ముని లక్ష్మణుని, భార్యను సీతను దోడ్కొని రాఁగలఁడు. వారు జనస్థానమున నుండఁగా, దేవదానవులకు వధ్యుఁడు గాని రావణుఁడను నొక్కయసురుఁ డా రాముని భార్యను సీత నెత్తి కొనిపోఁగలఁడు. ఆసీతాదేవి మహాపతివ్రతయని కీర్తివడసినదియగుటం జేసి, రావణుఁడు భక్ష్యభోజ్యవస్తువుల నిచ్చెదనని చెప్పినను, వానిని గైకొనక, భర్తృవిరహజనితశోకసాగరమున మునిఁగి యాతఁడిచ్చినది దేనిని గైకొనదు. అప్పు డింద్రుఁ డా సీత భుజింపకుండుట యెఱిఁగి యమృతముఁ దెచ్చి యీఁగలడు. దేవతలకుఁగూడఁ బొంద నలవికాని యమృతముఁబోలు నాహారమును బొంది, యది దేవేంద్రుఁ డొసఁగినది యని తలఁచి, యందుఁ మీఁదిభాగమును దీసి "నాభర్తయు నామఱఁదియుఁ బుడమిని జీవించియున్నను, లేక దైవత్వమునొందినను ఈ యన్నము దిందురుగాక" యని నేలఁ బెట్టఁగలదు. రామునిదూతలు వాన

రులు సీతను వెదకుచు రాఁగలరు. పక్షిరాజా! నీవు వారి కాసీత వృత్తాంతము నెఱిగింపవలసినది. నీ వెన్ని యిడుములు వచ్చిన నెచ్చటికిఁ బోవలదు. ఇట్టివాఁడ వెక్కడికిఁ బోఁగలవు? దేశమును కాలము నెదురుచూచుచు నుండుము. నీకు మఱల రెక్కలు రాఁగలవు. నీ కిప్పుడే రెక్కలు వచ్చుట నాకిష్టము గాదు. నీ విట్లు యిచ్చటనే యుందువేని, లోకములకు మేలగు కార్యమును జేయఁగలవు. ఆ రాజపుత్రులకును, బ్రాహ్మణులకును, దేవతలకును, మునులకును, దేవేంద్రునికిని మేలు గోరి, నీ వీకార్యము సేయవలయును. నేనును అన్నదమ్ములగు నా రామ లక్ష్మణులను జూడఁగోరుచున్నాను. చిరకాలము ప్రాణములతోనుండ సమ్మతిలేదు. నే నీశరీరము విడలఁగలను" అని సకలతత్త్వార్థసూక్ష్ములనెఱిఁగిన యమ్మహర్షి నాతో నీవిధమునఁ జెప్పెను.

63-వ సర్గము.

సంపాతి వాక్యము

మాటలాడువారిలో నేర్పరియగు నిశాకరమునీంద్రుఁడు నాతో నీమాటలును, ఇంకఁ బెక్కుమాటలును మాటాడి, ననూఁ బుడింఁచి, వీడ్కొలిపి తనయాశ్రమమునకుఁ బోయెను. నేనును తరువాత మెల్ల మెల్లఁగాఁ బర్వతగుహానుండి ప్రాఁకుచు వచ్చి, పైకెక్కి, మీరాక కెదురుచూచితిని. ఇప్పటి కీసంగతి నడచి, పూర్ణముగా వేయియేండ్లు గడచినవి. అయినను, అమ్మునీంద్రునిమాటను మనసునఁ బెట్టుకొని, యెప్పు డెచ్చట నావానరులను జూడఁగలనని యెదురుచూచితిని. నిశా కరమునీంద్రుఁడు మహాప్రస్థానముఁ బొంది స్వర్గతుఁడైనపిదప, నాకుఁ బెక్కు సంశయములు గలుగుటచే నేను గడు దుఃఖము నొంది, "మన మిఁక జీవింపరాదు. ప్రాణములు విడువవలసినదే" అని నిష్కర్షచేసి కొని, మఱల మునివాక్యములు తలఁచికొని యింతకాల మూరక యుంటిని. నాప్రాణములరక్షణముకొఱకయి యా మునీంద్రుఁ డేమి మాట చెప్పెనో, ఆ మాటయే దీపము చీఁకటిని పోఁగొట్టునట్లు నావెత నడఁగించుచున్నది. దురాత్ముఁడయిన రావణునిమగఁటిమి నెఱిఁగిన వాఁడను గనుక నేను నాపుత్రులఁజూచి "ఓరీ నాయనా! రావణుఁడు సీతనెత్తుకొని పోవునప్పు డేల చూచుచుంటివి? రావణునిచేతిలోనుండి

పట్టువదలించి యాసీత నేల కాపాడవయితివి" అని చెదరించితిని. ఆ సీతా దేవియొక్క విలాపమును విని, సీతాదేవి కెడఁబాసి విచారంపఁదుచున్న యా రామలక్ష్మణులను దలఁచుకొని, దశరథునిమీఁదఁ బ్రేమయుంచి, నాపుత్రుఁడు సీతను విడిపించుకొని నాకు సంతోషముఁ గలిగింపఁజాలఁ డయ్యెను" అని సంపాతి యంగదాదులతోఁ జెప్పెను.

సంపాతి వానరులతోడ నిట్లు మాటాడుచుండఁగా, వానరుల యెదుటనే యా ముని యనుగ్రహమునఁజేసి యా సంపాతికి రెక్కలు పుట్టెను. అప్పుడు సంపాతి తనదేహ మెట్టిని రెక్కలతోఁ గప్పఁబడి యుండుటఁజూచి యపారసంతోషమునుబొంది వానరులనందఱంజూచి, "ఆ సాటిలేనిప్రభావముగల నిశాకరమునీంద్రుని ప్రభావమువలననే సూర్యనికిరణములకుఁ గాలిపోయిన రెక్కలు మఱల పుట్టినవి. తొల్లి నేను ప్రాయమునసుండునప్పు డెంత బలపరాక్రమములు గలవాఁడనై యుంటినో, ఇప్పుడుగూడ నంతటి బలపరాక్రమంబులు గలవాఁడ నైతిని. మీరన్ని తెఱఁగులఁ బ్రయత్నముసేయుఁడు. సీత దప్పక దొరకఁ గలదు. నాకిప్పుడు రెక్కలు వచ్చుటయు మీ కార్యసిద్ధికి సూచనమే" అని పక్షీంద్రుఁడయిన సంపాతి వానరులతోఁ జెప్పి, తనకుఁ గ్రొత్తగా వచ్చిన రెక్కలబలిమిఁ జూడఁగోరినవాఁడై యాకాశమున కెగిరెను. అంత వాయువుంబోలు మగఁటిమిగల వానరశ్రేష్ఠులును సంపాతి మాటను విని మిక్కిలి యానందభరితులై, పరాక్రమము చూపుటకును మేలొందుటకును గోరి, యుత్సాహముపూని, యా సీతాదేవిని వెదకఁబూని, దక్షిణదిక్కునుగూర్చి పోయిరి.

64-వ సర్గము.

వానరులు దక్షిణసముద్రము సేరుట

సింహవిక్రములఁగు వానరశ్రేష్ఠులు సంపాతివలన సీతయున్న స్థలము నెఱిఁగినవారై, యంద ఱొక్కటిగాఁగూడి కిలకిలారవములు సేసి, సీతను జూచుటకై రావణునిమనికియగు లంకాపురమునకుఁ బోవుటకై సముద్రమునకుఁ దఱలిరి. భీకర బలపరాక్రములుగల యా వానరేంద్ర లా ప్రదేశముదాఁటి, మహాప్రపంచముయొక్క ప్రతిబింబమో యనునట్లుండు దక్షిణసముద్రమునుజూచి, దాని యుత్తరపు

గట్టుచేరి యచ్చట విడిసిరి. వానరశ్రేష్ఠులందఱు నీటియందు విహరించు చున్న వికృతరూపములగలవి, గొప్ప మేనుగలవియు, నోటు తెఱచికొని యున్నవియు నగు పెక్కుజంతువులతోఁ గూడినదియు, నలలచే నల్లోల కల్లోలమైనదియు, ఒక్కచోట నిద్రించునట్లు నెమ్మదిగను, మఱియొక చోటఁ గ్రీడించునట్లును నుండునదియు, కొన్నిచోట్ల పర్వతములం బోలు జలసమూహములతోఁ గూడినదియు, పాతాళలోకమునసుండు రాక్షసులచే వ్యాపింపఁబడినదియు, దేహమునకు గగ్గురుపాటొదవించు నదియు, ఆకాశముమాడ్కిఁ దెలియరాని యావలిగట్టుతోఁ గూడి నదియున్నైన సముద్రమును జూచి, వెంటనే విచారమునొంది యెట్లీ సముద్రము దాఁటఁగలమని పలికిరి.

వానరశ్రేష్ఠుఁడగు నంగదుఁడు సముద్రము జూచుటచే "మన మెట్లీ సముద్రమును దాఁటఁగలము?" అని దిగులుపడియుండు సైన్యమునుజూచి, "మీరు భయపడవల" దని యూరడించెను. అట్లు బుద్ధిమంతుఁడును, బలవంతుఁడునున్నైన వాలినందనుఁడగు నంగదుఁ డెంత యూరడించినను, గడు వంతతోఁ జతికిలఁబడియున్న వానరశ్రేష్ఠుల నందఱను జూచి, "మీరు విషాదము నొందవలదు. విషాదము మహా దోషము. పసివట్టిన పాము బాలునిఁ జంపునట్లు, విషాదము పురుషునిఁ జంపును. పరాక్రమము చూపవలసినప్పు డెవఁడు విషాదమునొందునో, అట్టి ప్రతాపహీనుఁడైనవానికిఁ గార్యము సిద్ధింపనేరదు" అని చెప్పి యారాత్రి యందఱితో నచ్చటఁ గడపెను. మఱునాటియుదయమున నంగదుఁడు వృద్ధులయిన వానరులతో నాలోచింపఁదలఁచెను. వానరసేనల నంగదుఁడు హనుమంతుఁడును దప్ప నెవ్వరును నిలుపఁజాలరు గనుక, అప్పుడు వానరులందఱు, దేవతలు దేవేంద్రునిచుట్టు నిల్చిన చందమున నా యంగదుఁ జుట్టును గూడియుండిరి.

అంతటఁ గాంతిమంతుఁడయిన యంగదుఁడు వృద్ధులగు వానరులను, తక్కిన సైనికులను జూచి గొప్ప యర్థముగలుగు మాట చెప్పఁబూని, "ఏ పరాక్రమశాలియగు వానరుఁ డిప్పు డీ సముద్రమును దాఁటఁగలఁడు? ఏ వానరుఁడు శత్రుసంహారియగు సుగ్రీవుని యథార్థవాదినిగాఁ జేయఁగలఁడు? వానరులారా! యే వానరవీరుఁ డీ నూఱు యోజనముల దూరమును దాఁటి, సీతాదేవిం జూచివచ్చి, యీ

యూథపాలురగు వానరులనందఱను మహాభయమునుండి విడిపింపఁ గలఁడు? ఎవని ప్రభావమువలన మనము గార్య్యము సాధించికొని యిచ్చటినుండి యూరికిఁబోయి, ఆలుబిడ్డలను, ఇండ్లువాఁకిళ్లను బొంది సుఖముతో నుండఁగలము? ఎవని యనుగ్రహమువలన మనము కార్య్యమును సాధించికొని సంతసముతో బలవంతులగు రామలక్ష్మణ సుగ్రీవుల సన్నిధానమును బొందఁగలము? వానరవీరులారా! మీలో నెవ్వఁడైన నూఱు యోజనములు సముద్రమును దాఁటఁగలవాఁడుండునేని, ఆతఁడిప్పుడు మాకభయదక్షిణ నొసఁగునుగాక! దాన మహాపుణ్యము వానికిఁ గలుగును" అని వానరులతోఁ జెప్పఁగా, నా సేనలో నొక్కఁడయిన నొక్కమాటయు బదులు చెప్పకుండెను. ఆ వానరసేనయెల్ల నిశ్చలముగా నుండెను. అంతట నంగదుఁడావానరులంజూచి, "ఓ వీరులారా! మీరు బలవంతులలో మేటులు; దిట్టమయిన పరాక్రమము గలవారలు; గొప్ప కులములందుఁ బుట్టినవారలు; పలుమాఱు గొప్ప కార్య్యములు గావించి మన్ననలఁ బడసియుండువారలు. మీలో నొక్కనికి నెప్పుడును, ఎచ్చటికిని బోవుటకు నడ్డంకిలేదు. కావున మీలో నెవ్వని కెవ్వని కెంతెంతదూరము దాఁట శక్తిగలదో చెప్పుఁడు" అని వానరవీరుల నడిగెను.

65-వ సర్గము.

వానరవీరులు తమతమశక్తులం దెలుపుట

అంతట గజ, గవాక్ష, గవయ, శరభ, గంధమాదన, మైంద, ద్వివిద, సుషేణ, జాంబవంతులనెడు వానరోత్తములందఱు సముద్రము దాఁటువిషయమునఁ దమకుఁ దమ కెంతటి శక్తియున్నదో, దాని నంగ దునికిఁ దెలిపిరి.

ఆ వానరులలో గజుఁడు పదియోజనములు, గవాక్షుఁ డిరువది యోజనములు, గవయుఁడు ముప్పదియోజనములు, శరభుఁడు నలుఁబది యోజనములు, మహాపరాక్రమశాలియగు గంధమాదనుఁడు నిస్సంశయముగా నేఁబదియోజనములు, మైందుఁ డఱువదియోజనములు, ప్రతాపశాలియగు ద్వివిదుఁడు సందియము లేక డెబ్బదియోజనములు,

వానరశ్రేష్ఠుఁడగు సుషేణుఁడు ఎనుబదియోజనములు దాఁటఁగలమని చెప్పిరి.

అట్లు వారందఱు తమతమ లాఘవులం జెప్పినతరువాతఁ బండు ముసలివాఁడయిన జాంబవంతుఁడు వారి యందఱి నెలవుగైకొని, వారిఁ జూచి, "తొల్లి నేనును నడకయం దెక్కువ వడిగలవాఁడనై యుంటిని. అప్పు డట్టివాఁడనైనను, ఇప్పుడు ముసలితనంబు నొందినవాఁడనైతిని. అయినను రాముఁడు స్వకార్యమును సుగ్రీవునితోఁ జెప్పఁగా, సుగ్రీవుఁడు, నేను సాధించెదనని చెప్పియుండఁగా, నే నుపేక్షించియుండుట యెంతమాత్రము తగదు. ఇప్పుడు ముసలివాఁడనైనందున నాకిప్పుడు శక్తి యెంతమాత్రమనిన, నేనిప్పుడు నిస్సంశయముగాఁ దొంబది యోజనములు దాఁటఁగలను. పూర్వము నాకున్న శక్తియంతయెకాదు. తొల్లి నేను ప్రాయమున నున్నప్పుడు మహాబలిచక్రవర్తి యాగము చేయుచుండఁగా, ఆదిదేవుఁడయిన విష్ణువు మూఁడడుగుల భూమి యాచించి, దానిని గొల్చుటకై తన యాకారము పెంచినసమయమున, నాత్రివిక్రమరూపధారియగు విష్ణువును బ్రదక్షిణముగాఁ జుట్టివచ్చితిని. నేను ప్రాయమున నున్నపు డొరులకుఁ బొందనలవికాని గమనబలము గలవాఁడనైయుంటిని. ఇప్పుడు ముసలివాఁడ నగుటచే నానాఁటికి గమనశక్తియుఁ దగ్గిపోయెను. ఇప్పుడు నాకుండు శక్తి యింతమాత్రమే యని యూహించెదను. నూఱుయోజనముల దూరము దాఁటవలసి యుండఁగాఁ దొంబదియోజనములు దాఁటుటచే నేమి యుపయోగము? ఇంతమాత్రమున మనకార్యము సిద్ధింపనేరదు" అని యంగదాదులతోఁ జెప్పెను.

అంతట నంగదుఁడు గొప్ప పండితుఁడయిన జాంబవంతుని యనుజ్ఞ గైకొని, వానరులంజూచి, "ఓ వానరులారా! నే నీ నూఱు యోజనముల దూరము దాఁట గలుగుదుఁగాని, మఱలవచ్చునప్పటికి శక్తియుండునో, యుండదోయని సంశయించుచున్నా" నని తన గొప్పతనమునకుఁ దగిన యర్థగౌరవముగల మాటను జెప్పెను.

వానరోత్తముఁడగు జాంబవంతుఁడు అంగదుని మాటలు విని, "వానరసత్తమా! నీకుఁగల ప్రయాణశక్తి నే నెఱుఁగుదును. నీకు నూఱే కాదు వేయి యోజనముల దూరమైనను దాఁటను, మఱల

NATIONAL MORAL LIBRARY
V.R.A.
Acc. No.

నచ్చటనుండి తిరిగి వచ్చుటకును శక్తిగలదు. అయినను నిన్నీపని కాజ్ఞాపించుట యుక్తముగాదు. యజమానుఁడు భృత్యులను బంపువాఁడే కాని, యెప్పటికిని భృత్యులచేఁ బంపఁదగినవాఁడు కాఁడు. వానరోత్తమా! మేమెల్లరము నీచేఁ బంపఁదగినవార మేకాని నిన్నుఁ బంపునంతటివారము కాము. నీవు మాకు రక్షింపఁదగినవాఁడవు; అధికారిగా నియమింపఁబడినవాఁడవు. రాజు సేనకురక్షింపఁదగినవాఁడు. కావున మృగండన్ని తెఱఁగులఁ బెండ్లామును గాపాడినట్లు, సేనలెల్లపుడు తమ యజమానునిఁ గాపాడవలయును. అట్లే నిన్ను మే మందఱమును గాపాడవలయును. శత్రుసంహారీ, నీ వికార్యమునకు మూలమైనవాఁడవు. చెట్టునకు వేఱు పదిలముగానున్ననే, యా చెట్టునఁ బువ్వులు, కాయలు మొదలగునవి పుట్టుచుండును. అట్లే యీ కార్యమునకుఁ గారణమైన నిన్నుఁ గాపాడుచుండినచో, కార్యము చక్కఁబడును. తఱుగని మగత నముగలవాఁడా! బుద్ధిబలమును బాహుబలమును గలవాఁడవైన నీవే యీ కార్యసాధనమునకుఁ గారణమవు. కపివీరుఁడా! నీవు మాకు రాజవు. రాజపుత్రుఁడవు. నీయండనుంటిమేని. మే మెంతటి పనినైనను సాధింపఁగలము" అని చెప్పఁగా, నంగదుఁ డట్లు చెప్పిన యా గొప్ప చదువరియైన జాంబవంతునితో నిట్లు బదులుసెప్పెను.

"మఱి నేను బోకపోతినేని, యింక దాఁటఁగలవాఁడు మఱొక్కఁడు లేఁడు. అప్పుడు మన మందఱము మఱల ప్రాయోపవేశము సేయవలసినదే. దెలివికాఁడగు నా వానరశ్రేష్ఠుఁడయిన సుగ్రీవు నానతిని నెఱవేర్పక యచ్చటికిఁ బోయినను ప్రాణములను గాపాడుకొనఁజాలము. ఆ సుగ్రీవుఁడు సంతోషించినయెడ, మనల రక్షింపను, కోపమువచ్చిన మనలను శిక్షింపను గలఁడు. ఆతనియాజ్ఞ మీఱి యచ్చటికిఁ బోతిమేని, మనకుఁ జావు తప్పదు. కావున నికార్యమెట్లు విపరీతముగాదో యట్టి యుపాయమును కార్యముల నెఱిఁగినవాఁడవైన నీవే యాలోచించి చెప్పవలయును" అని చెప్పఁగా, వీరుఁడైన వానరోత్తముఁడగు జాంబవంతుఁ డాయంగదుని నుద్దేశించి, "యోయంగదా! యీ నీకార్య మెన్నఁటికిని జెడదు. ఈకార్యమును సాధింపఁగలవాని నిదిగో పురికొల్పుచున్నాఁడను" అని చెప్పి, యేకతంబున సుఖముగాఁ గూర్చున్నవాఁడును, ప్రసిద్ధికెక్కినవాఁడును, దాఁటఁగల

వారిలో మేటియు, వానరోత్తముఁడునునైన హనుమంతునే సముద్రమును దాఁటుటకుఁ బ్రేరణనేయఁ దలఁచెను.

66-వ సర్గము.

జాంబవంతుఁడు హనుమంతునిఁ బురికొల్పుట

అంత జాంబవంతుఁడు పెక్కు లక్షులకొలఁది వానరసైనికులు మోమునఁ గళలేక విచారముతో నుండుట చూచి, హనుమంతునితో నిట్లనెను. "ఓ హనుమంతుఁడా! వానరు లందఱిలోపల శూరుఁడా, సకలశాస్త్రములందు నిపుణుఁడా! వానరవీరులందఱు తమతమబలములఁ దెల్పుచుండ, నీవేల యొకమూలలో డాగి మాటాడకయున్నావు? హనుమంతుఁడా! నీవు బలప్రతాపములచే సుగ్రీవునితో సమానుఁడవు. యోచించిచూచిన, రామలక్ష్మణులతో సమానుఁడవనియె చెప్పనొప్పును. కాశ్యపునకు వినతయందుఁ బుట్టినవాఁడు, బలవంతుఁడు, పక్షుల కెల్ల నధికుఁడైన గరుత్మంతుఁడనువాఁ డొక్కఁడుండెను. బలశాలియని పేరువడసిన యా గరుత్మంతుఁడు సర్పమును ముక్కునఁ గఱచికొని సముద్రమున వేగముతోఁ బోవుచుండునప్పుడు, నే నతనిని సముద్ర మధ్యంబునఁ బెక్కుమాఱులు చూచితిని. ఆ వైనతేయునకు నెక్కలం దెంతటి బలమున్నదో, ఆ బలము నీకు బాహువులందె యున్నది. వేగమునందును, మగటిమియందును నీ వాతనికిఁ దీసిపోవు. నీయందలి బలము, బుద్ధి, వెలుఁగు, సత్త్వ, యనుగుణము లన్నిభూతములం దున్న వానికంటె హెచ్చుగా నున్నవి.

నాయనా! ముల్లోకములందును ప్రసిద్ధురాలును, భూలోకమున రూపమున సాటిలేనిదియు, కోరినరూపమెత్తఁగలదియు నప్సరలలో శ్రేష్ఠురాలునైన, పుంజికస్థలయను నప్సరస శాపవశమున మహా బలుఁడయిన కుంజరుఁడను వానరేంద్రునికిఁ గూఁతురైపుట్టి యంజన యను పేరువడసి, కేసరియను వానరునికిఁ బెండిలియయ్యెను. ఆపె కపి రూపముతో నున్నను, కోరినరూపం బెత్తఁగలది గనుక, ఒకనాఁడు మానుషరూపము ధరించి, రూపయౌవనములచేఁ బ్రకాశించుచు, వింత గొల్పుపువ్వులసరములు, సొమ్ములును దాల్చి, సేలిమి పట్టుచీర గట్టు

కొన్నవై, వర్షాకాలపు మేఘముంబోలు పర్వతప్రఁ గొనను సంచరించు చుండెను.

అప్పర్వతమున నా మచ్చెకంటి విహరించుచుండఁగా, నామెకట్టిన యెట్టించుగల పచ్చపట్టుచీరచెఱుగు గాలికిఁ గొంచెము దొలఁగెను. అప్పుడా వాయుదేవుఁడు కడుఁజేరిన గుంద్రని తొడలును, ఒండొంటితోఁ గదిసియుండు బలిసిన స్తనములును, మిక్కిలి చక్కనైన మొగమును, విశాలదీర్ఘములైన పిఱుఁదులును, సన్నని నడుమునుగలదై యొప్పులకుప్పయైయున్న సర్వాంగసుందరియగు నాయంజనాదేవిని గాంచినవెంటనే, మన్మథునిపలలం దగిలినవాఁడై, యా కాంతనే మనమున ధ్యానించుచు, సర్వాంగములందు మదనుఁడు చొచ్చుటఁజేసి, పతివ్రత యయిన యా యంజనాదేవిని దన నిడుపుచేతులతో దృఢముగాఁ గౌఁగిలించుకొనెను.

ఆ మంచి యాచారములు గలదియగు నంజన నచ్చటనే ప్రొన్నడినదై, "ఎవఁడు నా పాతివ్రత్యమును జెఱుపనున్నాఁడు" అని యడుగఁగా, వాయుదేవుఁ డంజనపలుకులువిని, "ఓసీ చక్కని పిఱుఁదులదానా! సౌందర్యవతీ! నిన్ను నేను బీడింపను. నీకు భయమువలదు. పతివ్రతయని ఖ్యాతివహించిన నీ రూపుచూచి మోహించి, నిన్నుఁ గౌఁగిలించి మనసుచే నీలోపలఁ బ్రవేశించితిని. దాననే నీపాతివ్రత్యము నకు లోపము వాటిల్లదు. నీకు వీర్యవంతుఁడు, బుద్ధిమంతుఁడునైన పుత్రుఁడు పుట్టఁగలఁడు. అతఁడు మహాబలుఁడు, మహాతేజుఁడు మహా పరాక్రముఁడునై, దాఁటుటయందును, దుముకుటయందును నన్నుఁ బోలియుండును" అని చెప్పఁగా నంజన సంతోషపడినదైయుండి, యావల వానరోత్తముఁడవయిన ని న్నొక గుహాయందుఁ బ్రసవించెను.

అంతట నీవు పుట్టినతోడనె పసిబాలుఁడవుగా నుండునప్పుడే యస్తమాహారణ్యమున సూర్యుఁ డుదయించుటగని, యది పండని భ్రమించి యా పండును దినఁగోరిన వాఁడవై పై కెగిరి, యాకాశమునకుఁ బోతివి. నీ వట్లు మున్నూఱుయోజనముల దూరమేగి, యా సూర్యుని యెండవేఁడిమి సోఁకుచున్నను, గొంచెమైన నలసటనొందవైతివి. వాన రోత్తమా! నీవు మహావేగముతో నాకాశమునఁ జనుచుండఁగా, ధీమంతుఁడయిన దేవేంద్రుఁడు మిక్కిలి కోపముతోఁగూడినవాఁడై, వజ్రా

యుధముఁ బ్రయోగింపఁగా, నీయొక్క చెక్కిలి పర్వతంపుఁగొనకుఁ దగులుటచేఁ జీలెను. కావుననే నీకు హనుమంతుఁడని పేరువచ్చెను. దేవేంద్రుఁడు నిన్ను వజ్రాయుధముతోఁ గ్రిందఁద్రోసి, చెంపఁ బగులఁ గొట్టుటను జూచి, యన్నిటిని విఱుగఁద్రోయువాఁడు నెత్తావిగొను వాఁడున్నైన వాయుదేవుఁడు మిక్కిలి యాగ్రహము నొందినవాఁడ్డై ముల్లోకములందును వీవకుండెను. అప్పుడు మూఁడులోకములవారు నూపిరాడక మిక్కిలి కలఁతనొందిరి. అంత వేల్పులు దిగులుచేఁ దత్తర పడి, యాగ్రహగ్రస్తుఁడ్డైయున్న వాయుదేవుని శాంతపఱచి యథా ప్రకారముగా వీవఁజేసిరి. సత్యపరాక్రమా! వాయువు శాంతుఁడగు టయు, బ్రహ్మదేవుఁడు నీవు శస్త్రములచేఁ జంపఁదగినవాఁడవు గాకుండు నట్లు వరమొసఁగెను. వజ్రాయుధము ప్రయోగించినను నీకు నొప్పి లేకుండుట జూచి వేయికన్నులవేల్పు మెప్పువడసి, నీ కిచ్చువచ్చినప్పుడు మృతినొందునట్లు వరమొసఁగెను.

పగతుర వెఱపించు బల్మగల హనుమంతుఁడా! నీవు కేసరికి క్షేత్రజపుత్రుఁడవు. వాయువున కౌరసపుత్రుఁడవు. ప్రతాపమునను, నాతనితో సమానుఁడవు. ఓ పిన్నవాఁడా! నీవు వాయునందనుఁడవు గనుక, దాఁటుటయందు నాతని కీడయినవాఁడవు. నేర్పు, మగటి మియుఁ గలిగి, మాఱురూపమెత్తిన గరుడుఁడో యనఁదగినవాఁడవు. మే మిప్పు డించుమించుగా ప్రాణముపోయినవారివలె నున్నారము. కావున నీవిప్పుడు మమ్ము రక్షింతువుగాక. ఓరి నాయనా! విష్ణువు త్రివిక్రమావతార మెత్తినప్పుడు నేను భూమండలమెల్లఁ బర్వతా రణ్యములతోఁగూడ నిరువదియొక్కమాఱు చుట్టివచ్చితిని. మఱియు నమృతము చిలికినప్పుడు దేవతలపంపున నేను పెక్కు మూలికలు సంపా దించితిని. వాని నన్నింటిని వేసి చిలుకుటచేతనే సముద్రమున నమృతము పుట్టినది. ఆ సమయమున మాకెక్కువ బలముగలిగినది. అప్పు డట్టి వాఁడనయిన నేనిప్పుడు ముసలివాఁడను; బలముడిగినవాఁడను. ఇచ్చట నుండువారందఱిలోపల నీవె సకలగుణములతో నిండిన వాఁడవు. దాఁటువారిలోపల నుత్తముఁడవు గావునఁ బరాక్రమము పూనిన వాఁడవై నీయొడలిని బెంచుము. వానరవీరుఁడా! యీ కోఁతిమూఁక యెల్ల, నీ వీర్యమును జూడఁగోరి యున్నది లెమ్ము. మహాసముద్రమును

దాఁటుము. హనుమంతుఁడా! లోకమున నీతో సమానముగాఁ బోవు వాఁడు లేఁడు. హనుమానుఁడా! వానరులందఱు మిణుకరించుచుండఁగా, నీవేల యిట్లుపేక్ష సేయుచున్నావు. ఇది నీకుఁ దగదు. విష్ణువు త్రివిక్రమావతారమెత్తి మహావేగముతోఁ బుడమినెల్ల మూడడుగులతోఁ గొల్చినట్లు నీ వీ సముద్రము నొకదాఁటుతో నెగిరి దాఁటుము" అని జాంబవంతుఁడు హనుమంతునితోఁ జెప్పెను. అంతటఁ బ్రసిద్ధ వేగముగల వాయునందనుఁడగు హనుమంతుఁ డట్లు జాంబవంతుని ప్రేరణచే నావానరసేనను సంతసింపఁజేయుచుఁ దనరూపమును బెంచిన వాఁ డయ్యెను.

67-వ సర్గము.

హనుమంతుఁడు లంకకుఁ బయనమగుట

అంతట నూఱుయోజనములదూరము దాఁటుటకై పెరుగుచు, నప్పటికప్పటికిఁ బెంపొందుచున్న దేహముగలవాఁడై యున్న వాఁడును, బలవంతులలోపల నుత్తముఁడునైన హనుమంతునిఁజూచి, తత్క్షణమే వానరులు శోకముఁబాసి, యత్యానందముతోఁగూడినవారలై, సింహనాదముచేసి, యా హనుమంతునిఁ బొగడిరి. ప్రజలు త్రివిక్రమావతార మెత్తఁగలందులకై యుత్సహించుచున్న విష్ణువునుంబోలె నా వానరవీరులు సంతోషాశ్చర్యములుగలవారై యా హనుమంతునిఁ జూచుచుండిరి.

అట్లు వారు స్తోత్రములు సల్పుచుండఁగా, బలశాలియగు హనుమంతుఁడు తోఁక యాడించియుఁ దన యాకారము పెంచి, సంతసముచే నప్పటప్పటి కెక్కువ బలమునొందెను. పెద్దలగు వానరపుంగవులు స్తోత్రముచేయుచుండఁగా, పరాక్రమముచే నిండిన యా హనుమంతుని రూపము చూపఱు కత్యద్భుతముగాఁ దోఁచెను. కొండగుహయం దొక సింహము పెరుగుచు నెట్లు వ్యాపించునో యట్లు లావాయునంద నుఁడును దన దేహమును మిక్కిలి పెంచెను. అవ్విధమునఁ బెరుగుచున్న ధీమంతుఁడయిన హనుమంతుని మోము మండుచున్న వేఁపుడు మంగలమువలెను, పొగలేకుండ మండుచున్న యగ్నిహోత్రుని కైవడియు వెలుఁగుచుండెను.

అప్పుడు హనుమంతుఁడు సంతోషముచే గగ్గురుపాటు నొందిన వాఁడై, ముదుసలులయిన వానరవీరుల నందఱిని నమస్కరించి, "యగ్ని హోత్రునికి నెచ్చెలియు, బలిమిగలవాఁడు, కొలఁతపెట్టరాని రూపము గలవాఁడు, ఆకాశసంచారము చేయువాఁడునైన వాయుదేవుఁడు తన వేగబలముచేఁ బర్వతాగ్రములను విఱిచెను. అట్టి తీక్ష్ణ బలముగల వాఁడు, వడిగాఁ బోవువాఁడునైన మహాత్ముఁడయిన మారుతునికి నౌరస పుత్రుఁడను. దాఁటుటయందు నాతో సమానుఁ డొక్కరుఁడు లేఁడు. విశేషవిస్తారముగలిగి నింగి నొఱయుచున్నట్టులుండు మేరుపర్వతమును శ్రమలేకుండ వేయిమాఱులైనను జుట్టిరాఁగలను. నేను నాబాహా వుల వేగముచే సముద్రంపునీటిని జల్లి పర్వతనదీతటాకములతోఁగూడ లోకమును ముంచఁజాలుదును. నాతొడలయుఁ బిక్కలయు వేగము నకు వరుణుని కునికిపట్టగు సముద్రమును దానిలోపలనున్న గొప్ప మొసళ్లతోడ మీఁది కెగయునట్లు చేయఁగలను. పక్షులు నిండిన యా కాశమునఁ దిరుగునట్టి గరుత్మంతునిఁ గడు వేగముతో వేయిమాఱు లైనను జుట్టివచ్చుటకుఁ జాలియుందును. సూర్యుఁ డుదయపర్వతము నుండి వెడలినపుడు నే నతనితోడ బయలుదేఱి, యస్తపర్వతమునకుఁ బోయి మఱలి యాతఁడు ఆకాశమధ్యమునఁ గిరణంబులఁ బ్రసరింపఁజేసి, వెలుఁగుచున్నప్పుడే, ఓ వానరపుంగవులారా! పుడమిని దాఁకకయే మహాభీమబలముతోడనె మఱల సూర్యు నెదురొక్కనఁ జాలుదును. అంతియకాక, యాకాశమున సంచరించు భూతముల నన్నింటిని దాఁటి పోఁగలను. వానరులారా! నే నాకసమున నెగురుచు సముద్రము నింకింపఁగలను; పుడమిని బ్రద్దలుసేయఁగలను. పర్వతములను నుగ్గు సేయఁగలను. నేను పై కెగిరి, తొడలవేగముచే గొప్ప సముద్రమును గూడఁ గొనిపోఁగలను.

నే నాకాశమున వేగముతో నెగురునప్పుడు, అన్నివృక్షము లయు, తీఁగలయుఁ బుష్పములు నన్ను వెంబడించిరాఁగలవు. అట్లు నా మార్గము పుష్పములచే నిండియుండుటచే నాకాశమునందలి స్వాతీ నక్షత్రమార్గమువోలె నుండఁగలదు. వానరులారా! నే నాకసమునఁ బోవునప్పుడుగాని, పుడమినుండి పై కెగురునప్పుడుగాని, క్రిందకుదిగు నప్పుడుగాని సకలభూతములు నన్నాశ్చర్యముతోఁ జూచును. వానరు

లారా! నేను మహామేఘమువంటి శరీరముతో నాకాశమును మ్రింగు వానికైవడి నాకాశమును గ్రమ్ముచుఁ బోవునప్పుడు నన్ను మీరును జూడఁగలరు. ఏను పూనికతో దాఁటునప్పుడు మేఘములఁ జెదరఁ గొట్టఁగలను. పర్వతములఁ గదలింపఁగలను. సముద్రమును గలఁత వెట్టఁగలను. అంతటిశక్తి గరుత్మంతుని కొండె, నాకొండె, నాతండ్రి యగు వాయుదేవునికొండె యున్నదిగాని తక్కినవారికి లేదు. కడు వడిగల గరుత్మంతుఁడు వాయుదేవుఁడు తప్ప మఱొక్కఁడు నేఁ బరుగెత్తునప్పుడు నన్ను వెంబడించి రాఁజాలఁడు. కనుమూసి కనుదెఱచునంతలోపల మేఘమునుండి మెఱుపు హఠాత్తుగా తోచునట్లు పుడమినుండి యాకాశమున కెగురఁగలను. నేను సముద్రమును దాఁటునప్పుడు, నారూపము, బలిచక్రవర్తి యొసఁగిన మూఁడడుగుల భూమిని గొల్చుటకై ధరించిన త్రివిక్రమావతారుఁడగు విష్ణువు రూపమువలె నుండఁగలదు. వానరులారా! నాబుద్ధికి సీతఁ జూడఁగలనని తోఁచుచున్నది. నామనస్సును నంత యుత్సాహముగలిగియున్నది. నాచేష్టలు నట్లేయున్నవి. నేనెట్టులైనను సీతను జూడఁగలను. మీరు సంతసముతో నుండుఁడు. నేను వేగమునందు వాయువును, బలమున గరుత్మంతునిఁబోలినవాఁడను గావున నేను బదివేలయోజనముల దూరమైన నేగఁగలనని తలఁచుచున్నాఁడను. వజ్రాయుధమును బట్టిన యింద్రునియొక్కగాని తనంతఁబుట్టిన బ్రహ్మదేవునియొక్కగాని చేతినుండి యమృతమును శీఘ్రముగాఁ దేఁగలను. లంకాపట్టణమును బెళ్లగించుకొనినైనను రాఁగలనని నేను దలఁచెదను. అని యిట్లు వానరవీరుఁడగు హనుమంతుఁడు తన ప్రతాపము దేజరిల్లుచుండ ఱొప్పుచుఁ జెప్పినమాటను విని యందఱు వానరులు సంతోషముఁ బొంది విస్మయముతోఁ జూచుచుండిరి.

బంధువులకు శోకనాశకమయిన యా హనుమంతునిమాటను విని జాంబవంతుఁడు పరమానందమునొంది హరివీరుని హనుమంతు నుద్దేశించి, "వీరుఁడవు, కేసరికి క్షేత్రజుఁడవు, వాయువున కౌరసుఁడవు నైన యో హనుమంతుఁడా! నాయనా! బంధువులకుఁ గలిగిన విస్తార శోకమును నీవు పోకార్చితివి. మంచికాంతిగల వానరులందఱు గూడి నీవుపోయెడి కార్యము సిద్ధించునిమిత్తమై, యదేమనస్సుతో నీశ్వర

థ్యానాదులగు శుభకార్యములఁ జేయఁగలరు. ఋషులయనుగ్రహము వలనను, వానరవృద్ధుల దీవనలబలమువలనను, గురువులయనుగ్రహము వలనను నీవు సముద్రమునుదాఁటుము. మా యందఱి ప్రాణములు నిన్నుఁ బొందియున్నవి గావున, నీవు వచ్చునంతవఱకు మే మొంటికాలి మీఁద నిలఁబడియుందుము" అని చెప్పెను.

అంతట వేగమున వాయువునుబోలువాఁడు, శత్రువుల నణఁచు వాఁడు నైన హరిశార్దూలుఁ డా వానరులను జూచి, "నే నెగురు నప్పుడు, భూమి నావేగమును దాళఁజాలదు. ఒఁడొంటితోఁ గ్రిక్కిఱిసి యుండు బండలుగల యీ మహేంద్రపర్వతముయొక్క శిఖరములు కదలనివియు, గొప్పవియునైయున్నవి. పెక్కు వృక్షములచే నిండిన వియు, అంతట వ్యాపించిన గైరికాది ధాతువులయొక్క కాంతులుగల వియునైన యీ మహేంద్రపర్వతశిఖరము లెక్కి యిచ్చటినుండి నే నెగిరెదను. వానరవీరులారా! యీపర్వతశిఖరములే యిచ్చటనుండి నూఱుయోజనములదవ్వు దాఁటఁబోవు నా కాళ్ళతాఁకుడు నోర్వఁగలవు" అని పలికి యీ మహేంద్రమను పర్వతశ్రేష్ఠమునెక్కెను.

ఆ మహేంద్రమను పర్వతము నానావిధములగు వృక్షములచేఁ జుట్టఁబడినదియు, జింకలతోఁగూడిన పచ్చికబయళ్లు గలదియు, తీఁగెల జొంపములతోను, పువ్వులగుత్తులతోను గ్రిక్కిఱిసినదియు, విడువని పుష్పఫలసమృద్ధిగలదియు, సింగములును, పులులును, మదపుటేనుఁగులును గలిగి, మదించిన పక్షులగుంపులకూఁతలతో నిండినదియు, గొప్ప నీటిప్రవాహములచే నల్లకల్లోలమైనదియు, మహోన్నతశిఖరములు గలదియునై సొంపుమీఱియుండెను. బలవంతుఁడును, దేవేంద్రునిఁబోలు విక్రమముగలవాఁడునైన వానరవీరుఁ డా పర్వతోత్తమమునెక్కి తిరుగు చుండెను. బలవంతుఁడైన యా హనుమంతుని కాళ్ళక్రొక్కుళ్ళకు నొచ్చిన యా మహేంద్రనగరము సింహముచేఁ ద్రొక్కఁబడిన గొప్ప మదపుటేనుఁగుకైవడిఁ బ్రకాశించెను. మఱియు నాపర్వతమునందలి బండలెల్లఁ గదలి గొప్ప యూటనీటిప్రవాహములు పుట్టెను; ఏనుఁగులు మొదలగు మృగములు వెఱచి యిట్టటు పరుగెత్తెను, చెట్టులెల్లఁ గద లెను, మధుపానపరవశులైయున్న నాగులయు గంధర్వులయు దంప తులు నా కొండచరియలనుండి తొలఁగిపోయిరి. పక్షులెల్ల నెగిరి

పోయెను. శిఖరములందలి తొలగుంపులెల్లఁ గదలెను. పుట్టల లోపలనుండుపాములెల్ల నడలి పైకిఁ దమ్మడగలెత్తి బుసకొట్టుచుండుటవలన నాపర్వతము పెక్కెములతోఁగూడినదో యన్నట్లు వెలుఁగుచుండెను. ఆపర్వతమునఁ దపస్సుచేయుచుండిన ఋషులు భీతిచేఁ దత్తర పడి వేఱుప్రదేశములకుఁ బోవుటచే నాపర్వతము, తోడులేక పోవుటచే గొప్ప యడవియందు భీతినొంది, చదికిలఁబడిన బాటసారికై వడిఁగనఁబడఁజొచ్చెను. అప్పర్వత మట్టిస్థితియందుండఁగా, శత్రుసేనల సంహరించువాఁడు, వడిగలవాఁడు, వడిగఁబోవుటయం దాస్థగలవాఁడు, కీర్తిమంతుఁడునైన మహాసమర్థుఁడగుహానుమంతుఁడు మనస్సును గుదుటఁబఱచికొని, యప్పుడే లంకాపురమును మనస్సుచేఁ బొందినవాఁ డయ్యెను.

కిష్కింధాకాండము సమాప్తము

ఓం, తత్, సత్.

కిష్కింధాకాండ పఠన శ్రవణములకు ఫలము

శ్లో. కిష్కింధాఖ్య మిమం శృణ్వన్ పఠన్ వాపి విధానతః,
ఇహ సంపూజితః సర్వైర్యంతే బ్రహ్మణి లీయతే.

ఏమానవుఁ డీ కిష్కింధాకాండమును చదువుచున్నాఁడో, లేక వినుచున్నాఁడో, వాఁ డీలోకమున నందఱి మన్నన వడసి యంతమునఁ బరబ్రహ్మయందు లయించుచున్నాఁడు.

చెన్నపురి : 'చంద్రికా' ప్రెస్సున ముద్రితము—1959.

వచనగ్రంథములు

	ప్రతి 1-కి రూ. అ.
వచనగ్రంథములు	
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశ స్కంధములు, ఒకేసంపుటము	9 0
డిటో మూడుసంపుటములు	10 8
ఆంధ్రవచనభారతము:—	
,, ఆదిసభాపర్వములు	5 0
,, ఆరణ్యపర్వము	5 0
,, విరాటోద్యోగపర్వములు	5 8
,, భీష్మద్రోణపర్వములు	7 8
,, కర్ణశల్యసౌప్తికస్త్రీపర్వములు	5 8
,, శాంతిపర్వము	7 8
,, ఆనుశాసనికము మొదలు స్వర్గారోహణ పర్వము వరకు గలసంపుటము	7 8
ఆంధ్రవచనవాల్మీకిరామాయణము, బాలకాండము	2 8
ఆరణ్యకాండము	2 8
కిష్కింధాకాండము	2 8
సుందరకాండము	3 0
యుద్ధకాండము	7 8
ఉత్తరకాండము	3 8
పంచతంత్రహితోపదేశ కథామంజరి	3 0
ఆంధ్రవాఙ్మయచరిత్ర సంగ్రహము	4 0
న్యాయవిచారణ, (ప్రహసనము)	1 12
శ్రీతిలకుగారి సెక్యూరిటీకేసు ఉపన్యాసములు	0 14
యజుర్వేదకథాసంగ్రహము	0 10
పంచతంత్రము, వచనము	0 12

	ప్రతి 1-కి రూ. అ.
భారతరమణీమణులు, 1 భాగము	1 4
డిటో 2 భాగము	0 10
డిటో 3 భాగము	0 8
నీతిచంద్రిక, శ్రీచిన్నయసూరి	0 12
,, టీకతో	1 4
సంగ్రహరామాయణము	1 8
పతివ్రతలచరిత్రలు	3 0
భోజునికథలు	1 0
భోజకాళిదాసకథలు, I-భాగము	1 4
II-భాగము	1 8
తెనాలిరామలింగనికథలు, జీవితము	0 8
డిటో A. S. P. అయ్యరు	0 8
సంస్కృతనాటకకథలు	2 0
రాజశేఖరుఁడు, గోపాలుఁడు	0 12
చార్దర్వీషుకథలు	1 0
తాతాచార్యులకథలు	0 12
బేతాళునికథలు	0 12
పరమానందశిష్యులకథలు	0 4
నలుగురుమంత్రులకథలు	0 6
అయిదుగురుదొంగలకథలు	0 8
పురాణగాథలు I	1 0
,, II	1 0
బాజీరాయనిచరిత్ర	1 4
రఘువంశకథ	0 10
విక్రమార్కచరిత్ర, శ్రీభా. రామమూర్తిశాస్త్రి	1 8
ఈసబునీతికథలు, 1-వ భాగము	0 8
డిటో 2-వ భాగము	0 12
పంజాబు అల్లరి, శ్రీమాలవ్య	0 8

	ప్రతి	1-కి	రూ.	అ.
మర్యాదరామన్నకథలు			0	3
మైరావణచరిత్ర, చక్కనిబొమ్మ			0	2
అనంతసాగరము, బుక్కరాయ సముద్రచరిత్రము			0	12
ద్వాదశోపనిషత్తులు తెలుగువచనము			5	0
శ్రీమహాభక్తవిజయము			12	0
జగత్కథ			6	0
అరేబియన్ నైట్సుకథలు			2	0
నీతిరత్నాకరము			1	0
వైద్యులకథలు			0	6
రేచుక్కపగటిచుక్కకథ			0	4
సత్యసేనవిజయము			0	6
ఋషులచరిత్ర			1	0
శకుంతలచరిత్ర, చిన్నసైజు			0	6
నల	,,		0	8
సావిత్రి	,,		0	6
హరిశ్చంద్ర	,,		0	8

జీవితములు

అడిదము నూరకవిజీవితము	1	8	
త్యాగరాజచరిత్ర	0	10	
శ్రీలాలాలజపతిరాయజీవితము	0	2	
శ్రీఎస్. శ్రీనివాసఅయ్యంగారి జీవితము	0	12	
చిన్నయసూరిజీవితము	1	0	
రామకృష్ణపరమహంసచరిత్రము	0	6	
శ్రీగోపాలకృష్ణగోక్లేజీవితము	0	2	
శ్రీమహాదేవగోవిందరానడేజీవితము	0	2	
శివాజీచరిత్ర, ప్రతిమతో	1	0	
గౌరాంగస్వామిచైతన్యజీవితము	0	4	

	ప్రతి	1-కి	రూ.	అ.
శ్రీశంకరాచార్యచరిత్ర, ప్రతిమతో			0	6
శ్రీవేమనయోగిజీవితము	,,		0	4
దాదాభాయినౌరోజీచరిత్ర	,,		0	2
అప్పయ్యదీక్షితచరిత్ర			0	12
మహాత్మాగాంధీజీవితము, ప్రతిమతో			0	12
శ్రీగాంధీమహాత్మునిచరిత్ర, ఉపన్యాసములు			1	8
సోదరినివేదితజీవితము, ప్రతిమతో			0	2
శ్రీగ్లైక్వారుగారిజీవితము	,,		0	2
రామదాసుచరిత్ర			1	8
వివేకానందస్వామిజీవితము			0	4
శ్రీకృష్ణదేవరాయచరిత్ర (పెద్దసైజు)			2	8
సరోజినీదేవిచరిత్ర			0	6
శ్రీరాజేంద్రప్రసాద్ జీవితము			0	3
డాక్టర్ పట్టాభిసీతారామయ్య జీవితచరిత్ర			0	10
లార్డ్ క్లైవుజీవితము	,,		0	8
స్వామిరామతీర్థజీవితము			0	4
రామానుజాచార్యచరిత్ర			0	3
కాళిదాసచరిత్ర			0	3
శ్రీతుకారామస్వామిచరిత్ర			0	6
శ్రీసమర్థరామదాసస్వామిచరిత్ర			0	6
గౌతమబుద్ధుని జీవితము			0	8
శ్రీచిత్తరంజనదాసుజీవితము			0	4
ఆలీసోదరులజీవితము			0	4
పండిత మదనమోహన మాళవ్య జీవితము			0	8
శ్రీసీ. రాజగోపాలాచారి జీవితము			0	4

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

పోస్టుబాక్సు 1372. 292, ఎస్ప్లనేడ్, చెన్నపురి-1.

208

I78

L81

Andhra Bharati 119

వచనగ్రంథములు

	ప్రతి 1-కు రు.	అ.
...సభారకమ:—		
...విసభాపర్వములు	5	0
,, ఆరణ్యపర్వము	5	0
,, విరాటోద్యోగపర్వములు	5	8
,, భీష్మద్రోణపర్వములు	7	8
,, కర్ణశల్యసౌప్తికస్త్రీపర్వములు	5	8
,, శాంతిపర్వము	7	8
,, అనుశాసనికము మొదలు స్వర్గారోహణ పర్వము వరకు గలసంపుటము	7	8
ఆంధ్రవాఙ్మయచరిత్ర సంగ్రహము	4	0
పంచతంత్రహితోపదేశ కథామంజరి	3	0
తిలకుగారి సెక్యూరిటీ కేసు, ఉపన్యాసములు (పాతప్రతి)	0	14
భారతనవనీతనిధులు. 1-వ భాగము	1	4
,, 2-వ భాగము	0	10
,, 3-వ భాగము	0	8
ద్వాదశోపనిషత్తులు, తెనుగువచనము	5	0
యజుర్వేదకథాసంగ్రహము	0	12
నీతిచంద్రిక, శ్రీ చిన్నయసూరి	0	12
,, టీకతో	1	4
పంచతంత్రము, వచనము	0	12
సంగ్రహరామాయణము	1	8
సంగ్రహభాగవతము	2	8
భోజనికథలు	1	0

	ప్రతి 1-కు రు.	అ.
భోజకాళిదాసకథలు, I భాగము	1	4
,, II భాగము	1	3
తెనాలిరామలింగనికథలు, జీవితము	0	8
,, A. S. P. అయ్యరుగారిది	0	8
సంస్కృతకవికథలు, సీతారామ శాస్త్రి 12 భాగములు	2	0
రాజశేఖరుడు, గోపాలుడు	0	12
చార్దర్షికథలు	1	0
తాతాచార్యులకథలు	0	12
బేతాళునికథలు	0	12
పరమానందశిష్యులకథలు	0	4
సలుగురుమంత్రులు	0	5
అయిదుగురుదొంగలకథలు	0	8
పురాణగాథలు I	1	4
,, II	1	4
బాజీరాయని చరిత్ర	1	4
రఘువంశకథ	0	10
విక్రమార్కచరిత్ర, భా. రామ మూర్తిశాస్త్రి	1	8
పంజాబుఅల్లరి	0	8
మర్యాదరామన్నకథలు	0	3
మైరావణచరిత్ర	0	2
అనంతసాగరము, బుక్కరాయ సముద్రచరిత్రము	0	12
జీవితరహస్యము, చిత్రమైనకథలు	1	8
శకుంతలచరిత్ర, ప్రతిమలతో	0	6
త్రిలిడ్డికథలు	1	0
అశేబియట్ నైట్స్‌కథలు	2	0

ఇవిగాక అనేక సంస్కృతాంధ్రగ్రంథములు, నాగరికగ్రంథములు, అరబగ్రంథములు, ఇంగ్లీషుగ్రంథములు మావద్ద దొరకును.

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

పోస్టుబాక్సు 1372. 292, ఎస్‌ప్లనేడ్, చెన్నపురి.

మహమ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B119
పుస్తకం పేరు	శ్రీమద్రాంధ్ర వచనరామాయణము కిష్కింధాకాండము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	YES
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	213
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	C.L.BCJ
లేని పేజీలు	NO
తయారు చేసినది	P.Jayalakshmi
పేజీలు విడదీసినది	P.Jayalakshmi
స్కాన్ చేసినది	Hasmat
పరీక్ష చేసినది	anusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	